

నారాయణీయం

నారాయణభట్టతిరిపాద కృత సంస్కృత మూలమునకు
స్వామి కృష్ణదాస్‌జీ తెలుగుసేత



శ్రీ నారాయణభట్టతిరిపాదులు

(మూలకృతికర్త)

శ్రీః

ఓం నారాయణ నారాయణ నారాయణ నారాయణ ఓం



ఈ కృతి

భిక్షాపాత్రను నను ది
వ్యాక్షర కలశముగ అమృత భండారముగా
అక్షయ సుఖ సందోహా
ధ్యక్షునిగా సలిపినట్టి అయ్యకు నీకే

సమర్పితము

శ్రీ జగద్గురు పుష్పగిరి మహా సంస్థానం
పుష్పగిరి : కడప జిల్లా.

న మా మ వే ద మా త ర మ్



ప॥ ప॥ పుష్పగిరి పీఠాధిపతులు
శ్రీ శ్రీ శ్రీ శ్రీమదభినవోద్దండ విద్యానృసింహ భారతీ స్వాములవారు అనేక నారాయణ స్మరణములతో వ్రాయించి పంపిన పత్రిక...

శ్రీ కృష్ణదాస్‌జీ రచించిన నారాయణీయ - తెలుగు సేతను స్థాలీ పులాక న్యాయముగ వినినాము.

శ్రీ కృష్ణదాస్‌జీ మొదటి నుండియు కృష్ణదాసులే. కనుకనే వారి తెలుగుసేత కృష్ణరస ప్లావితమై భగవత్సౌందర్య మధురిమలతో వెలుగొందుచున్నది. భక్తిప్రవణులై వారు మూలము ననువదించుచున్నపుడు వారు లీలావినోద విగ్రహుని కన్నులార గాంచుచున్నట్లు వారి రచన తెలియజేయుచున్నది. బాలగోపాలుడు పలుకు ముగ్ధమనోహర సరస భాషితాలనే వీరు తెలుగు సేతగా చిత్రీకరించినట్లు తోచుచున్నది

శ్రీ దాస్‌జీ ఇట్లనేక రచనలుచేసి తమ నామమును సార్థకపరచుకొనుచు కల్యాణ గోపాలుని అనుగ్రహపాత్రు లగుదురుగాక.

ఇతి
నారాయణ స్మృతయః
(సం) శ్రీ విద్యానృసింహ భారతీస్వామినః

హైదరాబాదు
1-12-77

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

*　　　　*　　　　*

స్వామిజీ పరిచయ వాక్యాలు :

*　　　　*　　　　*

భగవదనుగ్రహంవల్ల మాత్రమే సంపూర్ణమైన ఆరోగ్యం ఆయుర్దాయం ఐశ్వర్యాదులూ సుఖం శాంతీ, చివరకు, పరమపురుషార్థమైన మోక్షం కూడా లభిస్తై. ఆ భగవదనుగ్రహప్రాప్తికి సులభతరమైన యేకైక మార్గం భక్తి.

భగవంతుని దిక్కుగా నిరంతరం తైలధార మాదిరి ప్రవహిస్తూ ఉండే ప్రేమనే 'భక్తి' అంటారు. అది మధురాతి మధురంగా ఉంటుంది. దాన్ని సేవించినవారికి అమృతత్వం సిద్ధిస్తుంది.

ఆ విధమైన భక్తి తత్వాన్ని బోధించే గ్రంథాలలో సర్వోత్కృష్టమైనది శ్రీమద్ భాగవతం. దానికి సంగ్రహరూపమే శ్రీమన్నారాయణీయం.

శ్రీమన్నారాయణీయం ఒక బృహత్ స్తోత్రమాల. ఇందులో శ్రుతి ప్రతిపాదితమైన అనేక విషయాలు, స్తుత్యర్హమైన శ్రీమన్నారాయణుని వివిధావతారాలు, లీలలు సంక్షిప్తంగా వివరింపబడి ఉన్నై. అన్నిటికీ మించి, ఇందులోని ప్రతి శ్లోకం ప్రతిపదం ప్రత్యక్షరం భక్తిరసప్లావితమై ఉంటుంది.

భాగవతసార సంగ్రహమైన యీ స్తోత్రరాజాన్ని పరమ భాగవతోత్తముడైన శ్రీ నారాయణభట్టతిరిపాదులు ఒక విశిష్ట ఫణితిలో సృష్టించి, సాక్షాత్తు భగవంతుడే అయిన శ్రీకృష్ణస్వామికి, శ్రీ గురువాయుపురాధీశ్వరునకు, దివ్యాక్షర రూపమైన

తమ భవ్య హృదయంగా నివేదించుకున్నారు. ఆయన అనుగ్రహానికి పాత్రులైనారు; తమ ఆర్తిని తొలగించుకున్నారు.

ఇంతకూ ఈ నారాయణభట్టతిరిపాదు లెవరు ? ఈ నారాయణీయ ప్రశస్తి యేమిటి ? గురువాయూరు మాహాత్మ్య మెటువంటిది ? ఇవి సంక్షిప్తంగా అయినా తెలుసుకోవలసిన కొన్ని ముఖ్య విషయాలు.

శ్రీ నారాయణభట్టతిరిపాదులు :

శ్రీ నారాయణభట్టతిరిపాదులు ఆదిశేషుని అంశతో జన్మించారని ప్రతీతి. ఆయన జన్మస్థలం దక్షిణ మలబారులోని పొన్నని తాలూకాకు చెందిన, భరతపుఝ నది ఒడ్డునఉన్న, చందనక్కావు అనే గ్రామం. అది, నవముకుంద దేవాలయ సమీపాన ఉంది.

అక్కడ, నంపుదిరి బ్రాహ్మణవంశంలో, మేల్పత్తూర్ అనే యింటిపేరుగల ఒక సుప్రసిద్ధ కుటుంబంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి పేరు మాత్రుదత్తుడు. ఆయన పుట్టింది క్రీ. శ. 1560 లో.

శ్రీ నారాయణభట్టు, బాల్యంలోనే, తమ తండ్రివద్ద తంత్రశాస్త్రాన్ని అభ్యసించారు. శ్రీ మాధవాచార్యునివద్ద వేదాధ్యయనం చేశారు. శ్రీ దామోదరార్యునివద్ద తర్కం, శ్రీ అచ్యుత పిషరడివద్ద వ్యాకరణం క్షుణ్ణంగా నేర్చుకున్నారు. 16 యేళ్ళు నిండేటప్పటికే, ధర్మశాస్త్రాలన్నీ ఆయనకు కరతలామలకమైనై. మహా మేధావి అన్న కీర్తి లభించింది.

అనంతర కాలంలో, శ్రీ నారాయణభట్టు శ్రీ పిషరడిని గురువుగా స్వీకరించటం, గురువైన శ్రీ పిషరడికి ప్రారబ్ధవశాన సంక్రమించిన వాతరోగాన్ని, కోరి తాము తీసుకుని, ఆయనకు, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని, గురుదక్షిణగా సమర్పించుకోవటం జరిగింది.

కోరిపొందిన వాతరోగం తీవ్రరూపం ధరించి, బ్రతుకు భారమైన పరిస్థితిలో, శ్రీ భట్టతిరి, ఆ బాధను తొలగించుకునే ఉద్దేశంతో, మహాభాగవత రచనకు ఉపక్రమించారు. దాన్ని, ఒక బృహత్ స్తోత్రంగా సృజించి, దానికి 'నారాయణీయం' అని నామకరణం చేశారు.

నరులకు ఆశ్రయుడైనవాడు నారాయణుడు. ఆ నారాయణునకు సంబంధించిన గాథ నారాయణీయం. అందుకనే, అది, నారాయణుని సన్నిధిలో జరిగితే బాగుండునని నారాయణభట్టు తలపోశారు. ఆ వెంటనే, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అయిన శ్రీకృష్ణ భగవానుడు విరాజమానుడై ఉన్న గురువాయూరు ఆయన మనోవీధిలో మెటిసింది; ఆయన అక్కడికి వెళ్ళారు.

నారాయణీయ రచన అక్కడ నూరు రోజులపాటు సాగింది. ఆ కాలంలో, ఆయనకు, అనేకమైన దివ్యానుభూతులు కలిగినై. సంపూర్ణమైన ఆరోగ్యం లభించింది. అన్నిటికి మించి, శ్రీకృష్ణ దర్శనంకూడా అయింది. అప్పటికి ఆయన వయస్సు 27 సంవత్సరాలు మాత్రమే.

ఆ పైన, ఆయన, పరమభక్తుడుగా. సాధుపుంగవుడుగా, మహాపురుషుడుగా ప్రసిద్ధి కెక్కారు. ఆయన కీర్తి కేరళదేశ మంతటా వ్యాపించింది. ఆయన్ని దర్శించుకోవాలనీ ఆయన ఆశీర్వాదాన్ని పొందాలనీ ఆనాటి ప్రజ యెంతగానో తపించిపోయేవారు. ఆయనపట్ల తమకున్న గౌరవాన్ని ప్రకటించుకోవాలనీ, తద్వారా తమ జన్మలకు చరితార్థత కలిగించుకోవాలనీ యెందరో ప్రభువులు ఉబలాట పడేవారు. కాని, ఆ అదృష్టం అందరికీ లభ్యం కాలేదు. ఖోజికోడ్ జామొరిన్ మానవిక్రముడు, వటకుంకూర్ పాలకుడు గోదావర్మ, కొచ్చిన్ రాజా వీరకేరళవర్మ, అంబళపురు అధిపతి దేవనారాయణుడు మాత్రమే తమ ఆశయాన్ని ఫలింపజేసుకోకలిగారు. తంజావూరు ప్రభువు ప్రయత్నించికూడా విఫలుడైనాడు.

శ్రీ నారాయణభట్టతిరిపాదులకు అశేష శిష్యగణ ముండేది. వారిలో, శ్రీ నారాయణ పండితుడు, చంద్రశేఖర పండితుడు సుప్రసిద్ధులు. వారు ఆయన్ని శ్రీ శుక నారదాదులతో సమునిగా భావించేవారు.

నారాయణీయంద్వారా శ్రీ నారాయణభట్టతిరిపాదులకు శ్రీమన్నారాయణుని అనుగ్రహం పరిపూర్ణంగా లభించింది. ఆయన పిలిస్తే పలికేవాడు; శ్రీకృష్ణదేవుడు. ఆ స్థితిలో లభించే పరమానందానుభూతితో, ఆయన, 106 సంవత్సరాలు జీవించాడు. అంతిమాన, ముక్కోల అనేచోట, ఆయన, అంబికను అర్చించుకుంటున్న సమయంలో, ఒక దివ్య విమానం వచ్చిందనీ, దాన్ని అధిరోహించి, ఆయన వైకుంఠానికి వెళ్ళిపోయినాడనీ, ఒక పరమభక్తురాలు, పంతవూరమ్మ అనేఆవిడ ప్రకటించింది. శ్రీ భట్టతిరిపాదులు ఆ విమానాన్ని అధిరోహించిన స్థలం, ఈనాటికీ, ఒక పుణ్యక్షేత్రంగా విలసిల్లుతూనే ఉంది.

నారాయణీయం :

హర్యంశతో జనించిన వ్యాసర్షి సృజించిన 'శ్రీమద్భాగవతం' ఒక మహా పురాణమైతే, ఆదిశేషుని అంశతో జనించిన నారాయణభట్టు రచించిన 'నారాయణీయం' ఒక స్తోత్రరాజమయింది. ఆర్తిని తొలగించటంలోను, ఆత్మశాంతిని ప్రసాదించటం లోను భాగవత మెంతో నారాయణీయంకూడా అంతే.

నారాయణీయం ఒక పారాయణ గ్రంథం. దాన్ని భక్తి శ్రద్ధలతో పఠిస్తే, ఏటువంటి రోగమైనా, చివరకు, పక్షవాతంకూడా, నిర్మూలమై తీరుతుంది.

గురువాయూరు దేవాలయంలో, ప్రతిరోజు, నారాయణీయ పారాయణ జరుగు తూనే ఉంటుంది. వ్యాధిగ్రస్తులైనవా రెందరో తమ గోత్ర నామాలతో, దీక్షగా దాన్ని పారాయణ చేయించుకుని, రోగ విముక్తులై బయటపడుతూ ఉంటారు. అది యీనాటికీ అనుభవంలోఉన్న విషయం.

శ్రీమద్భాగవతసార సంగ్రహమైన శ్రీమన్నారాయణీయంలో, నూరు అధ్యాయాలున్నై. వాటిని దశకాలు అన్నారు; శ్రీ నారాయణభట్టు. దశకం అంటే పది శ్లోకాలు కలది అని అర్థం. అయినా, యీ దశకాలలో, ఒక దాంట్లో 9 శ్లోకాలే ఉన్నై. కొన్నిటిలో 10 మొదలు 15 శ్లోకాల వరకు ఉన్నై. ఏ దశకంలో ఎన్ని శ్లోకాలు ఉన్నా, వాటి నన్నిటినీ దశకాలుగానే వ్యవహరించటం జరుగుతోంది. మొత్తం మీద, యీ గ్రంథంలో, 1036 శ్లోకాలు ఉన్నై.

వీటిలో స్తోత్రభాగాన్ని వేరుచేస్తే, మిగిలిన అన్నిటిలోను, చివరకు, 'స్వామీ ! నాకు రోగవిముక్తిని కలిగించవలసింది' అనో, 'నాకు పరాభక్తిని ప్రసాదించ వలసింది' అనో, 'నాకు పరమ పురుషార్థమైన మోక్షాన్ని అనుగ్రహించవలసింది' అనో. ఏదో ఒక విన్నపం ఉండితీరుతుంది. ఆ విన్నపం సామాన్యమయిందికాదు. హృదయాన్ని దహించివేస్తున్న వేదనాగ్నిలోంచి వెలువడ్డది. గత్యంతరంలేని పరిస్థితిలో, గజేంద్రుడు చేసుకున్న విన్నపం వంటిది అది.

శ్రీ నారాయణభట్టతిరిపాదులు తమ హృదయవేదనను విన్నవించుకున్నది, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అయిన, గురువాయూరు దేవాలయంలో తన కట్టెదుట శ్రీవిగ్రహరూపంలో ఉన్న శ్రీ కృష్ణస్వామికి.

అది కారణంగానే, ఆర్తత్రాణ పరాయణుడైన ఆయన, ఆ విన్నపాన్ని ఆల కించటం, ఆలకించినదానికి చిహ్నంగా, ప్రతిమాటూ, తల ఆడించటం జరిగింది.

తల ఆడించటంతోనే తన బాధ్యత తీరిపోయిందనుకోలేదు ఆయన. అలాగే అనుకుని ఉంటే, ఆయన, 'ఆయన'గానే ఉండిపోయేవాడు; అందరి హృదయాలనూ ఆకర్షించుకునే 'నాయన' - అప్పన్ - కాగలిగేవాడు కాడు.

కొన్ని వేల జన్మల పుణ్యఫలం కూడివచ్చినప్పుడుగాని, యే జీవికీ, నారాయణ స్ఫురణ కలుగదు. ఆ స్ఫురణ కలిగినవారిలో, కోటి కొకరికైనా, శ్రీమన్నారాయ ణుని త్రికరణశుద్ధిగా సేవించుకునే అదృష్టం లభించదు. ఆ అదృష్టవంతులలో యే కొందరో మాత్రమే ఆయన అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందగలుగుతారు. అలా పొందినవారిలో శ్రీ నారాయణభట్టతిరిపాదు లొకడు.

నారాయణీయ గ్రంథ రచనకు శ్రీకారం చుట్టింది మొదలు, దాన్ని పూర్తిచేసి, 'శ్రీ కృష్ణార్పణమస్తు' అని వ్రాసే లోపల, శ్రీ నారాయణభట్టతిరిపాదులకు కలిగిన దివ్యానుభూతులు అనేక మున్నై అవన్నీ, శ్రీ గురువాయుపురాధీశ్వరుడైన నారాయణుని అనుగ్రహానికి చిహ్నాలే. మాహాత్మ్యానికి నిదర్శనలే. దీన్నిబట్టి, నారాయణ భట్టును - నారాయణీయాన్ని - నారాయణుని ఏకీకృత మొనర్చిన యేదో ఒక దివ్యశక్తి అక్కడ ఉండితీరాలనిపిస్తుంది. అది కారణంగానే, గురువాయూరు త్రివేణీ సంగమమని, భక్తుడు భక్తి భగవంతుడు అనేవే ఆ మూడు పవిత్ర నదులని నేను హృదయ పూర్వకంగా విశ్వసిస్తున్నాను.

గురువాయూరు మాహాత్మ్యం :

గురుడు (బృహస్పతి) వాయుదేవుని సహాయంతో నిర్మించిన దేవాలయ పరి సరాల్లో పెరిగిన ఊరే, గురువాయూరు. అచటి అధిష్ఠాన దేవత, సాక్షాత్తు శ్రీమన్నా రాయణుడే అయిన శ్రీకృష్ణభగవానుడు. అచటివారు, ఆయన్ని 'అప్పన్' అని, ఆప్యాయంగా పిలుచుకుంటూ ఉంటారు.

అక్కడ ప్రతిష్ఠితమై ఉండే విగ్రహం, స్వయంభువుకాని, మానవ కల్పితం కాని కాదనీ, అసలది వైకుంఠంనుంచే వచ్చిందనీ, స్థలపురాణం తెలుపుతోంది. ఆ విగ్రహం, పాతాల అంజనం (శిల) లో చెక్కబడ్డదట. దాన్ని, చతుర్ముఖుడు,

సుతపుడు - పృశ్ని అనే దంపతులకు ప్రసాదించాడట. దాన్ని అర్చించి, వారు, పృశ్నిగర్భుడనే కుమారునికి తల్లిదండ్రులైనారట.

అనంతరం, ఆ దంపతులు, అదితి కశ్యపులుగాను, దేవకీ వసుదేవులుగాను జన్మించటం, అప్పుడుకూడా, వారు, ఆ విగ్రహాన్నే ఆరాధించటం, జరిగిందనీ, శ్రీ మహావిష్ణువు, వారికి, ఆయా జన్మలలో, క్రమంగా, వామనుడుగాను, శ్రీకృష్ణుడుగాను ఉదయించటం సంభవించిందనీకూడా తెలుస్తోంది. అంతేకాదు. ఆ విగ్రహాన్ని, శ్రీకృష్ణుడు, ద్వారావతిలో ప్రతిష్ఠించుకుని అర్చించుకునేవాడనికూడా ప్రతీతి ఉంది.

ద్వాపరయుగాంతాన, శ్రీకృష్ణుడు అవతారం చాలించుకుని వైకుంఠానికి వెళ్ళబోతున్న సమయంలో, దాన్ని, ఉద్ధవునకు ఒప్పచెప్పాడనీ, కలియుగ మానవులను ఉద్ధరించే నిమిత్తం, దాన్ని, ఎక్కడైనా ప్రతిష్ఠించవలసిందిగా అతణ్ణి ఆదేశించాడనీ, అనంతరం సంభవించిన జలప్రళయంలో కొట్టుకుపోతున్న ఆ విగ్రహాన్ని, వాయుదేవుని సాయంతో, ఉద్ధవుడు ఒడ్డుకు చేర్చాడనీ, దాన్ని ఎక్కడ ప్రతిష్ఠించటమా అని ఆలోచిస్తున్న వారికి, శంకరుడు కనిపించి, పశ్చిమతీరాన ఉన్న, పరశురామక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన, కేరళంలో, అంబాపురం అనే ఊరికి సమీపంలోఉన్న ఒక స్థలాన్ని చూపించాడనీ, దేవగురుడైన బృహస్పతి, దాన్ని, అక్కడ ప్రతిష్ఠించాడనీ, స్థలపురాణంవల్ల మనకు విదితమౌతోంది.

ఆ విధంగా, వైకుంఠంనుంచి వచ్చిన విగ్రహమే అక్కడ ప్రతిష్ఠింపబడటంవల్ల, ఆ ప్రదేశాన్ని, నేటి గురువాయూరును, 'భూలోక వైకుంఠ'మనీ, అచటి దేవాలయంలోని మూర్తిని - శ్రీమన్నారాయణుని - 'భూలోక వైకుంఠ నాథు'డనీ, భక్తులు వ్యవహరిస్తూ ఉంటారు.

* * *

సర్పయాగం చేయటంద్వారా సంభవించిన పాతకంవల్ల, జనమేజయునకు, కుష్ఠవ్యాధి వచ్చిందనీ, ఆత్రేయ మహర్షి సూచనమీద, ఆయన-జనమేజయుడు-గురువాయూరు వెళ్ళి, అచటి కృష్ణస్వామిని ఆశ్రయించి, అర్చించి, రోగవిముక్తి నందాడనీ, నారద పురాణం తెలుపుతోంది. దీన్నిబట్టి, యీ దేవాలయ నిర్మాణం, కలియుగ ప్రారంభంలోనే జరిగినట్టు విదితమౌతోంది. అంటే, యిప్పటికి 5079 యేళ్ళ క్రితం, ప్రప్రథమంగా, గురువాయూరులో, కృష్ణయ్య వెలిశాడన్నమాట.

అనంతర కాలంలో, యీ దేవాలయం, అనేకమైన ఒడుదొడుకులకు లోను కావలసివచ్చిందనీ, అయినా, దాని మాహాత్మ్యంవల్ల, పునః పునః ఉద్ధరింపబడుతూ ఉండటం జరిగిందనీ, ఆలయ చరిత్ర తెలుపుతోంది.

శ్రీ ఆదిశంకర భగవత్పాదులు, తమ పర్యటన సందర్భంలో, ఒకసారి, యీ ఆలయాన్ని సందర్శించుకుని, అక్కడ 41 రోజులు మకాం చేశారు. ఆ కాలంలో, ఆయన, అక్కడ జరుగవలసిన అర్చనాదికాలకు ఒక క్రమవిధానాన్ని ఏర్పాటు చేశారు. ఈ రోజుకుకూడా అక్కడ ఆ ప్రకారమే జరుగుతోంది.

అక్కడ, అర్చన అంతా తాంత్రిక విధానంలో జరుగుతుంది. దాన్ని చూసి ఆనందించవలసిందేగాని, వివరించటం, వర్ణించటం, అసంభవం.

ఆ ఆలయ ప్రతిష్ఠను విశదపరచిన వారిలో, ఐదుగురు మహాభక్తులున్నారు. వారందరు, 16, 17 శతాబ్దులకు చెందినవారే. వారే శ్రీ బిల్వమంగళస్వామి, శ్రీ పూంతనం నంపుదిరి, రాజా శ్రీ మానవిక్రముడు, శ్రీమతి కురూరమ్మ, శ్రీ నారాయణభట్టతిరిపాదులు.

అలాగే, ఆ ఆలయాన్ని పడగొట్టాలనీ కొల్లగొట్టాలనీ ప్రయత్నించి, విఫలులైనవారు కూడా, కొందరున్నారు. వారిలో, డచ్‌వారు, మహమ్మదీయులు, ప్రముఖులు. మహమ్మదీయ ప్రభువైన టిప్పుసుల్తాన్, ఆలయాన్ని నేలమట్టం చేయాలన్న సంకల్పంతో, గురువాయూరు పొలిమేరకువచ్చి, అక్కడినుంచి ఒక అడుగుకూడా ముందుకువేసే శక్తిలేక, అల్లంత దూరంనుంచే, 'సలాము'చేసి వెళ్ళిపోయినాడట. ఈ యథార్థాన్ని, చరిత్ర వెల్లడిచేస్తోంది.

శ్రీ గురువాయూరు మాహాత్మ్యాన్ని వెల్లడిచేసే యిటువంటి మహత్తర ఘట్టాలు ఎన్నో ఉన్నై. అది కారణంగానే...

> 'ఇసుక రేణువులను లెక్కించటం, ఆకసంలోని తారలను
> గణించటం, ఎంత అసంభవమో, గురువాయూరులోని శ్రీ కృష్ణస్వామి
> మాహాత్మ్యాన్ని వివరించటంకూడా అంత అసంభవమే'

అన్నారు; శ్రీ నారాయణభట్టతిరిపాదులు. అది అక్షరాలా యథార్థం.

* * *

అనువాదం పూర్తికాగానే, తొలుదొల్తగా, దీనిలోని 'సాక్షాత్కారం' అనే దశకాన్ని, సద్గురుదేవులు శ్రీ శ్రీ శ్రీ అభేదానందభారతీ స్వాములవారికి వినిపించుకున్నాను; వారు, సాదరపూర్వకంగా విని, సంతోషించారు; ఆశీర్వదించారు.

అనంతరం, పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ శ్రీ శ్రీమదభినవోద్దండ విద్యానృసింహ భారతీ స్వాములవారికి కొన్ని దశకాలు వినిపించాను. వారు ఆనందించి, ఆశీఃపూర్వకమైన తమ అమూల్యాభిప్రాయాన్ని ప్రసాదించారు.

అందుకనే ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ పూజ్యులకు, నేను, తిరిగి నా నమోవాకా లర్పించుకుంటున్నాను.

ఈ సందర్భంలోనే, ఈ గ్రంథప్రచురణకు తోడ్పడినవా రందరికీ శ్రీ బాలకృష్ణ భగవానుని దివ్యాశీస్సుల నందజేసుకుంటున్నానుకూడా.

కాలయుక్తి - వైశాఖపూర్ణిమ. ఓమ్ తత్ సత్ ఇట్లు
(22-5-1978) కృష్ణదాస్

మనవి

భక్తితత్వ ప్రబోధధానికి తమ జీవితాన్ని అంకితం చేసుకున్న స్వామి కృష్ణదాస్‌జీ మహారాజ్, ఆ లక్ష్యసిద్ధికిగాను, దానికి సంబంధించిన కొన్ని పవిత్ర గ్రంథాలను ప్రచురించే నిమిత్తం, శ్రీమద్భాగవత సేవా సమాజాన్ని స్థాపించారు. ఆ సమాజ ప్రచురణలు అందరకు అందుబాటులో ఉండే ధరకు అందజేయబడాలనికూడ నిర్ణయించారు.

స్వామిజీ యెప్పుడు యే పనిచేసినా, వారి లక్ష్యం, పదిమందికి మేలు చేకూర్చటంగానే ఉంటుంది. అది అందరికీ తెలుసు. అందుకనే, ఆ సమాజ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను వారు మా మీద ఉంచినప్పుడు, మేము, దాన్ని. పరమానందంతో శిరసావహించాం. శక్తివంచనలేకుండా వారి లక్ష్య సిద్ధికి కృషిచేయటానికే నిశ్చయించుకున్నాం.

సమాజ ప్రచురణలుగా స్వామిజీ నిర్ణయించినవి ప్రథానంగా నాలుగు గ్రంథాలు. వానిలో రెండు పునర్ముద్రణలు; రెండు నూతనములు.

ఆ నాలుగింటిలోను 'శ్రీకృష్ణ లీలామృతం' (చతుర్థ సహస్రం) 1974 మార్చి నెలలో ప్రచురించటమయింది. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర మహా మంత్రం (ప్రతి పదార్థ వివరణ సహితంగా) 1975 నవంబరు నెలలో ప్రకటిత మయింది. మూడవ ప్రచురణమైన 'నారాయణీయం' తొలిసారిగా యీ రోజున* విడుదల అవుతోంది. ఇక మిగిలిఉన్నది, 'శ్రీమద్భాగవతం' (పునర్ముద్రణం). దాన్ని శ్రావణమాసంలో - 1978 జులై మధ్యభాగంలో - అచ్చుకివ్వాలనుకుంటున్నాం; వచ్చే దసరా పండుగలలో విడుదలచేయాలనుకుంటున్నాం.

శ్రీమద్భాగవతం 670 పేజీల వచన గ్రంథం. అవధాన శిరోమణి మహామహోపాధ్యాయ బిరుదాంచితులూ మహాకవులూ ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవులూ అయిన శ్రీమాన్ కాశీ కృష్ణాచార్యులవారిచేత....

---

* కాలయుక్తి వైశాఖపూర్ణిమనాడు.

"అందరకు వినినపుడ ఆ
నందం బిడుకృతియె కృతియ నాబడు; నే నా
చందము నీ కృతిఁగని యా
నందించితి"

అని ప్రశంసింపబడిన మధురకృతి. దాన్ని, కనీసం 10 వేల ప్రతులైనా ముద్రించాలనీ, వీలున్నంత తక్కువ మూల్యానికే పాఠకులకు అందజేయాలనీ స్వామిజీ సంకల్పం. వారి ఆశీర్వాదబలంతో, శ్రీ బాలకృష్ణ భగవానుని అనుగ్రహంతో, భక్తుల ఆదరాభిమానాలతో మే మా పనిని చేయగలుగుతామనే విశ్వసిస్తున్నాం.

వ్యాపార దృష్టిగలవారు, ఆ గ్రంథం వెల ఈ నాడు 30 రూపాయలకు తక్కువ పెట్టరు. కాని, భక్తితత్వ ప్రచారమే పరమాశయంగాగల స్వామిజీ, దాన్ని, యే పరిస్థితిలోను 15 రూపాయలకు మించకుండా చూడమని ఆదేశించారు. మే మలా చేయటానికే పూనుకున్నాం.

ఈ పవిత్ర కార్యం ఒక మహాయజ్ఞం వంటిది. దీనివల్ల కనీసం ఒక లక్షమందికైనా మేలు కలిగితీరుతుంది. ఈ యథార్థాన్ని గ్రహించినవారు, ఆ పవిత్ర గ్రంథం తమకు కావాలనుకునేవారు, ముద్రణ ప్రారంభమయేలోగా (జులై 15 వ తేదీలోగా) ఆ ప్రతి వెలను - 15 రూపాయలను - గౌరవ కార్యదర్శి పేర పంపించి, సమాజానికి చేయూత నీయవచ్చు; స్వామిజీద్వారా శ్రీ బాలకృష్ణ భగవానుని దివ్యాశీస్సులతో వచ్చే రసీదును పొందవచ్చు.

భక్తులందరూ యీ సదవకాశాన్ని తప్పక వినియోగించుకుంటారనీ, శ్రీమద్భాగవత సేవలో యీ విధంగా పాల్గొని, భగవదనుగ్రహానికి పాత్రులవుతారనీ దృఢంగా విశ్వసిస్తున్నాం; సెలవు.

ఇట్లు

జి. కె. జి. కె. రావు;
సమాజ గౌరవాధ్యక్షులు
హైదరాబాదు.

మంచాల మల్లేశం
సమాజ గౌరవ కార్యదర్శి
భువనగిరి.

శ్రీమద్భాగవత సేవా సమాజం

సికిందరాబాదు

సంస్థాపకులు :

స్వామి కృష్ణదాస్‌జీ మహరాజ్

గౌరవాధ్యక్షులు :

శ్రీ గుంటూరు కుమార గోపాల కృష్ణారావు; బి. ఎ., బి. ఎల్.

గౌరవోపాధ్యక్షులు :

శ్రీ దశక సూర్యనారాయణ; బి. ఎ.,

గౌరవ కార్యదర్శి :

శ్రీ మంచాల మల్లేశం - భువనగిరి.

రాజపోషకులు :

1. శ్రీ కందుకూరి శివానందమూర్తి - హన్మకొండ.
2. శ్రీ ఎస్. ఆర్. కృష్ణమూర్తి - హైదరాబాదు.
3. శ్రీ బి. పి. ,,
4. శ్రీ ముష్టి వెంకటశాస్త్రి - మచిలీపట్నం.

పోషకులు :

1. శ్రీ తేన్కున్ట్ల చిరంజీవయ్య - (స్వర్గవాసి)
2. శ్రీ పోతరాజు వేణుగోపాల్ ,,
3. మెస్సర్సు. బెజుగం వీరన్న వెంకట నర్సింలు - నిజామాబాద్.
4. శ్రీమతి చిన్నం రామలక్ష్మమ్మ ,,

5. శ్రీ చిల్లంచెర్ల అనంతరాములు - మిర్యాలగూడ.
6. శ్రీ కొండూరు శేషయలింగం - వరంగల్.
7. శ్రీ వెంపటి చినసత్యం - మద్రాస్.
8. శ్రీ పి. వి. సుబ్రహ్మణ్యం - కావలి
9. శ్రీ టి. నరసింగరావు - హైదరాబాదు.
10. శ్రీ ఎస్. ఎస్. సిద్ధాంతి ,,
11. శ్రీ బాలాజీ మోతేవార్ - దెగులూరు.
12. శ్రీ డి. ఉపేంద్రరెడ్డి - సూర్యాపేట.

సహాయకులు :

1. శ్రీ మంచాల రవీంద్ర - భువనగిరి.
2. శ్రీ జి. పి. వి. ఎ. సుబ్రహ్మణ్యం (స్వర్గవాసి)
3. శ్రీ పాణింగపల్లి శివశంకరం - హైదరాబాదు.
4. శ్రీ జయం ఆంజనేయులు ,,

అభిమానులు :

1. శ్రీ చౌడారపు ఎల్లయ్య గుప్త - హైదరాబాదు.
2. శ్రీ గోపారపు వీరయ్యగుప్త ,,
3. డాక్టర్ శ్రీ రంగాచారి ,,
4. శ్రీ కానుకుంట జంగంరావు ,,
5. శ్రీ సీతారాం ఘనాతె ,,
6. శ్రీ వెంపటి సత్యనారాయణ ,,
7. శ్రీ దేవరకొండ వెంకటేశ్వరరావు - మండపాక.
8. శ్రీ ఎం. రాధాకృష్ణమూర్తి - హైదరాబాదు.
9. శ్రీ ఉపాధ్యాయుల కృష్ణమూర్తి ,,
10. శ్రీ పాణింగపల్లి వీరభద్రశర్మ ,,

11. శ్రీ వారణాసి శివకామయ్య - హైదరాబాదు.
12. శ్రీ నారుమంచి సూర్యనారాయణమూర్తి ,,
13. శ్రీ ఎం సుభాష్ ,,
14. శ్రీ ఎం. ఎన్. భారతి ,,
15. శ్రీమతి గాంజీ మాణిక్యమ్మ ,,
16. శ్రీ వెలుగులేటి శ్రీనివాసాచార్య - భువనగిరి.
17. శ్రీ తోట లక్ష్మీనారాయణ ,,
18. శ్రీ ఎ. పి. ఎన్. అయ్యర్ ,,
19. శ్రీ గంప లక్ష్మీనారాయణ - ఆలేరు.
20. శ్రీ బిజాపూర్ నర్సోజి - సికిందరాబాదు.
21. శ్రీమతి వి. ఎల్. పార్వతి - మద్రాస్.
22. శ్రీఎస్. కె. సోమయాజులు - రాజమండ్రి.
23. శ్రీ జి. రాఘవయ్య - మద్రాస్.
24. శ్రీ ఎస్. ఎన్. నాయుడు ,,
25. శ్రీ పెద్ది నారాయణ - జనగాం.
26. శ్రీ కె. వి. సుబ్బయ్య - విశాఖపట్నం.
27. శ్రీ కొంకిమళ్ళ హనుమంతరావు - హనుమకొండ.

('నారాయణీయం' ప్రచురణకుగాను తలకొక నూరురూపాయల చొప్పున అందజేసిన భక్తుల పేర్లు, 316 నుంచి 320 పేజీల వరకు ప్రత్యేకంగా ముద్రింపబడినై.)

నారాయణీయ నవనీతమ్

(నిత్యపారాయణ కొఱకు)

1. సాంద్రానందావబోధాత్మక - మనుపమితం కాలదేశావధిభ్యాం
నిర్ముక్తం నిత్యముక్తం నిగమశతసహస్రేణ నిర్భాస్యమానం
అస్పష్టం దృష్టమాత్రే పునరురు - పురుషార్థాత్మకం బ్రహ్మతత్త్వం
తత్తావద్భాతి సాక్షాద్ గురుపవనపురే హంత భాగ్యం జనానాం.

(పేజి. 5 - నం. 1)

2. తత్తే ప్రత్యగ్రధారాధర - లలితకలాయావలీకేలికారం
లావణ్యస్యైకసారం సుకృతిజనదృశాం - పూర్ణపుణ్యావతారం
లక్ష్మీనిశ్శంకలీలా - నిలయనమమృత - స్యందసందోహమంతః
సించత్సంచింతకానాం వపురనుకలయే మారుతాగారనాథ.

(పేజి. 6 - నం. 6)

3. కారుణ్యాత్ కామమన్యం దదతి ఖలు పరే స్వాత్మదస్త్వం విశేషా -
దైశ్వర్యా-దీశతే (అ)న్యే జగతి పరజనే స్వాత్మనో (అ)పీశ్వరస్త్వం
త్వయ్యుచ్చైః - రారమంతి ప్రతిపదమధురే చేతనాః స్ఫీతభాగ్యా -
స్త్వం చాత్మారామ ఏవేత్యతులగుణగణాధార శౌరే నమస్తే !

(పేజి. 7 - నం. 9)

4. ఐశ్వర్యం శంకరాదీ - శ్వరవినియమనం విశ్వతేజోహరాణాం
తేజస్సంహారి వీర్యం విమలమపి యశో నిస్పృహైశ్చోపగీతం
అంగాసంగా సదా శ్రీరఖిలవిదసి న క్వాపి తే సంగవార్తా
తద్వాతాగారవాసిన్ మురహర భగవచ్ఛబ్ద - ముఖ్యాశ్రయో(అ)సి.

(పేజి. 7 - నం. 10)

5. సూర్యస్పర్ధికిరీట - మూర్ధ్వతిలక - ప్రోద్భాసి - ఫాలాంతరం
కారుణ్యాకులనేత్ర - మార్ద్రహసితోల్లాసం సునాసాపుటం
గండోద్యన్మకరాభ - కుండల యుగం కంఠోజ్వలత్ కౌస్తుభం
త్వద్ రూపం వనమాల్యహార పటల - శ్రీవత్సదీప్రం భజే.
(పేజి. 10 - నం. 1)

6. కేయూరాంగద - కంకణోత్తమ - మహారత్నాంగులీయాంకిత -
శ్రీమద్-బాహు-చతుష్క--సంగత-గదా-శంఖారి-పంకేరుహాం,
కాంచిత్ కాంచనకాంచి - లాంఛిత-లసత్పీతాంబరా - లంబినీ -
మాలంబే విమలాంబుజద్యుతిపదాం మూర్తిం తవార్తిచ్ఛిదమ్.
(పేజి. 10 - నం. 2)

7. యత్ త్రైలోక్య-మహీయసోపి మహితం సమ్మోహనం మోహనాత్
కాంతం కాంతినిధానతోపి మధురం మాధుర్యధుర్యాదపి,
సౌందర్యోత్తరతోపి సుందరతరం త్వద్రూపమాశ్చర్యతో -
ప్యాశ్చర్యం భువనే న కస్య కుతుకం పుష్ణాతి, విష్ణో విభో.
(పేజి. 10 - నం. 3)

8. పఠంతో నామాని ప్రమదభరసింధౌ నిపతితాః
స్మరంతో రూపం తే వరద కథయంతో గుణకథాః
చరంతో యే భక్తా-స్త్వయి ఖలు రమంతే పరమమూ -
నహం ధన్యాన్ మన్యే సమధిగత - సర్వాభిలషితాన్.
(పేజి. 14 - నం. 1)

9. గదక్లిష్టం కష్టం తవ చరణసేవారసభరే -
ప్యనాసక్తం చిత్తం భవతి బత విష్ణో కురు దయాం
భవత్పాదాంభోజ - స్మరణరసికో నామనివహా -
నహం గాయం గాయం కుహచన వివత్స్యామి విజనే.
(పేజి. 14 - నం. 2)

10. కృపా తే జాతా చేత్ కిమివ న హి లభ్యం తనుభృతాం
మదీయక్లేశౌఘ - ప్రశమనదశా నామ కియతీ
న కే కే లోకే(అ)స్మి-న్ననిశమయి శోకాభిరహితా
భవద్భక్తా ముక్తాః సుఖగతి - మసక్తా విదధతే.

(పేజి. 14 - నం. 3)

11. మునిప్రౌఢా రూఢా జగతి ఖలు గూఢాత్మగతయో
భవత్పాదాంభోజ - స్మరణవిరుజో నారదముఖాః
చరంతీశ స్వైరం సతతపరినిర్భాత - పరచిత్ -
సదానందాద్వైత - ప్రసరపరిమగ్నాః కిమపరం.

(పేజి. 14 - నం. 4)

12. భవద్భక్తిః స్ఫీతా భవతు మమ సైవ ప్రశమయే -
దశేషక్లేశౌఘం న ఖలు హృది సందేహకణికా
న చేద్వ్యాసస్యోక్తి - స్తవ చ వచనం నైగమవచో
భవేన్మిథ్యా రథ్యాపురుషవచన - ప్రాయమఖిలం.

(పేజి. 15 - నం. 5)

13. భవద్భక్తి - స్తావత్ ప్రముఖమధురా త్వద్గుణరసాత్
కిమప్యారూఢా చేదఖిలపరితాప - ప్రశమనీ
పునశ్చాంతే స్వాంతే విమల - పరిబోధోదయమిల -
న్మహానందాద్వైతం దిశతి కిమతః ప్రార్థ్యమపరం.

(పేజి. 15 - నం. 6)

14. విధూయ క్లేశాన్ మే కురు చరణయుగ్మం ధృతరసం
భవత్ క్షేత్ర ప్రాప్తౌ కరమపి చ తే పూజనవిధౌ
భవన్మూర్త్యాలోకే నయనమథ తే పాదతులసీ -
పరిఘ్రాణే ఘ్రాణం శ్రవణమపి తే చారుచరితే.

(పేజి. 15 - నం. 7)

15. ప్రభూతాధివ్యాధి - ప్రసభచలితే మామకహృది
త్వదీయం తద్రూపం - పరమసుఖ - చిద్రూపముదియాత్
ఉదంచద్రోమాంచో గలితబహుహర్షాశ్రునివహో
యథా విస్మర్యాసం దురుపశమపీడా - పరిభవాన్.

(పేజి. 15 - నం. 8)

16. మరుద్గేహాధీశ త్వయి ఖలు పరాంచో (అ)పి సుఖినో
భవత్స్నేహీ సో (అ)హం సుబహు పరితప్యే చ కిమిదం
అకీర్తిస్తే మాభూద్ వరద గదభారం ప్రశమయన్
భవద్భక్తోత్తంసం ఝుటితి కురు మాం కంసదమన.

(పేజి. 16 - నం. 9)

17. కిరీట ముకుటోల్లసత్ - కటక - హార - కేయూరయు -
జ్మణిస్ఫురితమేఖలం సుపరివీతపీతాంబరం
కలాయకుసుమప్రభం గలతలోల్లసత్కౌస్తుభం
వపుస్తదయి భావయే కమలజన్మనే దర్శితం.

(పేజి. 35 - నం. 6)

18. త్వచిచ్ఛందో రోమస్వపికుశగణ శ్చక్షుషిధ్రుతం
చతుర్హోతారోంఘ్రౌ స్రుగపివదనే చోదరఇడా
గ్రహా జిహ్వాయాం తే పరపురుష కర్ణే చ చమసా
విభో సోమో వీర్యం వరద గలదేశే(అ)ప్యుపసదః.

(పేజి. 47 - నం. 9)

19. మధ్యోద్భవే భువ ఇలావృతనామ్ని వర్షే
గౌరీప్రధాన - వనితాజన - మాత్రభాజి
శర్వేణ మంత్రనుతిభిః సముపాస్యమానం
సంకర్షణాత్మక - మధీశ్వర సంశ్రయే త్వాం.

(పేజి. 71 - నం. 1)

20. భద్రాశ్వనామక ఇలావృతపూర్వవర్షే
భద్రశ్రవోభిఋషిభిః పరిణూయమానం
కల్పాంతగూఢ - నిగమోద్ధరణ - ప్రవీణం
ధ్యాయామి దేవ హయశీర్షతనుం భవంతం.

(పేజి. 71 - నం. 2)

21. ధ్యాయామి దక్షిణగతే హరివర్షవర్షే
ప్రహ్లాదముఖ్యపురుషైః పరిషేవ్యమాణం
ఉత్తుంగ శాంత - ధవలాకృతి - మేకశుద్ధ -
జ్ఞానప్రదం నరహరిం భగవన్ భవంతం.

(పేజి. 71 - నం. 3)

22. వర్షే ప్రతీచి లలితాత్మని కేతుమాలే
లీలావిశేష - లలితస్మిత - శోభనాంగం
లక్ష్మ్యా ప్రజాపతిసుతైశ్చ నిషేవ్యమాణం
తస్యాః ప్రియాయ ధృతకామతనుం భజే త్వాం.

(పేజి. 71 - నం. 4)

23. రమ్యేహ్యుదీచి ఖలు రమ్యకనామ్ని వర్షే
తద్వర్షనాథ - మనువర్య - సపర్యమాణం
భక్తైకవత్సల - మమత్సరహృత్సు భాంతం
మత్స్యాకృతిం భువననాథ భజే భవంతం.

(పేజి. 72 - నం 5)

24. యామ్యాం దిశం భజతి కింపురుషాఖ్యవర్షే
సంసేవితో హనుమతా దృఢభక్తిభాజా
సీతాభిరామ - పరమాద్భుత - రూపశాలీ
రామాత్మకః పరిలసన్ పరిపాహి విష్ణో.

(పేజి. 72 - నం. 8)

25. శ్రీనారదేన సహ భారతఖండముఖ్యై -
స్త్వం సాంఖ్యయోగనుతిభిః సముపాస్యమానః
ఆకల్పకాలమిహ సాధుజనాభిరక్షీ
నారాయణో నరసఖః పరిపాహి భూమన్.

(పేజి. 73 - నం. 9)

26. సర్వైర్ధ్రువాదిభి - రుడుప్రకరైర్గ్రహైశ్చ
పుచ్ఛాదికేష్వవయవే - ష్వభికల్ప్యమానైః
త్వం శింశుమారవపుషా మహతాముపాస్యః
సంధ్యాసు రుంధి నరకం మమ సింధుశాయిన్.

(పేజి. 73 - నం. 11)

27. పాతాలమూలభువి శేషతనుం భవంతం
లోలైకకుండల విరాజి - సహస్రశీర్షం
నీలాంబరం ధృతహలం భుజగాంగనాభిర్ -
జుష్టం భజే హర గదాన్ గురుగేహనాథ.

(పేజి. 73 - నం. 12)

28. త్వత్ సేవనేన దితిరింద్రవధోద్యతా(అ)పి
తాన్ప్రత్యుతేంద్రసుహృదో మరుతోభిలేభే
దుష్టాశయే(అ)పి శుభదైవ భవన్నిషేవా
తత్తాదృశస్త్వమవ మాం పవనాలయేశ.

(పేజి. 80 - నం. 11)

29. ఉత్సర్ప - ద్వలిభంగ - భీషణహనుం హ్రస్వస్థవీయస్తర -
గ్రీవం పీవరదోశ్శతోద్గత - నఖక్రూరాంశు - దూరోల్బణం
వ్యోమోల్లంఘి ఘనాఘనోపమఘన - ప్రధ్వాననిర్ధావిత -
స్పర్ధాలుప్రకరం నమామి భవత స్తన్నారసింహం వపుః

(పేజి. 85 - నం. 4)

30. నిపాయయంతీ స్తనమంకగం త్వాం
విలోకయంతీ వదనం హసంతీ
దశాం యశోదా కతమాన్న భేజే
స తాదృశః పాహి హరే గదాన్మాం

(పేజి. 140 - నం. 10)

31. తవ దధిఘృతమోషే ఘోషయోషా - జనానా -
మభజత హృది రోషో నావకాశం న శోకః
హృదయమపి ముషిత్వా హర్షసింధౌ న్యధాస్త్వం
స మమ శమయ రోగాన్ వాతగేహాధినాథ.

(పేజి. 150 - నం. 10)

32. ధృతతత్త్వధియం తదా క్షణం
జననీం తాం ప్రణయేన మోహయన్
స్తనమంబ దిశేత్యుపాసజన్
భగవన్నద్భుతబాల పాహి మామ్.

(పేజి. 152 - నం. 10)

33. లలితమురలీనాదం దూరాన్నిశమ్య వధూజనైస్ -
త్వరితముపగమ్యారా - దారూఢమోదముదీక్షితః
జనితజననీనందానందః సమీరణమందిర -
ప్రథితవసతే శౌరే దూరీకురుష్వ మమామయాన్.

(పేజి. 162 - నం. 10)

34. కరబదరవదేవం దేవ కుత్రావతారే
పరపదమనవాప్యం దర్శితం భక్తిభాజామ్
తదిహ పశుపరూపీ త్వం హి సాక్షాత్పరాత్మా
పవనపురనివాసిన్ పాహి మామామయేభ్యః.

(పేజి. 194 - నం. 10)

35. అభ్యాగతాభిరభితో వ్రజసుందరీభి -
ర్ముగ్ధస్మితార్ద్రవదనః కరుణావలోకీ
నిస్సీమకాంతిజలధి స్త్వమవేక్ష్యమాణో
విశ్వైకహృద్య హర మే పవనేశ రోగాన్.

(పేజి. 196 - నం. 9)

36. కేశపాశధృత - పింఛికావితతి సంచలన్మకరకుండలం
హారజాల - వనమాలికా - లలిత - మంగరాగ - ఘనసౌరభం
పీతచేలధృత - కాంచికాంచిత - ముదంచదంశు - మణినూపురం
రాసకేళిపరిభూషితం తవ హి రూపమీశ కలయామహే.

(పేజి. 203 - నం. 1)

37. ఏవం భక్తిః సకలభువనే నేక్షితా న శ్రుతా వా
కిం శాస్త్రౌఘైః కిమిహ తపసా గోపికాభ్యో నమో(అ)స్తు
ఇత్యానందాకుల - ముపగతం గోకులాదుద్ధవం తం
దృష్ట్వా హృష్టో గురుపురపతే పాహి మామామయౌఘాత్.

(పేజి. 226 - నం. 11)

38. కల్పద్రుం సత్యభామాభవనభువి సృజన్ ద్వ్యష్టసాహస్రయోషాః
స్వీకృత్య ప్రత్యగారం విహితబహువపుర్లాలయన్ కేళిభేదైః
ఆశ్చర్యా - న్నారదాలోకిత - వివిధగతి - స్తత్ర తత్రాపి గేహే
భూయః సర్వాసు కుర్వన్ దశ దశ తనయాన్ పాహి వాతాలయేశ.

(పేజి. 241 - నం. 10)

39. సో(అ)యం కృష్ణావతారో జయతి తవ విభో యత్ర సౌహార్దభీతి -
స్నేహద్వేషానురాగ - ప్రభృతిభిరతులై - రశ్రమై ర్యోగభేదైః
ఆర్తిం తీర్త్వా సమస్తా - మమృతపదమగుః సర్వతః సర్వలోకాః
స త్వం విశ్వార్తిశాంత్యై పవనపురపతే భక్తిపూర్త్యై చ భూయాః.

(పేజి. 265 - నం. 12)

40. రమాజానే జానే యదిహ తవ భక్తేషు విభవో
నసద్యః సంపద్య - స్తదిహ మదకృత్యా - దశమినామ్
ప్రశాంతిం కృత్వైవ ప్రదిశసి తతః కామమఖిలం
ప్రశాంతేషు క్షిప్రం న ఖలు భవదీయే చ్యుతికథా.

(పేజి. 266 - నం. 1)

41. జగత్స్రష్ట్యాదౌ త్వాం నిగమనివహై - ర్వందిభి రివ
స్తుతం విష్ణో సచ్చిత్పరమరస - నిర్ద్వైతవపుషమ్
పరాత్మానం భూమన్ పశుపవనితాభాగ్యనివహం
పరీతాపశ్రాంత్యై పవనపురవాసిన్ పరిభజే.

(పేజి. 268 - నం. 10)

42. యత్ కించిదప్యవిదుషా(అ)పి విభో మయోక్తం
తన్మంత్రశాస్త్రవచనా - ద్యభిదృష్టమేవ
వ్యాసోక్తిసారమయ - భాగవతోపగీత
క్లేశాన్ విధూయ కురు భక్తిభరం పరాత్మన్.

(పేజి. 271 - నం. 11)

43. శ్రీకృష్ణ త్వత్పదోపాసన - మభయతమం బద్ధమిథ్యార్థదృష్టే -
ర్మర్త్యస్యార్తస్య మన్యే వ్యపసరతి భయం యేన సర్వాత్మనైవ
యత్తావత్ త్వత్ప్రణీతానిహ భజనవిధీ - నాస్థితో మోహమార్గే
ధావన్నప్యావృతాక్షః స్ఖలతి న కుహచి - ద్దేవదేవాఖిలాత్మన్.

(పేజి. 272 - నం. 1)

44. భీతిర్నామ ద్వితీయా - ద్భవతి నను మనఃకల్పితం చ ద్వితీయం
తేనైక్యాభ్యాసశీలో హృదయమిహ యథాశక్తి బుద్ధ్యా నిరుంధ్యామ్
మాయావిద్ధే తు తస్మిన్ పునరపి న తథా భాతి మాయాధినాథం
తం త్వాం భక్త్యా మహత్యా సతతమనుభజ - న్నీశ భీతిం విజహ్యామ్.

(పేజి. 272 - నం. 3)

45. భక్తేరుత్పత్తివృద్ధీ తవ చరణజుషాం సంగమేనైవ పుంసా -
మాసాద్యే పుణ్యభాజాం శ్రియ ఇవ జగతి శ్రీమతాం సంగమేన
తత్సంగో దేవ భూయాన్ మమ ఖలు సతతం తన్ముఖాదున్మిషద్భి -
స్త్వన్మాహాత్మ్యప్రకారై - ర్భవతి చ సుదృఢా భక్తి రుద్ధూతపాపా.
(పేజి. 273 - నం. 4)

46. శ్రేయోమార్గేషు భక్తా - వధికబహుమతి - ర్జన్మకర్మాణి భూయో
గాయన్ క్షేమాణి నామాన్యపి తదుభయతః ప్రద్రుతం ప్రద్రుతాత్మా
ఉద్యద్ధాసః కదాచిత్ కుహచిదపి రుదన్ క్వాపి గర్జన్ ప్రగాయ -
న్నున్మాదీవ ప్రనృత్యన్నయి కురు కరుణాం లోకబాహ్యశ్చరేయమ్.
(పేజి. 273 - నం. 5)

47. భూతాన్యేతాని భూతాత్మకమపి సకలం పక్షిమత్స్యాన్ మృగాదీన్
మర్త్యాన్ మిత్రాణి శత్రూనపి యమితమతి - స్త్వన్మయాన్యానమాని
త్వత్సేవాయాం హి సిధ్యేన్మమ తవ కృపయా భక్తిదార్ఢ్యం విరాగ -
స్త్వత్తత్వస్యావబోధో(అ)పి చ భువనపతే యత్నభేదం వినైవ.
(పేజి. 273 - నం. 6)

48. భూతేష్వేషు త్వదైక్యస్మృతిసమధిగతౌ నాధికారో(అ)ధునాచేత్
త్వత్ప్రేమ త్వత్కమైత్రీ జడమతిషు కృపా ద్విట్సు భూయాదుపేక్షా
అర్చాయాం వా సమర్చాకుతుకమురుతరశ్రద్ధయా వర్ధతాం మే
త్వత్సంసేవీ తథాపి ద్రుతముపలభతే భక్తలోకోత్తమత్వమ్.
(పేజి. 274 - నం. 8)

49. దుఃఖాన్యాలోక్య జంతుష్వల - ముదితవివేకో(అ)హ-మాచార్యవర్యా -
ల్లబ్ధ్వా త్వద్రూపతత్త్వం గుణచరితకథాద్యుద్భవద్భక్తిభూమా
మాయామేనాం తరిత్వా పరమసుఖమయే త్వత్పదే మోదితాహే
తస్యాయం పూర్వరంగః పవనపురపతే నాశయాశేషరోగాన్.
(పేజి. 275 - నం. 10)

50. వేదైః సర్వాణి కర్మాణ్యఫలపరతయా వర్ణితానీతి బుద్ధ్వా
తాని త్వయ్యర్పితాన్యేవ హి సమనుచరన్ యాని నైష్కర్మ్యమీశ
మా భూద్వేదైర్నిషిద్ధే కుహచిదపి మనఃకర్మవాచాం ప్రవృత్తి -
ర్దుర్వర్జం చేదవాప్తం తదపి ఖలు భవత్యర్పయే చిత్ప్రకాశే.
(పేజి. 276 - నం. 1)

51. పాపో(అ)యం కృష్ణ రామేత్యభిలపతి నిజం గూహితుం దుశ్చరిత్రం
నిర్లజ్జస్యాస్య వాచా బహుతరకథనీయాని మే విఘ్నితాని
భ్రాతా మే వంధ్యశీలో భజతి కిల సదా విష్ణుమిత్థం బుధాంస్తే
నిందంత్యుచ్చైర్హసంతి త్వయి నిహితమతీం స్తాదృశం
మా కృథా మామ్.
(పేజి. 277 - నం. 4)

52. సో(అ)యం కాలేయకాలో జయతి మురరిపో యత్ర సంకీర్తనాద్యై -
ర్నిర్యత్నైరేవ మార్గైరఖిలద న చిరాత్ త్వత్ప్రసాదం భజంతే
జాతాస్త్రేతాకృతాదావపి హి కిల కలౌ సంభవం కామయంతే
దైవాత్తత్రైవ జాతాన్ విషయవిషరసైర్మా విభో వంచయాస్మాన్.
(పేజి. 278 - నం. 6)

53. గంగా గీతా చ గాయత్ర్యపి చ తులసికా గోపికాచందనం తత్
సాలగ్రామాభిపూజా పరపురుష తథైకాదశీ నామవర్ణాః
ఏతాన్యష్టాప్యయత్నాన్యయి కలిసమయే త్వత్ప్రసాదప్రసిద్ధ్యా
క్షిప్రం ముక్తిప్రదానీత్యభిదధుఋషయస్తేషు మాం సజ్జయేథాః.
(పేజి. 279 - నం. 9)

54. దేవర్షీణాం పితౄణామపి న పునరుణీ కింకరో వా స భూమన్
యో(అ)సౌ సర్వాత్మనా త్వాం శరణముపగతః సర్వకృత్యాని హిత్వా

తస్యోత్పన్నం వికర్మాప్యఖిలమపనుదస్యేవ చిత్తస్థితస్త్వం
తన్మే పాపోత్థతాపాన్ పవనపురపతే రుంధి భక్తిం ప్రణీయాః.
(పేజి. 279 - నం. 10)

55. బంధుస్నేహం విజహ్యాం తవ హి కరుణయా త్వయ్యుపావేశితాత్మా
సర్వం త్యక్త్వా చరేయం సకలమపి జగద్వీక్ష్య మాయావిలాసమ్
నానాత్వాద్భ్రాంతిజన్యా - త్సతి ఖలు గుణదోషావబోధే విధిర్వా
వ్యాసేధో వా కథం తౌ త్వయి నిహితమతే ర్వీతవైషమ్యబుద్ధేః.
(పేజి. 280 - నం. 1)

56. త్వాత్కారుణ్యే ప్రవృత్తే క ఇవ నహి గురుర్లోకవృత్తే(అ)పి భూమన్
సర్వాక్రాంతాపి భూమిర్నహి చలతి తతః సత్క్షమాం శిక్షయేయమ్
గృహ్ణీయామీశ తత్తద్విషయపరిచయే(అ)ప్యప్రసక్తిం సమీరాద్
వ్యాప్తత్వంచాత్మనో మే గగనగురువశాద్భాతు నిర్లేపతా చ.
(పేజి. 280 - నం. 3)

57. స్వచ్ఛః స్యాం పావనో(అ)హం మధుర ఉదకవద్వహ్నివ న్మాస్మ గృహ్ణాం
సర్వాన్నీనో(అ)పి దోషం తరుషు తమివ మాం సర్వభూతేష్వవేయాం
పుష్టిర్నష్టిః కలానాం శశిన ఇవ తనో - ర్నాత్మనో(అ)స్తీతి విద్యాం
తోయాదివ్యస్తమార్తాండవదపి చ తనుష్వేకతాం త్వత్ప్రసాదాత్.
(పేజి. 281 - నం. 4)

58. స్నేహాద్ వ్యాధాస్తపుత్ర ప్రణయమృతకపోతాయితో మా స్మ భూవం
ప్రాప్తం ప్రశ్నన్ సహేయ క్షుధమపి శయువత్సింధువత్స్యా మగాధః
మా పప్తం యోషిదాదౌ శిఖిని శలభవద్ భృంగవత్సారభాగీ
భూయాసం కింతు తద్వద్ధనచయనవశాన్మా(అ)హమీశ ప్రణేశమ్.
(పేజి. 281 - నం. 5)

59. మా బధ్యాసం తరుణ్యా గజ ఇవ వశయా నార్జయేయం ధనౌఘం
హర్తాన్యస్తం హి మాధ్వీహర ఇవ మృగవన్మా ముహం గ్రామ్యగీతైః
నాత్యాసజ్జేయ భోజ్యే ఝష ఇవ బలిశే పింగళావన్నిరాశః
సుప్యాం భర్తవ్యయోగాత్ కురర ఇవ విభో సామిషో(అ)న్యైర్నహన్యై.
(పేజి. 282 - నం. 6)

60. వర్తేయ త్యక్తమానః సుఖమతి శిశువన్నిస్సహాయశ్చరేయం
కన్యాయా ఏకశేషో వలయ ఇవ విభో వర్జితాన్యోన్యఘోషః
త్వచ్చిత్తో నావబుధ్యై పరమిషుకృదివ క్ష్మాభృదాయానఘోషం
గేహేష్వన్యప్రణీతే ష్వహిరివ నివసామ్యుందురోర్మందిరేషు.
(పేజి. 282 - నం. 7)

61. త్వయ్యేవ త్వత్కృతం త్వం క్షపయిసి జగదిత్యూర్ణనాభాత్ ప్రతీయాం
త్వచ్చింతా త్వత్స్వరూపం కురుత ఇతి దృఢం శిక్షయే పేశకారాత్
విడ్భస్మాత్మా చ దేహో భవతి గురువరో యో వివేకం విరక్తిం
ధత్తే సంచింత్యమానో మమ తు బహురుజాపీడితో(అ)యం విశేషాత్.
(పేజి. 283 - నం. 8)

62. హీ హీ మే దేహమోహం త్యజ పవనపురాధీశ యత్ప్రేమహేతో -
ర్గేహే విత్తే కలత్రాదిషు చ వివశితాస్త్వత్పదం విస్మరంతి
సో(అ)యం వహ్నేః శునో వా పరమిహ పరతః సాంప్రతం చాక్షికర్ణ-
త్వగ్జిహ్వాద్యా వికర్షన్త్యవశమత ఇతః కో(అ)పి న త్వత్పదాబ్జే.
(పేజి. 283 - నం. 9)

63. దుర్వారో దేహమోహో యది పునరధునా తర్హి నిశ్శేషరోగాన్
హృత్వా భక్తిం ద్రఢిష్ఠాం కురు తవ పదపంకేరుహే పంకజాక్ష
నూనం నానాభవాంతే సమధిగతమముం ముక్తిదం విప్రదేహం
క్షుద్రే హా హన్త మా మా క్షిప విషయరసే పాహి మాం మారుతేశ.
(పేజి. 284 - నం. 10)

64. త్వల్లోకాదన్యలోకః క్వను భయరహితో యత్ పరార్ధద్వయాంతే
త్వద్భీతః సత్యలోకే(అ)పి న సుఖవసతిః పద్మభూః పద్మనాభ
ఏవంభావే త్వధర్మార్జితబహుతమసాం కా కథా నారకాణాం
తన్మే త్వం ఛింధి బంధం వరద కృపణబంధో కృపాపూరసింధో.
(పేజి. 286 - నం. 4)

65. యాథార్థ్యాత్త్వన్మయస్యైవ హి మమ న విభో వస్తుతో బంధమోక్షౌ
మాయావిద్యాతనుభ్యాం తవ తు విరచితౌ స్వప్నబోధోపమౌ తౌ
బద్ధే జీవద్విముక్తిం గతవతి చ భిదా తావతీ తావదేకో
భుంక్తే దేహద్రుమస్థో విషయఫలరసాన్నాపరో నిర్వ్యథాత్మా.
(పేజి. 286 - నం. 5)

66. జీవన్ముక్తత్వ - మేవంవిధమితి వచసా కిం ఫలం దూరదూరే
తన్నామాశుద్ధబుద్ధే ర్న చ లఘుమనసః శోధనంభక్తితో(అ)న్యత్
తన్మే విష్ణో కృషీష్ఠాస్త్వయి కృతసకలప్రార్పణం భక్తిభారం
యేన స్యాం మంక్షు కించిద్గురువచనమిలత్త్వత్ప్రబోధ - స్త్వదాత్మా.
(పేజి. 286 - నం. 6)

67. శబ్దబ్రహ్మణ్యపీహ ప్రయతితమనసస్త్వాం న జానంతి కేచిత్
కష్టం వంధ్యశ్రమాస్తే చిరతరమిహ గాం బిభ్రతే నిష్ప్రసూతిమ్
యస్యాం విశ్వాభిరామాః సకలమలహరా దివ్యలీలావతారాః
సచ్చిత్సాంద్రం చ రూపం తవ న నిగదితం తాం న వాచం భ్రియాసమ్.
(పేజి. 286 - నం. 7)

68. యో యావాన్ యాదృశో వా త్వమితి కిమపి నైవావగచ్ఛామి భూమన్-
నేవంచానన్యభావః త్వదనుభజనమేవాద్రియే చైద్యవైరిన్
త్వల్లింగానాం త్వదంఘ్రిప్రియజనసదసాం దర్శనస్పర్శనాది -
ర్భూయాన్మే త్వత్ప్రపూజానతినుతిగుణకర్మానుకీర్త్యాదరో(అ)పి.
(పేజి. 287 - నం. 8)

69. యద్యల్లభ్యేత తత్తత్తవ సముపహృతం దేవ దాసో(అ)స్మి తే(అ)హం
త్వద్గేహోన్మార్జనాద్యం భవతు మమ ముహుః కర్మ నిర్మాయమేవ
సూర్యాగ్నిబ్రాహ్మణాత్మాదిషు లసితచతుర్బాహు మారాధయే త్వాం
త్వత్ప్రేమార్ద్రత్వరూపో మమ సతతమభిష్యందతాం భక్తియోగః.

(పేజి. 287 - నం. 9)

70. ఐక్యం తే దానహోమవ్రతనియమతపః సాంఖ్యయోగైర్దురాపం
త్వత్సంగేనైవ గోప్యః కిల సుకృతితమాః ప్రాపురానందసాంద్రమ్
భక్తేష్వన్యేషు భూయస్స్వపి బహుమనుషే భక్తిమేవ త్వమాసాం
తన్మే త్వద్భక్తిమేవ ద్రఢయ హర గదాన్ కృష్ణ వాతాలయేశ.

(పేజి. 287 - నం. 10)

71. ఆనీలశ్లక్ష్ణకేశం జ్వలితమకరసత్కుండలం మందహాస -
స్యందార్ద్రం కౌస్తుభశ్రీపరిగతవనమాలోరుహారాభిరామమ్
శ్రీవత్సాంకం సుబాహుం మృదులసదుదరం కాంచనచ్ఛాయచేలం
చారుస్నిగ్ధోరు - మంభోరుహలలితపదం భావయే(అ)హం భవంతమ్.

(పేజి. 291 - నం. 8)

72. త్వం హి బ్రహ్మైవ సాక్షాత్ పరమురుమహిమ - న్నక్షరాణామకార -
స్తారో మంత్రేషు రాజ్ఞాం మనురసి మునిషు త్వం భృగుర్నారదో(అ)పి
ప్రహ్లాదో దానవానాం పశుషు చ సురభిః పక్షిణాం వైనతేయో
నాగానామస్యనంతః సురసరిదపి చ స్రోతసాం విశ్వమూర్తే.

(పేజి. 293 - నం. 1)

73. బ్రహ్మణ్యానాం బలిస్త్వం క్రతుషు చ జపయజ్ఞో(అ)సి వీరేషు పార్థో
భక్తానాముద్ధవస్త్వం బలమసి బలినాం ధామ తేజస్వినాం త్వమ్
నాస్త్యంతస్త్వద్విభూతే - ర్వికసదతిశయం వస్తు సర్వం త్వమేవ
త్వం జీవస్త్వం ప్రధానం యదిహ భవదృతే తన్న కించిత్ ప్రపంచే.

(పేజి. 293 - నం. 2)

74. జ్ఞానం త్వద్భక్తతాం వా లఘు సుకృతవశాన్మర్త్యలోకే లభంతే
తస్మాత్తత్రైవ జన్మ స్పృహయతి భగవన్ నాకగో నారకో వా
ఆవిష్టం మాం తు దైవాద్భవజలనిధిపోతాయితే మర్త్యదేహే
త్వం కృత్వా కర్ణధారం గురుమనుగుణ - వాతాయితస్తారయేథాః.
(పేజి. 294 - నం. 5)

75. అవ్యక్తం మార్గయంతః శ్రుతిభిరపి నయైః కేవలజ్ఞానలుబ్ధాః
క్లిశ్యంతే(అ)తీవ సిద్ధిం బహుతరజనుషామంత ఏవాప్నువంతి
దూరస్థః కర్మయోగో(అ)పి చ పరమఫలే నన్వయం భక్తియోగ -
స్త్వామూలాదేవ హృద్యస్త్వరితమయి భవత్ప్రాపకో వర్ధతాం మే.
(పేజి. 294 - నం. 6)

76. కశ్చిత్ క్లేశార్జితార్థక్షయవిమలమతిర్నుద్యమానో జనౌఘైః
ప్రాగేవం ప్రాహ విప్రో న ఖలు మమ జనాః కాలకర్మగ్రహా వా
చేతో మే దుఃఖహేతు - స్తదిహ గుణగణం భావయత్సర్వకారీ -
త్యుక్త్వా శాంతో గతస్త్వాం మమ చ కురు విభో తాదృశీం చిత్తశాంతిమ్.
(పేజి. 295 - నం. 9)

77. ఐలః ప్రాగుర్వశీం ప్రత్యతివివశమనాః సేవమానశ్చిరం తాం
గాఢం నిర్విద్య భూయో యువతిసుఖమిదం క్షుద్రమేవేతి గాయన్
త్వద్భక్తిం ప్రాప్య పూర్ణః సుఖతరమచరత్ తద్వదుద్ధూయ సంగం
భక్తోత్తంసం క్రియా మాం పవనపురపతే హంత మే రుంధి రోగాన్.
(పేజి. 296 - నం. 10)

78. త్రైగుణ్యాద్భిన్నరూపం భవతి హి భువనే హీనమధ్యోత్తమం యత్
జ్ఞానం శ్రద్ధా చ కర్తా వసతిరపి సుఖం కర్మ చాహారభేదాః
త్వత్ క్షేత్రత్వన్నిషేవాది తు యదిహ పునస్త్వత్పరం తత్తు సర్వం
ప్రాహుర్నైర్గుణ్యనిష్ఠం తదనుభజనతో మంక్షు సిద్ధో భవేయమ్.
(పేజి. 297 - నం. 1)

79. త్వయ్యేవ న్యస్తచిత్తః సుఖమయి విచరన్ సర్వచేష్టాస్త్వదర్థం
త్వద్భక్తైః సేవ్యమానానపి చరితచరానాశ్రయన్ పుణ్యదేశాన్
దస్యౌ విప్రే మృగాదిష్వపి చ సమమతి - ర్ముచ్యమానావమాన -
స్పర్ధాసూయాదిదోషః సతతమఖిలభూతేషు సంపూజయే త్వామ్.
(పేజి. 297 - నం. 2)

80. త్వద్భావో యావదేషు స్ఫురతి న విశదం తావదేవం హ్యుపాస్తిం
కుర్వన్నైకాత్మ్యబోధే ఝటితి వికసతి త్వన్మయో(అ)హం చరేయమ్
త్వద్ధర్మస్యాస్య తావత్ కిమపి న భగవన్ ప్రస్తుతస్య ప్రణాశ -
స్తస్మాత్సర్వాత్మనైవ ప్రదిశ మమ విభో భక్తిమార్గం మనోజ్ఞమ్.
(పేజి. 297 - నం. 3)

81. త్ర్యంశే(అ)స్మిన్ సత్యలోకే విధిహరిపురభి - న్మందిరాణ్యూర్ధ్వ
మూర్ధ్వం
తేభ్యో(అ)ప్యూర్ధ్వం తు మాయావికృతివిరహితో భాతి వైకుంఠలోకః
తత్ర త్వం కారణాంభస్యపి పశుపకులే శుద్ధసత్త్వైకరూపీ
సచ్చిద్బ్రహ్మాద్వయాత్మా పవనపురపతే పాహి మాం సర్వరోగాత్.
(పేజి. 300 - నం. 10)

82. యస్మిన్నేతద్విభాతం యత ఇదమభవద్యేన చేదం య ఏత -
ద్యో(అ)స్మాదుత్తీర్ణరూపః ఖలు సకలమిదం భాసితం యస్య భాసా
యో వాచాం దూరదూరే పునరపి మనసాం యస్య దేవా మునీంద్రా
నో విద్యుస్తత్త్వరూపం కిము పునరపరే కృష్ణ తస్మై నమస్తే.
(పేజి. 301 - నం. 1)

83. జన్మాథో కర్మ నామ స్ఫుటమిహ గుణదోషాదికం వా న యస్మిన్
లోకానామూతయే యః స్వయమనుభజతే తాని మాయానుసారీ
బిభ్రచ్ఛక్తీరరూపో(అ)పి చ బహుతరరూపో(అ) వభాత్యద్భుతాత్మా
తస్మై కైవల్యధామ్నే పరరసపరిపూర్ణాయ విష్ణో నమస్తే.
(పేజి. 301 - నం. 2)

84. నోతిర్యంచం న మర్త్యం న చ సురమసురం న స్త్రియం నోపుమాంసం
న ద్రవ్యం కర్మ జాతిం గుణమపి సదసద్వాపి తే రూపమాహుః
శిష్టం యత్స్యాన్నిషేధే సతి నిగమశతై - ర్లక్షణావృత్తితస్తత్
కృచ్ఛ్రేణావేద్యమానం పరమసుఖమయం భాతి తస్మై నమస్తే.
(పేజి. 301 - నం. 3)

85. మాయాయాం బింబితస్త్వం సృజసి మహదహంకారతన్మాత్రభేదై -
ర్భూతగ్రామేంద్రియాద్యై రపి సకలజగత్ స్వప్నసంకల్పకల్పమ్
భూయః సంహృత్య సర్వం కమఠ ఇవ పదాన్యాత్మనా కాలశక్త్యా
గంభీరే జాయమానే తమసి వితిమిరో భాసి తస్మై నమస్తే.
(పేజి 302 - నం. 4)

86. శబ్దబ్రహ్మేతి కర్మేత్యణురితి భగవన్ కాల ఇత్యాలపంతి
త్వామేకం విశ్వహేతుం సకలమయతయా సర్వథా కల్ప్యమానమ్.
వేదాంతైర్యత్తు గీతం పురుషపరచిదాత్మాభిధం తత్తు తత్త్వం
ప్రేక్షామాత్రేణ మూలప్రకృతి - వికృతికృత్ కృష్ణ తస్మై నమస్తే.
(పేజి. 302 - నం. 5)

87. సత్త్వేనాసత్తయా వా న చ ఖలు సదసత్త్వేన నిర్వాచ్యరూపా
ధత్తే యాసావవిద్యా గుణఫణిమతివ - ద్విశ్వదృశ్యావభాసమ్
విద్యాత్త్వం సైవ యాతా శ్రుతివచనలవై - ర్యత్కృపాస్యందలాభే
సంసారారణ్య - సద్యస్త్రుటన - పరశుతామేతి తస్మై నమస్తే.
(పేజి. 302 - నం. 6)

88. భూషాసు స్వర్ణవద్వా జగతి ఘటశరావాదికే మృత్తికావ -
త్తత్త్వే సంచింత్యమానే స్ఫురతి తదధునాప్యద్వితీయం వపుస్తే
స్వప్నద్రష్టుః ప్రబోధే తిమిరలయవిధౌ జీర్ణరజ్జోశ్చ యద్వ -
ద్విద్యాలాభే తథైవ స్ఫుటమపి వికసేత్ కృష్ణ తస్మై నమస్తే.
(పేజి. 303 - నం. 7)

89. యద్భీత్యోదేతి సూర్యో దహతి చ దహనో వాతి వాయు స్తథా(అ)న్యే
యద్భీతాః పద్మజాద్యాః పునరుచితబలీనాహరంతే(అ)నుకాలమ్
యేనై వారోపితాః ప్రాఙ్నిజపదమపి తే చ్యావితారశ్చ పశ్చా -
త్తస్మై విశ్వం నియంత్రే వయమపి భవతే కృష్ణ కుర్మః ప్రణామమ్.
(పేజి. 303 - నం. 8)

90. త్రైలోక్యం భావయంతం త్రిగుణమయమిదం త్ర్యక్షరస్యైకవాచ్యం
త్రీశానామైక్యరూపం త్రిభిరపి నిగమై - ర్గీయమానస్వరూపమ్
తిస్రో(అ)వస్థా విదంతం త్రియుగజనిజుషం త్రిక్రమాక్రాంతవిశ్వం
త్రైకాల్యే భేదహీనం త్రిభిరహమనిశం యోగభేదై ర్భజే త్వామ్.
(పేజి. 303 - నం. 9)

91. సత్యం శుద్ధం విబుద్ధం జయతి తవ వపుర్నిత్యము క్తం నిరీహం
నిర్ద్వంద్వం నిర్వికారం నిఖిలగుణగణవ్యంజనాధారభూతమ్
నిర్మూలం నిర్మలం తన్నిరవధిమహిమోల్లాసి నిర్లీనమంత -
ర్నిస్సంగానాం మునీనాం నిరుపమ - పరమానంద - సాంద్రప్రకాశమ్.
(పేజి. 304 - నం. 10)

92. దుర్వారం ద్వాదశారం త్రిశతపరిమిలత్ - షష్టిపర్వాభివీతం
సంభ్రామ్యత్ క్రూరవేగం క్షణమను జగదాచ్ఛిద్య సంధావమానమ్
చక్రం తే కాలరూపం వ్యథయతు న తు మాం త్వత్పదై కావలంబం
విష్ణో కారుణ్యసింధో పవనపురపతే పాహి సర్వామయౌఘాత్.
(పేజి. 304 - నం. 11)

93. విష్ణోర్వీర్యాణి కో వా కథయతు ధరణేః కశ్చ రేణూన్మిమీతే
యస్యైవాంఘ్రిత్రయేణ - త్రిజగదభిమతం మోదతే పూర్ణసంపత్
యో(అ)సౌ విశ్వాని ధత్తే ప్రియమిహ పరమం ధామ తస్యాభియాయాం
త్వద్భక్తా యత్ర మాద్యంత్యమృతరసమరందస్య యత్ర ప్రవాహః.
(పేజి. 306 - నం. 1)

94. ఆద్యాయాశేషక ర్త్రే ప్రతినిమిషనవీనాయ భర్త్రే విభూతే -
ర్భక్తాత్మా విష్ణవే యః ప్రదిశతి హవిరాదీని యజ్ఞార్చనాదౌ
కృష్ణాద్యం జన్మ యో వా మహదిహ మహతో వర్ణయేత్
సో(అ) యమేవ
ప్రీతః పూర్ణో యశోభి - స్త్వరితమభిసరేత్ ప్రాప్యమంతే పదం తే.
(పేజి. 306 - నం. 2)

95. హే స్తోతారః కవీంద్రా స్తమిహ ఖలు యథా చేతయధ్వే తథైవ
వ్యక్తం వేదస్య సారం ప్రణువత జననోపాత్తలీలాకథాభిః
జానంతశ్చాస్య నామాన్యఖిలసుఖకరాణీతి సంకీర్తయధ్వం
హే విష్ణో కీర్తనాద్యై త స్తవ ఖలు మహత స్తత్వబోధం భజేయమ్.
(పేజి. 306 - నం. 3)

96. నో జాతో జాయమానో(అ)పి చ సమధిగత - స్త్వన్మహి
మ్నో(అ)వసానం
దేవ శ్రేయాంసి విద్వాన్ ప్రతిముహురపి తే నామ శంసామి విష్ణో
తం త్వాం సంస్తౌమి నానావిధనుతివచనై రస్య లోకత్రయస్యా -
ప్యూర్ధ్వం విభ్రాజమానే విరచితవసతిం తత్ర వైకుంఠలోకే.
(పేజి. 307 - నం. 5)

97. యత్తు త్రైలోక్యరూపం దధదపి చ తతో నిర్గతానంతశుద్ధ -
జ్ఞానాత్మా వర్తసే త్వంతవ ఖలు మహిమా సో(అ)పి తావాన్కిమన్యత్.
స్తోకస్తే భాగ ఏవాఖిలభువనతయా దృశ్యతే త్ర్యంశకల్పం
భూయిష్ఠం సాంద్రమోదాత్మకముపరి తతో భాతి తస్మై నమస్తే.
(పేజి. 308 - నం. 9)

98. అవ్యక్తం తే స్వరూపం దురధిగమతమం తత్తు శుద్ధైకసత్త్వం
వ్యక్తంచాప్యేతదేవ స్ఫుటమమృతరసాంభోధికల్లోలతుల్యమ్

సర్వోత్కృష్టామభీష్టాం తదిహ గుణరసేనైవ చిత్తం హరంతీం
మూర్తిం తే సంశ్రయే(అ)హం పవనపురపతే పాహి మాం
కృష్ణ రోగాత్.
(పేజి. 308 - నం. 10)

99. అగ్రే పశ్యామి తేజో నిబిడతరకలాయావళీలోభనీయం
పీయూషాప్లావితో(అ)హం తదను తదుదరే దివ్యకైశోరవేషమ్
తారుణ్యారంభరమ్యం పరమసుఖరసాస్వాదరోమాంచితాంగై -
రావీతం నారదాద్యై - ర్విలసదుపనిష - త్సుందరీమండలైశ్చ.
(పేజి. 310 - నం. 1)

100. నీలాభం కుంచితాగ్రం ఘనమమలతరం సంయతం చారుభంగ్యా
రత్నోత్తంసాభిరామం వలయితముదయచ్చంద్రకైః పింఛజాలైః
మందారస్రఙ్నివీతం తవ పృథుకబరీభార - మాలోకయే(అ)హం
స్నిగ్ధశ్వేతోర్ధ్వపుండ్రామపి చ సులలితాం ఫాలబాలేందువీథీమ్.
(పేజి. 310 - నం. 2)

101. హృద్యం పూర్ణానుకంపార్ణవ - మృదులహరీ - చంచలభ్రూవిలాసై -
రానీల - స్నిగ్ధ పక్ష్మావలి - పరిలసితం నేత్రయుగ్మం విభో తే
సాంద్రచ్ఛాయం విశాలారుణకమలదళాకార - మాముగ్ధతారం
కారుణ్యాలోకలీలా - శిశిరితభువనం క్షిప్యతాం మయ్యనాథే.
(పేజి. 310 - నం. 3)

102. ఉత్తుంగోల్లాసినాసం హరిమణిముకురప్రోల్లసద్ - గండపాళీ
వ్యాలోలత్కర్ణపాశాంచిత - మకరమణీకుండలద్వంద్వదీప్రమ్
ఉన్మీలద్దంతపంక్తి - స్ఫురదరుణతరచ్ఛాయ - బింబాధరాంతః -
ప్రీతిప్రస్యంది - మందస్మిత మధురతరం వక్త్రముద్భాసతాం మే.
(పేజి. 311 - నం. 4)

103. బాహుద్వంద్వేన రత్నోజ్జ్వలవలయభృతా శోణపాణిప్రవాలే -
నోపాత్తాం వేణునాళీం ప్రసృతనఖమయూఖాంగుళీసంగశారామ్
కృత్వా వక్త్రారవిందే సుమధుర వికస - ద్రాగ ముద్భావ్యమానైః
శబ్ద బ్రహ్మామృతైస్త్వం శిశిరితభువనైః సించ మే కర్ణవీథీమ్.
(పేజి. 311 - నం. 5)

104. ఉత్సర్పత్కౌస్తుభశ్రీ - తతిభి రరుణితం కోమలం కంఠదేశం
వక్షః శ్రీవత్సరమ్యం తరళతరసముద్దీప్రహారప్రతానమ్
నానావర్ణప్రసూనావలి - కిసలయినీం వన్యమాలాం విలోల -
ల్లోలంబాం లంబమానామురసి తవ తథా భావయే రత్నమాలామ్.
(పేజి. 311 - నం. 6)

105. అంగే పంచాంగరాగై - రతిశయవికసత్సౌరభాకృష్టలోకం
లీనానేకత్రిలోకీవితతి మపి కృశాం బిభ్రతం మధ్యవల్లీమ్
శక్రాశ్మన్యస్త - తప్తోజ్జ్వల - కనకనిభం పీతచేలం దధానం
ధ్యాయామో దీప్తరశ్మిస్ఫుటమణిరశనా - కింకిణీమండితం త్వాం.
(పేజి. 312 - నం. 7)

106. ఊరూ చారూ తవోరూ ఘనమసృణరుచౌ చిత్తచోరౌ రమాయా
విశ్వక్షోభం విశంక్య ధ్రువమనిశముభౌ పీతచేలావృతాంగౌ
ఆనమ్రాణాం పురస్తాన్న్యసనధృత - సమస్తార్థపాళీ - సముద్గ -
చ్ఛాయం జానుద్వయం చ క్రమపృథులమనోజ్ఞే చ జంఘే నిషేవే.
(పేజి. 312 - నం. 8)

107. మంజీరం మంజునాదైరివ పదభజనం శ్రేయ ఇత్యాలపంతం
పాదాగ్రం భ్రాంతి మజ్జ - త్ప్రణతజన మనో - మందరోద్ధార
కూర్మమ్

ఉత్తుంగాతామ్రరాజ - న్నఖరహిమకర - జ్యోత్స్నయా

చా(ఆ)శ్రితానాం

సంతాపధ్వాంతహంత్రీం తతి మనుకలయే మంగళామంగుళీనామ్.

(పేజి. 312 - నం. 9)

108. యోగీంద్రాణాం త్వదంగేష్వధికసుమధురం ముక్తిభాజాం నివాసో
భక్తానాం కామవర్ష - ద్యుతరుకిసలయం నాథ తే పాదమూలమ్
నిత్యం చిత్తస్థితం మే పవనపురపతే కృష్ణ కారుణ్యసింధో
హృత్వా నిశ్శేషతాపాన్ ప్రదిశతు పరమానందసందోహలక్ష్మీమ్.

(పేజి. 313 - నం. 10)

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

గమనిక :

(1) నారాయణీయ నవనీతంలో ప్రతి శ్లోకానికీ ప్రక్కన ఉన్న సంఖ్యలు, వాటి అనువాదం ఏ పేజీలో యెక్కడ ఉన్నదీ తెలియ చేస్తై.

(2) అనువాదం మొదట్లో ఉన్న సంఖ్యలు, మూలగ్రంథంలోని శ్లోక సంఖ్యను సూచిస్తై.

శ్రీః

నారాయణీయం

విషయసూచిక

నారాయణీయం

[శ్రీ నారాయణభట్టతిరిపాదకృత సంస్కృత మూలమునకు
స్వామి కృష్ణదాస్‌జీ తెలుగుసేత]

ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ
ఓమ్ నమో నారాయణాయ

ఓమ్

నారాయణీయం

1. భగవన్మహిమ

1. పరిపూర్ణజ్ఞానము పరమానందము మూర్తిదాల్చినవాడును, 'అట్టివాడ'ని పోల్చి చెప్పుటకు తగిన మరొకమూర్తి లేనివాడును, సర్వదా సర్వత్రా వ్యాపించియుండువాడును, మాయకు(1) యెప్పుడు యెంత మాత్రము లొంగనివాడును, అనంతమైన వేదమంత్రములచేత వివరింపబడి కూడ స్పష్టముకానివాడును, అయినను, ఆత్మదర్శనమైనంతనే(2) పరమ పురుషార్థమైన మోక్షరూపమున(3) సాక్షాత్కరించువాడును అగు ఆ పర బ్రహ్మము(4) గురువాయూరునందు, శ్రీకృష్ణ రూపమున ప్రత్యక్షమై యున్నది. మానవుల అదృష్టమే అదృష్టము కద!

2. అయినను, దానిని గుర్తింపలేక, కొందరు, మూర్ఖులై, తమ మనో బలమును, వాక్శక్తిని, శరీర పటుత్వమును, అశాశ్వత వస్తుసముపార్జన కొరకు(5) వ్యర్థము చేసుకొనుచున్నారు. అంతకు మించిన నైచ్యము మరొకటి ఉండబోదు. కావున, మేము, సర్వబాధానివృత్తి కొరకు,(6) సర్వాంతర్యామి(7) అయిన ఆ శ్రీకృష్ణునే, సభక్తికముగ సేవించుకొను చున్నాము.

3. కృష్ణా! నీవు, రజస్తమో సంపర్కములేని(8) శుద్ధ సత్త్వ స్వరూపుడవని(9) వ్యాసర్షి పదేపదే వక్కాణించియున్నారు. ఆ నీ స్వరూ పము స్వచ్ఛమైనది. జ్ఞానతేజముతో విలసిల్లునది. ఆనందఘనమైనది.(10) అది కారణముగనే, మధురమూర్తివైన నీ గాథలు విని, నిన్ను మనసులో

నిలుపుకుని, దర్శించుకుని ఆనందించుటకు ధన్యజీవులు సదా ఉవ్విళు లూరుచుందురు.

4. సర్వేశ్వరా ! కృష్ణా ! గంభీరమైనది, పరిపూర్ణమైనది, ఆనంద రసామృతముతో తొణికిసలాడుచుండునది, ముక్త జీవులకు(11) ఆశ్రయమై శోభించునది అగు ఆ పరబ్రహ్మము, ఒక మహాసముద్రమువంటిదని, తరంగములతో కూడియుండు దాని జలశయ్యయే శుద్ధసత్త్వమని, అదియే నీ స్వరూపమని జ్ఞానులు గ్రహించినారు; నీవు పరిపూర్ణతమావతారుడవని ప్రస్తుతించినారు.

5. ప్రభూ ! నీవు, జననమరణ రహితుడవు. నీకు, యెట్టి కర్మల తోడను పనిలేదు. అయినను, సృష్టి ప్రారంభమునందు, అకారణముగనే, సంకల్పమాత్రమున, నీలో, ఉండికూడ లేనట్లుండు, మాయాశక్తిని(12) ప్రేరేపించుచున్నావు. ఆ శక్తినుండి, నీ దైన సహజ మాహాత్మ్యమునకు ఐశ్వర్యమునకు అడ్డురాని విధమున, శుద్ధసత్త్వమును మాత్రము స్వీకరించి, శ్రీ విగ్రహుడవై భాసించుచున్నావు.

6. గురువాయుపురాధిపా! కృష్ణా! ధన్యజీవులకు, పూర్వపుణ్యఫలముగ దర్శనీయమగునదియు, శ్రీ మహాలక్ష్మి చిద్విలాసములకు(13) ఆటపట్టయి నదియు, ధ్యానించుకొనువారి హృదయములలో ఆనంద రసామృతమును అఖండముగ వర్షించునదియు, తొలకరి మేఘమువలె, అగిసెనపూల గుత్తివలె మనోహరముగ నుండునదియు నగు నీ దివ్యసుందర విగ్రహమును, నేను, సదా సేవించుకొనుచుందును.

7. కృష్ణా ! ప్రాణులను, వివిధ విధముల బాధలపాలు చేయుటకే నీవు సృష్టికార్యమునకు పూనుకొనుచుందువని, యింతకు మున్ను, నేను భావించుకొనుచుండువాడను. కాని, యిప్పుడు ఆ అభిప్రాయము మారినది. యథార్థమునకు, నీ వా జీవులను సృజించి యుండనిచో, సచ్చిదానంద

స్వరూపుడవును,[14] మధురమోహనమూర్తివియును అయిన నిన్ను, కనులార దర్శించుకుని, నీ లీలాభివర్ణనలను చెవులార విని, అనుపమానందము ననుభవించు ప్రాణులు కరవై యుందురుగదా!

8. శ్రీహరీ! నీవు పారిజాత వృక్షము[15] వంటి వాడవు. భక్తులు నీకు ప్రణమిల్లినంతనే, వారియెదుట సాక్షాత్కరించి, వారు కోరక పోయినను, వారికి అర్థమగు సుఖసముదాయమును[16] చేకూర్చుటతోపాటు, మోక్షమునుగూడ ప్రసాదించుచుందువు. ఆ విధముగ అనంత ఫలముల నొసగు నీవు, భక్తజన సులభుడవై ఉండగా, ప్రాపంచిక సుఖములకై ప్రాకులాడు ప్రజలు, ఆ ఇంద్రుని ఉద్యానముననుండు కల్పవృక్షమును[17] యాచించుట, వృథాశ్రమ కాక మరేమగును?

9. కృష్ణా! బ్రహ్మాదులు,[18] భక్తులను కరుణించి, మోక్షము వినా, యితరములగు కోర్కెలన్నిటిని ప్రసాదించెదరు. కాని, నీవో, నీ భక్తులను నీ అంతవారిని[19] చేయుదువు.

ఇతర దేవతలు, వారి వారి అధికారములు కారణముగ, యితరులకు మాత్రమే ప్రభువులుగ వ్యవహరించుచుందురు. వారికి ప్రభుడు వేరొకడున్నాడు. కాని, నీ విషయ మట్లుకాదు. నీకు కూడ ప్రభుడవు నీవే. నిన్ను శాసింపగలవాడు వేరొకడు లేడు. నీవు పరమానంద స్వరూపుడవు కావున, ధన్యజీవులగువారు, నీచే ఆకర్షింపబడుచు, నిన్ను ధ్యానించుకొనుచు, యినుమడించిన ఆనందము ననుభవించుచుందురు. కాని, నీవో, ఆత్మారాముడవై[20] యుందువు. నీవు, సర్వ సద్గుణ సంపన్నుడవు నాయనా! అది కారణముగనే, నేను, నీకు నమస్కరించుచున్నాను.

10. మురహరా! నీ అధికారము, బ్రహ్మరుద్రామరేంద్రులను సైతము శాసింపగలదు. నీ తేజము, ఇతరుల తేజమును హరింపగలవారి అందరి తేజమును, 'ఇట్టె' హరింపగలదు.

ఎట్టి కోరికలు లేనివారుకూడ, నీ విమలయశమును గానము చేయుచుందురు. సర్వైశ్వర్యప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి, సర్వదా, నిన్నే ఆశ్రయించియుండును.

నీవు సర్వజ్ఞుడవు. ఏ ప్రాణిపట్లను, నీకు, అనవసరమైన అనురాగము లేదు. అది కారణముగనే, మురాసురాంతకుడవును, పవన పురాధిపతివియును(21) అయిన నీ పట్ల, 'భగవానుడు'(22) అను పదము, సర్వ విధముల సార్థకమైయున్నది నాయనా !

అర్థము - వివరణ

(1) మాయకు : మోహమునకు - అజ్ఞానమునకు - అవిద్యకు. యథార్థమును మరగుపరచి, లేనిది ఉన్నట్లుగను, ఉన్నది లేనట్లుగను తోపింపజేయునది 'మాయ'.

(2) ఆత్మదర్శనమైనంతనే : 'నేను పరమాత్మస్వరూపుడను' అను అనుభూతి కలిగినంతనే -

(3) మోక్షరూపమున : ప్రపంచ సంబంధమేమియులేని పరమానంద రూపమున -

(4) పరబ్రహ్మము : సచ్చిదానంద స్వరూపుడు, సృష్టి స్థితి లయములకు కారణభూతుడు అయిన పరమాత్ముడు -

(5) అశాశ్వత వస్తు సముపార్జన కొరకు : ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేకుండువానికొరకు - ఇండ్లు, వాకిండ్లు, ధనము, పదవులు మున్నగువాని కొరకు -

(6) సర్వబాధా నివృత్తి కొరకు : శారీరకము మానసికము అయిన వివిధ బాధలను తొలగించుకొనుట కొరకు -

(7) సర్వాంతర్యామి : అన్నిట ఆత్మరూపమున నుండువాడు -

(8) రజస్తమో సంపర్కములేని : దేనిపట్లనైనను అనురాగమును కలిగించి, దానిని పొందవలెనను ఆశను కల్పించి, వాటికి అనుగుణమైన

కర్మలు చేయించునదిగాని, మరపు, మత్తు, నిద్ర మున్నగు వాటిని కలిగించునదిగాని లేనటువంటి -

(9) శుద్ధ సత్వస్వరూపుడవని : రజస్తమోగుణ సంపర్కము లేనివాడవని -

(10) ఆనందఘనమైనది : పరిపూర్ణానందమే అయినది -

(11) ముక్తజీవులకు : ప్రపంచమునుండి పొందగోరెడి దేమియులేక పరమాత్మని సేవయందే నిమగ్నులై ఉండువారికి -

(12) మాయాశక్తిని : ప్రకృతిని -

(13) చిద్విలాసములకు : జ్ఞానమయము ఊహాతీతము అయిన కార్యకలాపములకు-

(14) సచ్చిదానంద స్వరూపుడవును : శాశ్వతుడవును, జ్ఞానానందములు మూర్తి దాల్చినవాడవును -

(15) పారిజాత వృక్షము : మహేంద్రుని ఉద్యాన వాటికలోఉండు ఒక వృక్షము. దివ్య సౌరభమును వెదజల్లుచుండునది. కల్పవృక్షములజాతికి చెందినది -

(16) సుఖసముదాయమును : సర్వవిధ సుఖములను -

(17) కల్పవృక్షము : కోరిన కోర్కెలన్నిటిని తీర్చు ఒక దివ్య వృక్షము -

(18) బ్రహ్మాదులు : బ్రహ్మ, రుద్రుడు, మహేంద్రుడు మున్నగువారు -

(19) నీ అంతవారిని : భగవల్లక్షణము లన్నియు సంపూర్ణముగ పొందినవారిని -

(20) ఆత్మారాముడవై : నీయందే నీవు రమించుచుండువాడవై -

(21) పవనపురాధిపతి : గురువాయూరునందు వెలసిన శ్రీకృష్ణుడు - శ్రీమన్నారాయణుడు -

(22) భగవానుడు : సంపూర్ణమైన ఐశ్వర్యము, ప్రతాపము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము కలవాడు -

2. భగవద్రూపం

1. కృష్ణా! శిరమున, సూర్యకాంతిని తిరస్కరించు మణిమయ కిరీటము, నిలువుబొట్టుతో మెఱయుచుండు నెన్నుదురు, కృపారసము తొణికిస లాడుచుండు నేత్రములు, మృదు మందహాసముతో భాసించు సుందర వదనారవిందము, తీర్చి దిద్దినట్లున్న నాసాపుటములు, చెక్కిలిపై చిందులు ద్రొక్కుచుండు మకర కుండలములు, కంఠసీమను ప్రకాశించు కౌస్తుభమణి, వనమాలలతోను హారవల్లరులతోను శ్రీవత్స లాంఛనముతోను(1) శోభించు వక్షస్థలము గల నీ మధుర మోహనమూర్తిని నేను సర్వదా సేవించుకొనుచుందును ప్రభూ!

2. స్వామీ! శంఖ చక్ర గదా పద్మములను ధరించియున్న నాలుగు చేతులతోను, వాటిని అలంకరించియుండు భుజకీర్తులతోను రత్నాంగుళీయకములతోను వెలుగుల జిమ్ముచుండునదియు, పట్టు పీతాంబరముతోను బంగరు మొలనూలుతోను పద్మపత్రములవంటి పాదములతోను ప్రకాశించునదియు, బాధలన్నిటిని భస్మీకరింప గలదియు నయిన నీ దివ్యసుందర విగ్రహమునే నేను ఆశ్రయించియున్నాను.

3. ముల్లోకములయందును ఉత్తమోత్తమమైనవానికన్న ఉత్తమమైనదియు, అత్యంత మోహజనకమైన వానికన్న మోహజనకమైనదియు, అద్భుత తేజఃపుంజముకన్న తేజముకలదియు, మధురాతి మధుర పదార్థములన్నిటికన్న మధురమైనదియు, సుందరతమ వస్తు సముదాయముకన్న సుందరమైనదియు, ఆశ్చర్యకరమైన అన్నిటికన్న ఆశ్చర్యకరమైనదియు అగు నీ అద్భుత రూపమును దర్శించుకొనవలెనను కుతూహలము కలుగనివారెవ్వరుందురు?

4. అచ్యుతా ! సర్వవిధైశ్వర్యములు సర్వమంగళములు రూపొందిన మూర్తిగా ప్రసిద్ధినందిన శ్రీమహాలక్ష్మి కూడ, నిన్నాశ్రయించినదై, నీ మధురమూర్తియందు మనసును లగ్నము చేసుకొనినదై, తన్ను ఆరాధించు పరమ భక్తులవద్దకూడ చిరకాలముండుట కిష్టపడదు. అది కారణముగనే, ఆమెకు, 'చంచల స్వభావురాలు' అను అపకీర్తి వచ్చినది.

5. లక్ష్మీపతీ ! లక్ష్మి నిన్ను వదలి ఉండలేదనుటకు మఱొక తార్కాణముకూడ కన్పించుచున్నది. యథార్థమునకు, నీ మీద ఆమెకు అమితానురాగము కలదు. అది కారణముగనే, ఆమె, తన భక్తులవద్దకూడ నిలుకడగా ఉండలేదు. అయినను, ఎవరైన నిన్ను ధ్యానించుచుండిరేని, నీ గుణగణమును కీర్తించుచుండిరేని, ఆమె, తన్నుతాను మఱచిపోయి, అచటనే నిలబడిపోవుచున్నది.

6. నవ్య సౌందర్య రసామృత నిర్ఝరిని నలుదిక్కుల ప్రసరింపజేయు నీ పరిపూర్ణ జ్ఞానమయ స్వరూపము, నీ లీలా విశేషములను మాహాత్మ్యమును శ్రద్ధతో వినువారి నాకర్షించుకొనుచున్నది. తక్షణమే, వారికి, భక్తి పారవశ్యమును కలిగించుచున్నది. వారి శరీరములను పులకింపజేయుచున్నది. వారి కన్నులనుండి ఆనందాశ్రులను వర్షించుచున్నది. వారికి, తన్మయత్వము కలిగించి, పరమానందానుభూతిని(2) ప్రసాదించుచున్నది.

7. అది కారణముగనే, కర్మయోగముకంటెను, జ్ఞానయోగముకంటెను, భక్తియోగము విశిష్టమైనదని మహర్షు లెందరో ఉద్ఘాటించియున్నారు. యథార్థమునకు, అది సులభతరమైనదికూడ.

లక్ష్మీపతీ ! నీవు శృంగారరససర్వస్వమైనవాడవు. అట్టి నీయందు, అంతులేని ప్రేమను పెంపొందించుకొనుటయే భక్తియనిపించుకొనుచున్నది. సహజమైన ఆ భక్తిని సిద్ధింపజేసికొనుటకు అందరును అర్హులే కదా ! ఇందు యెవరుగాని కష్టపడవలసిన దేమున్నది ప్రభూ !

8. నిస్స్వార్థముగ, వేదవిహిత కర్మల నాచరించుటవలన[3] కలుగు ఫలము అంత శీఘ్రముగ లభించునది కాదు. జ్ఞాన యోగమున నిష్ణాతులు[4] కావలెనన్న ఉపనిషత్తులలో బోధింపబడిన విధమున బ్రహ్మజ్ఞానమును[5] సముపార్జించుకొనవలెను. అది అత్యంత సూక్ష్మమైనదియు అవ్యక్తమైనదియు అగుటచేత, సామాన్యులకు కష్టసాధ్యమౌచున్నది. కావుననే, నీయందు ప్రేమను అతిశయింపజేసికొనుట యను భక్తియోగము మధురమైనదిగను, శ్రేయోదాయకమైనదిగను పరిగణింపబడుచున్నది ప్రభూ !

9. అమిత శ్రమతోకూడిన కర్మల నాచరించి, మనో నైర్మల్యమును సాధించికొనినవారు, కొందరు, జ్ఞానమార్గమునుగాని భక్తిమార్గమునుగాని అనుసరించుటకు అర్హత నార్జించుకొందురు. మరికొందరు, అవ్యక్త పర తత్త్వమును గురించి[6] తీవ్రముగ తర్కించుకొనుచు, జీవితములను వ్యర్థము చేసికొందురు. అట్టివారు, తమ హృదయముల నార్ద్రమొనర్చుకొనుటకు గాని, మనసును పవిత్రీకరించుకొనుటకుగాని ప్రయత్నింపలేరు. అది కారణ ముగనే, వారికి, మోక్షము[7] సిద్ధించుటకు అనేక జన్మల సాధన అవసర మగుచున్నది.

10. కాని, భక్తిమార్గమున గమించువారికి, కష్టసాధ్యమగు అట్టి సాధనలతో పనిలేదు. నీ కథా రసామృత ప్రవాహమున క్రుంకు లిడు వారికి, మనో నైర్మల్యము, పరిశుద్ధ జ్ఞానము, తక్షణమే కలుగుచున్నవి. కావుననే, అట్టి స్థితి, నాకు అనాయాసముగ లభించునట్లును, నీ పాద పద్మ ములమీది ప్రేమద్వారా నా హృదయము ద్రవీభూత మగునట్లును, శీఘ్రమే అనుగ్రహింపవలసినదిగ ప్రార్థించుకొనుచున్నాను ప్రభూ !

అర్థము - వివరణ

(1) శ్రీవత్స లాంఛనముతోను : త్రిమూర్తులలోను ఉత్తముడెవరు అను ప్రశ్న వచ్చినప్పుడు, భృగుమహర్షి, వారిని పరీక్షించుటకు వెళ్ళినాడు.

అప్పు డాయన శ్రీ మహావిష్ణువును తన పాదముతో వక్షస్థలమున తన్నుట సంభవించినది. అది కారణముగ యేర్పడిన పదచిహ్నమే శ్రీవత్సము. అట్టి చిహ్నముతోను -

(2) పరమానందానుభూతిని : అంతకు మించినది లేని ఆనందానుభవమును -

(3) వేదవిహిత కర్మల నాచరించుటవలన : వేదములయందు నిర్దేశింపబడిన పనులు చేయుటవలన -

(4) నిష్ణాతులు : పరిపూర్ణమైన ప్రజ్ఞ కలవారు -

(5) బ్రహ్మజ్ఞానమును : పరమేశ్వర తత్త్వమునకు సంబంధించిన జ్ఞానమును -

(6) అవ్యక్త పర్వతత్త్వమును గురించి : ఇంద్రియములకు గోచరముకాని పరమేశ్వర శక్తిని గురించి -

(7) మోక్షము : ప్రపంచ సంబంధమైన మమత్వములేని స్థితి -

3. భక్తస్వరూపం

1. వరప్రదాతా ! మంగళప్రదమైన నీ నామములను[1] జపించుకొనుచు పరమానందము ననుభవించుచుండువారును, నీ దివ్యసుందర విగ్రహమును సర్వదా ధ్యానించుకొనుచుండువారును, సర్వవేళల, నీ గుణాభివర్ణనమునే చేయుచుండువారును, ఎల్లపుడును నీయందే రమించుచు, యిండ్లు వాకిండ్లు విడిచి తిరుగాడుచుకూడ, తమ అభీష్టము లన్నియు తీరినట్లు[2] ఆనందించుచుండువారును అగు నీ భక్తులే ధన్యజీవులని నేను దృఢముగ విశ్వసించుచున్నాను.

2. సర్వవ్యాపీ[3] ! కృష్ణా ! నేను రోగపీడితుడ నగుటచే, నిన్ను సేవించుటవలన కలుగు ఆనందమును కూడ అనుభవింపలేకున్నాను. నీవు, దయదలచి, నా బాధను తొలగించినచో, ఏదే నొక నిర్జన ప్రదేశమున, ఏకాంతముననుండి, నిన్నే సదా ధ్యానించుకొనుచు, నీ అనంత నామములను జపించుకొనుచు, నా శేషజీవితమును పరమానందమున వెళ్ళదీసికొన గోరుచున్నాను. తండ్రీ ! నన్ను కరుణించవలసినది.

3. ప్రభూ ! నీ దయ యున్నచో, జీవులకు పొందరానిదేమున్నది ? నీవు తలచుకొనినచో, నన్ను వేధించుచున్న బాధలు నివారింపబడుట యేమంత ఘనకార్యము ! ఈ ప్రపంచమున, నీ భక్తులు యెందరు, విరక్తులై, దుఃఖ నివృత్తినంది,[4] జీవన్ముక్తులై[5] సుఖ జీవితమును గడుపు కొనుచుండలేదు !

4. జగదీశ్వరా ! అచింత్య జీవనులును సుప్రసిద్ధులును అయిన నారదాది మునిశ్రేష్ఠులు, నిరంతరము నీ పాదపద్మములను సేవించుకొనుచుండుటవలన, నిన్నే స్మరించుకొనుచు, నీ దైన చిదానందమున[6] నెల్ల

వేళల మునిగి తేలుచుండుటవలననేగదా, యెట్టి బాధలును లేక, ముల్లోకి ములయందును స్వేచ్ఛావిహార మొనర్చుచున్నారు. ఎవరికైనను, అంతకు మించిన ఉత్తమస్థితి యేమున్నది ప్రభూ!

5. తంన్డ్రీ! నీయందు నాకు అనన్యమైన భక్తి[7] ననుగ్రహింపుము. ఆ విధముగ నీవు దయజూపితివేని, నన్ను ఆవరించియున్న బాధలన్నియు తొలగిపోగలవను దృఢ విశ్వాసము నా కున్నది. అట్లు కానియెడల, వ్యాసర్షి పలుకులు,[8] నీవు చేసిన వాగ్దానములు,[9] వేద వచనములు[10] అన్నియు, సామాన్య మానవుల మాటలవలె వ్యర్థములై పోవునుగదా!

6. అనంతమైన నీ దివ్య నామములను జపించుచుండుటవలన, మంగళ ప్రదమైన నీ సుందర విగ్రహమును మనసార ధ్యానించుచుండుట వలన, నీయందు మధురమైన భక్తి కుదురుచున్నది. ఆ భక్తి, పరిణతి నందినకొలది, సర్వవిధ దుఃఖములును సమసిపోవుచున్నవి. ఆ పైన, పరి శుద్ధమగు జ్ఞానము, పరమానందము, లభించుచున్నవి. వాటినిమించి, మేము కోరదగినది మాత్రము యేమున్నది ప్రభూ!

7. స్వామీ! నా దుఃఖమును దుఃఖకారణమును తొలగించి, నా పాదములు, నీ ఆలయమును చేరుటకే ఉత్సహించునట్లును, నా చేతులు, నిన్ను సేవించుటకే ఆతురపడునట్లును, నా నేత్రములు, నీ మూర్తిని తిల కించుటకే ఉవ్విళులూరునట్లును, నా నాసిక, నీ పాదార్చనలో ఉపయోగింప బడిన తులసిదళములను ఆఘ్రాణించుటనే వాంఛించునట్లును, నా కర్ణములు, నీవైన మధురగాథల నాకర్ణించుటకే తపించునట్లును అనుగ్రహింప వలసినది.

8. మానసికము శారీరకము అయిన బాధల మూలమున, తీవ్రముగ కలవరపడుచుండు నాయందు, చిదానందరస స్వరూపమైన[11] నీ మూర్తి భాసించుటద్వారా, నా శరీరము పులకించునుగాక! నా నేత్రములు ఆనం దాశ్రులను వర్షించునుగాక! నా వేదనల నన్నిటిని నేను విస్మరింతునుగాక!

9. ప్రభూ ! ఇదేమి విచిత్రమోగాని, నీపట్ల విముఖులైయుండు వారు కూడ సుఖ జీవితమును గడుపుకొనుచుండగా, నిన్నాశ్రయించి, నిన్నే సేవించుకొనుచుండియు, నేను అనేక బాధల ననుభవించుచున్నాను. ఇది నీ ప్రతిష్ఠకు భంగకరము కదా !

కంసదమనా ! నా అభిప్రాయమును గ్రహింపుము. నా రోగమును నిర్మూలింపుము. నన్ను, నీ పరమభక్తుల శ్రేణిలో చేర్చుకొనుము. ఇదే నా ప్రార్థన; నాయనా !

10. కృష్ణా ! ఈ విధమైన వేదనాపూర్వక ప్రలాపములవలన ప్రయోజన మేమున్నది ? నీవు, నన్ను అనుగ్రహించువరకు, నా దురదృష్ట మునుగూర్చి దుఃఖించుచుండుటకుమారుగా, విగ్రహరూపమున వెలసిన నీ యెదుట, యిచటనే ఉండి, నీకు పదేపదే ప్రణామము లాచరించుకొనుచు, హృదయపూర్వకముగ నిన్ను స్తుతించుకొనుచు, శక్తివంచన లేకుండ నిన్ను సేవించుకొనుచు కాలమును వెళ్ళదీసికొనుటకే నిశ్చయించుకొంటిని. ఆ అదృష్టమునైనను నాకు ప్రసాదింపవలసినది ప్రభూ !

అర్థము - వివరణ

(1) నామములను : భగవద్గుణములను వ్యక్తీకరించు పేర్లను -

(2) అభీష్టములన్నియు తీరినట్లు : ఆపైన కోరదగినవి పొందదగినవి లేనిస్థితి నందినట్లు -

(3) సర్వవ్యాపీ : ఏకకాలమున అన్నితావుల నుండువాడా !

(4) దుఃఖ నివృత్తినంది : శారీరక మానసిక విచారము లన్నియు తొలగిపోయి -

(5) జీవన్ముక్తులై : ఈ శరీరమున ఉండికూడ, ప్రపంచ సంబంధమైన రాగ ద్వేషాది ద్వంద్వము లేవియు లేనివారై -

(6) చిదానందమున : జ్ఞానముతోకూడిన పరమానందమున -

(7) అనన్యమైన భక్తిని : విషయములపట్ల మనసులేని భగవత్పరమైన ప్రేమను -

(8) వ్యాసర్షి పలుకులు : పురాణములయందు ఇతిహాసములయందు వ్యాసర్షి వెలువ రించిన భావములు -

(9) నీవు చేసిన వాగ్దానములు : గీతలో, 'నన్ను అనన్య భావమున నిరంతరము ఉపాసించుచుండువారి యోగక్షేమములను నేను చూచుకొనుచుందును' అని చేసిన వాగ్దానము మున్నగునవి -

(10) వేద వచనములు : శ్రుతులయందును స్మృతులయందును తెలుపబడిన మహా వాక్యములు -

(11) చిదానంద రసస్వరూపమైన : జ్ఞానానందములే రూపముగాగల -

4. యోగసిద్ధి

1. తండ్రీ! నిన్ను ఉపాసించుటకు తగిన ఆరోగ్యమును నాకు ప్రసాదింపుము. నీవు నాపట్ల యెంతవరకు ప్రసన్నుడవైన, అంతవరకు, నేను, శక్తివంచనలేకుండ, యమ నియమా ద్యనుష్ఠానములద్వారా(1) నిన్ను సంతుష్టి పరచుటకు పూనుకొందును.

2. ఆరోగ్యము కుదుటబడినప్పుడే, దృఢమైన బ్రహ్మచర్యము స్నానాదులు మున్నగు యమ నియమాది సాధనలు చేయుటకును, వాని మూలమున పవిత్రుల మగుటకును, అవకాశము లభింపగలదు. అప్పుడే, నీయందు, మనసు లగ్నముకాగలదు. ధ్యానము కుదురగలదు. క్రమశః, ఆసనశుద్ధి(2) యేర్పడగలదు.

3. అప్పుడు, ప్రణవ మంత్రమును - ఓంకారమును - నిరంతరము జపించుచు, ప్రాణవాయువును నియమించుకొనుటద్వారా(3) ప్రాపంచిక విషయములనుండి మనసును మరలించుకుని, పవిత్రీభూతులమై, నిన్ను ధ్యానించుట కుపక్రమింతుము.

4. ఆ విధముగ ధ్యానమున కుపక్రమించి, అతి ప్రయాసతోగాని దారికిరాని బుద్ధిని, మసకమసకగ గోచరించు నీ మూర్తిమీదకు పదేపదే మరలించుకొనుచు, నీ పాదద్వయము మనసున నిలచువరకు, భక్తి కుదురు వరకు, హృదయము ఆర్ద్రమగువరకు సాధన చేయుచునే ఉందుము.

5. ఆ విధముగ ధ్యానమున కుపక్రమించి, నిరంతర కృషి సలుపు వారికి, నీ దివ్యసుందర విగ్రహమునందలి ప్రత్యంగమును, మనోవీధిని సుస్పష్టముగ గోచరించి తీరును.

6. నీ శ్రీ విగ్రహమును సదా ధ్యానించుకొనుచుండువారికి, దాని మాధుర్యమును గ్రోలుచుండువారికి, కాలక్రమమున, బయటి ప్రపంచముతో సంబంధములేని మానసికానంద రూపమగు నీ పరతత్వ జ్ఞానము లభింప గలదు.

7. ఆ విధముగ, నీ యందు లీనమైన మనసుగలవారమై, ఆ సమాధి స్థితియందు(4) నీదైన పరతత్వ జ్ఞానమునంది, ఆ అనుభూతినుండి మనసు తొలగిపోయినపుడెల్ల, తిరిగి, ధారణాదులద్వారా, ధ్యానమున కుపక్రమింతుము.

8. అట్లు, ధ్యానయోగము(5) నభ్యసించుటద్వారా, పరబ్రహ్మవైన నిన్ను దర్శించుకొనుటవలన కలుగు పరమానందము ననుభవించుచు, నీ భక్తాగ్రగణ్యులును ముక్తజీవులును అయిన ఆ శుక నారదాదులవలె విశ్వమం దంతటను యథేచ్ఛా విహారము సలుపగలుగుదుము.

9. సమాధి స్థితినందుటలో విజయమును సాధించిన తరువాత, శీఘ్రముగగాని, క్రమక్రమముగగాని మోక్షము బడయదలచినవారు, యోగా భ్యాసముద్వారా, షడ్ చక్రములను(6) అధిగమించి, సుషుమ్న(7) మూల మున ప్రాణవాయువునకు ఊర్ధ్వగతిని కలిగించుకొందురు.

10. ఆపైన, ఏ విధమైన కోరికలును లేనివారు, ప్రాణవాయువును భ్రూమధ్యమున(8) నిలుపుకుని, లింగదేహమును(9) త్యజించి, నీ యందు లీనమగుచున్నారు. ఊర్ధ్వలోక సుఖముల నాసించువారు, ఆ ప్రాణవాయు వును సహస్రారమువరకు(10) గొనిపోయి, బ్రహ్మరంధ్రమును(11) ఛేదించు కుని, బయటపడి, జీవితమును చాలించుకొనుచున్నారు.

11. ఊర్ధ్వలోక సుఖముల నాసించు నీ భక్తులు, అగ్నికి, దినము నకు, శుక్లపక్షమునకు, ఉత్తరాయణమునకు అధిదేవతలగువారి ద్వారా(12)

సూర్యమండలమువరకు కొనిపోబడి, పరమానందముతో, ధ్రువపదమును చేరుకొనుట సంభవించుచున్నది.

12. ఆపైన, వారు, ధృవలోకమునుండి మహర్లోకము(13)నకుపోయి, అక్కడ కొంతకాల ముండి, ఆదిశేషుని వక్త్రగహ్వరమునుండి బాహిరిల్లు చుండు అగ్నిజ్వాలల మూలమున తప్తులైన పిదపగాని, అంతకు ముందు గాని, సత్యలోకమున(14) కరుగుచున్నారు.

13. ఆ సత్యలోకమునగాని, వైకుంఠమునగాని కొంతకాలముగడపి, ప్రళయ సమయముననో, అంతకుమునుపో, వారి యిచ్ఛానుసారము, వారు, వారిదైన యోగశక్తిద్వారా బ్రహ్మాండమును భేదించుకుని(15) ముక్తినందుట కూడ సంభవమే.

14. అట్లు బ్రహ్మాండమును చీల్చికొనిపోయి, దానికి ఆవరణలుగా ఉన్న, భూమి జలము అగ్ని వాయువు ఆకాశము మహత్తు ప్రకృతి అను వాటితో తాదాత్మ్యమునంది, వాటినిగూడ అధిగమించి, ఆపైన, యెట్టి ఆవరణలునులేని నీదైన పరమపదమును(16) పొందుచున్నారు.

15. ఆ విధముగ పరమపదమును పొందినవారు, తిరిగి భూలోకమునకు వచ్చుటనునది లేనేలేదు.

సచ్చిదానంద స్వరూపా ! కృష్ణా ! నీ గుణగణమును స్తుతించుచున్న నాకును, అట్టి పరమగతిని ప్రసాదింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) యమనియమాద్యనుష్ఠానములద్వారా : అహింస సత్యము అస్తేయము బ్రహ్మచర్యము అపరిగ్రహము సంతుష్టి నిరంతర దైవచింతనము మున్నగువాని నలవరచుకొనుటద్వారా పొందెడి బాహ్యాభ్యంతర శుచి - పవిత్రత - మూలమున -

(2) ఆసన శుద్ధి : సుఖముగ స్థిరముగ కూర్చొను స్థితి -

(3) ప్రాణవాయువును నియమించుకొనుటద్వారా : కోరిన ప్రకారము వాయువును లోనికి పీల్చుకొనుట, బయటకు వదలుట, ఒకచోట నిలుపు కొనుట అనువానిని సాధించుటద్వారా -

(4) సమాధి స్థితియందు : పరమాత్మనితో తాదాత్మ్యమునందిన స్థితియందు -

(5) ధ్యానయోగము : పరమాత్మనిమీదనే మనసును లగ్నము చేసికొనుట -

(6) షడ్చక్రములను : మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి ఆజ్ఞా చక్రములని పేర్కొనబడు స్థానములను -

(7) సుషుమ్న : ఇది ఒక 'నాడి' అని, దీని చివరిభాగము శిరస్సున ఉండునని, ప్రాణవాయువు దీనిద్వారాపోయి సూర్య కిరణములతో కలిసి పోవునని యోగులు విశ్వసింతురు.

(8) భ్రూమధ్యమున : కనుబొమలు రెంటినడుమ -

(9) లింగదేహమును : జ్ఞాన కర్మేంద్రియములు పంచప్రాణములు పంచమహా భూతములు బుద్ధి అవిద్య మున్నగువానితో కూడిన స్థూల శరీరమును -

(10) సహస్రారము : షడ్చక్రములపైనునుండు స్థానము.

(11) బ్రహ్మరంధ్రము : ఇది శిరోపరితలముననుండును. తమ యోగశక్తి మూల మున దీనిని ఛేదించుకుని మహర్షులు ప్రాణోత్క్రమణము నొనర్తురు.

(12) మహర్లోకము : దీనినే లోకాలోకమందురు. ఇది కర్మలవలనను జ్ఞానము వలనను సాధించుకొను లోకములకు నడుమ నుండును.

(13) సత్యలోకము : చతుర్ముఖ బ్రహ్మఉండు తావు. ఇది బ్రహ్మలోక, విష్ణులోక, రుద్రలోకము లను మూడు భాగములుగ ఉండును.

(14) బ్రహ్మాండమును ఛేదించుకుని : పృథ్వి జలము అగ్ని వాయువు ఆకాశము మహత్తత్త్వము మాయ అను ఆవరణలను చీల్చుకుపోయి -

(15) పరమపదము : వైకుంఠము -

5. విరాట్ పురుషోత్పత్తి

1. పూర్వము, బ్రహ్మప్రళయ కాలమున[1] నీ సృజనశక్తి అయిన మాయ, తనవైన సత్త్వ రజ స్తమోగుణములు తనయందు నిద్రాణములై యున్నపుడు, నీయందే లయించియుండుట సంభవించినది. అప్పుడు, వ్యక్తముగగాని, అవ్యక్తముగగాని, యీ ప్రపంచ మేమాత్రమును లేదు. మృత్యువుగాని అమృతత్వముగాని లేవు. పవలుగాని రేయిగాని లేవు. అట్టి స్థితిలో, పరమానంద స్వరూపుడవైన నీవు ఒక్కరుడవే ఉన్నావు.

2. నీ వపుడు, యోగనిద్రలో ఉండగా, సత్వ రజస్తమోగుణములు, కాలము, కర్మలు, జీవులు, వాటివాటి వాసనలు, సర్వము, నీదైన చిల్లీలానుభూతి[2] నందుచు, నీయందే లీనమైయున్నవి. అప్పుడు, అవి లేవనికాదు. సత్యముగ ఉన్నవి. నీ మాహాత్మ్యమున నణగియున్నవి. ఇది శ్రుతి ప్రతిపాదిత వచనమేకదా ప్రభూ! యథార్థమునకు, అట్లు కానిచో, ప్రళయాంతమున నవి యెచటినుండి ఆవిర్భవింపగలవు ? గగన కుసుమములు సృష్టింపబడుట అసంభవముగదా !

3. ప్రళయావసాన సమయమున,[3] తిరిగి, నీవు, సృష్టికార్యమునకు సంకల్పించినపుడు, నీదైన మాయాశక్తి, భువనత్రయ నిర్మాణమునకు[4] పూనుకొనుచున్నది. అప్పు డా మాయనుండి, కాలము అదృష్టము స్వభావము అనునవి ఆవిర్భవించి, సత్త్వరజస్తమో గుణములను విస్తరింపజేసి, ప్రపంచ నిర్మాణమునందు, ఆ మాయకు తోడ్పడుట జరుగుచున్నది.

4. నీ వపుడు, మాయావృతుడవు కాకుండ, సృష్టికార్యమున, సాక్షీభూతుడవుగ మాత్రము ఉందువని చెప్పబడుచున్నది. ఆ సమయమున, మాయ కల్పించిన ఉపాధులలో, నీవు ప్రతిబింబించి, జీవుడ వనిపించుకొను

చున్నావు. అది కారణముగ, జీవులకు, ప్రత్యేక వ్యక్తిత్వము లేదని తేలుచున్నది. ఆ మాయయే, కాల కర్మాదులవలనను, నీ సంకల్పబలముననుప్రేరేపింపబడి, తననుండి, బుద్ధితత్వమును కల్పించుచున్నది. అదే మహత్తు.(5)

5. మహత్తు, త్రిగుణాత్మకమైనదే అయినను, సత్వగుణ ప్రధానమైనదిగా ఉండి, 'అహం' భావమును, ప్రత్యేకత లేమియులేని, 'నేను' అను జ్ఞానమును కలిగించుచున్నది. ఆ మహత్తునుండియే, నీ సంకల్పానుసారము, తమోగుణ ప్రధానమైన 'అహంకారము' ఆవిర్భవించి, 'నేను', 'నాది' అను ప్రత్యేక భావమును జనింపజేయుచున్నది.

6. అదే 'అహ' భావము, క్రమశః, వైకారిక రాజసిక తామసికములుగ(6) వ్యక్తమౌచున్నది. సత్వగుణము ప్రధానముగ ఉన్నపుడు, ఇంద్రియాధిష్టాన దేవతలైన దిక్పాలురు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినులు, అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, మిత్రముడు, ప్రజాపతి, చంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు సృజింపబడుచున్నారు.

7. ఆ అహంభావమునందలి సాత్త్వికగుణము నుండియే, 'అంతఃకరణము' జనించుచున్నది. దానిలో, మనోబుద్ధి చిత్తాహంకారము లనునవి ఉండును. అందలి రజోగుణమునుండి, జ్ఞాన కర్మేంద్రియములు(7) కల్పింపబడుచున్నవి. ఆ విధముగనే, తమోగుణమునుండి, ఆకాశతత్త్వసారమైన శబ్దము ఉద్భవించుచున్నది.

8. ఆ శబ్దమునుండి ఆకాశము, దానినుండి స్పర్శ, దానినుండి వాయువు, దానినుండి రూపము, దానినుండి అగ్ని, దానినుండి రసము, దానినుండి జలము, దానినుండి గంధము, దానినుండి పృథ్వి అను పంచతన్మాత్రలు, పంచమహా భూతములు(8) జనించుచున్నవి. ఒకదాని తరువాత ఒకటిగ కలిగిన వీనికి, వాని వెనుకటివాని గుణములు సంక్రమించుటయు, ప్రతిదానికిని ఒక ప్రత్యేకగుణ ముండుటయు జరుగుచున్నది.

9. ఈ విధముగ సృజింపబడిన వేవియు, స్వయముగ, ప్రపంచ సృష్టి చేయగల సామర్థ్యము కలవి కావు. ఈ ఇంద్రియాదులే కాదు; వాటి అధిష్టాన దేవతలు(9) కూడ, అంతటివారే.

ఆ దేవగణముచే స్తుతింపబడినవాడవై, నీవు, ఆ పంచభూతముల లోను ప్రవేశించి, వాటికి, క్రియాశక్తిని ప్రసాదించి, వాటిని పరస్పరము కలిపి, హిరణ్మయాండమను యీ బ్రహ్మాండమును సృజించితివి.

10. ఆ హిరణ్మయాండము, అంతకుముందే సృజింపబడిన జల రాశియందు వేయి సంవత్సరము లున్నమీదట, దానిని, నీవు, భేదించి, చతుర్దశ భువనములుగా(10) రూపొందించితివి. అదే నీదైన విరాట్స్వరూపము. నీవు దానియందు ప్రవేశించి, దానికి ప్రాణమ వైతివి. అది కారణముగనే, నీవు, అనంతమైన కర చరణాదులు శిరములు ముఖములు కలవాడవైతివి.

విరాట్ స్వరూపుడవైన కృష్ణా! గురుపవనపురాధిపా! నన్ను వేధించుచున్న బాధ లన్నిటిని తొలగింపుము నాయనా!

అర్థము - వివరణ

(1) బ్రహ్మ ప్రళయ కాలమున: ఒక సృష్టికర్తపోయి మరొక సృష్టికర్త వచ్చువరకు యేర్పడియుండు ప్రళయ కాలమున - దీనినే ప్రాకృత ప్రళయకాల మందురు. ఇది మానవ మానమున, 31104,000,00,00,000 సంవత్సరములగును.

(2) చిల్లీలానుభూతి: స్వస్వరూప జ్ఞానమునకు సంబంధించిన ఆనందానుభవము.

(3) ప్రళయావసాన సమయమున: తిరిగి సృష్టి ప్రారంభము కానున్నప్పుడు -

(4) భువనత్రయ నిర్మాణమునకు: భూలోక భువర్లోక సువర్లోకముల సృష్టికి -

(5) మహత్తు: మాయనుండి తొలుదొల్త పుట్టునది. ప్రపంచ సృష్టికి ఉన్ముఖమైన ప్రకృతి -

(6) వైకారిక రాజసిక తామసికములుగ : వికారములను, అహంభావమును అజ్ఞానమును కలిగించునదిగ -

(7) జ్ఞాన కర్మేంద్రియములు : చెవులు, కన్ను, ముక్కు, చర్మము, నాలుక, చేతులు, కాళ్ళు, గొంతు, జననేంద్రియము మున్నగునవి -

(8) పంచమహాభూతములు : పృథ్వి, జలము, తేజము, వాయువు, ఆకాశము.

(9) ఇంద్రియాదుల అధిష్ఠాన దేవతలు : దిక్కులు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినులు, అగ్ని, ఇంద్రుడు, మిత్రుడు, ప్రజాపతి, చంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు.

(10) చతుర్దశ భువనములు : అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళములు - భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకములు.

6. విరాట్ పురుషుడు

1. కృష్ణా! నీవు చతుర్దశభువన స్వరూపుడవు.(1) విజ్ఞులు, నీ పాదతలమును పాతాలముగను, పాదోపరిభాగమును రసాతలముగను, చీల మండల భాగమును మహాతలముగను అభివర్ణించుచుందురు.

2. చక్రపాణీ! నీ విరాడ్ రూపమున, మోకాళ్లు తలాతలము. జానువులు సుతలము. తొడలు రెండును అతల వితలములు. జఘన ప్రదేశము భూలోకము. నాభి ఆకాశము. వక్షస్థలము స్వర్గలోకము.

3. భగవన్! అట్లే, నీ కంఠము మహర్లోకము. ముఖము జనలోకము. లలాటము తపోలోకము. శిరము సత్యలోకము. అదే విధముగ, ప్రపంచమునగల సర్వమును నీ శరీరమునందే కలవు. అట్టి, సర్వలోకమయుడవగు నీకు, నా నమోవాకములు; తండ్రీ!

4. జగత్కారణుడవైన ప్రభూ! నీ శిరోపరితలమునందు బ్రహ్మరంధ్రము వేదములు. సుందర కేశములు మేఘములు. కనుబొమలు బ్రహ్మదేవుని నివాసము. కనురెప్పలమీది రోమములు దివారాత్రములు. నేత్రములు సవిత్రుడు.

5. సర్వశక్తి సంపన్నుడవైన దేవా! నీ ఓరచూపు సర్వజగత్ సృష్టి. నీ కర్ణములు దిశలు. నీ నాసాపుటములు అశ్వినీ దేవతలు. నీ క్రింది పెదవి లోభము; మీది పెదవి లజ్జ. నీ పండ్లు తారాగణము. నీ కోర మృత్యుదేవత.

6. సర్వనియామకుడవగు స్వామీ! నీ మందహాసము మాయ. శ్వాస వాయువు. రసన జలము. నీ వచనములు విహంగ శ్రేణులు. నీవైన సప్త స్వరములు సిద్ధ చారణాదులు. నీ వక్త్రము అగ్ని. స్తనయుగ్మము ధర్మదేవత.

7. కమలనయనా ! నీ వీపు అధర్మము. మనసు చంద్రుడు. హృదయ పద్మము అవ్యక్త ప్రకృతి. కుక్షి సర్వ సముద్రములు. నీవు ధరించు వసనములు రెండు సంధ్యలు. మర్మావయవము ప్రజాపతి. వృషణములు మిత్రదేవుడు.

8. దయాసాగరా ! నీ పిఱుదులు మృగసముదాయము. నీ కాలిగోళ్ళు, ఏనుగులు ఒంటెలు గుఱ్ఱములు మున్నగు జంతుజాలము. నీ నడక కాలము. నీ ముఖపద్మము, బాహువులు, తొడలు, పాదములు, క్రమముగ, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రు లనబడు వర్ణ చతుష్టయమునకు నిలయములు.

9. నీ చేయు పనులు, జనన మరణ రూపమైన సంసార చక్రము. నీ పరాక్రమము అసురగణము. నీ ఎముకలు పర్వతములు. నీ శరీరమునందలి నాడులు నదీ సముదాయము. నీ రోమములు వృక్షములు.

చక్రధారీ ! ఇట్టి వర్ణనాతీతమైన నీ విరాట్ స్వరూపము నాయందు వర్ధిల్లుచుండునుగాక !

10. కృష్ణా ! కర్మభాజనులైన జీవులు, కర్మపరిత్యాగము చేయదలచినప్పుడు(2) నీ యీ విశ్వరూపమును స్మరించుకొనుట అవశ్యాచరణీయమనునది మహర్షుల మహద్వచనము. ఆ విరాట్ స్వరూపమున విస్తరించియుండు విమలాత్ముడవైన నీకు, నేను, నా నమోవాకము లర్పించుకొనుచున్నాను. ఇది కారణముగ, నన్ను పీడించుచున్న రోగములన్నియు నిర్మూలింపబడునుగాక !

అర్థము - వివరణ

(1) చతుర్దశ భువనస్వరూపుడవు : నీవే అయిన పదునాలుగు భువనముల రూపమున భాసించుచుండువాడవు -
(పదునాలుగు భువనములు - దశ. 5. వివ. 10. చూడుము.)

(2) కర్మ పరిత్యాగము చేయదలచినపుడు : ప్రాణావసాన సమయమున, లేదా, ప్రారబ్ధమును క్షయింపజేసికొనుటకుగాను ప్రార్థనాదికములు ప్రారంభించినపుడు -

7. హిరణ్యగర్భోత్పత్తి

(భగవదనుగ్రహ వర్ణనం)

1. పైన విన్నవించుకొనిన విధముగ, చతుర్దశ భువనముల రూపమున నావిర్భవించిన నీవే, అనంతర కాలమున, ఆ భువనముల కావల నుండు సత్యలోకమున, ధాతవై ఉద్భవించినావు. అతనినే, మహర్షులు, హిరణ్యగర్భుడని ప్రస్తుతించుచున్నారు. అత డొకసారి, రజోగుణ ప్రేరితుడై (1) విశ్వసృష్టికి సంకల్పించుకొనినాడు.

2. కాని, అత డెంతగ ఆలోచించినను, సృష్టి నిర్మాణ సంబంధమైన జ్ఞానము అతనికి లభింపలేదు. అది కారణముగ, అతడు, వ్యాకులచిత్తుడైనాడు. అది గ్రహించిన నీవు, అతని నుద్దేశించి, 'తపము చేయవలసినది' అని, గగనవాణి రూపమున, అతనిని ప్రేరేపించుట జరిగినది. జగత్ ప్రభూ ! ఆ పలుకులు, అతనికి శ్రవణ సుఖమును చేకూర్చినవి.

3. ఆ వెంటనే, అతడు, నలువంకల చూసినాడు. కాని, అతని కెవరును కన్పింపలేదు. 'ప్రపంచమంతయు జలమయమై యున్నది కదా ! ఈ పలుకు లెక్కడినుండి వచ్చినవి ?' అని, అతడు ఆశ్చర్యపడినాడు. ఆ వెంటనే, అతనికి, ఆ పలుకుల అర్థము అవగతమైనది.

ఆ పైన, అతడు, వేయి దివ్య వర్షములు, తీవ్రతపమొనర్చినాడు. అప్పుడు, మహాద్భుతమైన నీ వైకుంఠధామము, అతనికి దర్శనీయమైనది.

4. ఆ వైకుంఠము, చతుర్దశ భువనముల కావల నున్నది. కోటి సూర్యుల తేజముతో ప్రకాశించుచున్నది. మాయకు అక్కడ తావులేదు. దుఃఖముగాని, క్రోధ మోహాదులుగాని, భయముగాని అక్కడ లేవు. అచట

ద్యోతమైనది, పరిపూర్ణమైన పరమానంద రసప్రవాహ మొక్కటే. అట్టి, సర్వోత్కృష్టమైన వైకుంఠమే, బ్రహ్మదేవున కపుడు గోచరించినది ప్రభూ !

5. అచట, చతుర్భుజములతో భాసించు దేవత లున్నారు. వారి దేహ కాంతి, స్వచ్ఛమైనది; నీలమణుల వంటిది. వారు ధరించిన ఆభరణముల దీప్తి, దశదిశలను ప్రకాశింపజేయుచున్నది. దివ్య విమానములు, వారి నివాస స్థలములై ఉన్నవి. నీపట్ల వారికిగల భక్తిమూలముననే కదా, వారికి, ఆ ఉన్నత స్థితి లభించినది. ప్రభూ ! మలిన రహితమైన ఆ నీ దివ్య ధామము, సర్వదా, సర్వోత్కృష్టమై ప్రకాశించుచుండును గాక !

6. అక్కడ, పలువురు దివ్యాంగనలచే పరివేష్టింపబడియున్న నీ సహధర్మచారిణి, శ్రీ మహాలక్ష్మి, లేదీవవంటి మేనుతో, విశ్వమోహనమైన సౌందర్యముతో, మెఱపువలె, నలుదెసలను వెలుగొందజేయుచు, నీ దివ్య పదసేవనమునందే లగ్నమైన మనసుకలదై, స్వయముగ సాక్షాత్కరించి యున్నది.మహాద్భుతమైన ఆ నీ దివ్యధామమునకు, నన్నును చేర్చుకొనవా ప్రభూ !

7. అచట, రత్నాసనము నధిష్ఠించి, అనంతకోటి సూర్యుల తేజముతో భాసించు మణిమయ కిరీటాద్యాభరణములతోను, శ్రీవత్సలాంఛనముతోను, కౌస్తుభమణితోను వెలుగొందుచున్న నిన్ను, చతుర్ముఖుడు దర్శించుకొనినాడు. ఆ దివ్యసుందరవిగ్రహ దర్శనభాగ్యమును, నాకును అనుగ్రహింపుము తండ్రీ !

8. అప్పుడు, నీ ముఖమండలము, మందహాసముతో ప్రసన్నమై ఉన్నది. నీవు ధరించియున్న శంఖ చక్ర గదా పద్మములు, వెలుగులు చిమ్ముచున్నవి. నీలమేఘము వలె, నల్ల కలువవలె ఉన్న నీ దేహచ్ఛాయ, మనోహరమైన కాంతిని నలుదిక్కుల ప్రసరించుచున్నది.

అట్టి నీ మూర్తిని దర్శించుకుని, చతుర్ముఖుడు మురిసిపోయినాడు. నా ఆర్తిని తొలగించుకొనుటకు, నేనును, ఆ నీ మూర్తినే ఆశ్రయించినాను ప్రభూ !

9. ఆ విధముగ దర్శనమిచ్చిన నిన్ను చూసి, బ్రహ్మ తత్తరపడి నాడు. పరమానంద భరితుడై, నీకు ప్రణమిల్లినాడు. తను చేసిన తపస్సు ఫలించినదనుకొనినాడు. అది కారణముగనే, 'ప్రభూ ! నా కోరిక నీకు తెలి యనిదికాదు. ద్వైతా ద్వైతపరమైన నీ స్వరూపజ్ఞానమును(2) నాకు ప్రసా దింపవలసినది' అని నిన్ను ప్రార్థించినాడు. నా ప్రార్థనమును అట్టిదే ప్రభూ !

10. అరుణ కమలములవంటి నీ పాదములకు ప్రణమిల్లియున్న ఆ చతుర్ముఖుని, ప్రేమతో స్పృశించుచు, 'నాయనా ! నీ కోరిక ఫలించితీరును. అదిమాత్రమే కాదు. సృష్టి కార్యమును నిర్వహించుటవలన, నీ కెట్టి బంధ మును యేర్పడదు; అనికూడ సెలవిచ్చినావు.

ఆ విధముగ, అతనికి అమితానందమును చేకూర్చి, ఆ వెంటనే, అతని హృదయమున ప్రవేశించి, అతనిని, సృష్టి కార్యమున ప్రవర్తింప జేసినావు.

కృష్ణా ! అంతటి మహత్కార్యము నొనర్చినవాడవు, నాకు, పరి పూర్ణమైన ఆరోగ్యమును ప్రసాదింపలేవా తండ్రీ !

అర్థము - వివరణ

(1) రజోగుణ ప్రేరితుడై : 'నే నీ పని చేయవలెను' అను కోరిక కలవాడై -

(2) ద్వైతాద్వైత పరమైన నీ స్వరూప జ్ఞానమును : పరమేశ్వరుడు సగుణ నిర్గుణ రూపముల, సాకారుడుగ నిరాకారుడుగ కూడ భాసించు చుండునను జ్ఞానమును -

8. ప్రళయ వర్ణనం

1. మహాప్రళయావసాన సమయమునందు[1] ఈ బ్రహ్మకల్పమున[2] తొలుదొల్త నావిర్భవించిన చతుర్ముఖుడు, నీ నుండి, వేదవిజ్ఞానము నందిన వాడై, పూర్వకల్పమున జరిగిన సృష్టివంటి సృష్టిని చేయుట కారంభించినాడు.

2. ఆ విధముగ ప్రారంభింపబడిన సృష్టికార్యము, రెండువేల చతుర్యుగముల పరిమితి[3]గల ఒకే ఒక రోజున జరిగినది. ఆ సమయమున నేర్పడిన రాత్రులందు, బ్రహ్మదేవుడు, తాను సృజించిన ప్రాణులతోకూడ నీయందు విశ్రమించియుండువాడు. అది కారణముగనే, అతడు నిద్రించి యుండుట కేర్పడిన కాలమునకు, 'నైమిత్తిక ప్రళయకాలము[4] అను పేరు వచ్చినది.

3. ప్రతి దినమును, ప్రాతఃకాలమునలేచి, మా వలెనె, చతుర్ముఖుడు కూడ పని ప్రారంభించుచుండును. అదియు నీ అనుగ్రహమేకదా ! పూర్వ బ్రహ్మకల్పమునన్న చిరంజీవులకు[5] అప్పుడు జరుగు సృష్టి, తిరిగి ప్రారంభమైన నిన్నటి పనిగ మాత్రమే గోచరించును.

4. ప్రస్తుత బ్రహ్మకల్పములో, యిప్పుడు, పూర్వార్ధము గడచి పోయినది. అనగా, బ్రహ్మదేవుని ఆయువులో సగము ముగిసినదన్నమాట. అతని జీవితమున గడచిపోయిన రాత్రియందును, దాని తరువాత వచ్చిన ప్రాతఃకాలమునందును జరిగిన నీ లీలల నిపుడు వర్ణింపదలతును ప్రభూ !

5. పద్మసంభవుడైన బ్రహ్మ, దినాంతమున విశ్రమింపదలచి, నీ యందు లీనుడై యున్నాడు. ఆ సమయమున, ముల్లోకములును, నీ కుక్షి

యందు ప్రవేశించినవి. అప్పుడు, విశ్వమంతయు, ఒక జలరాశిగ మారి పోయినది.

6. ప్రపంచమంతయు జలార్ణవమైయున్న ఆ తరుణమున, పరమానంద స్వరూపుడవైన నీవు, నీవే అయిన ఆదిశేషునిమీద, ఆత్మరతుడవై (6) పడుకొని ఉన్నావు.

7. అట్టి ప్రళయారంభకాలమున, ప్రకృతి(7) మహత్తు(8) అహంకారము(9) మున్నగు శక్తులన్నియు నీయందే లీనమైయుండగా, సర్వ జీవులకును విశ్రమ స్థానమైన నీవు, 'వేయి మహాయుగములు గడచిన మీదట(10) నన్ను లేపవలసినది' అని, 'కాల' మనబడు శక్తికి ఆదేశించి, పడుకొనినావని చెప్పబడుచున్నది.

8. జగత్ప్రభూ ! ఆ విధముగ, వేయి చతుర్యుగములకాలము, నీవు, యోగనిద్రారతుడవైయుండగా, కాలశక్తి, ముందుగలేచి, నీకు 'సుప్రభాతము' పలికినది.

9. జలరాశియందున్న నీవు, అప్పుడు మేల్కొని, భువనములన్నియు సూక్ష్మరూపమున నీయందు లీనమైయుండుటను గ్రహించి, వానిమీద నీ దృష్టిని ప్రసరింపజేసినావు.

10. అది కారణముగ, అంతవరకు నీయందు లీనమైయున్న సర్వమునకు సారభూత మగునదియు, వర్ణనాతీతమైనదియు, మొగ్గవలె నున్నదియు నగు ఒక దివ్య కమలము, నీ నాభినుండి ఆవిర్భవించినది.

11. ఆ విధముగ ఆవిర్భవించిన మొగ్గ, ప్రళయ జలమునుండి పైకివచ్చి, అంతవరకు నలుదిక్కుల నావరించియున్న గాఢాంధకారమును, తన దివ్య తేజముతో , పటాపంచ లొనర్చినది.

12. ఆ విచిత్ర శక్తి ఆధారముగ ఉన్నదియు, పరిపూర్ణముగ వికసించినదియు నగు ఆ మహాద్భుత పద్మమునుండి, వేదమూర్తి అయిన చతుర్ముఖుడు బాహిరిల్లినాడు.

18. 'పద్మ'మని పిలువబడు ఈ మహాకల్పమున, 'పద్మ జన్మ'డని పేర్కొనబడు చతుర్ముఖుని వెలువరించిన పరమాత్ముడవు నీవు. నీవు సర్వవ్యాపివి.

వాతాలయ నివాసా! కృష్ణా! నీ మాహాత్మ్యము అనూహ్యమైనది నాయనా! అట్టి నిన్ను, నన్నావరించియున్న వేదనలనుండి నాకు ముక్తిని ప్రసాదింపవలసినదిగ వేడుకొనుచున్నాను తండ్రీ!

అర్థము - వివరణ

(1) మహా ప్రళయావసాన సమయమునందు : ఒక బ్రహ్మ మారి మరొక బ్రహ్మ వచ్చులోపల - రెండువేల చతుర్యుగములవంటివి ముప్పది ఆరువేలు అయిన కాలమున -

(2) ఈ బ్రహ్మకల్పమున : ప్రస్తుతము గడచుచున్నది శ్వేతవరాహకల్పము.

(3) రెండువేల చతుర్యుగముల పరిమితి : మానవ మానమున, కృత త్రేతా ద్వాపర కలియుగముల పరిమితి 43,20,000 సంవత్సరములు. అటువంటివి 2000 అయిన కాలమున -

(4) నైమిత్తిక ప్రళయకాలము : బ్రహ్మదేవుడు, ఒక రోజున - పగటిపూట - చరాచర జీవరాశిని సృజించి విశ్రమించు రాత్రి సమయము -

(5) పూర్వ బ్రహ్మకల్పముననున్న చిరంజీవులకు : మార్కండేయుడు మున్నగు వారికి -

(6) ఆత్మరతుడవై : (దశ. 1 - వివ. 20. చూడుము.)

(7) ప్రకృతి : వ్యక్త ప్రపంచమునకు తల్లి వంటిది.

(8) మహత్తు : (దశ. 5 - వివ. 5. చూడుము.)

(9) అహంకారము : 'నేను', 'నాది' అను భావము.

(10) వేయి మహాయుగములు : 43,20,000,000 సంవత్సరములు.

9. సృష్టి విలాసం

1. ఆ బ్రహ్మ, నీ నాభిస్థానముననున్న పద్మమునందుండి 'ప్రళయార్ణవమున[1] నీ పద్మ మెచటినుండి వచ్చినది ?' అని విచారించుచు, నలువంకల జూచినాడు. అట్లు చూచుటతో, అతడు, నాలుగు ముఖములు, ఎనిమిది కన్నులు కలవాడైనాడు.

2. అట్లతడెంతగా తిలకించినను, అతనికి, ఆ జలరాశియందు, అటునిటు కదలుచున్న పద్మముతప్ప వేఱొండెదియు గోచరింపలేదు. ఆ పద్మమున కాధారమైన నీవు, అతనికి దర్శనీయుడవు కాలేదు. అప్పుడతడు, 'ఈ మహా పద్మమున నొంటరిగాఉన్న నేనెవడను ? అస లీ పద్మ మెచ్చట పుట్టినది ?' అని, తనలోతాను విచారించుకొనసాగినాడు.

3. 'ఈ పద్మమునకు మూల మెచటనో ఒకచోట ఉండితీరును' అన్న దృఢ విశ్వాసముతో, మహా బుద్ధిశాలిఅయిన అతడు, తనదైన యోగ శక్తిని ఆధారము చేసుకుని, ఆ పద్మనాళమునందలి రంధ్రముద్వారా క్రిందికి దిగినాడు. కాని, అత్యంత సమ్మోహన కరమైన నీ మూర్తి అతనికి గోచరము కాలేదు.

4. అయినను, అతడు నిరుత్సాహపడలేదు. ఆ పద్మమునందలి రంధ్రము లన్నిటిద్వారా, క్రిందికి మీదికి పోవుచు, తన లక్ష్యసిద్ధికొరకు, నూరేండ్లు శ్రమించినాడు. కాని, ఆ పద్మమూలము అతనికి అగోచరమే అయినది.

అప్పుడతడు, తన ప్రయత్నమును విరమించుకుని, ఆ పద్మమునందే సుఖాసీనుడై యుండి, మనసు నేకాగ్ర మొనర్చుకుని, నీ అనుగ్రహముకొరకు నిన్నే ధ్యానింపసాగినాడు.

5. ఆ విధముగ, నిర్వికల్ప సమాధి(2)యందు శతవత్సరములు గడచినమీదట, అతనియందు, వినూత్న జ్ఞానభానూదయమైనది. అది కారణముగ, అతడు, పవిత్రీభూతుడైనాడు. ఆ సమయమున, అతని అంతర్దృష్టికి(3) శేషతల్పమున శయనించియున్న నీ దివ్యసుందర విగ్రహము, అంతకుము న్నెన్నడును గోచరముకానిది, దర్శనీయమైనది. అతడు, పరమానందభరితుడైనాడు.

6. ఆ సమయమున, నీవు, నీ శిరస్త్రాణమైన రత్నకిరీటముతోను, కంకణములు హారములు భుజకీర్తులు మున్నగు దివ్యాభరణములతోను, మణిమయాంచితమైన మొలనూలుతోను, పట్టుపీతాంబరముతోను, నీలము కోమలము అయిన దేహచ్ఛాయతోను మహాద్భుతముగ భాసించుచున్నావు. అట్టి, నీ దివ్యసుందర విగ్రహమును, చతుర్ముఖుడు దర్శించుకొనినాడు. నేనును, ఆ రూపమునే ధ్యానించుకొనుచున్నాను ప్రభూ !

7. 'లక్ష్మీపతీ ! నీవు, ప్రపంచ సంబంధమైన వేదనల నన్నిటిని నిర్మూలింపగలవాడవు. సర్వశక్తి సంపన్నుడవు. నీ దైన వైభవమును, వేదములు వేనోళ్ళ కొనియాడుచున్నవి. అట్టి నీవు, నా పూర్వపుణ్య వశమున, నేడు దర్శనీయుడవైనావు. నీకు జయమగుగాక ! తండ్రీ ! సృష్టి నిర్మాణమునకు వలసిన సునిశిత జ్ఞానమును నాకు ప్రసాదింప వలసినది' అని, చతుర్ముఖుడు, నిన్ను, స్తుతిపూర్వకముగ ప్రార్థించు కొనినాడు. ఆ విధముగ స్తుతింపబడిన మహానుభావా ! నన్ను రక్షింప వలసినది.

8. చతుర్ముఖునిచే ప్రార్థితుడవైన నీవు, 'నాయనా ! ముల్లోకములను సృజింపగల అప్రతిహత సామర్థ్యము నీకు కలుగునట్లు ఆశీర్వదించు చున్నాను. అయినను, తిరిగి తపమొనర్పవలసినది. దాని మూలమున, నీకు, నా యందు దృఢతరమైన భక్తి కుదురుటయు, నీవు తలపెట్టిన కార్యములన్నియు నిర్విఘ్నముగ నెరవేరుటయు జరుగగలదు' అని తెలియ

పరచినావు. మధురాతి మధురమైన ఆ పలుకుల నాలకించి, చతుర్ముఖుడు, సంతుష్టస్వాంతుడైనాడు.

9. ఆ పైన, అతడు, మరొక నూరు దివ్యవత్సరములు(4) తీవ్ర తపమొనర్చి, అపూర్వమైన తపోబలమునూ బుద్ధిబలమునూ సముపార్జించు కొనినాడు. అంతలో, అతడున్న పద్మము, గాలితాకిడికి, నీటియందు కంపించుట సంభవించినది. అది గ్రహించి, నీవు ప్రసాదించిన శక్తిద్వారా, అతడు, ఆ గాలినీ నీటినీ త్రాగివేసినాడు.

10. అనంతరము, అతడు, ఆ పద్మమునుండియే, ముల్లోకములను(5) సృజించినాడు. జీవజాలమును కల్పించుట కుపక్రమించినాడు. అదంతయు, నీ కృపా విశేషమున జరిగినదే కదా !

కృష్ణా ! నీవు, గురుపవన పురాధిపతివి. పరమదయా సముద్రుడవు. కావుననే, నీ గురుకరుణాపాంగ వీక్షణములను నామీదకూడ ప్రసరింపజేయ వలసినదిగ ప్రార్థించుకొనుచున్నాను నాయనా !

అర్థము - వివరణ

(1) ప్రళయార్ణవమున : ప్రళయ సమయమున నేర్పడిన జలరాశియందు -

(2) నిర్వికల్ప సమాధి : మనస్సు పరమాత్మనియందు అపరిచ్ఛిన్నముగ ఉండు సమాధి స్థితి -

(3) అంతర్ దృష్టికి : బయటి ప్రపంచముమీద కాక పరమాత్మనియందే లయమై ఉండు దృష్టి -

(4) దివ్యవత్సరములు : దేవమానమునకు సంబంధించిన సంవత్సరములు -

(5) ముల్లోకములు : స్వర్గ మర్త్య పాతాళములు -

10. సృష్టిభేదం

1. వికుంఠాధిపా ! కృష్ణా ! నీ కృపా విశేషమువలన అతిశయించిన శక్తి సామర్థ్యములతో, చతుర్ముఖుడు ఆ పైన, జీవసృష్టికి పూనుకొనినాడు. ఆ సందర్భమున, అతడు, స్థావరములైన వృక్షలతాదులను, పశు పక్ష్యాదులను, దేవ మానవ సంఘమును, అట్లే, చరాచరముల నన్నిటిని సృజించినాడు.

2. అనంతరము, అజ్ఞాన జన్యములగు మిథ్యాజ్ఞానము(1) అహంకారము రాగము ద్వేషము భయము అనువాటిని కల్పించినాడు. అట్లు, తమోగుణ ప్రధానమైనవాటినిమాత్రమే సృజించుటవలన కలిగిన హృదయవేదనతో తిరిగి, పరిశుద్ధుడగుటకుగాను, అతడు, నీ దివ్య చరణాంబుజములను ధ్యానింపసాగినాడు.

3. అది కారణముగ, సనక సనంద సనాతన సనత్ కుమారులు అతని మానసపుత్రులగుటయు, వారు, అనంతర సృష్టికార్యమునందు, అతనికి తోడ్పడక, పరమభక్తులుగ రూపొందుటయు సంభవించినది.

4. ఆ పైన, అతని భ్రూమధ్యమునుండి, నీ అంశయే అయిన మృడుడు ఉదయించినాడు. ఆ వెంటనే, అతడు, తనలోని క్రోధము నణచికొనుచు, చతుర్ముఖుని ఉద్దేశించి, 'నన్ను పిలుచుటకు పేర్లుగాని, నేను నిలచుటకు ఊళ్లుగాని లేవాయేమి ?' అని అరచినాడు. అది కారణముగ, అతనికి, 'రుద్రుడు' - అరచువాడు - అను సార్థకనామ మేర్పడినది.

5. ఆ రుద్రునకు, చతుర్ముఖుడు ఆపైన, పదునొకండు నామములు(2)గల పదునొకండు రూపము లేర్పరచినాడు. పదునొకండు గురు భార్యల(3) నతనికి ప్రసాదించినాడు. అటులనే, వారు నివసించుటకు,

పదునొకండు స్థానములను(4)కూడ కల్పించినాడు. ఆపైన, అతని నుద్దే శించి, 'నీవు, ప్రాణులను సృష్టించవలసినది' అని సాదరపూర్వకముగ ఆదేశించినాడు. అదంతయు నీ ప్రేరణ మూలముననే జరిగినది ప్రభూ !

6. రుద్రునిచే సృజింపబడిన భయంకరాకారులతో నిండియున్న ముల్లోకములను తిలకించి, భీతచిత్తుడైన చతుర్ముఖుడు, తిరిగి, నీ చేత ప్రేరేపింపబడినవాడై, అతని నుద్దేశించి, 'ప్రజాసృష్టికి 'స్వస్తి'చెప్పవలసినది. విశ్వశ్రేయమునకై తప మాచరింపవలసినది', అని ఆదేశించినాడు.

7. అనంతరము, సృష్టికార్యమున నిమగ్నుడై ఆనందించుచున్న ఆ చతుర్ముఖుని వివిధావయవములనుండి, మరీచి అత్రి అంగిరసుడు క్రతువు పులహుడు పులస్త్యుడు భృగువు వసిష్ఠుడు దక్షుడు నారదుడు ఉద్భవించినారు. వారిలో, నారదుడు, నీ పద సేవకుడుగా ప్రసిద్ధుడైనాడు.

8. ధర్ముడు మున్నగువారినీ, కర్దమునీ, సృజించిన మీదట, చతుర్ముఖుడు, శారదను సృజించినాడు. ఆమెను చూసినంతనే, అతనిలో మోహము జనించినది. కాని, నీ వలన ప్రేరేపింపబడిన అతని కుమారులు, సనక దక్షాదులు, బోధించుట కారణముగ, అతడు, తన దోసమును గ్రహించుకొనినాడు; తనలోని వికారమును శమింపజేసికొనినాడు.

9. ఆ పైన, అతని ముఖమునుండి వేదములు బాహిరిల్లినవి. సర్వ విధ విద్యలు సముత్పన్నమైనవి. వాటి నతడు, తన కుమారుల కంద జేసినాడు.

ఆ స్థితిలో, సృష్టికార్యము కుంటుపడినట్లు అతడు భావించుట జరిగినది. అది కారణముగనే, అతడు, నీ పాద పద్మముల నాశ్రయించుట సంభవించినది.

10. ని న్నాశ్రయించినదానికి ఫలముగ, అతని కొక ఉపాయము తోచినది. ఆ వెంటనే, అతడు, తన శరీరమును, స్త్రీ పురుష భాగములుగ

విభజించుకొనినాడు. అవే, మనువుగా, అతని భార్య అయిన శతరూపగా విలసిల్లినవి.

మరుత్పురాధిపా ! గోవిందా ! ఆ దివ్య దంపతులద్వారా, మానవ జాతిని వృద్ధిజేయుచున్న నీవు, నా ఆరోగ్యము నభివృద్ధి చేయలేవా తండ్రీ !

అర్థము - వివరణ

(1) మిథ్యాజ్ఞానము : ప్రపంచముకూడ శాశ్వతమైనదే అను భావము -

(2) పదునొకండు నామములు : శంకర, త్రిభువన, భవ, అంతక, శంభు, ఉగ్ర, హర, నీలలోహిత, త్ర్యంబక, మహినస, ధృతవ్రత -

(3) పదునొకండుగురు భార్యలు : ధీ, వృత్తి, ఉశన, ఉమ, నియత్, సర్పి, ఇల, అంబిక, ఇరావతి, సుధ, దీక్ష -

(4) పదునొకండు స్థానములను : హృదయము, ఇంద్రియములు, ప్రాణవాయువు, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి, సూర్యుడు, చంద్రుడు, తపము అనువానిని -

11. జయవిజయుల శాపం

1. కృష్ణా ! విశ్వసృష్టి క్రమక్రమముగ వృద్ధినందుచున్న సమయమున, ఒకప్పుడు, నిన్ను దర్శించుకొను తలంపుతో, సనకాది మహర్షులు(1) నీ నిజధామమైన వైకుంఠమున ప్రవేశించినారు.

2. ఆ పైన, వారు, కొన్ని ఆవరణల నధిగమించి, 'నైశ్శ్రేయస కానన'(2) మనబడు మనోహరోద్యానముతోను, అందుగల, అనేక సుందరతర జలాశయములతోను, కనులు మిఱుమిట్లుగొలుపు మణిమయ ప్రాసాదములతోను, నిరుపమానముగ ప్రకాశించుచున్న నీ దివ్యధామమును సమీపించినారు.

3. నిన్ను దర్శించుకొను కుతూహలముతోవచ్చిన ఆ మహర్షులను, అచటి ద్వారపాలకులు, జయ విజయు లనువారు అడ్డగించినారు. అది, ఆ మహర్షులకు ఆగ్రహకారణమైనది. అదంతయు అట్లు జరుగవలెనన్నది, నీ సంకల్పమే కదా ప్రభూ !

4. 'వైకుంఠవాసులకు ఉచితముకాని విధమున ప్రవర్తించిన మీరు, రాక్షసులై జన్మింపవలసినది' అని, ఆ మహర్షులు, జయ విజయులను శపించినారు. ఆ విధముగ శప్తులైన నీ ఆశ్రితులు, ఆ వెంటనే, వారికి ప్రణమిల్లి, 'ఐనను, మేము, శ్రీహరిని మఱవకుండునట్లు అనుగ్రహింపవలసినది' అని ప్రార్థించినారు.

5. అది గ్రహించిన నీవు, శ్రీ మహాలక్ష్మితోసహ అచటికిపోయి, పక్షిరాజైన గరుడుని మూపున చేతులుమోపి నిలబడినావు. దివ్యసుందర విగ్రహుడవైన నిన్ను, ఆ విధముగ దర్శించుకొనిన మహర్షులు, మహదానందము ననుభవించినారు.

6. ఆనందాతిరేకమున నిన్ను ప్రస్తుతించుచున్న ఆ మహర్షులను, మృదుమధుర వచనములతో సంతుష్టిపరచి, నిన్నే ఆశ్రయించియున్న

జయ విజయుల నుద్దేశించి, 'వైరానుబంధమున[3] మూడు జన్మలలో మీరు నన్ను చేరగలరు' అని, దయతో పలికినావు.

7. అనంతర కాలమున, వా రిరువురును, కశ్యపునకు, అతని భార్య అయిన దితియందు, భగవద్విరోధులైన కవలుగా జన్మించినారు. వారు, సంధ్యాసమయమున గర్భస్థులగుటవలన, క్రూరకర్ములగుటయు, ఇద్దరు 'యముల'వలె సంచరించుచుండుటయు జరిగినది.

8. వారే, హిరణ్యాక్ష హిరణ్యకశిపులు. వారు, వారి వారి స్వభావముల ననుసరించి, గర్వాంధులై, నీవు నాథుడవుగా ఉన్న ప్రపంచమునంతను, అమితముగ పీడింపసాగినారు.

9. వా రిరువురిలోను, రాక్షసాధిపుడైన హిరణ్యాక్షుడు, తనతో పోరగల వీరునికొరకు, విశ్వమంతటను వెదకి వెదకి, అట్టివా రెవరును కనబడకపోవుటవలన, నీ ప్రియురాలైన భూదేవిని జలరాశిలో ముంచివేసి, గదను ధరించి, సగర్వముగ సంచరింపసాగినాడు.

10. ఆ సమయమున, అతడు, వరుణదేవునిద్వారా, నిన్నుగురించి వినుట సంభవించినది. నీవు, తనకు తగిన ప్రత్యర్థివను అభిప్రాయమున, అతడు, నిన్ను వెదుకసాగినాడు.

దయానిధీ ! కృష్ణా ! నీవు, భక్తులకు దర్శనీయుడవుగదా ! న న్నేల దయచూడవు నాయనా ! నా బాధల నేల నివారింపవు తండ్రీ !

అర్థము - వివరణ

(1) సనకాది మహర్షులు : సనక సనంద సనత్కుమార సనత్సుజాతులు -

(2) వైశ్రేయస కాననము : వైకుంఠముననుండు ఒక ఉద్యానవనము. అది, ముక్త జీవులకు పరమగతి అయిన స్థానము.

(3) వైరానుబంధము : విరోధమును పాటించుట మూలమున కలుగు సంబంధము -

12. వరాహావతారం

1. అనంతరము, బ్రహ్మమానస పుత్రుడైన స్వాయంభువ మనువు, ప్రజాసృష్టికి ఉపక్రమించి, సమయముకానిసమయమున విశ్వమంతయు జలమయమై ఉండుటచూసి, సత్యలోకమున, మహర్షులతోకలసి నిన్ను ధ్యానించుకొనుచు పరమానందము ననుభవించుచున్న చతుర్ముఖుని శరణు జొచ్చినాడు.

2. ఆ పైన, అతనికి, తన పరిస్థితినంతను సభక్తికముగ విశద పరచుకొనినాడు. 'నాచే సృజింపబడు జీవులకు యేదేనొక స్థానమును నిర్దేశింపవలసినది' అనికూడ ప్రార్థించినాడు.

అతని ప్రార్థన నాలకించి, చతుర్ముఖుడు, ఆ వెంటనే, నీ దివ్య చరణాబ్జములకు నమస్కరించినాడు; నిన్ను స్మరించుకొనినాడు.

3. అనంతరము, 'స్వామీ ! నే నింతకు పూర్వము జలమునంతను త్రాగివేసినాను. అయినను, భూమి, క్రుంగిపోవుచునే ఉన్నది. ఇప్పుడు నే నేమి చేయవలెనో సెలవీయవలసినది' అనికూడ, విన్నవించు కొనినాడు.

ఆ విధముగ నీ చరణముల నాశ్రయించిన చతుర్ముఖుని నాసా పుటమునుండి, ఒక వరాహ కిశోర రూపమున నీ వపుడు బాహిరిల్లినావు.

4. ఆ సమయమున, నీవు, అంగుష్ఠమాత్రదేహుడవుగనే ఉన్నావు; కాని, అంతలోనే, ఏనుగంతవాడవైనావు. ఆ విధముగ ఆకాశము దిక్కుగా పెరుగుచున్న నిన్నుచూసి, అచటనున్నవా రందరును ఆశ్చర్యచకితు లైనారు.

5. అప్పుడు, చతుర్ముఖుడు, 'ఇదంతయు వైష్ణవమాయగా ఉన్నది. కానిచో, నా నాసాపుటమునుండి యీ మహావరాహము బాహిరిల్లుట యేమి ?

ఇంతకును యీ మూర్తి యెవరో కదా !' అని, తనలోతాను విచారింప సాగినాడు. అంతలో, నీవు, ఒక పెద్ద పర్వతమంతగ పెరిగి, అతి భీకరముగ ఘుర్ఘురించినావు.

6. ఆ నినాదము నాకర్ణించి, జనలోకమునందును తపోలోకము నందును సత్యలోకమునందును ఉన్న మహర్షులు, హర్షాతిరేకమున నిన్ను స్తుతింపసాగినారు. ఆ స్తోత్ర పాఠములకు సంతుష్టాంతరంగుడవైన నీవు, తిరిగి ఘుర్ఘురించి, సముద్ర గర్భమున ప్రవేశించినావు.

7. పొగవన్నెగలవీ పుల్కరించినవీ అయిన వెంట్రుకలను విదళించు కొనుచు, తోకను పైకెత్తుకుని, భయంకరమగు ముట్టెను క్రిందికి వంచుకుని, గ్రుడ్లుఉుముచు, నీవు, 'గుభీ' మని సముద్రగర్భమున మునిగినప్పుడు, కల్లోలితమైన ఆ తరంగములు కల్పించిన గాలి తాకిడికి, మేఘములే చిందర వందర అయినవి. ఆ సమయమున, నిన్ను దర్శించుకొనిన మహర్షుల ఆనందము అవధిలేనిదైనది.

8. నీవు ప్రవేశించిన ఆ జలరాశియందు, మొసళ్లు తిమింగలములు తండోపతండములుగ ఉన్నవి. అంతులేని తరంగమాలిక లున్నవి. భయంక రముగ ఘుర్ఘురించుచు, నీ వందు ప్రవేశించినపుడు, రసాతలవాసులే అశాంతితో అటమటించిరనిన, వాటిమాట చెప్పవలసిన దేమున్నది ? అట్టి క్షుభిత మహార్ణవమున, నీవు, నీ ప్రియురాలగు భూదేవికొరకు, వెదుక నారంభించినావు.

9. అంతలో, ఆ రాక్షసాధముడు రసాతలముక్రింద దాచిఉంచిన నీ ప్రియురాలు, నీకు గోచరించినది. ఆ వెంటనే, మాయావరాహ రూపమున నున్న నీవు, ని న్నెదిరించుచున్న రాక్షస గణమును నిర్లక్ష్యముచేయుచు, నీ కోరలతో, ఆమె 'నిట్టె' పైకెత్తి పట్టుకొనినావు.

10. క్రీడావరాహరూపమున, సంక్షుభిత సాగరమునుండి సువిశాలమైన భూమితో నీవు బయటకు వచ్చునప్పుడు, ఆ భూమి, నీ దంష్ట్రాగ్రభాగము నంటుకునిఉన్న ఒక గడ్డిపోచవలె గోచరించినది.

పుడమిబాధను తొలగించిన మహానుభావుడవు, నా బాధను తొలగింపలేవా తండ్రీ!

13. హిరణ్యాక్ష సంహారం

1. ఆ సమయమున, నీ మోకాటిబంటి నీరుగామాత్రమే ఉన్న ప్రళయజలమున తిరుగుచు, నిన్ను వెదుకుచున్న హిరణ్యాక్షుని, దైవ కార్యములు నిర్వహించుటలో నేర్పరిఅయిన నీ పరమభక్తుడు, నారదుడు, కలుసుకొనినాడు. కలుసుకుని, అతని సామర్థ్యము నుగ్గడించుచు, నీ పరాక్రమమును నిరసించుచు మాట్లాడ సాగినాడు.

2. ఆ సందర్భముననే, ఆయన, అతనితో, 'దానవేశ్వరా ! నీవు కష్టపడి సంపాదించి దాచుకొనిన భూమిని, మాయావి అయిన ఆ మహా విష్ణువు అపహరించినాడట కదా ! పాపము; నీ పట్ల యెంత మోసము జరిగినది !' అనికూడ పరామర్శించినాడు. ఆ పలుకులు వినిన హిరణ్యాక్షుడు, 'ఔను. అయినదేదో అయినది. కాని, యిప్పుడు అత డెక్కడ ఉన్నాడు ?' అని గర్జించినాడు. దానిమీద, ఆ మహర్షి, నీ జాడను తెలుపుటయు, దంష్ట్రాగ్రమున భూమిని పదిలముగ నిలుపుకుని, జలరాశి నుండి బయటకు వచ్చుచున్న నిన్ను, ఆ రాక్షసుడు సమీపించుటయు, జరిగినది.

3. ఆ పైన, అతడు, నిన్నుచూసి, వికటాట్టహాస మొనర్చుచు, 'పందీ ! ఆగవలసినది !' అని అరచినాడు; బహు విధముల నిన్ను తూల నాడినాడు. ఐనను, నీ వతనిని లక్ష్యముచేయలేదు.

కాని, అతనిని చూడగనే, భూదేవి కంపించిపోయినది. అది గ్రహించిన నీవు, ఆమెను అక్కడనే సురక్షితముగ నిలిపి, అతనితో యుద్ధముచేయుటకు సిద్ధపడినావు.

4. అటుపిమ్మట, మీ యిరువురి నడుమను, భీకర గదాయుద్ధము జరిగినది. మీ గదా ప్రహారములు, గగన తలమున ప్రతిధ్వనించినవి.

అదంతయు, నీకు, పిల్లల ఆటవంటిదే కదా ప్రభూ ! అయినను, దానిని తిలకించుటకు దేవతలుకూడ దిగివచ్చినారు.

గములు గములుగ ఆకసము నంతటను ఆవరించిన దేవగణము, ఆ సమయమున నిన్నుద్దేశించి జయజయధ్వాన మొనర్చినది. చతుర్ముఖుడు, 'స్వామీ ! సంధ్యాసమయమునకు ముందే అతనిని సంహరింపవలసినది' అని నిన్ను వేడుకొనినాడు.

5. అంతలో, అసురుడు విసరికొట్టిన దెబ్బకు తట్టుకొనలేక పోయినట్లు, నీ చేతిలోని గద క్రింద పడిపోయినది. అది చూసిన దేవతలు విస్మయావిష్టులైనారు. నీ వది గ్రహించి, మందహాస మొనర్చినావు. ఆ వెంటనే, అసురకుల నిర్మూలనార్థము అవతరించిన సుదర్శన చక్రమును స్మరించుకొనినావు. తక్షణమే, అది, నీ హస్తము నాశ్రయించినది. అది, నీ దివ్యతేజమును మహోజ్వల మొనర్చినదని, బ్రహ్మాదులు భావించినారు.

6. ఆ పైన, హిరణ్యాక్షుడు, సంహారకర్త అయిన కాల స్వరూపుని వలె, అమిత క్రోధముతో, త్రిశూలమును నీ మీదకు విసరుట కుద్యమించి నాడు. అది గ్రహించిన నీవు, దానిని, నీ చక్రాయుధముతో ఖండించి వేసినావు.

ఆ చర్య, అతని ఆగ్రహమును అతిశయింపజేసినది. ఆ వెంటనే, అతడు, ముష్టియుద్ధమునకు దిగినాడు. మాయాతీతుడవైన నీ మీద, తన దైన మాయాసంగ్రామ చాతుర్యము నంతను ప్రయోగించినాడు.

7. కాని, నీ దివ్య చక్రము ప్రసరించిన తేజోలేశమునకే అతని మాయాజాలమంతయు ఆహుతి అయిపోయినది. అది గ్రహించిన అతడు, క్రోధావిష్టుడైనాడు. నీ మీద, ముష్టి ప్రహారములను వర్షింపసాగినాడు. ఆ సమయమున, నీవు, నీ కాలి బొటనవ్రేలితో, అతని కణతమీద, ఒక్క తన్ను తన్నినావు.

8. మహాకాయుడైన హిరణ్యాక్షుడు, ఆ తాకిడికి తట్టుకొనలేక, రక్తము గ్రక్కుచు కూలిపోయినాడు. అది చూసిన మహర్షులు, అమితముగ ఆనందించినారు; యజ్ఞస్వరూపుడవైన నిన్ను, బహుధా ప్రస్తుతించినారు.

9. "వరప్రదాతా! నీ చర్మమునందు ఛందస్సు ఉన్నది. నీ రోమములయందు దర్భలున్నవి. నీ నేత్రములయందు నేయి ఉన్నది. నీ పాదములయందు నలువురు హోతలున్నారు. నీ ముఖమునందు స్రుక్కు ఉన్నది. నీ ఉదరమున పురోడాశము నుంచు 'ఇడ' యను పాత్రయున్నది. నీ కర్ణమునందు ఆ రసమును త్రావు పాత్రయున్నది. నీ వీర్యమే సోమ రసము. నీ కంఠమున 'ఉపసద' మను మూడు ఇష్టి విశేషములున్నవి. నీవు సాక్షాత్తు యజ్ఞస్వరూపుడవే తండ్రీ!" అని ఆ మహర్షులు నిన్ను స్తుతించినారు.

10. ఆ విధముగ మహర్షులచేత స్తుతింపబడుచు, విశ్వస్వరూపుడవును, విమలయశోవిరాజితుడవును, అయిన నీవు, పరమానందముతో, నీ దివ్యధామమును చేరుకొనినావు.

మధుసూదనా! నా బాధలనుకూడ నిర్మూలింపవలసినదని, నీ ఆనందమును నాకుకూడ ప్రసాదింపవలసినదని ప్రార్థించుకొనుచున్నాను తండ్రీ!

14. కపిలావతరణం

1. అనంతరము, బ్రహ్మమానసపుత్రుడైన స్వాయంభువ మనువు, సర్వదా నీ పాదపద్మములనే స్మరించుకొనుచు, నీ లీలావిశేషములనే వర్ణించుకొనుచు, యెట్టి అవరోధములును లేక, తన జీవితమును సుఖమయ మొనర్చికొనినాడు.

2. ఆ సమయమున, చతుర్ముఖుని ఛాయనుండి ఉద్భవించిన కర్దమ ప్రజాపతి, అతని ఆదేశానుసారము, ప్రజాసృష్టి చేయవలయునను తలంపుతో, నిన్ను, పదివేల సంవత్సరములు సేవించుకొనుట జరిగినది.

3. అది కారణముగ, నీలమేఘమువంటి శరీరచ్ఛాయ కలవాడవు, మందహాసముచే వికసించిన ముఖపద్మము కలవాడవు, కరకమలమున నొక కమలమును సవిలాసముగ ధరించినవాడవు అయిన నీవు, గరుడవాహనారూఢుడవై వచ్చి, అతనికి దర్శన మొసంగినావు.

4. ఆ దర్శన భాగ్యమువలన ఆనందాతిశయమునందినవాడై నిన్ను స్తుతించుచున్న కర్దముని ఆశీర్వదించి, మనుపుత్రి అతనికి ధర్మపత్ని అగునట్లును, ఆమెవలన అతనికి తొమ్మండుగురుకుమార్తెలు కలుగునట్లును నీవే, అతనికి, స్వయముగ కుమారుడవై జన్మించునట్లును వరము ననుగ్రహించి, నీవు అంతర్హితుడవైనావు.

5. అటుపిమ్మట, నీ సంకల్పానుసారము, నారదమహర్షిచే ప్రోత్సహింపబడిన మనువు, తన దేవేరి అయిన శతరూపతోను, కుమార్తె అయిన దేవహూతితోను, తమకై నిరీక్షించుచున్న కర్దముని కలుసుకొనినాడు.

6. ఆ విధముగ కలుసుకుని, కన్యారత్నమైన దేవహూతిని, అతనికి సమర్పించుకొనినాడు. కర్దముడు, యథార్థమునకు నీ భక్తుడు. నిన్ను

ఆరాధించి అతడు పొందుచుండు ఆనందము అంతులేనిది. అయినను, స్వార్థరహితముగ దేవహూతిచేయు పరిచర్యలు, ఆమెపట్ల అతనికిగల అనురాగము నతిశయింపజేసినవి.

అది కారణముగ, అత డామెకు, ఆనందమునొదగూర్చు తలంపుతో, నిన్ను ఉపాసించినదాని ఫలముగ లభించిన ప్రభావముద్వారా ఒక దివ్య రూపమును ధరించినాడు. ఒక విచిత్ర విమానమును కల్పించినాడు. ఆమెకు పరిచర్యలొనర్చుటకు కొందరు దివ్యాంగనలను సృజించినాడు. ఆ పైన, ఆ విమానము నధిరోహించి, పరిచారికాగణముతోను, సహధర్మచారిణితోను, బయలుదేరి, దేవమార్గములయందు(1) యథేచ్ఛా విహారమొనర్ప సాగినాడు.

8. ఆ విధముగ, నూరు సంవత్సరములు గడచినవి. ఆ సమయమున, అతనికి, అమిత సౌందర్యవతులైన తొమ్మండుగురు కుమార్తెలు కలిగినారు. అప్పు డతనికి, వనాంతరముల కేగి, తపస్సు చేసుకొనవలెనను తలంపు కలిగినది. కాని, దేవహూతిదైన కోరికను మన్నించు ఉద్దేశముతోను, నిన్ను కుమారునిగా పొందవలెనను ఔత్సుక్యముతోను, అత డా ఉద్యమమును విరమించుకొనినాడు.

9. ఆ పైన, దేవహూతి, కర్దముని ఆదేశానుసారము, నీ యందే మనసును లగ్నము చేసుకొనినది. నిన్నే, భక్తిశ్రద్ధలతో ఉపాసింపసాగినది. ఆ సమయమున, నీవు, పరతత్త్వమును(2) ప్రపంచమున ప్రవర్తిల్ల జేయుటకుగాను, ఆమె యందు, కపిలుడవుగ అవతరించినావు.

10. కృష్ణా ! నీవే ఆ కపిలుడవు. నీ తండ్రి అయిన కర్దముడు, సంతుష్టచిత్తుడై వనాంతరముల కేగిన పిమ్మట, సాంఖ్యయోగ సారమును(3) నీ తల్లికి, దేవహూతికి, బోధించినది నీవే కదా !

నాకు కూడ అట్టి జ్ఞానమును ప్రసాదింపుము తండ్రీ !
నా వేదనల నన్నిటిని, వెంటనే నివారింపుము నాయనా !

(4)

అర్థము - వివరణ

(1) దేవమార్గములయందు : దేవతలు విహరించు భూములయందు -

(2) పరతత్వము : పరమేశ్వర సంబంధమైన యథార్థ విషయము -

(3) సాంఖ్యయోగ సారము : 'ఇది పరమాత్మ తత్త్వము', 'ఇది ప్రకృతి లక్షణము' అని గ్రహించుటద్వారా ముక్తి లభించుననునది సాంఖ్య సిద్ధాంతము. సాంఖ్యులు అనేకాత్మవాదులు. వారు, పురుషుడు వేరు, ప్రకృతి వేరు అని విశ్వసింతురు.

15. కపిలోపదేశం

1. భగవన్ ! కపిలావతారమున, నీ తల్లిఅయిన దేవహూతికి, నీ విట్లు ఉపదేశించినావు.

"ప్రపంచ సంబంధమైన విషయములపట్ల ఆసక్తికలిగియుండు మనస్సు, మరల మరల పుట్టుచుండుట, బాధల ననుభవించుచుండుట, మరణించుట అనువాటికి మూలకారణమగుచున్నది. అట్టి విషయములపట్ల ఆసక్తిలేని బుద్ధి, మోక్షమును ప్రసాదించుచున్నది.

విషయాసక్తిని తొలగించునది భక్తియోగము. అట్టి భక్తి, మహాపురుషులను సేవించుటద్వారా లభించుచున్నది. అది కారణముగనే, మానవులకు, భక్తియోగసాధన అవశ్యాచరణీయమైనదని మహాత్ములు ఉద్ఘాటించుచున్నారు.

2. 'అవిద్య' అని, 'మాయ' అని పేర్కొనబడు మూలప్రకృతి(1), 'పరిశుద్ధచిత్తమ'నబడు మహత్తత్వము(2) సాత్వికము రాజసికము తామసికము అను మూడు గుణములను వ్యక్తీకరించుచుండు అహంకారమూ(3), శబ్ద స్పర్శ రూప రస గంధములనబడు పంచతన్మాత్రలూ(4), పృథ్వి జలము తేజము వాయువు ఆకాశము అని పిలువబడు పంచమహాభూతములూ, మనస్సు అని బుద్ధి అని చిత్తమని అహంకారమని చెప్పబడుచుండు అంతఃకరణమూ, ముక్కు, నాలుక, కన్ను, చెవి, చర్మము, వాక్కు, చేయి, పాదము మున్నగు పది జ్ఞాన కర్మేంద్రియములూ, క్షేత్రజ్ఞుడని ఆత్ముడని కూటస్థుడని జీవుడని పరమాత్ముడని తెలుపబడు పురుషుడూ - ఈ యిరువది అయిదు తత్వముల స్వభావ స్వరూపములను గ్రహించినవారు, మాయను జయించినవారే అగుచున్నారు.

3. జీవుడు, సహజముగ, ప్రకృతి సంబంధమైన గుణములవలన బద్ధుడగుటలేదు. అయినను, అత డప్పుడప్పుడు ప్రకృతిని ఆశ్రయించు చున్నాడు. అట్టి సమయములందే, అతడు, మాయకు కట్టువడుట జరుగుచున్నది. అయినను, అతడు, నిరంతరము నిన్నే స్మరించుకొనుట ద్వారా, ఈ పంచవింశతి (ఇరువదిఅయిదు) తత్వముల స్వభావమును విమర్శించుకొనుచుండుటద్వారా, సత్పదార్థజ్ఞానమునంది, ఆ ప్రకృతి కల్పించు మాయనుండి విముక్తుడవుచున్నాడు.

4. ప్రాణాయామాదులద్వారా(5) మనసును పవిత్రీకరించుకుని, ఆసనశుద్ధినంది, తద్వారా, ఇంద్రియములను నియమించుకుని, భక్తులైనవారు, దివ్యాభరణములను దివ్యాయుధములను ధరించినవానినిగా, గరుడ వాహనారూఢుడై యున్నవానినిగా, తమాలనీలవర్ణమున శోభించుచున్న వానినిగా, నన్ను భావించుకుని నిరంతర ధ్యానమునకు ఉపక్రమింపవలెను.

5. అవిచ్ఛిన్నముగ ప్రవహించుచుండు గంగానదివలె, నిరంతరము నా గుణలీలా విశేషములను వినుచుండుటవలన, నా అనంతనామములను జపించుచుండుటవలన, జీవులకు, నాపట్ల పరమభక్తి యేర్పడ గలదు. అదే అమృతత్వసిద్ధి.

6. ఇతరులను పీడించి సంపాదించుకొనిన ఆస్తితో సంసారమును పోషించుకొనువాడును, ఆడుదాని చేతి కీలుబొమ్మగ ఉండువాడును, తన సంతానమును చూసుకుని మురిసిపోవుచుండువాడును, గృహకృత్యముల యందే మునిగితేలుచు, నన్ను మరచియుండువాడును అగు పురుషుడు, నిశ్చయముగ నరకముననే కూలిపోవుచున్నాడు.

7. మాతృగర్భముననుండి, అనేక యాతనల ననుభవించునప్పుడు కలిగిన జ్ఞానమును(6) భూమిమీద పడగనే, జీవుడు, మరచిపోవుచున్నాడు. ఆపైన, అత డనుభవింపని దుఃఖముండదు. బాల్య కౌమార దశలలో దైన్యము, యౌవనదశలో మోహము, అతని వేదనలకు కారణమగుచున్నవి.

8. పితృ గణమును, తదితర దేవతాగణమును భజించుచు, ధర్మ మార్గమున చరించుచుండు గృహస్థులు, తమ జీవితాంతమున, దక్షిణ దిక్కుగా[7] పోయి, స్వర్గమును చేరుకొందురు. అక్కడ, వారు, తమ పుణ్య కర్మల ఫలమును కొలదికాలమనుభవించి, కాలక్రమమున, తిరిగి, భూలోకమునకు దిగివత్తురు.

కాని, నిష్కామ కర్మల నాచరించుచు, ఆ కర్మల ఫలమును నాకే అర్పించుకొనుచుండు గృహస్థులు, మరణించినవెనుక, అర్చిరాది మార్గముల[8] నుత్తరాభిముఖులై పోయి, పునరావృత్తిరహితమైన[9] పరమ పదమును చేరుకొందురు."

9. ఆ విధముగ, దేవహూతికి, బ్రహ్మజ్ఞానమును ప్రసాదించిన నీవు, ఆమె ప్రశంసల నందుకుని, ఆ వెంటనే, మునిగణసమేతుడవై నిష్క్రమించినావు.

అట్లు నిష్క్రమించిన నీవు, లోక కళ్యాణార్థము, చిరంజీవివై, ఈనాటికికూడ పూర్వోత్తర భాగమున ఉండనే ఉన్నావు.

ఇక్కడ, నీ తల్లి అయిన దేవహూతి, నీ నిష్క్రమణానంతరము, పరిశుద్ధమైన మనసుతో, భక్తియోగాభ్యాసమున కుపక్రమించినది. కాల క్రమమున, ముక్తురాలైనది.

10. పరమపురుషా ! కపిలస్వరూపా ! ఇన్ని మాట లెందుకు ? నీ పాదపద్మములను భక్తితో సేవించుటవలన భయములన్నియు తీరిపోవునని, బాధలన్నియు తొలగిపోవునని, వాంఛితార్థములెల్ల ఈడేరునని, నీవే ఘంటా పథముగ వెల్లడించినావుగద ! కావుననే, కృష్ణా ! నా భక్తి నీ పట్ల దృఢమగునట్లు అనుగ్రహింపవలసినదిగ ప్రార్థించుకొనుచున్నాను; నాయనా !

అర్థము - వివరణ

(1) మూల ప్రకృతి : సర్వసృష్టికి మూలకారణమైనది -

(2) మహ త్తత్వము : సహజముగ మార్పులేనిది.
(దశ. 5 - వివ. 5. చూడుము.)

(3) అహంకారము : మహ త్తత్వమునుండి పుట్టినది. మహ త్తత్వమున మార్పు కలిగినప్పుడు అది అహంకారముగ పరిణమించును; 'నేను' 'నాది' అను భావమును కలిగించును.

(4) పంచతన్మాత్రలు : పంచమహా భూతములకు మూలమైనవి.
పంచమహాభూతములు : (దశ. 5 - వివ. 8. చూడుము)

(5) ప్రాణాయామాది నియమములు : ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన ధారణ సమాధులు - యమ నియమ ఆసనాదులు -

(6) ... జ్ఞానము : గర్భస్థ శిశువునకు 7 - వ మాసమున పూర్వజన్మస్మృతి కలుగునని భావము.

(7) దక్షిణ దిక్కు : దీనినే పితృయానము, లేదా, 'ధూమ్ర మార్గము' అందురు.

(8) అర్చిరాది మార్గములు : క్రమముక్తిని పొందువారు పోవుదారులు. ఇవి ఊర్ధ్వ ముఖముగ నుండునని, వెలుగు బాటలుగ ఉండునని భావింతురు.

(9) పునరావృత్తి రహితమైన : తిరిగి పుట్టుట అనునది లేని -

16. నరనారాయణావతార వర్ణనం

1. బ్రహ్మమానసపుత్రుడైన దక్షుడు, మనుపుత్రి అయిన ప్రసూతిని ధర్మపత్నిగా స్వీకరించి, ఆమె ద్వారా పదార్వురు కుమార్తెలకు(1) తండ్రి అయినాడు. వారిలో స్వధ అను కన్యను పితరులకును, స్వాహ అను కన్యను అగ్నిదేవునకును, సతి అను ఆమెను నీ అంశయేఅయిన శివునకును ఇచ్చి అతడు వివాహము చేసినాడు. మిగిలిన పదముగ్గురిని ధర్మదేవతకు సమర్పించుకొనినాడు.

2. ధర్ముని భార్య అయిన మూర్తి 'నర నారాయణులు' అను కవలను కన్నది. ఆ యిరువురును మహిమా సమన్వితులే; పూజ్యులే.

నరనారాయణు లుదయించినప్పుడు, దేవతలు, అమితానందము ననుభవించినారు. దానికి చిహ్నముగ, వారు, దుందుభులు మ్రోయించినారు. పుష్పవృష్టి గురిపించినారు. నిన్ను విశేషముగ స్తుతించినారు.

3. ఆ కాలమున సహస్రకవచుడను రాక్షసుడు, వేయికవచములను ధరించి, గర్వించి చరించుచుండెడివాడు. వేయి సంవత్సరముల కాలము, ఒకవంక తపస్సు, వేరొకవంక సమరము చేయుచుండువారికిగాని అతడు 'దాసోహ' మనడు. అట్టి శక్తి సామర్థ్యములుగల వానిని, మీరు, ఆ నియమమును యథావిధిగ పాటించుచు, అవలీలగ సంహరించినారు.

4. ఆపైన, మీ రిరువురును, లోకసంగ్రహార్థము, మోక్షధర్మము ననుష్ఠించుచు(2) అర్హులగువారికి, బ్రహ్మజ్ఞానము(3) నుపదేశించుచు, బదరి కాశ్రమమునందు, స్థిరనివాస మేర్పరచుకొనినారు.

ఆ సమయమున, మి మ్మాశ్రయించిన ప్రసన్నభావమును తపశ్శక్తిని గ్రహించిన ఇంద్రునిలో, మీ పట్ల ఈర్ష్య జనించినది. అది కారణముగ,

అతడు, మీ బ్రహ్మచర్య దీక్షకు భంగము కలిగింపవలెననుకొనినాడు. ఆ వెంటనే, మన్మథుని, అతని పరివారమైన దివ్యాంగనలతో మీ వద్దకు పంపినాడు.

5. అప్పుడు, వసంతము మందమలయానిలము కూడ మన్మథునకు సహాయముగా వచ్చినవి. వాటినీ, అప్సరస్త్రీల ఓరచూపుతూపులనూ, అత డాపైన, మీ మీద, పదే పదే ప్రయోగించినాడు. కాని, అవేవియు మీ మీద పనిచేయలేదు.

అది గ్రహించిన మన్మథుడు, భయముతో కంపించిపోయినాడు. నీ వదిచూసి, మందహాసము చేసినావు.

6. ఆ పైన, నీవు, మన్మధుని ఉద్దేశించి, 'కామదేవా ! నిర్భయముగ నా ఆతిథ్యమును స్వీకరింపవలసినది' అని మృదుమధురముగ పలికినావు. ఆ పలుకులు విని, మన్మథుడును అతని పరివారమును, నిన్ను స్తుతింప సాగినారు. అంతలో, నీవు, నీ యోగబలముద్వారా ఉత్పన్నమై, నిన్ను పరివేష్టించి ఉన్న పరిచారికాగణమును, దివ్యసుందరీ సముదాయమును, వారి సముఖమున నుంచినావు.

7. నిన్ను మోహింపజేయు తలంపుతో వచ్చిన మన్మథుడును అతని పరివారమును, నీ పరిచారికాగణమైన ఆ దివ్య సుందరీమణులనుచూసి విస్మితులైనారు. తమ్ము తాము మరచిపోయినారు. అనంతరము, వారు, నీవు వారికి ప్రసాదించిన అందాలరాశిని, దివ్యాంగనల గర్వమునంతను హరింపగలదానిని, ఉర్వశిని, సిగ్గుతో తలవంచుకుని స్వీకరించినారు.

8. ఆ విధముగ, ఉర్వశి, స్వర్గవాసులకు దక్కినది. ఆమెను చూసి, నీ వృత్తాంతమునంతను విని, అంతవరకును నీ మాహాత్మ్యమును గ్రహింపలేకపోయినందుకు, ఇంద్రుడు, అమితముగ వ్యాకుల పడినాడు.

అతి ప్రసన్నమూ అత్యంత మనోహరమూ అయిన నీ యీ నారాయణావతారమును మించిన మరొక అవతారమేదైన ఉన్నయెడల, అది నీ కృష్ణావతారమే కదా ప్రభూ !

9. చతుర్ముఖుని చేతులో, మిక్కిలి గారాబముతో పెరిగినవా డగుటవలన, దక్షుడు, అమిత గర్విష్ఠి అయినాడు. రజోగుణ సంబంధ మైన అన్ని లక్షణములును అతనిలో మూర్తీభవించి, అతని కళ్ళను కప్పి వేసినవి. అది కారణముగ, అతడు, నీ పట్ల తగినంత గౌరవము చూప కుండుటయు, మనశ్శాంతిని కోలుపోవుటయు జరిగినవి. అశాంతితో అటమటించిపోవు అతనికి, కాలక్రమమున, మతిభ్రంశము కలిగినది. అది, అతని బుద్ధిని నశింపజేసినది. తత్ఫలితముగ అతడు, నీ స్వరూపమే అయిన శివునితో విరోధము పెంచుకొనినాడు. దానిని ప్రకటించుటకు ఒక యజ్ఞమును తలపెట్టినాడు. అందు, శివుని అర్ధాంగి అయిన తన కుమార్తెను, సతీదేవిని సైతము, అమితముగ అవమానించినాడు.

10. తన ప్రియురాలైన సతీదేవికి జరిగిన పరాభవమును శంకరుడు సహింపలేకపోయినాడు. క్రోధమూర్తి అయినాడు. అది కారణముగ, ఆ యజ్ఞము విఘ్నమైపోయినది. దక్షుని తల తెగిపోయినది. కాని, దేవతల అభ్యర్థనమీద, శంకరుడు, తిరిగి ప్రసన్నుడై, దక్షునకు ప్రాణదాన మొనర్చినాడు. ఆ పైన, దక్షునకు శాంతి చేకూరుటయు, అతడు ప్రారం భించిన ఆ మహాయజ్ఞమును నీవు సమాప్తమొనర్చుటయు జరిగినవి.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! నా జాడ్యమునుకూడ నీవే నివారింప వలెను తండ్రీ ! నాకుకూడ, నీవే శాంతిని ప్రసాదింపవలెను నాయనా !

అర్థము - వివరణ

(1) పదార్గురు కుమార్తెలు : శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, తుష్టి, పుష్టి, క్రియ, ఉన్నతి, బుద్ధి, మేధ, తితిక్ష, శ్రీ, మూర్తి, స్వధ. స్వాహ, సతి.

(2) మోక్షధర్మము ననుష్ఠించుచు : ముక్తినందుటకు వలయు సాధనలు చేయుచు -

(3) బ్రహ్మజ్ఞానము : (దశ. 2 - వివ. 5. చూడుము.)

17. ధ్రువ చరితం

1. మనుపుత్రుడైన ఉత్తానపాదునకు ఇరువురు భార్యలు కలరు. వా రిరువురిలోను, సురుచియను భార్యయందు, ఆ మహారాజునకు అమితాను రాగమును, సునీతి యను భార్యయందు నిరాదరణయు కలిగినవి. అది కారణముగ, సునీతి, వేరొక సహాయము లేనిదై, అనన్య భావముతో, నిన్నే ఆశ్రయించినది.

2. ఒకమారు, సురుచి కుమారుడైన ఉత్తముడు, తన తండ్రి తొడ మీద ఉండగా, సునీతి కుమారుడైన ధ్రువుడు చూసినాడు. చూసి, తను కూడ తండ్రి ఒడిలో కూర్చొనవలెనని ఉబలాటపడినాడు. కాని, అతని భావమును గ్రహించిన సురుచి, అతనిని అమితముగ తూలనాడినది.

నీపట్ల విముఖులైన వారిలో, ఈర్ష్యాసూయలు జనించుట సహజమే కదా ప్రభూ !

3. సురుచి పలుకులు, ధ్రువుని హృదయమున, ములుకులై గ్రుచ్చు కొనినవి. అది గ్రహించికూడ, సురుచి కనుసన్నలలో మెలగుచుండు ఉత్తానపాదుడు, నీ మాయా ప్రభావమునకు వశుడైయుండుటవలన, ఆమె నేమియు అనలేదు. కుమిలిపోవుచున్న కుమారునివంక, సానుభూతితో చూడనైనను చూడలేదు.

ఆ పరిస్థితిలో, ధ్రువుడు, తన తల్లిని సమీపించినాడు. అంతకు ముందు జరిగినదంతయు ఆమెకు నివేదించుకొనినాడు.

ధ్రువుని వేదనను సునీతి గ్రహించినది. గ్రహించి, పరమేశ్వరుడ వైన నీ పాదముల నాశ్రయించుటవలననే ప్రారబ్ధము[1] క్షయము కాగలదని అతనికి హితోపదేశ మొనర్చినది.

4. అప్పటికి ధ్రువుని వయసు అయిదేండ్లు మాత్రమే. అయినను, అతనిలో, స్వాభిమానము నిండి నిబిడీకృతమై ఉన్నది. అది కారణముగనే, అతడు, ఆమె పలుకుల నాలకించి, నిన్ను ఉపాసించుటకే నిశ్చయించుకుని, వనాంతరములకు బయలుదేరినాడు.

అట్లు గమించుచున్న ధ్రువునకు, మార్గమధ్యమున, నారద మహర్షి కనిపించి మంత్రోపదేశ మొనర్చుటయు,(2) ఆ పైన, ధ్రువుడు, మధు వనమును చేరుకుని, అచట, తపశ్చర్యకు పూనుకొనుటయు జరిగినది.

5. ధ్రువుడు వనాంతరములకు పోయినమీదట, ఉత్తానపాదునకు పశ్చాత్తాపము కలిగినది. అతడు, విచార సాగరమున మునిగిపోయినాడు.

ఆ సమయమున, నారద మహర్షి అతనిని కలుసుకుని, ధ్రువుని క్షేమసమాచారములు తెలుపుటయు, ఆ మహారాజునకు కొలది మనశ్శాంతిని కలిగించుటయు సంభవించినది.

అక్కడ, మధువనమున తపము నారంభించిన ధ్రువుడు, నీ యందే మనసును లగ్నము చేసుకొనినాడు. క్రమక్రమముగ కఠోర నియమములను పెంచుకొనుచు, ఉగ్ర తపశ్చర్యలో(3) ఐదు మాసములు గడపినాడు.

6. ఆ సమయమున, అతని తపోబలము కారణముగ, దశదిశల యందును, ప్రాణవాయువు బంధింపబడిపోయినది. అది గ్రహించిన దేవతలు, నిన్ను సమీపించి, ప్రపంచమునకు ప్రాణదానము చేయవలసినదిగ వేడికొనినారు. కరుణామయుడవైన నీవు, ఆ వెంటనే, గరుడవాహనా రూఢుడవై వెళ్ళి, నీ స్వరూపమే అయిన చిదానందమునందు మునిగితేలు చున్న ధ్రువుని యెదుట, సాక్షాత్కరించినావు.

7. ఆ విధముగ నిన్ను దర్శించుకొనిన ధ్రువుని హృదయము పరమానంద భరితమైనది. అతని మనసు, నీ మనోహర రూపమునందే లగ్నమైపోయినది.

ఆ సమయమున, అతడు, నిన్ను స్తుతింపదలచినాడు. అది గ్రహించిన నీవు, నీ దివ్య శంఖముతో, అతని చుబుకమును ఆదరపూర్వకముగ స్పృశించినావు.

8. ఆ వెంటనే, అతనిలో, పరిశుద్ధమైన జ్ఞాన ముదయించినది. అది కారణముగ, అతడు, పవిత్రీభూతుడై నాడు; నిన్ను స్తుతింపసాగినాడు.

అప్పు డతని మనస్థితిని గ్రహించిన నీవు, అతని నుద్దేశించి, 'నాయనా ! నీవు చిరకాలము రాజ్యపాలన మొనర్చి, ఆ పైన, పునరావృత్తి లేని(4) పరమపదము నందవలసినది' ! అని ఆశీర్వదించినావు.

9. ఆ విధముగ పలికి, నీవు అంతర్హితుడవైనపిమ్మట, నీ ఆశీః ప్రభావమున, వాంఛితార్థములన్నియు నీడేరినవాడై, ధ్రువుడు, తన నగరు సమీపించినాడు. తనవా రందరికిని ఆనందమొడగూర్చినాడు. ఆ పైన, తపస్సు చేసుకొను ఉద్దేశముతో అతని తండ్రి అడవులకు వెళ్ళిన పిమ్మట, అతడు, రాజ్యాధికారమును స్వీకరించుటయు, సర్వవిధ భోగముల ననుభవించుటయు జరిగినది.

10. అనంతర కాలమున, అతని సోదరుడైన ఉత్తముడు, ఒక యక్షునిచేత సంహరింపబడుట సంభవించినది. అది కారణముగ, ధ్రువుడు, యక్షులతో యుద్ధమునకు దిగినాడు. కాని, అతని తాత అయిన మనువు, అది తగదని చెప్పుటవలన, అత డా ఉద్యమమును విరమించుకొనుట జరిగినది.

అది గ్రహించిన కుబేరుని హృదయము ప్రసన్నమైనది. ఆ వెంటనే, అతడు, ధ్రువుని సమీపించి, 'ఏదైన వరమును కోరుకొనవలసిన'దనినాడు. కాని, మహాత్ముడైన ధ్రువుడు, నీ పట్ల దృఢతరమైన భక్తినిమాత్రమే కోరి, దాని నతనినుండి పొందినాడు.

11. కాలక్రమమున, అతనికి మరణకాల మాసన్నమైనది. దేవతలు తెచ్చిన ఒక దివ్య విమానము నధిరోహించి, అతడు, తన తల్లితోకూడ పోయిపోయి, ధ్రువపదమును(5) చేరుకొనినాడు. ఈనాటికిని అచ్చటనే ఉన్నాడు.

కృష్ణా ! నీవు, భక్తసంరక్షణమున కువ్విళులూరుచుందువుకదా ! నా జాడ్యములను నివారించి నన్నేల రక్షింపవు నాయనా !

అర్థము - వివరణ

(1) ప్రారబ్ధము : పూర్వజన్మలలో సలిపిన పుణ్యపాప కర్మలనుండి (సంచితము నుండి) యీ జన్మలో అనుభవించుటకు నిర్దిష్టమైనది -

(2) మంత్రోపదేశ మొనర్చుటయు : 'ఓమ్ నమో భగవతే వాసుదేవాయ' అనునదే ఆ మంత్రము.

(3) ఉగ్రతపశ్చర్య : మొదటి నెలలో మూడురోజుల కొకసారి ఫలములను మాత్రమే భుజించుచు, రెండవ నెలలో ఆరు రోజుల కొకసారి ఎండుటాకులను గడ్డిని మాత్రమే గ్రహించుచు, మూడవ నెలలో తొమ్మిది రోజుల కొకమారు మంచినీటిని మాత్రమే త్రావుచు, నాల్గవ నెలలో పన్నెండు రోజుల కొకసారి గాలిని మాత్రమే పీల్చుకొనుచు, ఐదవ నెలలో నిరాహారిగ ఉండి ఉచ్ఛ్వాస నిశ్వాసలను బంధించుకుని కాలి బొటనవ్రేలిమీద నిలబడియు అతడు తపమాచరించినట్లు భాగవతము తెలుపు చున్నది.

(4) పునరావృత్తిలేని : (దశ. 15 - వివ. 9. చూడుము.)

(5) ధ్రువపదము : ప్రళయ సమయమునకూడ చలించుటెరుగని సుస్థిర స్థానము.

18. పృథు చరితం

1. ధ్రువుని వంగడమున జనించినవాడు అంగుడు. అతడు దోష రహితుడు; సుప్రసిద్ధుడు. అతనికి వేనుడను కుమారుడు కలడు.

ఆ వేనుడు, దుష్టచిత్తుడై వ్యవహరించుచుండువాడు. అది, అంగ మహారాజునకు అమిత వేదన కలిగించినది. అది కారణముగనే, ఆయన, ఆత్మశాంతి కొరకు, నీ చరణాబ్జముల నాశ్రయించి, వనాంతరముల కేగుట సంభవించినది.

2. అత డట్లు వనాంతరముల కేగిన పిమ్మట, వేనుడు దుర్మార్గుడని తెలిసికూడ, ప్రజ లతనికే పట్టము కట్టినారు.

ఆ పైన, వేనుడు, తన పరాక్రమమును ప్రకటించుకొనుచు, నీ పేరట జరుగు యజ్ఞ యాగాదు లన్నిటిని నిషేధించినాడు.

3. అది గ్రహించిన మహర్షులు, అతనికి హితోపదేశ మొనర్చు నిమిత్తము, ఒకసారి అతనిని కలుసుకొనినారు. ఆ సమయమున, అతడు నిన్ను కించపరచు మాటలతో, 'భూమండలమున నన్ను మించిన ప్రభుడు లేడు' అని వారికి తెలియపరచినాడు.

కర్ణకఠోరమైన ఆ పలుకులు, మహర్షులకు, అమితమైన ఆగ్రహమును కలిగించినవి. అది కారణముగ, వా రతనిని శపించుటయు, అతడు మరణించుటయు జరిగినది.

4. వేనుని మరణానంతరము, దేశ మరాజకమైనది. రాజ్యమం దంతటను రాక్షసగణము తాండవింపసాగినది. అది గ్రహించి భీతిల్లిన మహర్షులు, అంతవరకు, అతని తల్లిఅయిన సునీథవద్ద సురక్షితముగఉన్న

అతని కళేబరమును తీసుకుని, దాని ఉపభాగమును మథించినారు. దానితో ఆ కళేబరము పునీతమైనది. ఆ పైన వారు, ఆ కళేబరమునందలి భుజములను మథించుట జరిగినది. తత్ఫలితముగ, మహానుభావుడవైన నీవు, పృథువు రూపమున నావిర్భవించినావు.

5. ఆ సమయమున, పృథు మహారాజుగా ప్రసిద్ధుడవైయున్న నీ పరాక్రమమును, మహర్షుల ఉపదేశానుసారము, సూతాదులు బహు విధముల ప్రశంసించినారు. ఆ పైన, నీవు, వేనుని అత్యాచారములకు భయపడి అంతవరకు తన ఐశ్వర్యమునంతను తనయందే గుప్తపరచుకొని యున్న భూమాతను అనునయించి, ఆమెకు ఆనందమును కలిగించి, సాదరముగ ఆమెను స్వాధీనపరచుకొనినావు.

6. ఆ విధముగ నీకు స్వాధీనమైన భూమాత, ఆ పైన, గోరూపము ధరించినది. ఆమెయే సురభి. ఆమెనుండి, దేవతాగణము, తమతమ గణ నాయకులను దూడలుగా చేసుకుని, వారి వారి అంతస్తులకు ఉచితమైనవీ, పరిశుద్ధమైనవీ అగు పాత్రలలో, యెవరి వాంఛితార్థములను వారు, యథేచ్ఛగ పిదుకుకొనుట జరిగినది. అదంతయు నీ సంకల్పమే కదా ప్రభూ !

7. పృథు మహారాజు రూపముననున్న నీవు, నీ సంతృప్తికొరకు, ఆ కాలమున అనేక యాగము లొనర్చినావు. వాటిలో నూరవది అయిన అశ్వమేధము జరుగుచుండగా, ఇంద్రునకు నీ పట్ల అసూయ జనించినది. అప్పుడతడు, కపట వేషమున అక్కడికివచ్చి, యాగాశ్వము నపహరించు కుని పోవుటకు ప్రయత్నించినాడు; కాని, నీ కుమారుడతని ఉద్యమమును భంగపరచినాడు.

8. ఐనను, ఇంద్రుడు, తన దురుద్యోగమును విరమించుకొనలేదు. యాగాశ్వము నపహరించుకొనిపోవుటకు, అతడు, పదేపదే ప్రయత్నించి

నాడు. అది గ్రహించిన మహర్షులు ఆగ్రహపరవశులై, తమ ముందున్న హోమకుండములలో ఆ ఇంద్రునే ఆహుతిగా వ్రేల్చుటకు సంకల్పించుకొనినారు. కాని, ఆ సంకల్పము నెరింగిన చతుర్ముఖుడు, వారిని వారించుట జరిగినది.

అటుపిమ్మట, యాగము నిర్విఘ్నముగ ముగిసినది. ఆ సమయమున, నీవే అయిన ఆ పృథు మహారాజు సముఖమున నీవు, నీ నిజ రూపమున సాక్షాత్కరించినావు.

9. ఆ విధముగ సాక్షాత్కరించిన నీవు, ఆ మహారాజునకు, ఆయన కోరికమీద, అనన్య భక్తిని(1) ప్రసాదించినావు.

అనంతరము, ఆ మహారాజు, గంగాతీరమున మరొక యజ్ఞమునకు సన్నాహము లొనర్చుచుండుట నెరిగి, పలువురు మునిశ్రేష్ఠులు అచటకు విజయము చేసినారు. పృథుమహారాజు వారలకు ధర్మోపదేశము చేయుచున్న సమయమున, ఆయనకు, సనకాది మహర్షుల(2) దర్శనమైనది.

10. ఆ సనకాదుల ద్వారా, ఆత్మజ్ఞానోపదేశమునందిన పృథు మహారాజు, ఆ పైన, వనాంతరములకేగి, తపశ్చర్యలో నిమగ్నుడైనాడు; కాలక్రమమున, బ్రహ్మీభూతుడైనాడు.(3)

పృథు రూపమున నవతరించిన పరమేశ్వరా ! కృష్ణా ! నన్ను పీడించుచున్న రోగ సమూహమును శీఘ్రముగ నిర్మూలింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) అనన్య భక్తిని : (దశ. 3 - వివ. 7. చూడుము.)

(2) సనకాది మహర్షులు : (దశ. 11 - వివ. 1. చూడుము.)

(3) బ్రహ్మీభూతుడైనాడు : పరమాత్మునిలో లీనమైనాడు.

19. ప్రాచేతస కథానువర్ణనం

1. పృథుమహారాజు మునిమనుమడు ప్రాచీన బర్హి. ధర్మాచరణము నందును, కర్మాచరణమునందును, అతడు, పృథుమహారాజంతవాడు.

ప్రాచీనబర్హి చిన్నభార్య పేరు శతద్రుతి. అతనికి ఆమెయందు, ప్రాచేతసు లనబడు కుమారు లుదయించినారు. వారందరును పరిశుద్ధ చిత్తులే; నీ దయాంకురములే.

2. ప్రజాసృష్టియందు అత్యంతాభిమానముగల ప్రాచీన బర్హి, ఆ సృష్టికార్యమునందు తనకు తోడ్పడవలసినదిగ కుమారుల నాదేశించినాడు. అతని ఆదేశమును శిరసావహించి, ఆ పదిమంది కుమారులును, నిన్ను గురించి తపమాచరించు తలంపుతో, పశ్చిమ సముద్ర తీరమునకు చేరు కొనినారు. అక్కడ, వారి కొక రమణీయ సరోవరము గోచరించినది.

3. ఆ సరోవర మొక తీర్థరాజము. నీ పరమభక్తుడైన శంకరుడు, నీ భక్తులే అయిన ప్రాచేతసులను అక్కడ కలుసుకుని, వారికి, నిన్ను స్తుతించు మార్గమును బోధించినాడు.

4. ప్రాచేతసులు, ఆ పైన, ఆ నీటిలో నిలబడి, నిన్ను స్తుతించు కొనుచు, పదివేల సంవత్సరములు గడపినారు. స్తోత్రమునందే వారి మనసు లగ్నమై ఉండుటవలన, నీ దర్శనభాగ్యము వారికి, ధ్రువునకువలె, అచిర కాలమున లభ్యము కాలేదు.

5. ప్రాచీనబర్హి భగవద్భక్తుడే; కాని, హింసాత్మకమైన క్రతువుల నాచరించుచుండువాడు. అయినను, అతని కుమారులైన ప్రాచేతసులు తీవ్ర తపస్సంపన్ను లగుటవలన, అతడు పవిత్రీభూతుడైనాడు. దానికి తోడుగ,

నారదు డతనికి ఆత్మజ్ఞానము నుపదేశించుటకూడ జరిగినది. అది కారణ ముగ, అతడు సాయుజ్యముక్తి[1] నందినాడు.

6. అనంతరము, నీవు, ఎనిమిది చేతులలోను ఎనిమిది దివ్యాయుధ ములను ధరించి, గరుడవాహనారూఢుడవై, పోయి, మహాద్భుత తేజముతో, ప్రాచేతసులకు దర్శన మిచ్చినావు. అది, నీ కృపావిశేషమేగదా ప్రభూ !

7. అప్పుడుకూడ, వారు, ని న్నేమియు అర్థింపలేదు. అయినను, నీవు వారిని కరుణించి, వారిని తలచుకొనినవారికి సర్వశుభములు చేకూరు నట్లును, రుద్రునిద్వారా వారికి లభించిన నీ స్తోత్రరాజము[2] సర్వాభీష్ట ప్రదాయిని అగునట్లును వరమొసంగినావు.

8. దానితో తృప్తిపడక, 'వృక్షపుత్రి అయిన మారిష[3] మీకు భార్య కాగలదు. ఆమెతో మీరు పదిలక్షల సంవత్సరములు సుఖోపభోగము లనుభవింపగలరు. దక్షు డనువాడు, మీకు కుమారుడుగా జన్మింపగలడు. అనంతరము, మీరు, నన్ను చేరుకొనగలరు' అనికూడ వారికి తెలియపరచి నావు; వారిని ఆశీర్వదించినావు.

9. ఆ పైన, ప్రాచేతసులు, భూమి నావరించియున్న వృక్షములపై క్రోధము వహించి, వాటిని తగులపెట్ట సాగినారు. కాని, చతుర్ముఖుడు, వారిని, ఆ దురుద్యోగమునుండి వారించినాడు.

అటుపిమ్మట, వృక్షములు, తమ కుమార్తెను వారికిచ్చి వివాహము చేయుటయు, వారు, ఆమెతో, నీవు నిర్దేశించినంతకాలము, సుఖజీవితమును గడుపుటయు జరిగినది.

10. ఆ కాలమున, వారికి, దక్షు డను కుమారుడు జన్మించినాడు. ఆ పైన, వారు, అనేక యజ్ఞము లాచరించి, నారదమహర్షి ప్రసాదించిన జ్ఞానముద్వారా, పరమానంద స్వరూపుడవైన నిన్ను చేరుకొనినారు.

కృష్ణా ! నా రోగము లన్నిటిని నిర్మూలించి, నాకును అట్టి పరమానంద ప్రాప్తిని కలిగింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) సాయుజ్యముక్తి : పరబ్రహ్మముతో తాదాత్మ్యమునందుట -

(2) నీ స్తోత్రరాజమును : 'రుద్రగీత'గా ప్రసిద్ధినందిన స్తోత్రమును - దీనిని పఠించుటకు అందరును అర్హులే.

(3) మారిష : కండు మహర్షికీ, ఆతనిని వంచించుటకు మహేంద్రునిచే పంపబడిన ప్రమ్లోచ అను అప్సరోంగనకూ జనించినది. ఈమె పుట్టిన వెంటనే, యీమె తల్లి, యీమెను ఒక వనమున వదలి దేవలోకమునకు వెళ్ళిపోయినది. అది కారణముగ, ఈమెను వనరాజు పెంచుటయు, వృక్షము లీమెను తమ కుమారితగా భావించికొనుటయు సంభవించినది.

పూర్వజన్మమున, యీ మారిష, తీవ్రతప మాచరించి, పదిమందికి ఏకకాలమున ధర్మపత్నియగునట్లు ఒక వరమును కోరి పొందినదగుటచే, ఈ జన్మమున, పదిమంది ప్రాచేతసులకు భార్యయగుట జరిగినది.

20. ఋషభ చరితం

1. ప్రియవ్రతుని ప్రియపుత్రుడైన ఆగ్నీధ్రునకు(1) సుప్రసిద్ధుడైన నాభి(2) జనించినాడు. ఆయన, నిన్ను సంతుష్టిపరచుటకు ఒక క్రతువు నారంభించి, ఆ క్రతుసమయముననే, వరప్రదాతవైన నిన్ను దర్శించుకొనినాడు.

2. ఆ సమయమున, ఆ మహారాజునకు నీ అంతవాడు ఒక కుమారుడు కలుగునట్లు ఆశీర్వదింపవలసినదిగ, అచటి మునీశ్వరులు నిన్ను వేడికొనినారు. విశ్వరూపుడవైన నీవు, వారి ప్రార్థనను మన్నించి, 'నేనే ఆయనకు కుమారుడ నయ్యెదను' అని వాగ్దానము చేసినావు; ఆ వెంటనే, యాగాగ్నిలో, అంతర్హితుడవైనావు.

3. అనంతరము, నాభి మహారాజు దేవేరి అయిన మేరుదేవికి, నీ అంశతో, నీవే కుమారుడవై జన్మించినావు. అప్పుడు, మహర్షులు, నీకు, ఋషభు డని పేరుపెట్టినారు. ఆ పైన, నీవు, నీ అసాధారణమైన మేలిగొనములద్వారా, అనన్యమైన నీ శక్తి సామర్థ్యములద్వారా, ప్రజలందరకును పరమానందము కలిగించినావు.

4. అటు పిమ్మట, తన రాజ్యభారమునంతను, నీ రూపమే అయిన ఋషభునకు ఒప్పగించి, తపమాచరించికొను నిమిత్తము, నాభి మహారాజు, మేరుదేవితోసహ వనాంతరముల కేగినాడు. అక్కడ, నిన్నే భజించుకొనుచు, కాలక్రమమున, పరమానంద నిలయమైన నీ దివ్యధామమును చేరుకొనినాడు.

5. నీ పాలనలో, ప్రజా సౌభాగ్యము, మూడు పూవులు ఆరు కాయలుగా విలసిల్లినది. అది గ్రహించి అసూయ వహించిన ఇంద్రుడు, ఒకసారి, నీ రాజ్యమైన అజనాభ వర్షమునందు వర్షాభావము కల్పించినాడు.

కాని, ఋషభ మహారాజు రూపముననున్న నీవు. నీ యోగబలముద్వారా, వర్ష సమృద్ధిని కలిగించి, ప్రజానీకమును రక్షించినావు.

6. నీవు సహజముగ ఆత్మారాముడవే[3] అయినను, నీ వలన పరాజితుడైన ఇంద్రుడు సమర్పించుకొనిన జయంతి అను కన్యారత్నమును ధర్మపత్నిగా స్వీకరించి, ఆమెయందు నూరుగురు కుమారులను బడసినావు. వా రందరిలోను, రాజన్యశ్రేష్టుడుగా ప్రసిద్ధుడైన భరతుడు జ్యేష్టుడు.

7. అతని తమ్ములు తొంబది తొమ్మిదిమందిలోను, తొమ్మిదిమంది యోగులైనారు. తొమ్మిదిమంది, భారత వర్షమునగల తొమ్మిది ప్రాంతముల కును పాలకులైనారు. మిగిలిన ఎనభైఒక్కమంది, తమ తపోబలము ద్వారా, బ్రహ్మణ్యులైనారు.[4]

8. కాలక్రమమున, ఋషభదేవుడు, మునీశ్వరుల సముఖమున, భరతుడు మున్నగు తన కుమారులకు, విరక్తితోను భక్తితోను మిళితమైన ముక్తిమార్గమును బోధించినాడు. ఆ పైన, పరమహంస స్థితి[5]ని పొంది, తాను, జడుని మాదిరి, ఉన్మత్తుని మాదిరి, పిశాచము మాదిరి, వ్యవహరింప సాగినాడు.

9. ఆ స్థితిలో ఉండికూడ, సత్కార తిరస్కారములను గణింపని అవధూత మార్గమున నుండికూడ, ఆయన, తన్ను ఆశ్రయించినవారికి ఆత్మజ్ఞానము నుపదేశించుచు, ఆ పైన, భూమండలమునం దంతటను యథేచ్ఛావిహార మొనర్చినాడు.

10. ఆ సమయమున, ఆయన, చాలకాలము, అజగరవ్రతము[6] నవలంబించినాడు. ఆ పైన, ఆవులు లేళ్ళు కాకులు జీవించు పద్ధతి[7] ననుస రించినాడు. అనంతరము, పరమాత్మస్వరూపము నంది, కుటకాచల ప్రాంతమునగల ఒక అరణ్యమున ప్రవేశించి, అక్కడ జనించిన వన వహ్నికి ఆహుతి అయిపోయినాడు.

వాతనాథా ! కృష్ణా ! నా వాతరోగమునుకూడ ఆ విధముగ భస్మీక
రింప వలసినది తండ్రీ !

అర్థము - వివరణ

(1) ఆగ్నీధ్రుడు : ప్రియవ్రతునకును బర్హిష్మతికిని తొలుదొల్త పుట్టినవాడు.

(2) నాభి : ఆగ్నీధ్రునకు పూర్వచిత్తి యను అప్సరోంగనయందు జనించినవాడు.

(3) ఆత్మారాముడవే... : (దశ. 1 - వివ. 20. చూడుము.)

(4) బ్రహ్మణ్యులైనారు : తప మాచరించి బ్రాహ్మణత్వము పొందినారు.

(5) పరమహంస స్థితి : ప్రపంచముతో యెట్టి సంబంధమును లేని, సర్వదా పరమాత్మునియందే లీనమై ఉండు సర్వోత్కృష్ట స్థితి.

(6) అజగర వ్రతము : కొండచిలువవలె జీవించుట.

కొండచిలువ ఆహారమునకై వెదకులాడదు. ఎప్పు డేది లభించిన అది మ్రింగుటయె దానిపని; రుచికొరకు నమలి తినుటలేదు. ఆహారము దొరుకనప్పుడు అది విచారపడదు. ఉన్నచోటనే తిని, తిన్నచోటనే మల మూత్ర విసర్జన మొనర్చు కొనుట దాని లక్షణము. ఎవ రెంతగ బాధించినను అది సామాన్యముగ కదలదు; ప్రాణాపాయస్థితియందు కూడ భీతి చెందదు.

(7) ఆవులు లేళ్లు కాకులు జీవించు పద్ధతి : ఆవులు, గ్రామములయందు, ఎవరు పోషించిన వారి యింట నివసించును. మృగములు వనముల యందు సంచరించుచుండును. కాకులు గ్రామములందును వనములందునుకూడ వసించుచుండును.

—అట్లుండుట సిద్ధపురుషుల లక్షణము.

21. ఉపాసనా విధానములు

1. భూమధ్యమున 'ఇలావృత'(1) మనబడు ఒక ప్రదేశమున్నది. అందుండువా రందరును స్త్రీలే. వారిలో, పార్వతి ప్రసిద్ధురాలు.

అచట ఉండు పురుషుడు శంకరుడు మాత్రమే. ఆయన, సంకర్షణ రూపముననుండు నిన్ను, వేదమంత్రములద్వారా, స్తోత్రములద్వారా ఉపాసించుచున్నాడు ప్రభూ! ఆ నీ సంకర్షణ రూపమును నేను శరణుగోరుచున్నాను.

2. ఇలావృత వర్షమునకు తూర్పు భాగమున భద్రాశ్వనామక వర్షమున్నది. అక్కడ, నీవు, హయగ్రీవ రూపమున విరాజమానుడవై ఉన్నావు. ప్రళయార్ణవమున కొట్టుకుపోయిన వేదరాశిని ఉద్ధరించుటలో నీవు మంచి నేర్పుగలవాడవు. అట్టి నిన్ను, భద్రశ్రవసులను మహర్షులు వేనోళ్ళ వినుతించుచుందురు. ఆ నీ రూపమును నేను ధ్యానించుకొనుచున్నాను ప్రభూ!

3. ఇలావృత వర్షమునకు దక్షిణ భాగముననుండు హరివర్షనామక ప్రదేశమున, నరసింహాకృతిలో, ఉన్నతము ప్రశాంతము ఉజ్వలము అయిన నీ మూర్తి ఉన్నది. అక్కడ, నీవు, నిన్నాశ్రయించినవారికి, అద్వితీయమైన పరిశుద్ధ జ్ఞానమును ప్రసాదించుచుందువు. అట్టి నిన్ను, ప్రహ్లాదుడు మున్నగువారు సేవించుకొనుచుందురు. ఆ నీ రూపమును నేను ధ్యానించుకొనుచున్నాను.

4. ఆ ఇలావృతమునకు పశ్చిమ దిశలో, 'కేతుమాల' అను ఒక సుందరప్రదేశ మున్నది. శ్రీ మహాలక్ష్మికి ఆనందము నొడగూర్చు నిమిత్తము, నీవు, అక్కడ, మన్మథుని రూపమున విలసిల్లుచుందువు. అచటి

నీ మూర్తి, నీ లీలావిశేషములచే రమణీయమును, మందస్మితముచే సుశోభితమును అయి ఉన్నది. ఆ మూర్తిని, శ్రీ మహాలక్ష్మియు ప్రజాపతి కుమారులును సర్వదా సేవించుకొనుచుందురు. తండ్రీ! నేను దానిని ఉపాసించుకొనుచున్నాను.

5. ఇలావృతమునకు ఉత్తర భాగమున, 'రమ్యక'మను ఒక రమ్య ప్రదేశమున్నది. అక్కడ, నీవు, మత్స్యరూపమున ప్రకాశించుచుందువు. భక్తుల ననుగ్రహించుచుందువు. మాత్సర్యరహిత హృదయములలో భాసించుచుందువు. అట్టి నిన్ను, ఆ ప్రాంతమున కధిపతి అయిన వైవస్వతమనువు, సర్వదా భజించుకొనుచుండును. విశ్వనాథా! నేనును అట్లే చేయుచుందును.

6. రమ్యకమునకు ఉత్తర భాగముననుండు హిరణ్మయ నామక వర్షమున, నీవు, మందరాచలము నవలీలగ యెత్తిన కూర్మరూపమున ప్రత్యక్షమై ఉన్నావు. పితృగణమున శ్రేష్ఠుడగు అర్యముడు నిన్నచట నిత్యము సేవించుకొనుచుండును. విశుద్ధ జ్ఞానస్వరూపుడవైన నిన్ను, నేనును ఆ రూపమున సేవించుకొనుచున్నాను తండ్రీ!

7. స్వామీ! ఉత్తర కురు భూమిలో, విజ్ఞులచే స్తుతింపబడు యజ్ఞ వరాహమూర్తివై నీవు సాక్షాత్కరించియున్నావు. అక్కడ, నీవు, నీ దంష్ట్రాగ్రముచే మేఘములను చూర్ణము చేయగలంత ఉన్నతాకారమున శోభించుచుందువు. ఆ నీ మూర్తిని, నీ దేవేరి అయిన భూదేవి, మహిమాన్వితములైన మంత్రములతోను, అర్థవంతములైన వివిధ స్తోత్రములతోను ఉపాసించుకొనుచున్నది. ఆ రూపమును నేనును ఉపాసించుకొనుచున్నాను నాయనా! నన్ను కాపాడవలసినది.

8. దక్షిణ దిశయందున్న కింపురుష సీమలో, మహాద్భుతమైనదీ, సీతామాతకు ప్రమోదము నొడగూర్చునదీ అయిన రూపమున, శ్రీరామచంద్రుడవై విలసిల్లుచున్నావు. అక్కడ, నిన్ను, అచంచల భక్తిగల

హనుమంతుడు సేవించుకొనుచున్నాడు. రామచంద్రుని రూపముననున్న స్వామీ ! నన్ను రక్షింపవలసినది.

9. ప్రభూ ! నీవు, భరతఖండమున, నరసఖుడవైన నారాయణుడ వుగ అవతరించినావు. ఇక్కడ, నీవు, సాధుజన సంరక్షణార్థము, కల్పాంతమువరకు ఉందువు. సాంఖ్యయోగము ననుసరించిన స్తోత్రములద్వారా, నారదాది మహర్షులు, ని న్నిచట ఉపాసించుకొనుచుందురు. నేనుకూడ నిన్ను ఉపాసించుకొనుచున్నాను నాయనా ! నన్ను కరుణించవలసినది; కాపాడవలసినది.

10. భగవన్ ! ప్లక్షద్వీపమునందు సూర్యుని రూపమున, శాల్మల ద్వీపమునందు చంద్రుని రూపమున, కుశ ద్వీపమునందు అగ్ని రూపమున, క్రౌంచ ద్వీపమునందు జల రూపమున, శాకద్వీపమందు వాయురూపమున, పుష్కర ద్వీపమునందు బ్రహ్మరూపమున ప్రజలు నిన్ను ఉపాసించుకొను చున్నారు.

11. క్షీరసాగర శయనా ! మహాపురుషులు, నిన్ను ఒక మొసలి రూపమున సంభావించుకుని, ఆ శరీరమునందలి వివిధావయవములందును, అశ్వినీత్యాది నక్షత్రములను(2), మీన మేషాది రాశులను(3), ధ్రువేత్యాది మండలములను, సూర్యాది గ్రహములను(4) కల్పించుకుని, నిత్యము, త్రికాలములయందును ఉపాసించుకొనుచు, కృతార్థులగుచున్నారు. అట్టి నీవు, నీ భక్తుడనైన నన్ను కృతార్థుని చేయలేవా తండ్రీ !

12. స్వామీ ! గురుపవనపురాధిపా ! పాతాళమునందు, నీవే అయిన ఆదిశేషుడు విరాజమానుడై ఉన్నాడు. అతనికి వేయి పడగ లున్నవి. ఒకే ఒక కుండలమున్నది. అతడు, నీలాంబరధారియై శోభించు చున్నాడు. అతని హస్తమున, హలరూపమున నొక ఆయుధమున్నది. నాగకాంత లతని నచట సేవించుకొనుచుందురు. కృష్ణా ! అట్టి నీ మూర్తిని

నేనును భజించుకొనుచున్నాను. నా రోగములను నిర్మూలింపవలసినది నాయనా !

అర్థము - వివరణ

(1) ఇలావృతము : లవణ ఇక్షు సుర సర్పి దధి క్షీర ఘృత ఉదక సముద్రము లనబడు సప్త సముద్రముల మధ్యనున్నవి ఇలావృత రమ్యక హిరణ్మయ కురు హరి కింపురుష భరత భద్రశ్రవ కేతుమాల అను పేర్లు గల సప్త ద్వీపములు. ఆ ఏడు ద్వీపముల నడుమనున్నది జంబూ ద్వీపము. అది ఎనిమిది పర్వతములచే విభజింపబడి తొమ్మిది భాగములుగ ఉన్నది. ఆ తొమ్మిదింటి నడుమ నున్నది ఇలావృతము.

(2) అశ్వినీత్యాది నక్షత్రములు : అశ్విని భరణి కృత్తిక రోహిణి మృగశిర ఆర్ద్ర పునర్వసు పుష్యమి ఆశ్లేష మఖ పుబ్బ ఉత్తర హస్త చిత్త స్వాతి విశాఖ అనూరాధ జ్యేష్ఠ మూల పూర్వాషాఢ ఉత్తరాషాఢ శ్రవణ ధనిష్ఠ శతభిష పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర రేవతి అనునవి.

(3) మీన మేషాది రాశులు : మీనం మేషం వృషభం మిధునం కర్కాటకం సింహం కన్య తుల వృశ్చికం ధనస్సు మకరం కుంభం.

(4) గ్రహములు : సూర్యుడు చంద్రుడు అంగారకుడు బుధుడు బృహస్పతి శుక్రుడు శని రాహువు కేతువు.

22. అజామిళోపాఖ్యానం

1. పూర్వము, అజామిళుడను ఒక బ్రాహ్మణుడు, గృహస్థాశ్రమ ధర్మములను యథావిధిగ నిర్వర్తించుకొనుచు, భక్తితో నిన్ను ఉపాసించు కొనుచుండువాడు. అత డొకసారి, తన తండ్రి ఆదేశానుసారము, ఒక అరణ్యమునకు పోవుట సంభవించినది. అక్కడ, ఆతనికి, లజ్జాభిమానములు లేనిదియు, కామవికారములు కలదియు అయిన ఒక కులట కనిపించినది.

2. అతడు, స్వభావ సిద్ధముగ నిశ్చల మనస్కుడే. అయినను, ఆమె అతని మనసు నాహరించుకొనినది. అది కారణముగ, అతడు, ధర్మమును విసర్జించినాడు; అధర్మము నాశ్రయించినాడు. ఆమెతో, కొంగ్రొత్త జీవితమును ప్రారంభించినాడు.

కాలక్రమమున, నతనికి వృద్ధాప్యము వచ్చినది. వృద్ధాప్యము వృద్ధి అయినకొలది, అతని సంతానముపట్ల అతనికిగల అనురాగము అతిశయింప జొచ్చినది. ఆ విధముగ అతిశయించిన అనురాగము, అతని కనిష్ఠపుత్రుడైన నారాయణునిమీద నిలచిపోయినది.

3. ఆ అజామిళుడు, మరణశయ్యమీద ఉన్నపుడు, ముగ్గురు యమభటులు, అతని కట్టెదుట కనిపించినారు. వారిని చూడగనే అతడు భయముతో కంపించిపోయినాడు. 'నారాయణా!' అని ఎలుగెత్తి అరచినాడు. అత డా సమయమున, తన కుమారుని ఉద్దేశించి అయినను, నీ నామమును స్పష్టముగ ఉచ్చరించుటకు, అతని పూర్వపుణ్యమేకదా కారణమైనది!

4. 'నారాయణ' అను దివ్యాక్షరములు అతని నాలుకమీద ఉండగనే, చతుర్భుజులు, పీతాంబరధారులు, రమ్యమూర్తులు అయిన నీ పార్షదులు అక్కడ ప్రత్యక్షమైనారు.

5. అజామిళుని మెడలో పాశమును వేసి లాగుకొనిపోవుచున్న యమకింకరులను చూసి, నీ దూతలు, 'ఇతనిని వదలిపెట్టవలసినది!' అని గంభీరముగ పలికినారు; వారిని నిరోధించినారు. ఆ విధముగ వారిచే వారింపబడిన యమభటులు, ఆ పైన, అజామిళుడు ఆచరించిన పాప కృత్యముల నన్నిటిని నీవారికి వివరించుట జరిగినది.

6. వారు చెప్పినదంతయు విని, నీ అనుచరులు, వారిని ఉద్దేశించి, 'ఇతడు అనేక పాపములు చేసి ఉండవచ్చును. అయినను, వాటికి తగిన ప్రాయశ్చిత్తము చేసికొనినాడు. ప్రాయశ్చిత్తము చేసికొనిన వారికి వేరు దండనము లేదుగద!' అని సమాధాన పూర్వకముగ అనినారు. 'దండనీతిపారగులైన మీకు, ప్రాయశ్చిత్త స్వరూపము అనూహ్యమెట్లైనది ?' అని ప్రశ్నించినారు.

7. ఆ పైన వారు, ఆ కింకరులకు ఇట్లు ఉపదేశించుట జరిగినది :

"వేదములద్వారా, ధర్మశాస్త్రముల ద్వారా వెలువరింపబడు వ్రత నియమాదులు, చేసిన పాపములను క్షీణింపజేయగలవేగాని, పాప వాసనలను నశింపజేయలేవు. శ్రీహరి సేవ అట్టిదికాదు. అది, పాపముతో పాటు పాప వాసనలను సైతము నిర్మూలింపగలదు.'

8. 'ఈ అజామిళుడు, తను, ఈ జన్మలోచేసిన పాపములకే కాదు; పూర్వము, అనంతకోటి జన్మలలో సలిపిన పాపములకు కూడ ప్రాయశ్చిత్తము చేసికొనినాడు. 'అది యెట్లు జరిగినది' అని మీరు ఆశ్చర్య పడుచుండవచ్చును. అంతిమ క్షణములలో, మీ మూలమున కలిగిన భీతితో అయినను, అతడు, హరినామము నుచ్చరించినాడు. ఎట్టి పాపాత్మునకైనను, అంతకు మించిన ప్రాయశ్చిత్తము వే రేమున్నది ?'

9. 'మానవులు, బుద్ధి పూర్వకముగ కాకపోయినను, శ్రీహరివైన దివ్యనామములను ఉచ్చరించుట సంభవించెనేని, వారి పాపములన్నియు,

అగ్నిలోపడిన ఇంధనములవలె, ఔషధము సేవించినవారి జాడ్యములవలె నశించిపోగలవు."

10. ఆ విధముగ ఉపదేశింపబడిన యమదూతలు నిష్క్రమించిన మీదట, నీ అనుచరులు తిరోహితులైనపిమ్మట, అజామిళుడు, నిన్నే భజించు కొనుచు, కొంతకాలము గడపినాడు; ఆ పైన, నీ పార్షదులద్వారా[1] నీ దివ్య ధామమునకు[2] గొనిపోబడినాడు.

11. అజామిళుని విషయములో జరిగినదంతయు తన భటుల మూలమున గ్రహించిన యమధర్మరాజు, 'భక్తాపరాధము[3] జరిగినదే' అను భీతితో, తనవారి నుద్దేశించి, 'ఇక మీద, మీరు, భగవద్భక్తులను సమీపింపరాదు,' అని, కఠోరముగ శాసించినాడు.

భక్తవత్సలా! కృష్ణా. నన్నును నీ భక్త శ్రేణిలో చేర్చుకొనుము తండ్రీ!

అర్థము - వివరణ

(1) పార్షదులు : విష్ణు దూతలు.

(2) దివ్యధామము : వైకుంఠము.

(3) భక్తాపరాధము : భక్తులపట్ల జరిగిన దోషము.

23. దక్షాదుల చరిత్రలు

1. బ్రహ్మమానస పుత్రుడుకాక, వేఱొక దక్షు డున్నాడు. అతని తండ్రిపేరు ప్రచేతసుడు. అతనికి సృష్టికార్యమునందు అభిలాష కలిగినది. అది కారణముగ, అతడు నిన్ను ఉపాసించినాడు. అప్పుడు, నీవు, అష్ట భుజములతో శోభించుచు, అతనికి ప్రత్యక్షమై, అతడు కోరిన వరముతో పాటు, 'అసిక్ని' అను భార్యనుకూడ ప్రసాదించినావు.

2. ఆ దక్షునకు, పదునొకండువేలమంది కుమారులు కలిగినారు. వా రందరును, నారదునివలన ఉపదేశమునంది, ముక్తిమార్గావలంబులగుట జరిగినది. అది కారణముగ, దక్షుడు ఆగ్రహించుకుని, 'నీకు స్థిరనివాస మనునది లేకుండుగాక !' అని ఆయనను శపించినాడు. భక్తజన శిరోమణి అయిన నారదుడు, ఆ శాపమును వరమునువలె స్వీకరించినాడు.

3. అనంతరము, దక్షుడు, తన అరువదిమంది కుమార్తెలద్వారా, అనంత జీవరాశిని సృజింపసాగినాడు. ఆ విధముగ జనించినవాడే, అతని దౌహిత్రుడైన విశ్వరూపుడు.[1]

ఆ విశ్వరూపుడు, నిన్ను స్తుతించుటద్వారా లభించిన ఒక కవచ మును[2] ఇంద్రునకు ప్రసాదించినాడు. ఆ కవచప్రభావము వలననే, ఇంద్రుడు, దేవ దానవ సంగ్రామమున విజయమును సాధించుకొనుట జరిగినది.

నీ అనుగ్రహ మున్నవారికి అసాధ్య మేముండును ప్రభూ !

4. పూర్వము, శూరసేన దేశమున, చిత్రకేతుడను ఒక మహారాజు ఉండెడివాడు. అతనికి చిరకాలమునకు, అంగిరస మహర్షి అనుగ్రహమున, ఒక కుమారుడు కలిగినాడు. కాని, ఆ బాలుని, అతని సవతితల్లులే చంపి

వేసినారు. అది కారణముగ, ఆ చిత్రకేతు మహారాజు, దుఃఖసాగరమున మునిగిపోవుట సంభవించినది. అదియును నీ మాయా ప్రభావమే కదా!

5. ఆ సమయమున, దయాళువైన నారద మహర్షి, అంగిరసునితో సహా ఆ మహారాజును సమీపించి, అతని కుమారుని ఆత్మను అతని సముఖమున ఉంచినాడు.

ఆ విధముగ తిరిగివచ్చిన జీవుడు, ఆ మహారాజు నుద్దేశించి, 'నేను నీ కుమారుడనా ?' అని ప్రశ్నించినాడు. ఆ పలుకులు వినిన చిత్రకేతునకు మోహభ్రాంతి తొలగిపోయినది. ఆ పైన, నారద మహర్షి, అతనిని, నీ ఆరాధనమునందే మనసుగలవానినిగా చేసినాడు.

6. అనంతరము, అనంతరూపుడవైన నిన్ను స్తుతించు మార్గమును, దానికి సంబంధించిన మంత్రమును, నారదుని ద్వారా గ్రహించిన చిత్రకేతు మహారాజు, నీ అనుగ్రహమునే ఆసించి, తపశ్చర్యకు పూనుకొనినాడు. దానికి ఫలితముగ, అతనికి, ఏడు రోజులలోనే విద్యాధరాధిపత్యము లభించినది. అయినను, అత డా పదవితో సంతుష్టి చెందక, అమితమైన ఉత్సాహముతో, నీ ఆరాధనమునందే నిమగ్నుడై ఉండుట జరిగినది.

7. ఆ సమయమున, అతడు చేసిన స్తుతి మహాద్భుతమైనది. అది ఆయనపట్ల నిన్ను ప్రసన్నుని చేసినది. అది కారణముగ, నీవు, అనతికాలముననే, ఆదిశేషుని రూపమున ఆయనకు సాక్షాత్కరించినావు.

అప్పటి నీ మూర్తి వర్ణనాతీతము ప్రభూ! కమలకాండమువలె ధవళమై ఉన్న శరీరచ్ఛాయతో, సహస్ర ఫణులతో, నీవు శోభించితివి. తన్మయత్వమున స్తుతించు సిద్ధగణము నిన్ను పరివేష్టించియున్నది. అట్టి నీవు, అతనికి, ఆత్మజ్ఞానోపదేశ మొనర్చితివి. అతని నాశీర్వదించితివి. ఆ పైన అంతర్హితుడవైతివి.

8. అనంతరము, నీ భక్తశిరోమణి అయిన ఆ చిత్రకేతు మహారాజు, విషయోపభోగముల పట్ల అత్యాసక్తి లేనివాడై, ప్రసన్న చిత్తముతోను, పరమానందానుభూతితోను, సర్వదా నిన్నే స్మరించుకొనుచు, నీ గుణగణమును, నీ లీలా విశేషములను, విద్యాధర స్త్రీలచే గానము చేయించుచు, అనేక లక్షలసంవత్సరములు, చతుర్దశ భువనములందును(3) యథేచ్ఛావిహార మొనర్చినాడు.

9. అతని విషయాసక్తిని పూర్తిగ తొలగించు ఉద్దేశముతో, నీవు, అతడొకసారి కైలాస పర్వతమునకు పోవునట్లు ప్రేరేపించితివి. ఆ విధముగ అచటికి పోయిన ఆ మహారాజు, మన్మథ విరోధి అయిన శంకరుడు, మహర్షుల సముఖమున, తన ప్రియురాలిని తన ఊరుభాగమున నుంచుకుని ఉండుటచూసి, పగలబడి నవ్వినాడు.

ఆ విధమైన అతని చర్య, ఉమాదేవికి ఆగ్రహమును కలిగించినది. అది కారణముగ, ఆమె అతనిని శపించినది.

10. శప్తుడైకూడ, చిత్రకేతు మహారాజు ఉద్వేగపడలేదు; శాపమును ఉపసంహరించుకొనవలసినదని యాచింపనుకూడ లేదు.

ఆ చిత్రకేతుడే, అనంతరము, వృత్రాసురుడై జన్మించి, ఇంద్రునితో యుద్ధము చేసినాడు. ఆ సమయమునగూడ, అతడు, తన ప్రత్యర్థి అయిన ఇంద్రుని అజ్ఞానమును, భక్తితత్త్వోపదేశముద్వారా, ఆత్మబోధద్వారా అంతరింప జేయుట జరిగినది. ఎంతటి ఆశ్చర్యకర విషయము !

11. ఇంద్రుని సంహరింపగల కుమారులను కోరి, దైత్యజనని అయిన దితి, నిన్ను సేవించినది. దానికి ఫలముగ, అతనికి, పరమ మిత్రులు కాగల మరుత్తులను కన్నది. పాపాత్ములకు కూడ పరమోత్కృష్ట ఫలములను ప్రసాదించునదికదా నీ పదసేవనము !

భక్తవత్సలా! కృష్ణా! ఇది మనలోమాట నాయనా! నేనును పాపాత్ముడనే; నీ సేవకుడనే.

అర్థము - వివరణ

(1) విశ్వరూపుడు : దేవతలకు గురుడు.

(2) కవచమును : దీనినే నారాయణకవచమందురు.

(3) చతుర్దశ భువనములు : (దశ. 5. వివ. 10. చూడుము.)

24. ప్రహ్లాద చరిత్ర

1. భగవన్ ! ప్రథిత వరాహరూపమున నీవు హిరణ్యాక్షుని వధించినప్పుడు, అతని సోదరుడైన హిరణ్యకశిపుడు, అమిత విచారము వలనను క్రోధము వలనను మనసు చలించినవాడై, తన అనుచరుల సముఖమున, నిన్ను సంహరించుటకు శపథము చేసినాడు.

2. ఆ పైన, అతడు, తీవ్ర తపమాచరించి, అనతికాలముననే చతుర్ముఖుని సాక్షాత్కరింపచేసికొనినాడు. అతనినుండి, దేవతలచేతగాని, మానవులచేతగాని, మృగములు మున్నగు ప్రాణులచేతగాని తనకు మరణము లేకుండునట్లు వరము పొందినాడు. అదంతయు, అతనికి, గర్వకారణమైనది. దానిమూలమున, అతడు, త్రిభువనాధీశుడవైన నిన్నుకూడ నిర్లక్ష్యము చేసినాడు. నీ అధీనమునందున్న ప్రపంచమునంతను భస్మీకరింప సమకట్టినాడు. ఆ సమయమున, అతడు, స్వర్గమునుండి ఇంద్రుని కూడ తరిమివేయుట సంభవించినది.

3. అటు పిమ్మట, అతడు, నిన్ను సంహరించు ఉద్దేశముతో, నీ దివ్యధామమైన వైకుంఠమును చేరుకొనినాడు. అంతట, నీవు, వెలిచూపు మాత్రమే కల అతని హృదయాంతరాళమున, సూక్ష్మరూపివై ప్రవేశించినావు.

అది గ్రహింపలేని అతడు, నీ కొరకు,. వైకుంఠమునం దంతటను వెదకినాడు. చతుర్దశ భువనములను (1) గాలించినాడు. కాని, నిన్ను, కనుగొనలేకపోయినాడు.

అప్పు డతనికి, నీవు, తనకు భయపడి యెచటికో పారిపోయి ఉందువను అభిప్రాయము కలిగినది. అది కారణముగనే, అతడు, నిన్ను, పరాజితునిగ భావించినాడు; విజయగర్వమున గృహోన్ముఖుడైనాడు.

4. అనంతరకాలమున, అతనికి, ప్రహ్లాదుడను కుమారుడు కలిగినాడు. ఆ ప్రహ్లాదుడు, మాతృగర్భమున నున్నపుడే, నారదమహర్షి ద్వారా, భక్తితత్వ ప్రభావమును గ్రహించుట సంభవించినది. అతడు, జన్మతః రాక్షసుడైనను, బాల్యమునందే నీ పాదముల నాశ్రయించుటయు, నీ భక్తు లెల్లరకు ఆదర్శప్రాయు డగుటయు జరిగినది.

5. అసురు లపహసించు హరిపద సేవాభిరతి, తన కుమారుడైన ప్రహ్లాదునియందు మూర్తీభవించియుండుటను, దుష్టాత్ముడైన హిరణ్యకశిపుడు గ్రహించినాడు. గ్రహించి, అతనిని తన మార్గమునకు త్రిప్పుకొను ఉద్దేశముతో, అతనిని, తన గురుపుత్రులైన చండుడు అమర్కుడు అను వారికి అప్పగించినాడు.

ఆ విధముగ చండా-మర్కులను చేరిన ప్రహ్లాదుడు, వారి బోధన లన్నియు గర్హ్యములని గ్రహించి, క్రమక్రమముగ, వాటి నన్నిటిని నిరసించినాడు; నీ పట్ల తనకు కుదిరిన అనన్యభక్తితో, వర్ధిల్లసాగినాడు.

6. ఆ పైన, హిరణ్యకశిపు డొకసారి, 'నాయనా! నీవు నేర్చుకొనిన వానిలో శ్రేష్టమైన విషయమేది ?' అని ప్రహ్లాదుని ప్రశ్నించినాడు. ఆ వెంటనే, ప్రహ్లాదుడు, 'భగవద్భక్తి' అని సమాధాన మిచ్చినాడు.

అది విన్న హిరణ్యకశిపుడు విహ్వలచిత్తుడైనాడు. ఆచార్యుల వంక ఆగ్రహముతో చూసినాడు. కాని, అది ఆ బాలుని నైజగుణమని వారు విన్నవించుకొనినమీదట, నీ పరమభక్తుడైన ఆ బాలుని - తన కుమారుని - నిర్మూలించుటకే నిశ్చయించుకొనినాడు.

7. ఆ నిశ్చయముతో, అతడు, ప్రహ్లాదుని, శూలములతో పొడిపించినాడు. దిగ్గజేంద్రములచేత త్రొక్కించినాడు. సర్పరాజములచే కరపించినాడు. నిరాహారిగ ఉంచినాడు. పర్వతాగ్రములనుండి పడద్రోయించినాడు. అతనిచే విషాన్నము తినిపించినాడు. అయినను, ఆ బాలుని మనసు,

నీయందే లీనమై ఉండుటవలన, అతని కెట్టి అపాయమును కలుగలేదు. నీదైన భక్తజన సంరక్షణాసక్తికి, అది, ప్రబల నిదర్శనము కదా తండ్రీ!

8. తన ప్రయత్నములన్నియు విఫలమగుటవలన, హిరణ్యకశిపుడు, భయ కంపితుడైనాడు. ఆ పైన, ఆచార్యుల సూచనమీద, ప్రహ్లాదుని, వారి ఆశ్రమముననే, వరుణ పాశములచే బంధించి ఉంచినాడు.

అక్కడ, ప్రహ్లాదుడు, గురువుల పరోక్షమున, తన తోటి విద్యార్థులకు, అసుర కుమారులకు, భగవద్భక్తి తత్వమును, బ్రహ్మజ్ఞానమును బోధింపసాగినాడు.

9. ఆశ్రమవాసులైన విద్యార్థులందరును నిన్ను స్తుతించుటయందు ఆసక్తి చూపుచున్నారని వినిన హిరణ్యకశిపుడు, ఆగ్రహావేశపరవశుడైనాడు. ప్రహ్లాదుని ఉద్దేశించి, 'కులనాశకుడా! ఎవని బలమును చూసుకుని నీ విట్లు ప్రవర్తించుచున్నావు!' అని ప్రశ్నించినాడు.

ఆ వెంటనే, ప్రహ్లాదుడు, 'తండ్రీ! శ్రీ మహావిష్ణువే నాకుగల బలము. నాకేకాదు; నీకును సర్వ ప్రపంచమునకునుకూడ బల మతడే. ముల్లోకములును ఆయన స్వరూపమే నాయనా!' అని, నిర్భయముగ ఆయనకు సమాధాన మిచ్చినాడు.

10. అది వినిన హిరణ్యకశిపుడు, 'అయిన, ఆ సర్వాత్ముడైన హరి యెక్కడ ఉన్నాడు?' అని గర్జించుచు, ఒఱనుండి కరవాలమును దూసి, తన యెదుటఉన్న స్తంభమును తీవ్రముగ ప్రహరించినాడు.

సర్వాంతర్యామీ! దయామయా! కృష్ణా! అనంతర వృత్తాంతమును వివరించు సామర్థ్యమును, నీవే నాకు ప్రసాదింపవలెను తండ్రీ! ఆ అనుగ్రహమునే నేను అభ్యర్థించుచున్నాను నాయనా!

అర్థము - వివరణ

(1) చతుర్దశ భువనములను: (దశ. 5. వివ. 10. చూడుము.)

25. నృసింహావతారం

1. హిరణ్యకశిపుడు, ఆ స్తంభము నట్లు ప్రహరించినంతనే, అందుండి ఒక భయంకర శబ్దము బాహిరిల్లినది. అది, అతని కర్ణపుటములను భేదించినది. ప్రపంచమందంతటను ప్రతిధ్వనించినది. అట్టి దాని, నతడు, ము న్నెన్నడును వినియుండలేదు. అది కారణముగనే, అతని హృదయము కంపించిపోయినది. చతుర్ముఖుడు కూడ చకితుడగుట సంభవించినది.

2. అప్పుడు, దానవాధిపతి, తన్ను తాను మరచి, దశదిశల[1] పరికింపసాగినాడు. అంతలో, ఆ స్తంభమునుండి, పూర్తిగ మానవాకృతి గాని, మృగరూపముగాని కాని నీవు బాహిరిల్లినావు. అట్టి నిన్ను దర్శించు కొనిన అసురాధిపతి అదలిపోయినాడు. తత్తరపాటుతో, 'అమిత భీతావహము, అత్యంతాశ్చర్యకరము నగు ఈ మూర్తి యెవరు ?' అని తనలో తాను వితర్కించు చుండగనే, నీవు, భీకరముగ గర్జించుచు, ఉజ్వలము ఉగ్రము అయిన నీ సటాచ్ఛటమును (జూలును) విదళించుకొనుచు, బృహద్ రూపము ధరించినావు.

3. ఆ సమయమున, నీవు, నిప్పులు గ్రక్కుచున్న కనుగ్రుడ్లతో ఉరిమిచూచుచు, విదళిత కేశపాశముతో శరీరమునంతను కప్పుకొనుచు, ఝళిపింపబడు ఖడ్గమువలె ఉన్న నాలుకకు యిరువంకల ప్రకాశించుచున్న కోఱలుగల ముఖ గహ్వరమును తెరచుకుని, భీకరముగ గోచరించినావు. ఆ నీ దివ్యసుందర విగ్రహమునకు, నేను, జయము పలుకుచున్నాను ప్రభూ !

4. గర్జించుచున్నపుడు ముడతలుపడిన ముఖము గలదియు, హ్రస్వమును, స్థూలమును అయిన మెడ గలదియు, కన్నులు మిఱుమిట్లు గొలుపు సహస్ర నఖములు గలదియు, ఉరుములవలె గర్జించుచున్నదియు,

విరోధులకు హృదయ విదారకముగ నున్నదియు అగు నీ నరసింహాకృతికి నేను నమస్కరించుచున్నాను తండ్రీ !

5. ఆ నీ భీకరాకారమును తిలకించిన హిరణ్యకశిపుడు; 'ఇతడే శ్రీ మహావిష్ణువు' అనుకొనినాడు. 'ఇతని నిప్పుడే సంహరింపవలెను' అని నిశ్చయించుకొనినాడు. ఆ వెంటనే, గదను తీసుకుని, నీ మీదకు ఉరికినాడు. అది గ్రహించిన నీవు, ఆ వెంటనే, అతనిని, నీ చేతులలో చిక్కించుకొనినావు. ఆ మీద హిరణ్యకశిపుడు నీతో పెనగులాడుటయు, నీ బాహుపంజరమునుండి బయటపడుటయు జరిగినది.

ఆ విధముగ బయటపడిన అసురాధిపతి, తక్షణమే, ఖడ్గ కవచములు ధరించి, ఖడ్గచాలనమున తనకుగల నైపుణ్యమునంతను ప్రదర్శించుచు, కాశ్యపినెల్ల కబళించునట్లున్న నీమీద పడినాడు.

6. అంతలో, నీవు, మండలాకారమున తిరుగుచు నిన్ను సమీపించిన ఆ రాక్షసాధముని, తిరిగి పట్టుకొనినావు. ద్వారబంధమువరకు అతనిని ఈడ్చుకుపోయినావు. అక్కడ ఆశీనుడవై, అతడు నీ ఒడిలో కూలిపోవునట్లుచేసి, నీ గోళ్లను అతని గుండెలో గ్రుచ్చి, రొమ్మును చీల్చి, అందుండి ఉబికి వచ్చుచున్న కదుష్ణరుధిరమును, అత్యుత్సాహముతో, హృదయ సంతుష్టి అగువరకు త్రాగసాగినావు. ఆ సమయమున నీ వొనర్చిన భీకర గర్జనలు, ముల్లోకములను(2) మూర్ఛనొందింప జాలినవిగా ఉన్నవి.

7. అప్పుడు, నీవు, అతని కళేబరమును అక్కడనే వదలి, రక్తసిక్తమై ఉన్న శరీరముతో లేచి, అచట ఉన్న రాక్షసులందరను, ఒక్కుమ్మడిగ కబళింపజొచ్చినావు. ఆ సమయమున, భూమి గిరగిర తిరిగిపోయినది. సముద్రము లన్నియు కంపించిపోయినవి. భూధరములన్నియు కదలిపోయినవి. తారకాగణములన్నియు తారుమారైనవి. ప్రపంచమునగల చరాచర జీవరాశి అంతయు అస్తవ్యస్తమై పోయినది.

8. ఆ సమయమున, నీ శరీరమంతయు, మేదో మాంసములతో నిండి, భయంకరముగ నున్నది. నీ కంఠమున, ప్రేవుల చేరులు వ్రేలాడు చున్నవి. నీ మూర్తి, మూర్తీభవించిన క్రోధమువలె ఉన్నది. నీవు భీకరముగ గర్జించుచున్నావు. అట్టి స్థితిలో, ఆ సభామధ్యమున నున్న నిన్ను దర్శించుటకుగాని, దరియుటకుగాని, యెవరికిని ధైర్యము లేక పోయినది. బ్రహ్మ రుద్రాదులు కూడ, భీతచిత్తులై, దూరమునుండియే నిన్ను బహుధా స్తుతింపసాగినారు.

9. అప్పటికిని, నీ క్రోధము ఉపశమింపలేదు. అది గ్రహించిన చతుర్ముఖుని ఆదేశము ప్రకారము, ప్రహ్లాదుడు, నిర్భయముగ నీ పాద తలమును సమీపించి, నీకు ప్రణమిల్లినాడు. అతనిని చూసినంతనే, నీలోని దయారసము పెల్లుబికినది. నీవు, ప్రసన్నచిత్తుడవైనావు.

ఆ పైన, నీకు ప్రణమిల్లి నిన్ను స్తుతించుచున్న ప్రహ్లాదుని వంక, నీవు, అనుగ్రహపూర్వకముగ చూసినావు. అతని మస్తకమున, నీ వరద హస్తము నుంచినావు.

నీ హస్త స్పర్శద్వారా లభించిన జ్ఞానముతో, బాలుడైన ప్రహ్లాదుడు, ఫలాపేక్షరహితముగ, నిన్ను బహుభంగుల స్తుతించినాడు. అది గ్రహించిన నీవు, అతనికి అనేక వరములను ప్రసాదించినావు. అటుపిమ్మట, భక్త శ్రేణిని ఆశీర్వదించినావు.

10. సర్వాంతర్యామీ ! కృష్ణా ! నీవు పరిశుద్ధ స్వరూపుడవు. అయినను, భక్త శిరోభూషణమైన ప్రహ్లాదుని రక్షించుటకొరకు, ఇట్లు, భయంకరమగు నరసింహాకృతిని ధరించినావు; ఇంతటి నాటక మాడినావు.

ప్రహ్లాదప్రియా ! నీ మాహాత్మ్యము అనుపమమైనది. సర్వోత్కృష్ట మైనది. నీ ఆజ్ఞ అనుల్లంఘ్యమైనది. అది కారణముగనే, తాపని యోపనిషత్తు, నిన్నంతగా స్తుతించుచున్నది.

గురుపవనపురాధీశ్వరా ! కృష్ణా ! నీ మాహాత్మ్యశకలమును నా మీద కూడ ప్రసరింప జేయుము తండ్రీ ! నా వేదనల నన్నిటిని నిర్మూలింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) దశదిశలు : తూర్పు ఆగ్నేయము దక్షిణం నైరుతి పశ్చిమం వాయవ్యం ఉత్తరం ఈశాన్యం ఊర్ధ్వం అధస్సు.

(2) ముల్లోకములు : స్వర్గ మర్త్య పాతాళములు.

26. గజేంద్రమోక్షం

1. పాండ్యదేశాధిపతి అయిన ఇంద్రద్యుమ్న మహారాజు, నీకు పరమభక్తుడు. ఆయన, మలయాచలమున, నిన్ను గురించి తపమాచరించు కొనుచున్న సమయమున, ఒకసారి, అగస్త్యమహర్షి, ఆతిథ్యము నాసించి, అచటకు పోవుట తటస్థించినది. కాని, అనన్యమనస్కుడై ఉన్న ఆ మహారాజు, ఆయన ఆగమనమును గుర్తింపలేదు.

2. కుంభోద్భవుడైన[1] అగస్త్యునకు, అది ఆగ్రహకారణమైనది. ఆ వెంటనే, ఆయన, ఆ మహారాజు నుద్దేశించి, 'జడబుద్ధివైన నీవు, ఏనుగువై జన్మింపవలసినది' అని శపించినాడు. అది కారణముగ, ఇంద్రద్యుమ్నుడు, కరీంద్రుడై జన్మించుటయు, అప్పుడు కూడ, నిన్ను మరువకుండుటయు జరిగినది.

3. క్షీరసాగర మధ్యమున, త్రికూటమను పర్వతమున్నది. కరీంద్రుడుగామారిన ఇంద్రద్యుమ్నుడు, ఆ పర్వతముమీద, తన కరిణీ సంఘముతో (తోటి ఆడు ఏనుగులతో) విహరించుచుండువాడు. ఆ కాలమున బలమునందు అతని నధిగమింపగల వేరొక జంతువు, ఆ ప్రాంతమున లేకుండెడిది. నీ భక్తులగువారికి, విశిష్ట స్థానము లభింపని దెక్కడ ప్రభూ !

4. ఆ కరీంద్రుడు, తన బలమును ఆ స్థల ప్రభావమును కారణములుగా, యెట్టి వేదనయులేక, అచట చరించుచుండెడివాడు. కాని ఒకసారి, అంతర్యామివయిన నీ ప్రేరణమూలమున, అత డా పర్వతసానువు లందుగల ఒక తటాకమున ప్రవేశించి, తాపోపశమనార్థము, కరిణీ యూథముతోకలిసి, జలక్రీడ సలుపుట సంభవించినది.

5. దేవల మహర్షి శాప కారణమున(2) మొసలిగ మారిన హూహూ నామక గంధర్వుడు, ఆ సమయమున ఆ తటాకమునం దుండుటయు, కరీంద్రుని పాదమును పట్టుకొనుటయు జరిగినది.

అప్పుడప్పుడు నీవు నీ భక్తులను కూడ బాధలపాలు చేయుచుండుట, వారి ఆధ్యాత్మికాభివృద్ధి నాసించియే కదా ప్రభూ !

6. పూర్వ జన్మమున, నిన్ను ఆరాధించినదాని ఫలముగ, ఆ గజేంద్రుడు, ఒక వేయి సంవత్సరములు, ఆ నక్రముతో, నిర్విరామముగ యుద్ధము చేయగలిగినాడు. కాని, అతని భక్తిని యేకాగ్ర మొనర్పవలసిన సమయ మాసన్నమగుటవలన, అత డా నక్రపీడను భరింపలేక శోకించు నట్లు చేసినావు.

7. ఆ నక్రపీడవలన, గజేంద్రునిలో అంతవరకు గుప్తముగ ఉన్న భక్తియు జ్ఞానమును అభివ్యక్తమైనవి. ఆ వెంటనే, అతడు, సరోవరము నుండి ఒక కమలమును పెకలించి, తొండముతో పైకెత్తిపట్టుకుని, పూర్వ జన్మలో తాను అభ్యసించిన మార్గమున, నిర్గుణ పరబ్రహ్మమునకు సంబంధించిన కొన్ని స్తోత్రములను పఠింపసాగినాడు.

8. అవ్యక్త పరబ్రహ్మను గురించి అతడు చేసిన స్తోత్రమును సాకల్యముగ విన్న చతుర్ముఖాదులు, 'అతడు స్తుతించినది నన్ను కాదు. అత దర్థించినది నా సహాయమును కాదు' అని తలపోసి, అతని నాదుకొనుటకు పోక, మిన్నకుండినారు. అది గ్రహించిన నీవు, అతనిని కనికరించినావు. ఆ వెంటనే గరుడవాహనారూఢుడవై పోయి, అతని యెదుట సాక్షాత్కరించినావు.

9. ఆ పైన, గజేంద్రుని ఒక చేతితో పట్టుకుని, ఆ నక్ర శ్రేష్టమును, నీ చక్రాయుధముతో ఖండించినావు.

ఆ విధముగ నీ చేతులో మరణించిన నక్రరూపిఅయిన గంధర్వునకు, శాపవిమోచనమైనది. నీ కరస్పర్శ మూలమున ఆ కరిరాజునకు సారూప్య ముక్తి (3) లభించినది.

10. అనంతరము, నీవు, ఆ కరిరాజు నుద్దేశించి, 'గజేంద్ర మోక్షణమను ఈ గాథను, ప్రాతఃకాలమున, భక్తి శ్రద్ధలతో పఠించినవారికి మోక్షము లభించితీరున'ని తెలియపరచినావు. ఆ వెంటనే, అతనితో కూడ, నీ నిజనివాసమైన వైకుంఠమునకు వెళ్ళిపోయినావు.

గురుపవనపురాధిపా! కృష్ణా! అట్టి నీ అనుగ్రహమునే, నేనును అభ్యర్థించుచున్నాను తండ్రీ!

అర్థము - వివరణ

(1) కుంభోద్భవుడైన అగస్త్యుడు : ఈయన ఒక ఋషి. మిత్రవరుణుల తేజము - ఊర్వసి తేజము కలిసిన ఒక కుంభమునుండి ఉద్భవించినవాడు. వసిష్టుని సోదరుడు.

(2) దేవలమహర్షి శాపం : హూహూనామక గంధర్వు డొకసారి ఒక కొలనులో తన స్త్రీ జనముతో జలక్రీడ సలుపుచుండగా దేవలుడను ఒక మహర్షి అక్కడికివెళ్ళి స్నానార్థము అందులో ప్రవేశించినాడు. అది చూసిన గంధర్వుడు సవిలాసముగ నీటిలో మునిగి ఆ మహర్షి పాదమును పట్టుకుని లాగినాడు. అది గ్రహించిన మహర్షి ఆగ్రహించుకుని 'నీవు మొసలివై జనించవలసినది' అని అతడిని శపించినాడు. ఆ శాపము కారణముగా ఆ గంధర్వుడు మొసలిగా మారిపోవుట సంభవించినది.

(3) సారూప్య ముక్తి : శ్రీ మహావిష్ణువు రూపమువంటి రూపమునందుట.

27. క్షీరసాగర మథనం

1. దేవకాంతలు తనకు సమర్పించికొనిన ఒక దివ్యమాలను, దుర్వాసమహర్షి, ఒకసారి, మహేంద్రునకు స్వయముగ బహూకరించినాడు. మహేంద్రుడు, ఆ మాలతో, తన వాహనమైన ఐరావతము నలంకరించుటయు ఆ గజేంద్రము, దానిని, క్రిందపడవేసి, తన పాదములతో త్రొక్కుటయు జరిగినది. అది చూసిన మహర్షి ఆగ్రహించుకొనినాడు; మహేంద్రుని శపించినాడు.

నీ అంశతో కాక, యితర దేవతల అంశతో జనించిన వారికి(1) సహనముండుట అరిదికదా ప్రభూ !

2. ఆ శాపమువలన, మహేంద్రునకు వృద్ధాప్యము సంభవించినది. దేవతలు, తేజోహీనులగుటయు, రాక్షసులచేత పరాజితులగుటయు జరిగినది. ఆ దురవస్థను తొలగించుకొను ఉద్దేశముతో, శంకరుడు మున్నగువారు, చతుర్ముఖుని సందర్శించుకొనినారు. ఆ చతుర్ముఖుడు, వా రందరితోను, ముక్తిదాతవైన నిన్ను ఆశ్రయించినాడు.

3. ఆ పైన, బ్రహ్మాదులు, చాలకాలము, ని న్నెంతగనో స్తుతించినారు. అప్పుడు, నీవు, నీ దైన సర్వోత్కృష్ట తేజముతో వారి యెదుట సాక్షాత్కరించి, 'మీరు దైత్యులతో సంధిచేసుకుని, అమృతముకొరకు సముద్రమును మథింపవలసినది' అని ఆదేశించినావు.

4. నీ ఆదేశానుసారము, దేవతలు, దానవులతో సంధిచేసుకొనినారు. ఆ పైన, వారు, సముద్ర మథన సమయమున, మందరపర్వతమును కవ్వముగా ఉపయోగింపదలచి, సగర్వముగ, దానిని మోసుకుని పోవుచుండగా,

అది పట్టుతప్పి, క్రింద పడిపోయినది. ఆ సమయమున, గరుడునిమీద ఉన్న నీవు, దానిని, రేగిపండునువలె పైకెత్తి, క్షీరసాగరమున నుంచినావు.

5. ఆ పైన, దేవ దానవులు, వాసుకి అను సర్పరాజమును కవ్వపు త్రాడుగా ఉపయోగించి, సర్వబీజ సముదాయమునకు ఆకరమైన సముద్రమును మథించుట కుపక్రమించినారు. ఆ సమయమున, 'సర్పముఖ సమీపముననే మన ముండవలె' నను భావమును అసురులయందు, నీవు, కోరి కల్పించినావు.

6. క్షీరసాగరము మథింపబడుచున్న సమయమున, కవ్వముగా ఉన్న మందర పర్వతము, దాని గురుతర పరిమాణము కారణముగ, సముద్రాంతర్భాగమునకు కృంగిపోసాగినది. అది గ్రహించిన దేవతలు, వ్యధిత హృదయులైనారు. వారి వేదనను తొలగించి, వారికి మేలు చేకూర్చు ఉద్దేశముతో, నీవు, ఆ పైన, కఠోర కవచముగల కూర్మరూపము ధరించినావు.

7. వజ్రాయుధమునకన్న కఠినముగఉన్న ఆ కవచముతో, లక్ష యోజనముల విస్తీర్ణముగల శరీరముతో అవతరించిన నీవు, ఆ వెంటనే, సాగర గర్భమున ప్రవేశించి, మునిగిఉన్న ఆ పర్వత శ్రేష్ఠమును వీపున నిలుపుకుని, అటులనే అక్కడ ఉండిపోయినావు.

8. ఆ విధముగ పైకివచ్చిన పర్వతమును ఉపయోగించుకుని, దేవ దానవులు, అమితోత్సాహమున, సముద్రమును తీవ్రతరముగ మథింప సాగినారు. ఆ సమయమున, నీవు, వారికి ఆయాసము కలుగకుండ చూసినావు; వారిలోని ఉత్సాహమును ఇనుమడింప జేసినావు.

9. కవ్వముగాఉన్న పర్వతశ్రేష్ఠము, తీవ్ర భ్రమణమువలన, అప్పుడప్పుడు పైకివచ్చుట జరుగుచుండెడిది. అప్పుడు, నీవు, నీ సుదృఢ హస్తమును దానిమీద మోపుచుండువాడవు. అది చూసిన బ్రహ్మరుద్రాదులు,

ఆకసమునుండి, ఆనందాతిశయమున నిన్ను స్తుతించుచుండెడివారు; నీ మీద పుష్పవృష్టి గురియించుచుండెడివారు.

10. సర్పముఖమునుండి వెలువడు విషవాయువు మూలమున, అనతిదూరముననున్న అసురులు అమితముగ పీడింపబడుచుండుటయు, దూరముననున్న సురానీకమున కది బాధాకరము కాకుండుటయు జరిగెడిది. నీ కృపా విశేషమున అప్పుడు వర్షించిన మేఘములు, దేవతలను మాత్రమే శాంతింపజేయుచుండెడివి.

11. సాగరమథనము ఆ విధముగ దీర్ఘకాలము జరిగినను, అందుండెడి తిమింగలములు, మొసళ్లు, కలవరపడుట జరిగినదేకాని, వేరొక ప్రయోజనము కలుగలేదు. అది గ్రహించిన నీవు, నీ రెండు చేతులతోను, ఆ సర్పరాజము నటునిటు పట్టుకుని లాగుచు, స్వయముగ సముద్రమును మథింపసాగినావు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! అంతటి మహత్కార్యము నొనర్చిన నీకు, నా వేదనలను నిర్మూలించుట ఒక ఘనకార్యమగునా తండ్రీ !

అర్థము - వివరణ

(1) నీ అంశతోకాక......జనించినవారికి : దుర్వాసుడు రుద్రాంశతో జనించినాడు.

(2) లక్ష యోజనములు : ఎనిమిది లక్షల మైళ్ళు.

28. అమృతోదయం

1. కృష్ణా ! నీవు సముద్ర మథనమున కుపక్రమింపగనే, అందుండి, కాలాగ్నివంటి కాలకూటము బాహిరిల్లినది. అప్పుడు, దేవతానీకముచేసిన ప్రశంసలకు ప్రసన్నుడైన శంకరుడు, నిన్ను సంతుష్టిపరచుటకుగాను, దానిని, అమృతమునువలె ఆపోశన పట్టినాడు.

2. అనంతరము, దేవ దానవులు, తిరిగి మథన క్రియకు పూనుకొనినారు. ఆ సమయమున, సురభి ఆవిర్భవించినది. త్రిలోకాధిపతివైన నీవు, దానిని, మహర్షులకు ప్రసాదించినావు.

ఆ పైన, అశ్వరాజమైన ఉచ్చైశ్శ్రవము, హయశ్రేష్ఠమైన ఐరావతము, దివ్య వృక్షమైన కల్పకము బాహిరిల్లినవి. వాటిని, నీవు, దేవతలకు దత్తము చేసినావు. దివ్యాంగనలైన అప్సరలనుకూడ, వారికే యిచ్చినావు.

3. అటుపిమ్మట, చేతోహారిణి అయిన శ్రీ మహాలక్ష్మి ఆవిర్భవించినది. ఆమె, నీయందే మనసును నిలుపుకొనినది. కళంక రహిత అయిన ఆ కన్యారత్నమును చూడగనే, అందరి మనసులును చలించి పోయినవి. ఎవరికివారు, ఆమె తమకే కావలయు ననుకొనుట జరిగినది.

4. నిన్నే వరించిన ఆ శ్రీమహాలక్ష్మికి, దేవేంద్రుడు, తన రత్న ఖచిత సింహాసనమును సమర్పించుకొనినాడు. ఇతర దేవతలు సమకూర్చిన పట్టాభిషేక సంబారములతో, మహర్షులు, ఆమెకు, మంత్రోక్తముగ అభిషేక మొనర్చినారు.

5. పవిత్రమైన అభిషేక జలముతోపాటు, నీవు వర్షించుచున్న అపాంగ వీక్షణములతో అద్భుతముగ శోభించుచున్న ఆ లతాతన్వంగిని, దేవతలు, దివ్యమైన కర్ణాభరణములతోను, కంఠాభరణాదులతోను, పట్టు పీతాంబరములతోను అలంకరించినారు.

6. ఆ విధముగ, సాలంకృతయై లజ్జావనతవదనయై, లీలావిలాస శోభితయై, కుచకలశ భారముచే కొలదిగ వంగి, మెల్లమెల్లగ అడుగులు వేయుచు, ఝుంకారముచేయు తుమ్మెదలతో కూడియున్న కల్యాణ సుమ మాలను కరపద్మమున ధరించి, ఆమె నిన్ను సమీపించినది. ఆ సమయమున, ఆమె మంజీరములు కల్పించిన మృదుమధుర స్వనము, ఒక మంగళ వాద్య విశేషముగ తోచినది ప్రభూ !

7. శంకరుడు చతుర్ముఖుడు మున్నగువారు గుణవంతులే అయినను, వారి యందు దోషలేశములు కొన్ని లేకపోలేదను భావముతో, శ్రీ దేవి, సర్వదా సర్వ సద్గుణసంపన్నుడవై శోభించు నీ గళసీమ నా కళ్యాణసుమమాలిక నుంచినది.

8. అనన్యభావముతో నిన్నే ఆశ్రయించిన ఆ జగజ్జననికి,ఆ వెంటనే నీవు, నీ హృదయమున స్థానము కల్పించినావు. అచటినుండి ఆమె ప్రసరించు మధుర కటాక్ష వీక్షణములద్వారా, ఆ పైన, ప్రాణికోటి అంతయు, సర్వసమృద్ధితో విలసిల్ల జొచ్చినది.

9. అనంతరము, ఆ క్షీరసముద్రమునుండి, విశ్వమునంతను మోహింపజేయగలదియు, సర్వులకును మదోద్ధతిని కలిగించునదియు, అజ్ఞానమునకు మూలకారణమైనదియు నగు వారుణి(1) జనించినది. దానిని నీవు, ఆదరపూర్వకముగ, అసురానీకమున కందించినావు.

10. ఆ పైన, నీవు, గర్భిణీమేఘమువంటి మనోహరరూపముతో, కరకమలమున నున్న అమృత కలశముతో, సముద్ర గర్భమునుండి, ధన్వంతరి రూపమున నవతరించినావు.

గురుపవన పురాధిపా ! కృష్ణా ! సంపూర్ణారోగ్యము కొరకు, నేను, ధన్వంతరివైన నిన్నే శరణుగోరుచున్నాను తండ్రీ !

అర్థము - వివరణ

(1) వారుణి : ఒక మత్తు పదార్థము - పానీయము.

29. విష్ణుమాయా ప్రాదుర్భావం

1. ధన్వంతరి రూపమున నీవు, సముద్రగర్భమునుండి పైకి వచ్చుచుండగా, నీ చేతిలోని అమృత కలశమును, అసురులు, ఆకస్మికముగ అపహరించినారు. అదిచూసిన నిలింపులు, నిశ్చేష్టితులైనారు. ఆ పరిస్థితి నర్థము చేసుకొనిన నీవు, వారిని అనునయించి, ఆ వెంటనే, అంతర్హితుడ వైనావు. ఆ సమయమున, నీ మాయాప్రభావము కారణముగ, అసురానీకమునందు, పరస్పర వినాశకరమైన అంతఃకలహము ఆరంభ మైనది.

2. అంతలో, నీవు, మోహినీరూపమున వారి యెదుట ప్రత్యక్ష మైనావు. షోడశవర్ష ప్రాయయు, మహాతేజస్వినియు, కుచ కలశ భారమున కొలదిగ వంగియున్నదియు అయిన ఆ మనోహారిణిని చూడగనే, అసురు లందరకును, ఆమెయందు అమితాసక్తి కలిగినది. ఆ వెంటనే, వారు, అమృత కలశము కారణముగ కలిగిన కలహమునకు 'స్వస్తి'చెప్పి, ఆమె కుచకలశముల మీది దృష్టితో పరుగిడసాగినారు.

3. ఆ విధముగ ఆమెను సమీపించిన అసురులు, ఆమెను ఉద్దేశించి, 'మృగాక్షీ ! నీవు ఎవరిదానవు?' అని ప్రశ్నించినారు. 'ఈ అమృతమును మాకు పంచిపెట్టవలసినది !' అని బ్రతిమాలుకొనినారు.

వారికి సమాధానముగ, ఆమె, 'మీరు నన్ను నమ్ముచున్నారా !' అని యెగతాళిగ అన్నది. అయినను వారామెను విశ్వసించినారు.

4. ఆనందముతో అసురులందించిన అమృతభాండమును స్వీక రించుచు, 'ఇప్పుడు, నేను, నాకు తోచినట్లు చేయుదును. మీరు నన్ను అపార్థము చేసుకొనరాదు సుమా !' అని సవిలాసముగ అన్నది. ఆ పైన

ఒయ్యారము నొలికించు నడలతో, అమృతమును పంచిపెట్టుట కుపక్రమించినది.

5. 'ఈమె మనపట్ల ప్రేమతో ఉన్నది' అనుకొనుచు, అసురులు మిన్నకున్న సమయమున, భక్తులపట్ల పక్షపాతబుద్ధిగల నీవు, ఆ మోహినీ రూపమున, కలశముననున్న అమృతమునంతను దేవతలకే పంచిపెట్టినావు. ఆ సమయమున, తనకు దొరికినదానిని త్రావుచున్న రాహువును గుర్తించి, నీ నిజరూపమున అతని కుత్తుక నుత్తరించినావు.

6. నీనుండి అమృత కలశము నపహరించినదానికి తగిన ఫలమును అసురులు అనుభవించునట్లుచేసి, నీవు అంతర్హితుడవైనపిమ్మట, వారు, దేవతలతో యుద్ధమునకు దిగినారు. ఆ యుద్ధము, అతి భయంకరముగ జరిగినది. రాక్షసేశ్వరుడైన బలి, ఆ సమయమున, దేవతలమీద, తనదైన అసురమాయను ప్రయోగించినాడు. అది కారణముగ, దేవతలకు మతిభ్రమణము కలిగినది. అది గ్రహించిన నీవు, తిరిగి అక్కడ ప్రత్యక్షమైనావు.

7. అప్పుడు, నీవు, కాలనేమి, మాలి, మున్నగువారిని వధించినావు. బలినీ జంభునీ వలునీ పాకునీ ఇంద్రుడు సంహరించినాడు. పొడిదిగాని తడిదిగాని అయిన దానిచే చావులేని నముచి, తరంగ ఫేనములతో తయారయిన ఒక విచిత్రాయుధముద్వారా నిహతుడైనాడు. ఆ పైన, నారదుని అభ్యర్థనమీద, నీవు యుద్ధమునుండి విరమించుకొనినావు.

8. అసురులను సమ్మోహితుల నొనర్చు నిమిత్తము నీవు మోహినీ రూపమును ధరించినావని వినిన శంకరునకు, నిన్నా రూపమున దర్శించుకొనవలెనను కుతూహలము కలిగినది. ఆ వెంటనే, అతడు, తన అర్ధాంగి అయిన పార్వతితోను, భూతగణముతోను, నీ దివ్యధామము చేరుకొనినాడు. నిన్ను దర్శించుకొనినాడు. బహుభంగుల స్తుతించినాడు. అంతలోననే, నీవు, అంతర్హితుడవగుట సంభవించినది.

9. మరుక్షణమున, నీవు, వనాంతర్భాగమున బంతులాడుచున్న ఒక చేతోహారిణి రూపమున గోచరించినావు. అప్పుడు, ఆ విలాసిని నేత్రములు, అతి చంచలములై ఉన్నవి. గాలిసోకి, ఆమె పయ్యెద తొలగి యున్నది. ఆ స్థితిలో, ఆమెను చూసిన మన్మథాంతకుడు, ఆమెను ఆలింగనము చేసుకొనినాడు.

10. కాని, ఆమె, అతనినుండి తప్పించుకుని, పారిపోవుటకు ప్రయత్నించినది. అయినను, శంకరుడు, ఆమెవెంట పడినాడు.

ఆ సమయమున, అతనికి, తన తేజము తరగిపోవుచున్నదను భావము కలిగినది. ఆ వెంటనే, పరమార్థ జ్ఞానము తిరిగి లభించినది. అది గ్రహించిన నీవు, అతనిని ప్రశంసించినావు.

ఆ విధముగ నీచే సన్మానితుడైన శంకరుడు, ఆ పైన, నీ మాహాత్మ్యమును, తన అర్ధాంగి అయిన పార్వతికి విశదపరచుకొనుట జరిగినది.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! నన్నును ఆ విధముగ దయచూడవా తండ్రీ ! నాకు, నీ చరణాబ్జములచెంత ఆశ్రయమును కల్పింపవా నాయనా !

30. వామనావతారం

1. మహానుభావుడైన బలిమహారాజు, దేవ దానవ సంగ్రామమున, శక్రునిచే సంహరింపబడినాడు. అయినను, అసురగురుడైన శుక్రాచార్యుడు, అతనిని పునర్జీవితు నొనర్చినాడు.

ఆ విధముగ పునర్జీవితుడైన బలి, అనంతరకాలమున, అనేక యజ్ఞము లాచరించినాడు. అది కారణముగ, అతని శక్తి పెరిగినది. అతడనేక మహత్కార్యము లాచరింపగలిగినాడు. నీ చక్రాయుధమునకు కూడ భయపడనివాడైనాడు. ముల్లోకములను జయించినాడు. ఆ సమయమున దేవత లతనికి భయపడి, యెక్కడనో తలదాచుకొనవలసివచ్చినది.

2. దేవతల తల్లి అయిన అదితి, తన కుమారుల దుస్థితిని చూసి, అమితముగ, దుఃఖించినది. తాపోపశమనార్థము, తన భర్త అయిన కశ్యప మహర్షి నాశ్రయించినది.

అదితి, సహజముగనే నీ భక్తురాలు. ఆమె కశ్యపుని ఉపదేశము ననుసరించి, పన్నెండు రోజులపాటు, పయోవ్రత దీక్షతో(1) నిన్ను ఉపాసించినది.

3. దీక్షాకాలము సమాప్తము కాగనే, నీవు, నీలమేఘమువంటి శరీరచ్ఛాయ కలవాడవై, చతుర్భుజుడవై, నీ యందే మనసును లగ్నము చేసుకొని ఉన్న ఆమె యెదుట సాక్షాత్కరించినావు.

నిన్ను చూడగనే, ఆమె, నీకు ప్రణమిల్లినది. అప్పుడు నీవు ఆమెను ఉద్దేశించి, 'నేను నీకు పుత్రుడనై జన్మించెద'నని మాటయిచ్చినావు. 'నన్ను దర్శించుకొనినట్లు నీ వెవ్వరికిని చెప్పరాదు', అనికూడ ఆదేశించినావు. ఆ వెంటనే, అంతర్హితుడవైనావు.

4. అనంతరకాలమున, అదితి గర్భవతి అయినది. ఆమె గర్భమున ప్రవేశించిన నిన్ను, చతుర్ముఖుడు, అమితముగ ప్రశంసించినాడు.

ఆ పైన, అదితి, శ్రవణానక్షత్రయుక్త ద్వాదశీ పుణ్యదినమున వైష్ణవ తేజముతో విలసిల్లుచున్న నిన్ను ప్రసవించినది.

5. ఆ సమయమున, దేవతలు, అమితానందము ననుభవించినారు. దివ్య దుందుభులను మ్రోయించినారు. ఆ పవిత్ర కుటీరముమీద పుష్పవృష్టి గురియించినారు.

అది గ్రహించిన అదితి - కశ్యపులు, ముకుళిత కరములతో నిలబడి, నీకు జయము పలికినారు. తక్షణమే, నీవు, మంచి పటుత్వము గల ఒక వటువురూపము ధరించినావు.

6. ప్రభూ ! అప్పుడు, నీవే అయిన ఆ వటువునకు, కశ్యప ప్రజాపతి మున్నగువారు, జననమాది ఉపనయనము వరకు జరుగవలసిన సర్వవిధ సంస్కారములను భక్తిశ్రద్ధలతో జరిపినారు. ఆ సమయమున, నీవు, నీకు సమర్పించుకొనబడిన దర్భలతోను, దండముతోను, కృష్ణాజినముతోను, అక్షమాల మున్నగువానితోను దేదీప్యమానముగ భాసించినావు. అనంతరము, అగ్ని కార్యమును నెరవేర్చుకుని, బ్రహ్మచారి రూపమున, అశ్వమేధయాగము(2) జరుగుచున్న బలిదానవుని యజ్ఞవాటికకు బయలు దేరినావు.

7. ఆ సమయమున, నీవు, అనంతర కాలమున వెలువరింపనున్న మాహాత్మ్యమునకు చిహ్నమువలె, అడుగడుగునకు భూమిని కంపింపజేసినావు. ప్రత్యర్థుల తాకిడిని ప్రతిఘటించుటకువలె, గొడుగును పట్టుకొనినావు. అసురులమీద ప్రయోగించుటకువలె, దండమును ధరించినావు.

8. నర్మదానదికి ఉత్తర భాగముననున్న యాగశాలను నీవు సమీపించునపుడు, శుక్రాచార్యుడు మున్నగువారు, నీ తేజమును తిలకించి,

నీవు ఆదిత్యుడవో, అగ్నిదేవుడవో, కాక, సనత్కుమారుడవో అయిఉందువ వనుకొనినారు.

9. రమణీయమూ తేజో విలసితమూ అయిన నీ మూర్తిని తిలకించి, పరవశులైన భృగువంశీయులు, ఆ వెంటనే, నీకు స్వాగతము పలికినారు. మహాత్ముడైన బలి, నిన్ను దర్శించుకుని, మహదానందమున నీ పాదములను కడిగినాడు; ఆ చరణ తీర్థమును, తన శిరమున చల్లుకొనినాడు.

10. బలిచక్రవర్తి అసురుడై జన్మించినను, శంకరుడుసైతము పవిత్రముగ భావించు నీ చరణ తీర్థమును పొందగలిగినాడు. ప్రహ్లాదుని వంగడమున పుట్టుటవలననో, అనేక యజ్ఞముల నాచరించుట వలననో, బ్రహ్మ నిష్ఠులను సేవించియుండుటవలననో అతనికి ఆ అదృష్టము కలిగి యుండును.

సర్వవ్యాపీ ! గురుపవనపురాధిపా ! నీ అనుగ్రహ రూపమగు అట్టి అదృష్టమునకే నేనును తపించుచున్నాను తండ్రీ !

అర్థము – వివరణ

(1) పయోవ్రత దీక్ష : ఈ వ్రతము మాఘ పూర్ణిమ రోజున ప్రారంభింపబడి పన్నెండు రోజులపాటు జరుగును. ఆ దీక్షా కాలమున భక్తులు పాలను మాత్రమే త్రాగి ఉందురు.

(2) అశ్వమేధయాగము : గుఱ్ఱమును పశువుగాచేసి, చక్రవర్తులు మాత్రమే సలుపు ఒక రకమైన యాగము.

31. బలినిగ్రహణం

1. దివ్య తేజముతో దేదీప్యమానముగ ప్రకాశించుచున్న నీ భవ్య సుందర విగ్రహమును వీక్షించిన అసురాధిపతి, నీకు, సర్వవిధోపచారముల నొనర్చినాడు.[1] ఆ పైన, అంజలి ఘటించి నిలబడి, 'వటుశ్రేష్ఠా! నన్ను అనుగ్రహించి, నీ వాంఛితార్థము నెరిగింప వలసినది. భూములనుగాని భవనములనుగాని భోగ సముదాయమునుగాని, లేదా, అన్నిటినిగాని, నీ అభీప్సితానుసారము అర్పించుకొనుటకు, నేను సిద్ధముగ ఉన్నాను' అని, తన హృదయమును విశదపరచుకొనినాడు.

2. ఆ పలుకుల నాలకించిన నీవు, అసురుల ఔదార్యమును ప్రస్తుతించినావు. ఆ పైన, అతనిపట్ల అభిమానము కలవాడవే అయ్యును, అతని గర్వమును నిర్మూలించు నిమిత్తము, 'నా కేమి కావలయును ప్రభూ! మూడడుగులమేర భూమి నిచ్చిన చాలును' అనినావు.

అత్యాసవలెనే, అల్పాతి అల్పమైన ఆసయు హాస్యాస్పదమే అవునుకదా !

3. వటువుదైన ఆ అభ్యర్థన, ఆ మహారాజునకు, బాలేయమైనదిగ (బాలురకు మాత్రమే ఉచితమైనదిగ) తోచినది. అది కారణముగనే, ఆయన, ఆ వటువు నుద్దేశించి, 'జగత్ప్రభుడనైన నా నుండి మూడడుగుల భూమిని మాత్రము కోరుటయా ! దానివలన నీవు సాధింపగల దేమున్నది ? నీవు కావలెనన్న, ధరణీతలమునంతను దానము చేయుదునుకదా !' అని సగర్వముగ పలికినాడు.

ఆ అహంకారమే, అత డా పైన, మూ డడుగుల మేరనుకూడ ఇవ్వ లేక పోవుటకును, నిందా వాక్యములను, బందీకరణమును, అనుభవించుటకును మూలమైనది.

4. ఆ మహారాజు ఆ విధముగ పలికినమీదట, నీవు, ఆయన నుద్దేశించి, 'మూడడుగులనంది తృప్తిపడలేనివాడు ముల్లోకముల బొందినను సంతుష్టి చెందలేడు' అనినావు. ఆ వెంటనే, ఆ మహారాజు, దానజలమును వదలుటకు ఉద్యుక్తుడైనాడు. అది గ్రహించికూడ, ఆయనలోని ధర్మ నిరతిని ప్రపంచమునకు చాటు నిమిత్తము, అతనిని వారించుటకు, అసుర గురుడైన శుక్రాచార్యుని ప్రేరేపించినావు. ఆ వెంటనే, ఆయన, ఆ మహా రాజు నుద్దేశించి, 'ఆగవలసినది మహారాజా! దానమిచ్చుట నాపవలసినది. ఇతడు, నిన్ను వంచించుట కిటుగావచ్చిన శ్రీ మహావిష్ణువుకాని సామాన్య వటుడు కాడు' అని, తీవ్రముగ హెచ్చరించినాడు.

5. ఆ హెచ్చరికను గ్రహించిన బలిచక్రవర్తి, 'నన్ను అర్థించునది ఆ శ్రీమహావిష్ణువే అయిన, నన్ను మించిన అదృష్టశాలి వేరొక డుండబోడు. ఇతడు సామాన్య వటుడైనను, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అయినను, నేను మాత్రము, మాటయిచ్చిన ప్రకారము దానము చేసితీరెదను' అని, తన హృదయమును ఆచార్యునకు విశదపరచుకొనినాడు.

ఆ వెంటనే, శుక్రాచార్యుడు శపించుచున్నను సరకుచేయక, తన సహధర్మచారిణి అయిన వింధ్యావళి సహాయముతో, బలిచక్రవర్తి, వటు రూపముననున్న నీ పాదములను కడిగినాడు. తన సర్వస్వమును నీకు సమర్పించుకొనినాడు. అది సామాన్య విషయమా ప్రభూ!

6. దితికులపతి అయిన బలిచక్రవర్తి, నిస్సంకోచముగ, తన సర్వస్వమును నీకు ధారవోసికొనుచున్నపుడు, మహర్షులును దేవతలును నీ పైన పుష్పవృష్టి కురియించినారు. ముల్లోకములందలి ప్రాణులును, అమితానందమున హర్షధ్వానము లొనర్చినవి. ఆ సమయమున, నీవు, నీ దివ్యసుందర విగ్రహమును అంతకంతకు పెంచుకొనుచు, బ్రహ్మాండము నంతను ఆక్రమించుకొనినావు.

7. ఆ విధముగ పెరిగి పెరిగి, సత్యలోకము[2] చేరుకొనిన నీ చరణాబ్జములను, చతుర్ముఖుడు భక్తిపూర్వకముగ కడిగినాడు. ఆ పవిత్ర పాదోదకము, ముల్లోకములను పునీత మొనర్చినది.

ఆ మహోత్సవ సమయమున, గగనతల నివాసులైన గంధర్వ విద్యాధరాదులు, అతిశయించిన ఆనందముతో నృత్యము చేసినారు. నీ పరమ భక్తుడైన జాంబవంతుడు, భేరి మ్రోయించుచు, నీ మహాద్భుత లీలావిశేషమును ప్రపంచమం దంతటను చాటినాడు.

8. అనంతరము, రాక్షసులు, తమ ప్రభుని అనుమతినందకనే, నీతో యుద్ధమునకు దిగినారు. కాని, నీ భటులు, వారిని పరాజితులను చేసినారు. అది గ్రహించిన బలిచక్రవర్తి, వారిని ఉద్దేశించి, 'కాల స్వరూపుడైన శ్రీమహావిష్ణువే యిపుడు మీ సమక్షమున నున్నాడు. అతని అనుగ్రహమువలననే మనకు పూర్వము విజయము చేకూరినది. ఇప్పుడు, మీరు ఆయనను ప్రతిఘటించుటవలన సాధింపగల దేమియు నుండదు' అని హితమును బోధించినాడు. అది కారణముగ, వా రందరును పాతాళమునకు వెళ్ళిపోయినారు.

9. అప్పుడు, నీవు, గరుడునిచే బంధింపబడిఉన్న రాక్షసేశ్వరుని ఉద్దేశించి, 'త్రిభువనపతీ ! నా మూడవ పాదము నెచట మోపవలెను ?' అని అడిగినావు. ఆ వెంటనే, ఆ మహారాజు, సంక్షోభ రహితముగ, 'స్వామీ ! ఆ చరణమును నా శిరమున నుంచవలసినది' అనినాడు.

ఆ సమయముననకే అచటికి విచ్చేసిన ప్రహ్లాదుడు, నిన్ను యెంతగనో ప్రస్తుతించినాడు; బలిచక్రవర్తిని అమితాదరముతో ప్రశంసించినాడు.

10. ఆ పైన, నీవు, బలిచక్రవర్తి నుద్దేశించి, 'రాక్షసేశ్వరా ! నీ గర్వమును నిర్మూలించుటకే నే నిట్లు చేయవలసివచ్చినది. నీవు మహాద్భుత కార్యము లొనర్చినావు. జీవితమును చరితార్థము చేసికొనినావు. ఇక, నీవు,

స్వర్గమును మించిన సుతలమునకు[3] పోవలసినది. అనంతరకాలమున, ఇంద్రపదవినంది, సర్వవిధ భోగముల ననుభవింపవలసినది. ఆ పైన, సాయుజ్యముక్తిని[4] పొందవలసినది' అని, ఆశీఃపూర్వకముగ పలికినావు. తదనంతరము, నీవు, ఆ మహారాజు ప్రారంభించిన విశ్వజిద్ యాగమును[5] నిర్విఘ్నముగ సమాప్తము చేయించినావు.

గురుపవనపురాధీశ్వరా ! కృష్ణా ! బలిచక్రవర్తిదైన గర్వమునువలె, నా జాడ్యమునుకూడ హరింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) వివిధోపచారములు : పాదప్రక్షాళనమునకు హస్తప్రక్షాళనమునకు జలము నొసంగుట, ఉచితాసనము జూపుట మున్నగునవి -

(2) సత్యలోకము : (దశ. 4. విన. 13. చూడుము.)

(3) సుతలము : అధోలోకములలో ఒకటి.

(4) సాయుజ్యముక్తి : (దశ. 19. విన. 1 చూడుము.)

(5) విశ్వజిద్యాగము : రాజులందరను జయించిన పిదప సమ్రాట్టు లొనరించు ఒక విశిష్ట యాగము.

32. మత్స్యావతారం

1. పూర్వము, ఆరవ మన్వంతరాంతమున సంభవించిన అవాంతర ప్రళయ సమయమునందు, చతుర్ముఖుడు విశ్రమింపబోవుచుండగా, హయగ్రీవుడను మహాసురుడు, అతనినుండి వేదములను అపహరించినాడు. వాటిని, తిరిగి ప్రపంచమునకు ప్రసాదించు నిమిత్తము, నీవు, మత్స్యరూపమున నవతరించుటకు సంకల్పించుకొనినావు.

2. ఆ సమయమున, ద్రమిడ దేశాధిపతి అయిన సత్యవ్రతుడు, కృతమాలయను ఒక నదియందు జలతర్పణ మొనర్చుచుండగా, దేదీప్యమానముగ ప్రకాశించుచున్న ఒక బాల మీనమవై, నీవు, అతని దోసిట గోచరించినావు.

3. వెంటనే, ఆ రాజర్షి, దానిని, ఆ నదీ జలమున వదలివేసినాడు. కాని, అది భీతిలుచున్నటులు గ్రహించి, ఆయన, దానిని, తన జలపాత్రమున నుంచుకుని, ప్రాసాదమునకు గొనిపోయినాడు.

ఆ విధముగ జలపాత్రమునందు ప్రవేశించిన మీను, అనతికాలముననే, ఆ జలపాత్రను, ఒక బావిని, తటాకమును, సరస్సునుకూడ ఆక్రమించుకొనునంతటి దైనది.

4. అనంతరము, ఆ మహారాజు, నీ ఆదేశము ననుసరించి, తన యోగబలముద్వారా, దానిని, సముద్రమున వదలినాడు. ఆ సమయమున, ఆయన, ప్రళయ సందర్శనమునందు తనకుగల కుతూహలమును నీకు నివేదించుకొనుటయు, 'ఒక వారము దినములలో నీ కోరిక తీరగలద'ని నీవతనికి మాటయిచ్చి, అంతర్హితుడ వగుటయు జరిగినది.

5. నీవు తెలిపినటులనే, జలప్రళయము సంభవించినది. భూమి అంతయు, మున్నీటిలో మునిగిపోయినది. అప్పుడు, అందు కొట్టుకుపోవు చున్న ఆ రాజర్షియు, సప్తర్షులును(1) నీ శరణు జొచ్చినారు.

6. ఆ సమయమున, నీకు సర్వదా విధేయురాలై ఉండు భూదేవి, ఒక నావ రూపమున వారిని సమీపించినది. అప్పుడు, వారందరును అందు ప్రవేశించినారు. కాని, ఆ నావ, తరంగముల తాకిడికి అటునిటు ఒరుగుచుండుటవలన, వారు, తిరిగి భీతావహులగుట సంభవించినది. అప్పుడు, నీవు, బృహద్రూపమున, సముద్రగర్భమునుండి బాహిరిల్లినావు.

7. మీనాకృతిలో బృహద్రూపమున వారి యెదుట సాక్షాత్కరించిన నీవు, ఒక లక్ష యోజనముల విస్తీర్ణము కలవాడవై ఉన్నావు. నీ తేజము, అత్యంతోత్కృష్టమైనదిగా ఉన్నది. అట్టి నిన్ను దర్శించుకొనిన మహర్షులు, ఆ వెంటనే, నీ ఆదేశానుసారము, ఆ నావను, నీ ఉన్నత శృంగమునకు (కొమ్మునకు) బంధించినారు.

8. ఆ పైన, నీవు, ఆ నావను ఈడ్చుకొనుచు పోయి, అందున్న మహర్షులకు, ప్రపంచమంతయు చూపించినావు. ఆ సమయమున, నిన్ను స్తుతించుచున్న సత్యవ్రత మహారాజునకు, ఆత్మజ్ఞానోపదేశముకూడ చేసినావు.

9. ప్రళయాంతమున, నావలోని సప్తర్షులను, వారివారి స్థానములలో వదలి, సత్యవ్రత మహారాజును వైవస్వతుడను మనువుగా నియమించి, అమిత క్రోధముతో, హయగ్రీవుని అనుగమించినావు.

10. అనతి కాలముననే ఆ రాక్షసుని కలుసుకుని, నీ ఉత్తుంగ శృంగముతో అతని వక్షస్థలమును చీల్చి, అతనిని సంహరించినావు.

ఆ పైన, సంతోషస్వాంతుడై ఉన్న చతుర్ముఖునకు, వేదరాశిని అంద జేసినావు.

ప్రభంజనాగారపతీ(2) ! కృష్ణా ! ఆ రాక్షసునివలెనె, నా రోగములను కూడ చీల్చి చెండాడి, ఆ వేదములనువలె నన్నును ఉద్ధరింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) సప్తర్షులు : అత్రి వసిష్ఠుడు కాశ్యపుడు గౌతముడు భరద్వాజుడు విశ్వామిత్రుడు జమదగ్ని అనువారలు.

(2) ప్రభంజనాగారము : గురువాయూరు.

33. అంబరీషోపాఖ్యానం

1. వైవస్వతమనువు పుత్రుడు, నభాగుడు. నభాగుని కుమారుడు, నాభాగుడు. ఆ నాభాగునకు జనించినవాడే అంబరీషుడు.

అంబరీషుడు, సప్తసముద్ర పరీవృతమైన భూమండలమున కంతటికిని ప్రభువై కూడ, సదా, నిన్ను భజించుటయందును, నీ భక్తులను సేవించుటయందును, అమితోత్సాహము చూపుచుండువాడు.

2. ఆయనది అనన్యమైన భక్తి. నిన్ను ప్రసన్నుని చేసుకొనుటయే ఆయన యేకైక లక్ష్యము. అది కారణముగనే, ఆయన, సర్వకర్మలను, నీ ప్రీతికొరకే చేయుచుండువాడు. వాటి ఫలమును, నీకే అర్పించుకొనుచుండువాడు. అది గ్రహించిన నీవు, ఆయనకు రక్షణకల్పించు నిమిత్తము, సహస్ర ముఖములుగల నీ చక్రాయుధమును, అయాచితముగనే, ఆయనకు ప్రసాదించినావు.

3. ఆ అంబరీషు డొకసారి, భార్యా సహితుడై, యమునాతీరమున నున్న మధువనమున ప్రవేశించి, అత్యుత్సాహముతో, ఒక సంవత్సర కాలము, ద్వాదశీ వ్రతము నాచరించినాడు. ఆ సందర్భమున, ఆయన, అరువది కోట్ల ఆవులను, అర్హులకు దానము చేసికొనుట జరిగినది.

4. ఏకాదశినాడు ఉపవశించి, సభక్తికముగ నిన్ను అర్చించుకుని, ద్వాదశీదినమున, ఒక నిర్ణీత సమయమునకు పారణచేయుట అనునది ఆ వ్రత నియమము. ఆ నియమానుసారము, అర్చనాదికములను ముగించుకుని పారణకు ఉపక్రమింపనున్న ఒక ద్వాదశీ దినమున, దుర్వాస మహర్షి, ఆ మహారాజును కలుసుకొనినాడు. భోజనార్థము ఆహూతుడైనాడు. ఆ పైన పరపీడనమందు ప్రసిద్ధుడైన ఆ మహానుభావుడు, మాధ్యాహ్నిక కర్మానుష్ఠానము కొరకు, యమునానదికి, నిదానముగ వెళ్ళసాగినాడు.

5. అంతలో, దీక్షావిరమణ సమయము ఆసన్నమైనది. ఆహూతుడైన మహర్షి, అంతవరకును తిరిగి రాలేదు. ఆ పరిస్థితిలో, జలపారణ మొనర్చుట దోసముకాదన్న అభిప్రాయము ఆ మహారాజునకు కలిగినది; ఆయన, అటులనే ఆచరించినాడు.

అనంతరము విచ్చేసిన దుర్వాసుడు, తన దివ్యదృష్టిద్వారా, అది గ్రహించినాడు. గ్రహించి, అది, ఆహూతుడైన తనపట్ల ఆ మహారాజు సలిపిన అపచారముగ భావించినాడు. ఆ వెంటనే, అమిత క్రోధముతో, తన కేశపాశముల నుండి ఒక జటను పెఱికి, ఆ మహారాజును భస్మీకరించు నిమిత్తము, భయంకరమైన ఒక కృత్యను(1) సృజించినాడు.

6. బ్రహ్మాండమునంతను భస్మీకరింపగల ఆ కృత్య, కరవాలమును ధరించి తన సముఖమున నిలబడినను, భక్తాగ్రేసరుడైన అంబరీషుడు భయపడలేదు. ఆ సమయమున, నీదైన సుదర్శనచక్రము ఆ కృత్యమీదకు పోయి, దానిని దహించినది; దుర్వాసునిమీద పడినది.

7. అది గ్రహించిన దుర్వాసుడు, భయవిహ్వలుడై పరువిడిపోవుచు, ముల్లోకములను చుట్టినాడు. అత డెచటికి పోయినను, ఆ చక్రము అతనిని వెంటాడుచునే ఉన్నది.

ఆ ఆపదనుండి బయటపడు నిమిత్తము, దుర్వాసుడు, ఆ మీదట, చతుర్ముఖుని ఆశ్రయించినాడు. కాని, ప్రయోజనము లేకపోయినది. కాలచక్రము నధిగమింపగల శక్తి యెవరికిని లేదని చెప్పి, చతుర్ముఖుడు, ఆయనను పంపివేసినాడు.

అంతట, ఆ మహర్షి, శంకరుని శరణుజొచ్చినాడు. శంకరుడు కూడ, నిన్ను స్మరించుకుని నమస్కరించినాడేకాని, ఆయన ఆపదను వారింపలేకపోయినాడు.

8. అనంతరము, దుర్వాస మహర్షి, వైకుంఠమును చేరుకుని, నీకు ప్రణమిల్లినాడు. ప్రాణదానము చేయవలసినదిగ నిన్ను ప్రార్థించినాడు.

అప్పుడు, నీ వాయన నుద్దేశించి, 'మహర్షీ! నేను భక్తజన సేవకుడను. వారిని కాదని నే నేమియు చేయలేను. జ్ఞానము తపము అనునవి వినయముతో కూడుకొనినపుడే ఆదరణీయములు కాగలవు. కావున, మీరు, ఆ అంబరీషునే ఆశ్రయింపవలసినది' అని హితోపదేశము చేసినావు.

9. ఆ పైన, దుర్వాసమహర్షి, అంబరీషుని పాదములమీదపడి, క్షమాభిక్ష నర్థించినాడు. వినయశీలి అయిన ఆ మహారాజు, ఆ పరిస్థితిని అర్థము చేసుకుని, కొంచెము ప్రక్కకు తొలగి నిలబడి, నీ సుదర్శనమును స్తుతించినాడు. ఆ వెంటనే, అది, అంతర్ధానమైనది.

సుదర్శన చక్రము ఆ విధముగ తిరోగమించినమీదట, దుర్వాస మహర్షికి, ప్రాణములు కుదుటబడినవి. తన దోషమునుకూడ విస్మరించి, తన్ను కాపాడిన అంబరీషుని భక్తిభావమును, ఆయన, అమితముగ ప్రశంసించినాడు; హృదయపూర్వకముగ అతని నాశీర్వదించినాడు.

10. దుర్వాసమహర్షి ఆగమనమునకు నిరీక్షించుచు, ఒక సంవత్సర కాలము నిరాహారిగ ఉన్న అంబరీషుడు, ఆ సమయమున, ఆయనకు మృష్టాన్న భోజనము పెట్టి, సంతుష్టిపరచి సాగనంపినాడు; అటుపిమ్మటనే తాను భుజించినాడు.

అది మొదలు, అంబరీషుని భక్తి, నీ పట్ల అతిశయింపజొచ్చినది. అది కారణముగ, అతనికి, కాలక్రమమున, సాయుజ్యముక్తి లభించినది.

ముక్తిప్రదాతా! కృష్ణా! నా రోగపీడనుండి నా కెప్పుడు ముక్తిని కలిగింతువు నాయనా!

అర్థము - వివరణ

(1) కృత్యా : భీకరాకారము గలదియు దారుణ కృత్యము లొనర్చునదియు నైన ఒక శక్తి.

34. శ్రీ రామ చరిత (అ)

1. దశముఖుడైన రావణాసురుని సంహరింపవలసినదిగ దేవతలచే ప్రార్థితుడవైన నీవు, కోసల దేశమున, ఋష్యశృంగ మహర్షి నిర్వహించిన పుత్రకామేష్టి[1] ద్వారా దశరథ మహారాజునకు లభించిన దివ్య పాయసమును స్వీకరించి, ఏక కాలమున గర్భవతులైన ఆయన భార్యలు ముప్వురి యందును, భరత లక్ష్మణ శత్రుఘ్న లనుజులుగా గల శ్రీరామచంద్రుడవై జన్మించినావు.

2. విశ్వామిత్ర మహర్షి నిర్వహింపనున్న యాగమును సంరక్షించు నిమిత్తము, శ్రీరామచంద్రుని రూపముననున్న నీవు, కోదండమును ధరించి, నీ తండ్రి ఆదేశము ప్రకారము, లక్ష్మణునితోకూడ బయలుదేరినావు. దారిలో, ఆ మహర్షి ప్రసాదించిన బల అతిబల అను రెండు మహా మంత్రముల ప్రభావమున, మార్గాయాసమును తొలగించుకుని, లోకకళ్యాణము లక్ష్యముగా గల ఆయన మాటమీద, తాటకను వధించి, ఆయననుండి అనేక దివ్యాస్త్రములను పొంది, ఆయనదైన సిద్ధాశ్రమమును చేరుకొనినావు.

3. యాగారంభమునందు, బాణప్రయోగముద్వారా మారీచుని పారద్రోలి, ఇతర రాక్షసులను సంహరించినావు. మార్గమధ్యమున, నీ పాద రజముద్వారా, అహల్యకు శాపవిముక్తి కలిగించినావు. ఆపైన, విదేహ రాజ ప్రాసాదమునకుపోయి, అచటి శివధనుస్సును విఱిచి, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మియే అయిన భూపుత్రిని, సీతామహాదేవిని, స్వయంవరమున గెలుచుకుని, ముప్వురు సోదరులతోను, వారివారి భార్యలతోను, నీ రాజధాని అయిన అయోధ్యానగరమునకు తిరుగు ప్రయాణము సాగించినావు.

4. మార్గమధ్యమున, భృగుకుల తిలకుడైన పరశురాముడు క్రోధముతో నిన్ను ప్రతిఘటించినాడు. కాని, తుదకతడు, తన వైష్ణవ తేజమును

నీకు సమర్పించుకుని వెళ్ళిపోవుట సంభవించినది. దివ్యమూర్తీ! ఆ పైన, నీవు, అయోధ్యను చేరుకుని, నీ ప్రియురాలైన సీతామహాదేవితో, సుఖ జీవితమును గడుపసాగినావు.

అనంతరము, భరత శత్రుఘ్నులు తమ మేనమామల యింట నున్నపుడు, మీ తండ్రి అయిన దశరథుడు, నీకు పట్టాభిషేకము చేయ సంకల్పించినాడు. కాని, నీ సవతితల్లి అయిన కైకేయి, దానికి విఘ్నము కలిగించినది.

5. పితృవాక్య పరిపాలనార్థము, కోదండధారివయిన నీవు, అర్థాంగి అయిన జానకితోను, అనుజుడైన లక్ష్మణునితోను బయలుదేరి అరణ్యము నకు పోవుచు, మార్గమధ్యమున, అంతవరకు నిన్ను అనుసరించివచ్చిన అయోధ్యాపురవాసు లందరను వదలి, నిషాద విభుడైన గుహుని నివాస మును చేరుకొనినావు.

ఆ పైన, జటా వల్కలములు ధరించి, గుహుడు సమకూర్చిన ఒక నావ సహాయముతో గంగానదిని దాటి, ఆ సమీపముననేఉన్న భరద్వాజ మహర్షిని సందర్శించుకుని, ఆయన సూచనమీద, పర్వతరాజమైన చిత్ర కూటమున, అతి ప్రశాంత జీవితమును గడుపసాగినావు.

6. పుత్ర వియోగమును భరింపలేక, మీ తండ్రి అయిన దశరథ మహారాజు స్వర్గస్థుడైనాడని భరతునివలన విని, దుఃఖించి, ఆయనకు తిలో దకము నర్పించుకుని, నీవైన పాదుకలను, పాదధూళిని, అక్కడనే, భరతు నకు ప్రసాదించినావు. ఆ పైన, అత్రి మహర్షికి అంజలించి, విస్తృత దండ కాటవిలో ప్రవేశించి, అక్కడ, భయంకరరూపము గల విరాధుని వధించి నావు. అంతవరకు నీ దర్శనముకొరకు వేచిఉన్న శరభంగ మహాముని(2) అంతిమ యాత్రను సహర్షముగ తిలకించినావు.

7. అటుపిమ్మట, తాపసుల తాపమును తొలగించు ఉద్దేశముతో, 'అసురానీకము నంతరింపజేసెదను' అని, వారి సముఖమున శపథముచేసి,

అగస్త్య మహర్షికి అంజలించి, ఆయన ప్రసాదించిన ఒక దివ్య ధనుస్సును, బ్రహ్మాస్త్రమును, కొన్ని అక్షయతూణీరములను(3) ఖడ్గమును గ్రహించినావు.

అనంతరము, మీ తండ్రిఅయిన దశరథుని బాల్యసఖుని, జటాయువను పక్షీంద్రుని, కలుసుకొనినావు. ఆ పైన, గోదావరీతీరముననున్న పంచవటియందు, పత్నీ సహితుడవై, కొంతకాలము, నిరతిశయానందమున నివసించినావు.

8. ఆ సమయమున, శూర్పణఖ అను ఒక రక్కసి, నిన్ను సమీపించి, కామ పరవశురాలై నీతో వ్యవహరింపసాగినది. అది సహింపలేక, నీ వామెను సౌమిత్రివద్దకు పంపినావు. అత డామె చేష్టలు గ్రహించి, ఆగ్రహించుకుని, ఆమె నాశికను నఱకివేసినాడు.

ఆ స్థితిలో ఆమెనుచూసిన ఖర దూషణ త్రిశిరులు, క్రోధపరవశులై, పదివేలమంది రాక్షస గణముతో నీ మీద పడినారు. వా రందరిని, నీవు, తక్షణమే యమపురి కనిపినావు.

9. శూర్పణఖద్వారా ఆ వర్తమానమును గ్రహించిన రావణుడు, అమితముగ ఉద్రేకపడినాడు. నీ పట్ల పగబూనినాడు. ఆ పగను సాధించుకొను నిమిత్తము, మారీచుని, మృగరూపమున నీ ఆశ్రమ ప్రాంతమునకు పంపినాడు.

ఆ మాయా మృగము, సీతాదేవి మనసు నాహరించినది. ఆమెకు ఆనందమును చేకూర్చు నిమిత్తము, రామచంద్రుని రూపముననున్న నీవు, దానిని వెంబడించి, ఒక బాణముతో కూల్చివేసినావు.

మృగరూపధారి అయిన మారీచుడు, మరణించుటకుముందు పెట్టిన కేక విని, సీతాదేవి, నీ సోదరుడైన లక్ష్మణుని, నీ సహాయార్థము పంపినది. ఆ అవకాశమును చూసుకుని, రావణుడు ఆమెను అపహరించుకు పోయి

నాడు. సీతా వియోగము నీకు దుఃఖమునే కలిగించినను, రావణ వధో పాయము దొరికినందులకు, నీవు, అంతరంగమున అమితముగ ఆనందించినావు.

10. అనంతరము, సీతామాత కొరకు నీవు వెదకుచున్న సమయమున, 'రావణుడు నన్ను నటికి, నీ అర్థాంగిని అపహరించుకు పోయినాడు' అని తెలిపి ప్రాణము వదలిన జటాయువునకు, నీవు, స్వయముగ అగ్ని సంస్కార మొనర్చినావు. ఆ పైన, నిన్నును నీ సోదరుని మ్రింగవచ్చిన కబంధుని వధించినావు. అటు పిమ్మట, పంపాసరోవరముచెంత, శబరికి దర్శన మొసంగినావు; చిత్రకూటమువద్ద, హనుమంతుని కలుసుకుని, అమితానందము నందినావు.

ఆనందరస స్వరూపా ! కృష్ణా ! నా రోగములను నిర్మూలించి, లేశమాత్రపు ఆనందమునైనను నాకు ప్రసాదింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) పుత్రకామేష్ఠి : కుమారునికోరి చేయు ఒక యజ్ఞము.

(2) శరభంగ మహాముని : ఈయన దండకారణ్యమున నుండువాడు. ఈయన సలిపిన తపమునకు సంతసించి ఈయనను స్వర్గమునకు గొని పోవు నిమిత్తము మహేంద్రుడే స్వయముగ వచ్చినాడు. కాని, యీ మహర్షి ఆయనతో పయనింపక, ఆ సమయమున నచటికి చేరుకొనిన శ్రీరామచంద్రుని దర్శించుకొను నిమిత్తము వెళ్ళినాడు. ఆయనను దర్శించుకుని, కృతార్థుడై, తన తపోబలము ద్వారా అచటనే అగ్నిని కల్పించుకుని, అందు ప్రవేశించి శరీర త్యాగ మొనర్చికొనినాడు.

(3) అక్షయ తూణీరములు : ఎన్ని ప్రయోగించినను తరగుట నెరుగని బాణములు.

35. శ్రీ రామ చరిత (ఆ)

1. అనంతరము, నీవు, హనుమంతునిద్వారా, సుగ్రీవునితో మైత్రి నెఱపుకుని, దుందుభికాయమును(1) కాలి బొటనవ్రేలితో దూరముగ విసరి వేసి, ఒకే ఒక బాణముతో సప్త తాలములను కూల్చివేసినావు(2). ద్వంద్వ యుద్ధమున సుగ్రీవుని వధింపనున్న అమిత బలశాలి అయిన వాలిని, కపటోపాయమున సంహరించినావు. ఆ పైన, పత్నీ వియోగమునకు దుర పిల్లుచు, వర్షాకాలము నంతను, మతంగాశ్రమ ప్రాంతమున గడపికొనినావు.

2. అటుపిమ్మట, లక్ష్మణుని ఉపాలంభనము కారణముగ భయము గొనిన సుగ్రీవుడు సమాయత్తపరచి నీ సమక్షమున నుంచిన వానర సేనను వీక్షించి, ముదిత హృదయుడవైన నీవు, సీతామాతకు అందజేయుటకుగాను, సంజ్ఞా చిహ్నమైన ఒక అంగుళీయకమును, సందేశమును, హనుమంతునకు ప్రసాదించినావు. అనంతరము, వానర వీరులు, నీ ప్రియురాలి నన్వే షించుచు బయలుదేరినారు.

3. నీ వార్త వినిన వెంటనే, పోయిన రెక్కలు తిరిగి వచ్చిన సంపాతి(3) అమిత వేగమున నెగిరివచ్చి చెప్పిన మాటలు ఆధారముగ, సముద్రమును లంఘించి, లంకలో ప్రవేశించిన హనుమంతుడు, నగరాంత ర్భాగమునఉన్న సీతామాతను దర్శించుకొనినాడు. ఆమెకు, నీ విచ్చిన అంగుళీయకమును సమర్పించుకొనినాడు. అశోకవనము నంతను ధ్వంసము చేసి, యుద్ధమున, అక్షయ కుమారుని వధించినాడు.

ఆ పైన, బంధితుడై, రావణుని సముఖమునకు వెళ్ళినాడు. లంకా రాజ్యమును అగ్నికి ఆహుతి చేసినాడు. అనతి కాలముననే, సీతామహాదేవి పంపిన ముద్రికను నీకు సమర్పించుకొనినాడు.

4. అనంతరము, నీవు, సుగ్రీవుడు అంగదుడు మున్నగు మహా వీరుల నాయకత్వమున, భూమినంతను ఆవరించి కదులుచున్న వీరవానర సేనా సమూహముతో, యుద్ధమునకు బయలుదేరినావు. ఆ సమయమున, రాక్షసేశ్వరుని సోదరుడైన విభీషణుడు, సముద్ర తీరమున మిమ్ము కలుసుకుని, నీ శరణు కోరినాడు; శత్రు సంబంధమైన రహస్యములను నీకు విన్నవించుకొనినాడు.

అటుపిమ్మట, నీవు, సముద్రుని ఉద్దేశించి, దారినీయవలసినదిగ కోరుటయు, అతడు, మొదట నిరాకరించుటయు జరిగినది. దానిపై నీవు, ఆగ్రహించుకుని, ఒక ఘోర నారాచమును అతనిమీద ప్రయోగించుట కుద్యుక్తుడవైనావు. అది గ్రహించి భయకంపితుడైన సముద్రుడు, ఆ వెంటనే, నీ కొరకు, జలమధ్యమున దారి నేర్పరచినాడు.

5. వానరులు దశదిశలనుండి తెచ్చిన పర్వతములతో, సముద్రము మీద, సేతు నిర్మాణము జరిగినది. దాని సాయమున, నీవు, వానరు లందరితోను సముద్రమును దాటి, లంకలో ప్రవేశించినావు.

ఆ విధముగ లంకాప్రవేశ మొనర్చిన వానరులు, తమ పళ్ళతోను గోళ్ళతోను రాక్షసుల నమితముగ పీడింపసాగినారు. గుట్టలను కొండలను వృక్షములను విసరి, వారిని, చూర్ణము చేయజొచ్చినారు.

అంతలో, ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రము, మీ సోదరు లిరువురను బంధించినది. కాని, నీ వాహనమైన గరుడుడు, తన రెక్కలు విసరుటవలన కలిగిన గాలి మూలమున, మీరు విముక్తులగుట సంభవించినది.

6. సంకుల సమరము జరుగుచున్న సమయమున, రావణుడు వదలిన ఒక శూలము, లక్ష్మణుని మూర్ఛిలజేసినది. కాని, హనుమంతుడు పెకలించితెచ్చిన ఒక పర్వతము మీది మృతసంజీవని అను ఓషధీ గంధము నాఘ్రాణించుటవలన, అతడు తెప్పరిలుట జరిగినది.

ఆ పైన, మాయాయుద్ధమున కుపక్రమించిన ఇంద్రజిత్తును, లక్ష్మణుడు సంహరించినాడు.

అటుపిమ్మట, రావణుడు, కొన్నిమాయలను ప్రయోగించి, నిన్ను ఖిన్నుని చేసినాడు. కాని, విభీషణుని సాయమున, ఆ వెంటనే, నీవు, మనసును దిట్టపరచుకుని, కనిపించిన కపీశ్వరులందరను కబళించుచు, కాశ్యపిని కంపింపచేయుచు నిన్ను సమీపించిన కుంభకర్ణుని వధించినావు.

7. అనంతరము, మహేంద్రుడు పంపిన కవచమును ధరించి, దివ్య రథము నధిరోహించి, బ్రహ్మాస్త్ర ప్రయోగముద్వారా దశాస్యుని విగతాసువు నొనర్చినావు. అగ్నిప్రవేశమొనర్చి, తన పావిత్ర్యమును నిరూపించుకొనిన సీతామాతను స్వీకరించినావు.

ఆ సమయమున, దేవతానీకము, అంతకుముందు సంగరరంగమున గాయపడినవారికి బాధానివారణ మొనర్చుటయు, విగతజీవులైనవారికి ప్రాణదానము చేయుటయు జరిగినది. అప్పుడు, నీవు, నీ ధర్మపత్ని అయిన ధరణీజాత్మజతోను, లంకేశ్వరుడైన విభీషణునితోను, వీరవానర సమూహముతోను, పుష్పకవిమానము నధిరోహించి, అయోధ్యాభిముఖుడవై బయలుదేరినావు.

8. అనంతరము, నీకు, అయోధ్యానగరమున దివ్యపట్టాభిషేకము జరిగినది. అటుపిమ్మట నీవు, పదివేల సంవత్సరములు, మహారాజభోగము లనుభవించినావు.

ఆ పైన, సీతామహాదేవిని గురించి, ఎవరో ఏదో అనుకొనినట్లు విని, ఆ సమయమున గర్భిణిగాఉన్న ఆమెను, అడవులకు పంపివేసినావు. శివ ! శివ ! పాపము పరిహార మగుగాక !

అనంతరము, శత్రుఘ్నుని ద్వారా లవణాసురుని చంపించుటయు నీచుడైన శంబూకుని, నీవు స్వయముగ వధించుటయు జరిగినది.

ఆ సమయముననే, వాల్మీకి మహర్షి ఆశ్రమమున తలదాచుకొనుచున్న సీతామహాదేవి సుఖముగ ప్రసవించినది; ఇరువురు కుమారులను నీకు ప్రసాదించినది.

9. అటుపిమ్మట, నీవు, అశ్వమేధయాగము నొనర్చుచున్నపుడు, వాల్మీకి మహర్షి రచించిన నీ దివ్యచరిత్రను, నీ కుమారులైన లవ కుశులు అతిమనోహరముగ గానము చేసినారు. దాని నాకర్ణించిన నీవు, సీతామాతను తిరిగి కలిసికొనుటకు ఉబలాట పడినావు. కాని, ఆమె, నిన్ను చేరుటకుమారు తన కన్నతల్లిని చేరుకొనినది.

ఆ పైన, కాలుడు కూడ, 'తిరిగి వైకుంఠమునకు విచ్చేయవలసినది' అని నిన్ను ప్రార్థించినాడు. ఆ వెంటనే, నీవు, ఏదో ఒక అల్పవ్యాజమున, లక్ష్మణుని పరిత్యజించి, సపరివారముగ సరయునదిలో ప్రవేశించి, స్వర్గారోహణమొనర్చినావు. అచటి నుండి, నీ మౌలిక నివాసస్థానమైన దివ్యధామమును, వైకుంఠమును, చేరుకొనినావు.

10. చక్రపాణీ! ఆ విధముగ నీవు మర్త్యరూపమును ధరించినది, అమితానురాగమున వియోగ దుఃఖము సంభవించుననియు, అత్యంత ధర్మాసక్తి మూలమున, నిరపరాధులను కూడ త్యజింపవలసివచ్చుననియు, మానవులకు బోధించుటకే కదా ప్రభూ! అది కానియెడల, స్వాత్మానందమున సదా రమించుచుండు నీకు మనోవికారమెక్కడిది!

శుద్ధ సత్వస్వరూపుడవైన కృష్ణా! నన్ను వేధించుచున్న వికారముల నన్నిటిని తొలగింపుము నాయనా!

అర్థము - వివరణ

(1) దుందుభి : మయుని కుమారుడు. మహా బలశాలి. పరాక్రమవంతుడు. ఇతనితో పోరుటకు మహేంద్రుడుకూడ భయపడినాడు.

దుందుభి వాలితో యుద్ధము చేసినాడు. అతనిచేత సంహరింపబడినాడు.

రక్తము క్రక్కుచు ప్రాణమువదలిన యితనిని పైకెత్తి విసరివేసినపుడు, అతని రక్తబిందువు ఒకటి, అప్పుడు ఋష్యమూక పర్వతమున తపమాచరించుకొనుచున్న మతంగ మహాముని పైపడినది. అది కారణముగ, ఆ ముని, వాలిని ఉద్దేశించి, 'నీ వీ పర్వతముమీదకు వచ్చినచో తలపగిలి చచ్చిపోదువు' అని శపించినాడు. అది గ్రహించిన వాలి అచటికి పోవుట మానుకొనినాడు.

దుందుభి శరీరము అప్పటినుండి అక్కడనే ఉండిపోయినది. ఉట్టి బొమికల 'గూడు'గా తయారయినది. అయినను, శ్రీరాముడు ఋష్యమూకము చేరుకొనువరకు దానిని ఎత్తగలవారు ఎవరును కనిపించలేదు. అది కారణముగనే, సుగ్రీవుడు, వాలిని సంహరించుట కుద్యుక్తుడైన ఆయనతో, 'స్వామీ! మీ రీ దుందుభికాయము నెత్తగలిగిన, మీ మాటలమీద నాకు విశ్వాసము కుదురగలదు' అని విన్నవించుకొనినాడు. ఆ పలుకులు వినిన రామచంద్రుడు, చిరునవ్వుతో, సునాయాసముగ ఆ శరీరమును తన కాలి కొనగోటితో ఎత్తి పది ఆమడల దూరము విసరివేసినాడు.

(2) సప్త తాలములు : ఋష్యమూక పర్వతమునందున్న ఏడు తాటిచెట్లు. అవి అక్కడక్కడ ఉన్నవి. ఆ యేడింటిని ఒక్క బాణమున కూల్పగలవాడే వాలిని సంహరింపగలడనునది సుగ్రీవుని దృఢాభిప్రాయము. శ్రీరామచంద్రుడు ఆ పనిచేసి, సుగ్రీవునిలో తనపట్ల పరిపూర్ణమైన విశ్వాసమును కలిగించుకొనినాడు.

(3) ...సంపాతి : జటాయువునకు అన్న. యౌవన మదముతో సూర్యమండలమున కెగిరి రెక్కలు కాల్చికొనినవాడు. ఇతడు వింధ్యాచలమున పడిఉన్న సమయమున, రామకార్యమున పోవుచున్న వానరులను దర్శించుకొనుటయు, ఆ వెంటనే అతనికి పోయిన రెక్కలు తిరిగి వచ్చుటయు జరిగినది.

36. పరశురామావతారం

1. కృష్ణా ! నీవు పూర్వము, అత్రిమహర్షికీ అనసూయకూ కుమారుడవై జన్మించి, దత్తాత్రేయుడవుగా ప్రసిద్ధి వహించినావు. ఆ సమయమున, దత్తరూపమున నున్న నీకు, అశేషశిష్యగణ ముండెడిది. వారు, నిన్ను, అనుక్షణము, దేనికో ఒకదానికి వేధించుచుండెడి వారు. అది కారణముగ, నీవు, వారిని వదలి, భార్యాసమేతుడవై యథేచ్ఛావిహార మొనర్చుచుకూడ, సదా, ఆత్మానందమునందు మునిగి తేలుచుండువాడవు.

ఆ విధముగడున్న సమయమున, నీ పరమభక్తుడైన హైహయరాజు, కార్తవీర్యార్జును డనువాడు, దత్తరూపమున నున్న నిన్ను కలుసుకుని, అత్యంతభక్తితో పరిచర్యలొనర్చినాడు. అపుడు, నీవు, వానికి, అష్ట సిద్ధులను(1) ప్రసాదించినావు; నీ మూలముననే మరణము సంభవించునట్లు కూడ వాగ్దానము చేసినావు.

2. ఆ కాలమున, క్షత్రియులు, బ్రహ్మద్వేషులుగా ఉండు వారు. అది కారణముగ, వారు, భూమికి భారమైనారు. అయినను, అర్జునుడు, తనశక్తి మూలమున వారిని అణచియుంచువాడు.

అట్టి క్షత్రియకులమును నిర్మూలించుటకును, అర్జునునకు నీవు చేసిన వాగ్దానమును చెల్లించుకొనుటకును, నీవు, భృగువంశమున, పరశురాముడను పేర, రేణుకా జమదగ్నులకు కనిష్ఠకుమారుడవై జనించి నావు; ఆ దంపతులకు అమితానందము నొడగూర్చినావు.

3. పదునాలుగేండ్ల ప్రాయముననే, నీకు, సర్వవేదసారమును కరత లామలకమైనది. ఆ సమయమున, ఒకసారి, గంధర్వపతి అయిన చిత్ర రథుని చూసిన మీ తల్లి మనసు, కొలదిగ చలించుట సంభవించినది. అది గ్రహించిన మీ తండ్రి, ఆగ్రహావేశపరవశుడై, ఆమెను నిర్జింపవలసినదిగ

కుమారుల నాదేశించినాడు. కాని, పరశురాముడుతప్ప యితరు లెవరును ఆయన మాటను పాటింపలేదు. ఆ వెంటనే, పరశురాముడు, వారందరి శిరములు నరికివేసినాడు. తన తల్లిని కూడ సంహరించినాడు. ఆ విధముగ, తన తండ్రికి సంతుష్టి కలిగించి, ఆయనను ప్రసన్నుని చేసుకుని, తను చంపినవారినందరిని బ్రతికించుకొనినాడు. ఆ సందర్భమున, అతని తల్లి అయిన రేణుకాదేవి, అతనికి, అనేక వరములు ప్రసాదించినది.

4. అనంతరము, జమదగ్ని, తన భార్యను సంతోషపరచు నిమిత్తము, తన ఆశ్రమమునకు, కామధేనువును గొనివచ్చినాడు. ఆపైన, భృగుమహర్షి ఆదేశానుసారము, పరశురాముని రూపమున నున్న నీవు, తపమాచరించుకొను నిమిత్తము హిమాలయములకు పోయినావు. నీ సలిపిన తపస్సునకు సంతుష్టిచెందిన శంకరుని ద్వారా, గండ్రగొడ్డలిని, మరికొన్ని దివ్యాయుధములను, గ్రహించినావు. ఆయన చూపిన రాక్షసుని వధించినావు. అటు పిమ్మట, అకృతవ్రణుడను మునిశ్రేష్ఠునితో స్నేహము చేసుకుని, ఆశ్రమమునకు మరలివచ్చినావు.

5. ఒకసారి, కార్తవీర్యార్జునుడు, మృగయా వినోదార్థము మీ ఆశ్రమ ప్రాంతమునకు వచ్చి, మీ తండ్రియిచ్చిన ఆతిధ్యమును స్వీకరించి, కామధేనువు ప్రసాదించిన మృష్టాన్నము నారగించి, తిరిగి తన రాజధానికి వెళ్లినాడు. అక్కడ, దుష్టబుద్ధిఅయిన తన అమాత్యుని సూచనమీద, ఆ గోవును విలుచుకొని వచ్చుటకుగాను ఒక మంత్రిని పంపినాడు.

దుర్మార్గుడైన ఆ మంత్రి, సురభినీ నందినినీ తోలుకుపోవు చుండుట చూసి, జమదగ్ని, అతనిని వారించినాడు. అది కారణముగ, క్రుద్ధుడైన ఆ మంత్రి, మహర్షిని సంహరించుటయు, ఆ దుశ్చర్యను సహింపలేక, సురభి, అతనిసైన్యము నంతను హతమార్చుటయు, తుదకు, ఆ మంత్రి, నందినీ ధేనువును మాత్రము తీసుకుని వెళ్లుటయు జరిగినది.

6. అనంతరము, శుక్రాచార్యుని ప్రభావమువలన పునర్జీవితుడైన నీ తండ్రి ద్వారా ఆ ఉదంతము నంతను విని, అమితక్రోధముతో,

నీవు, మహోదరుడు తెచ్చియిచ్చిన విల్లమ్ములను, గండ్రగొడ్డలిని, తీసుకుని, అకృతవ్రణునితో సహ రథము నధిరోహించి, మాహిష్మతీ నగరమున ప్రవేశించినావు. ఆ పైన, సామోపాయమున ఆ రాజన్యుని నుండి నందినీ ధేనువును తిరిగి పొందుట అసంభవమని తేల్చుకుని, నీ వతనితో యుద్ధమునకు తలపడినావు.

7. అప్పుడు, కార్తవీర్యార్జునుడు, తన పదివేలమంది కుమారులతోను, పదిహేడు అక్షౌహిణుల సేనతోను(2) వీరవరేణ్యులైన సేనాపతులతోను, మిత్రసమూహముతోను, నిన్ను ప్రతిఘటించినాడు. ఆ సమయమున జరిగిన సంకుల సమరములో నీవు, నీ పరశువుతోను, అక్షయ తూణీరములతోను, అతని సేనానివహమునంతను నిర్మూలించినావు.

అది గ్రహించి, చావగా మిగిలిన అతని కుమారు లనేకులు, భీత చిత్తులై, పలాయనమును చిత్తగించినారు. అనంతరము, మిగిలి ఉన్న తన వారిని కూడగట్టుకుని, ఆ రాజు, అకస్మాత్తుగ నీ మీద పడినాడు.

8. ఒకసారి, రావణాసురుడు, నర్మదా తీరమున ధ్యాననిమగ్నుడై ఉన్న సమయమున, క్రీడావశమున ఆ నదీ ప్రవాహము నాపి, దాని నతని మీదకు పంపి, అత డా జలమున మునిగిపోవునట్లుచేసి, అతని గర్వము నాహరించిన కార్తవీర్యుడు, అప్పుడు, నీ మీద, అనేక శస్త్రాస్త్రములను, యేక కాలమున ప్రయోగించినాడు. అనంతరము, సుదర్శన చక్రమునుకూడ వదలినాడు. కాని, ప్రయోజనము లేకపోయినది.

అప్పుడుగాని, అతనికి, నీవు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవే అను జ్ఞానము కలుగలేదు. ఆ విధమైన జ్ఞానము కలిగినవెంటనే, అతడు, అమితానందముతో నిన్ను ధ్యానించుకొనినాడు. అది కారణముగ, అతని పాపములన్నియు పటాపంచలైనవి. గర్వము హరించిపోయినది. అతనికి, నీదైన పరమ పదము లభించినది.

9. అనంతరము, అతని కుమారులు, తమ తండ్రిని సంహరించిన నీ మీద పగసాధించుకొనదలచి, నీ తండ్రిఅయిన జమదగ్నిని వధించినారు. అది కారణముగ, నీ తల్లి అయిన రేణుక, గుండెలు బాదుకుని రోదించినది. నీ వది చూసి, భరింపలేక, 'క్ష్మాతలమును క్షత్రియ నిర్ముక్త మొనర్చెదను' అని తీవ్ర శపథము చేసినావు. ఆ పైన, ధ్యానబలమున లభించిన శస్త్రాస్త్రములను ధరించి, రథము నధిరోహించి, దశదిశలనున్న బ్రహ్మద్వేషులను, క్షత్రియుల నందరను, నీ కఱకు గొడ్డలితో నఱికివేసినావు.

10. ఆ పైన, నీ తండ్రిని బ్రతికించుకుని, ఇరువదియొక్క మార్లు క్షత్రియులమీద దండెత్తి, వారి నందరను జయించి, ఆ సందర్భమున నేర్పడిన 'సమంత పంచక'మను రుధిర తటాకమున, నీ పితృదేవతలకు తర్పణము లర్పించుకుని, క్షత్రియకుల నిర్మూలనముద్వారా సంక్రమించిన పాపమును పరిహరించుకొనుటకుగాను, ఒక మహాక్రతువు నొనర్చినావు ఆ క్రతు సమయమున, నీవు జయించిన భూమినంతను, కశ్యపాదులకు యిచ్చివేసినావు.

అనంతరము, పరశురాముని రూపమునన్న నీవు, సాల్వునితో పోరుచుండగా, సనకాదులు నిన్ను సమీపించి, 'సాల్వుని సంహరించు పని శ్రీకృష్ణుని'దని విన్నవించుకొనుటవలన, నీ వా యుద్ధమునుండి విరమించుకొనినావు.

11. అనంతరము, నీవు, శస్త్రాస్త్రములన్నిటిని త్యజించి, మహేంద్ర పర్వతమున తపమాచరించుకొనుచున్న సమయమున, గోకర్ణమువరకు గల భూమిని సముద్రు డాక్రమించుకొనినాడని మహర్షులు నీకు విన్నవించుకొనినారు. ఆ వెంటనే, నీవు, ధ్యానమాత్రమున లభించిన ధనుస్సునకు ఆగ్నేయాస్త్రమును సంధించి, సముద్రునిమీద ప్రయోగించుటకు ఉద్యుక్తుడవైనావు. అది గ్రహించిన సాగరుడు, సంక్షోభించిపోయినాడు. ఆ వెంటనే, నీవు, నీ చేతులోని స్రువము(3) ద్వారా, జలరాశిని తిరోగమింపజేసినావు.

ఆ విధముగ ఉద్ధరింపబడిన భూభాగమే, అనంతరము, కేరళముగ ప్రసిద్ధి కెక్కినది ప్రభూ !

భృగుపతీ ! కృష్ణా ! సాగరమునే తిరోగమింపజేసిన నీవు, నా రోగములను తిరోగమింపజేయలేవా తండ్రీ !

అర్థము - వివరణ

(1) అష్టసిద్ధులు : అణిమ గరిమ లఘిమ మహిమ ఈశిత్వ వశిత్వ ప్రాప్తి ప్రాకామ్యములు.

(2) పదిహేడు అక్షౌహిణులు : 21870 రథములు, 21870 ఏనుగులు, 65610 గుఱ్ఱములు, 1,09,350 పదాతులు (నడిచే సైనికులు) కలది ఒక అక్షౌహిణీ సేన. అట్టివి పదిహేడు.

(3) స్రువము : హోమకుండమున ఆజ్యమునుంచు కొయ్యగరిటె.

37. శ్రీ కృష్ణావతారం (అ)

1. సాంద్రానంద రసస్వరూపా ! కృష్ణా ! పూర్వము, దేవ దానవ సంగ్రామమున, నీచే నిహతులైన రాక్షసులు కొందరు, పూర్వకర్మ వాసనలు పూర్తిగ క్షయముకాని కారణమున, మోక్షప్రాప్తి నందనివారై, తిరిగి జన్మించినారు. వారి వలన కలిగిన భారమును భరింపలేక, భూదేవి, బ్రహ్మదేవుని సమీపించినది. ఆ సమయమున, దేవతలందరును అచటనే ఉన్నారు.

2. అప్పుడు, భూదేవి, బ్రహ్మదేవుని ఉద్దేశించి, 'ప్రభూ ! అవనీతల మంతయు అసురులతో నిండిపోయినది. వారిని, నేను, భరింపలేకున్నాను. దుఃఖ సముద్రమున మునిగిఉన్నాను. నిస్సహాయురాలను. నా విషయము, మీ రందరకును విదితమే. నన్ను రక్షింపవలసినది' అని, అతి దీనముగ విన్నవించుకొనినది.

ఆమె దీనాలాపములను వినిన చతుర్ముఖుడు, ఆమెవంక, సాదరముగ చూసినాడు. దేవతల దుస్థితిని అర్థము చేసికొనినాడు. అనంతరము, నిన్ను స్మరించుకొనినాడు.

3. ఆ పైన, ఆయన, దేవతల నుద్దేశించి, 'భూదేవి పలికినదంతయు సత్యమే. ఇప్పుడు, ఆమెను మనలనందరనుకూడ రక్షింపగలవాడు ఆ లక్ష్మీపతి ఒక్కడే. ఆయననే మన మిప్పుడు దర్శించుకొనవలెను; ప్రార్థించి ప్రసన్నుని చేసుకొనవలెను' అని హితోపదేశ మొనర్చినాడు. అనంతరము, వా రందరును, మహేశ్వరుని ముందుంచుకుని, నీ దివ్యధామమునకు బయలు దేరినారు.

4. ఆ విధముగ బయలుదేరి, చల్లని పిల్లతెమ్మెరలతో విలసిల్లుచున్న పాల్కడలిని సమీపించి, ఏక మనస్కులై, వా రందరును, నిన్ను ధ్యానింప సాగినారు.

అంతలో, చతుర్ముఖునకు, అంతర్వాణి రూపమున, నీ సందేశము వినవచ్చినది. ఆ వెంటనే, ఆయన, వారిని ఉద్దేశించి, 'భగవద్వాణిని విన వలసినది' అని ఆదేశించినాడు; వారికి, ఆనందము నొడగూర్చినాడు.

5. ఆ పైన, 'దురాత్ములైన మేదినీ పతుల మూలమున, మీకును మేదినికిని సంభవించిన దురవస్థ నాకు అవగతమైనది. వారిని నిర్మూలించుటకే, నేను, నిశ్చయించుకొనినాను. అందుకొరకు, నేను, సచ్చిదానంద స్వరూపుడనై, యాదవ వంశమున నవతరింపనున్నాను. ఆ సందర్భమున, నన్ను అచట సేవించుటకుగాను, దేవతలును, వారి స్త్రీ జనమును, వారి వారి దివ్యాంశలతో, వృష్ణి కులమున జన్మింపవలసియున్నది' అను నీ సందేశమును, చతుర్ముఖుడు, వారికి అందజేసినాడు.

6. కృపామృత పరిపూర్ణమూ, కర్ణరసాయనమూ అయిన ఆ పలుకుల నాలకించి, నిలింపులు, సంతుష్ట స్వాంతులై, నీ వద్ద సెలవు తీసికొనినారు అనంతరము, శూరసేనుని కుమారుడైన వసుదేవుడు, దేవకుని కుమార్తె అయిన దేవకిని, నీ సన్నిధిచే పునీతమైన మథురానగరమున వివాహము చేసుకొనుట జరిగినది

7. వివాహానంతరము, ఆ నూత్న దంపతులను సన్మానించు ఉద్దేశముతో, దేవకీదేవి అన్న(1) అయిన కంసుడు, వారికి రథసారథిగా వ్యవహరించినాడు. ఆ సమయమున, 'దేవకీదేవి అష్టమ గర్భమున జనించినవాడు, దుష్టాత్ముడవైన నిన్ను సంహరింపగలడు' అను అదృశ్యవాణి అతనికి వినిపించినది. అది విన్న అతడు, అమితముగ కంపించిపోయినాడు. అది కారణముగ, తన ప్రక్కనేఉన్న దేవకిని సంహరించు నిమిత్తము, ఒరనుండి కత్తిని దూసినాడు.

8. అది చూసిన వసుదేవుడు, ఆ దురుద్యోగమునుండి అతనిని మరలించు ఉద్దేశముతో, యెన్నియో సాంత్వన వచనములు పలికినాడు.

కాని, దురాత్ముడైన కంసుని మనసు కరగినట్లు కనిపించలేదు. అది గ్రహించి ఆయన, ఆమెకు జనించిన పుత్రులందరను అతనికి ఒప్పజెప్పు కొనునట్లు శపథము చేసినాడు. ఆ పలుకులు వినిన కంసుడు, ప్రసన్న చిత్తుడై, గృహోన్ముఖుడైనాడు.

అనంతరము, వసుదేవుడు, తను చేసిన వాగ్దానము ప్రకారము, దేవకీదేవికి జనించిన మొదటి కుమారుని, అతనికి అప్పగించుట జరిగినది. అయినను, అతడు, ఆ బాలునిమీది వాత్సల్యము కారణముగ, అతనిని వధింపలేదు.

కఠినాత్ముల హృదయములుకూడ అప్పుడప్పుడు కరగిపోవుచుండును కదా ప్రభూ !

9. కాలక్రమమున, నారద మహర్షి, ఒకసారి, భోజరాజేంద్రుడైన కంసుని కలుసుకుని, ప్రసంగవశమున, 'రాజేంద్రా ! మీరు దైత్యులనియు, యాదవులు దైవాంశ సంభూతులనియు నీవు మరచినట్లున్నావు. దేవతలు, దైత్యవంశ నిర్మూలమునే ఆకాంక్షించుచున్నారు. వారి కోరిక తీర్చుటకు, మాయావి అయిన శ్రీహరి, అనతి కాలముననే అచట అవతరింపనున్నాడు' అని, హెచ్చరించినాడు.

కర్ణకఠోరములైన ఆ పలుకులు, కంసరాజేంద్రుని అమితముగ కలవర పరచినవి. ఆ వెంటనే, అతడు, వసుదేవుని కుమారులందరను, తన కఱకు కత్తికి ఎరజేసినాడు. యాదవులందరను భీతావహుల నొనర్చినాడు.

10. లక్ష్మీపతీ ! అనంతర కాలమున, దేవకీదేవి యేడవమారు గర్భము ధరించుటయు, అప్పుడు, ఆమె జఠరమున ప్రవేశించిన ఆది శేషుడు, నీ మాయా ప్రభావమున, రోహిణీ గర్భమున జేరుటయు, అటు పిమ్మట, సచ్చిదానంద స్వరూపుడవైన నీవు, దేవకీ గర్భస్థుడవగుటయు

జరిగినది. ఆ సమయమున నిన్ను, దేవతలందరును, బహు విధముల ప్రస్తుతించినారు.

పరమానంద రసస్వరూపా ! కృష్ణా ! ప్రపంచమునకు ఆనందము నొడగూర్చుటకేగదా నీవు ఆవిర్భవింపనున్నది. ఇక నేను నిరోగిని కాక పోవుటయేమి ? పరాభక్తిని పొందకుండుట యేమి ?

అర్థము - వివరణ

(1) దేవకీదేవి అన్న : దేవకుని సోదరుడైన ఉగ్రసేనుని కుమారుడు.

38. శ్రీ కృష్ణావతారం (ఆ)

1. ఆనందరస స్వరూపా ! కృష్ణా ! నీవు ఆవిర్భవించు సమయము ననే, వర్షర్తువుకూడ ఆరంభమైనది. అపుడు, ఆకసము నావరించిన మేఘ జాలము, దేదీప్యమానముగ ప్రకాశించుచున్న నీ శరీరకాంతి నుండి పుడికి పుచ్చుకొనినదా అనునట్లున్న నీలవర్ణమున, అత్యద్భుతముగ శోభించినది.

2. ఆ సమయమున మేఘములు వర్షించినవి. నలుదిక్కులు చల్లబడి నవి. అభీప్సితార్థము లభించుటవలన, సత్పురుషులు హర్షించినారు. అపుడే చంద్రోదయమైనది. ఆ అర్ధరాత్రి సమయమున, త్రిభువన తాపాపహారివగు నీవు, శీతకరుని మాదిరి, భూలోకమున నవతరించినావు.

3. అప్పుడు, ఆ సూతికా గృహమున నున్న నీవు, పసిపాపడవే అయ్యును, దివ్యైశ్వర్య విభూషితుడవై వెలుగొందినావు. మణిమయాంచిత ములైన కిరీటము, కరకంకణములు కేయూరములు హారములు మున్నగు ఆభరణములతోను, శంఖము చక్రము మున్నగు ఆయుధములతోను, పుల్ల వికసిత పద్మముతోను, దేదీప్యమానముగ భాసించినావు. గర్భిణీ మేఘము వంటి శరీరచ్ఛాయగలవాడవై శోభించినావు.

4. వసుదేవాత్మజా ! కృష్ణా ! అంతవరకు, దురాత్ముడైన కంసుని కారాగారమున విలయతాండవ మొనర్చుచున్న అశుభమును హరించుటకు వలె, నీ హృదయపీఠమున సర్వదా వసించియుండు శ్రీ మహాలక్ష్మి, తన కటాక్ష వీక్షణములను నలుదిక్కుల ప్రసరించుచుండగా, నీవు, నిరతిశయ శోభతో ప్రకాశించినావు.

5. యోగీశ్వరులు, తమ సమాధిస్థితిలోకూడ సామాన్యముగ దర్శించుకొనలేని నీ శ్రీవిగ్రహమును, కట్టెదుట చూచుచున్న వసుదేవుడు,

ఆ సమయమున, నేత్రోత్సవము చేసుకొనినాడు. దివ్యానుభూతి నందినాడు. ఆనందబాష్పములు రాల్చినాడు. ఆపైన, గద్గదస్వరముతో, నిన్ను స్తుతింపసాగినాడు.

6. "స్వామీ! నీవు అతీంద్రియుడవు. దేవాధిదేవుడవు. లీలావిలాసివి. సర్వసముడవు. నీ కృపాకటాక్ష వీక్షణమున సర్వవిధ తాపములును సమసిపోగలవు. నన్ను కరుణింపుము తండ్రీ! నా వేదనల నన్నిటిని హరింపుము నాయనా!" అని, ఆ సమయమున, ఆయన, నీకు, విన్నవించుకొనినాడు.

7. అనంతరము, ఆ దేవకీదేవి, ఆనందబాష్పములు రాల్చుచు, కరుణారస స్వరూపుడవైన నిన్ను బహుభంగుల స్తుతించినది. ఆపైన, నీవు, వా రిరువురకును, వారి పూర్వజన్మ వృత్తాంతమును(1) విశదపరచినావు. నీ తల్లి దైన్యప్రార్థన నాలకించి, తిరిగి, కిశోరరూపము ధరించినావు.

8. ఆపైన, నీ సంకల్పానుసారము, నిన్ను, నందపత్ని అయిన యశోదవద్ద ఉంచి, ఆమె కనిన ఆడుబిడ్డను, దేవకివద్ద చేర్చునిమిత్తము, వసుదేవుడు, మునీశ్వరుల మానసములందు మాత్రమే దర్శనీయుడవగు నిన్ను, తన చేతులలోనికి తీసుకొనినాడు. అప్పుడు, నీవు, ఫుల్లవికసిత కమలము నందున్న హంసకిశోరమువలె, మనోహరముగ గోచరించినావు.

9. అదే సమయమునకు, నందగోపుని యింటిలో, యోగమాయ జనించినది. ఆ వెంటనే, నీ ఆదేశానుసారము, ఆ పరిసర ప్రాంతమునంతను నిద్రాముద్రిత మొనర్చినది. (అంధకార బంధుర మొనర్చినది.)

నీకొరకు, నిర్జీవ కవాటములే తమంతతాము తెరచుకొనినప్పుడు, అఖిల ప్రపంచమును నిద్రాముద్రిత మగుటలో (అంధకారమున మునిగిపోవుటలో) ఆశ్చర్యమేమున్నది ప్రభూ!

10. ఆపైన, అదృష్టశాలి అయిన వసుదేవుడు, ఎట్టి అవరోధములును లేక, స్వేచ్ఛగ, ప్రయాణము సాగించినాడు. నీవు, వర్షములో

తడవకుండునట్లుగ, ఆదిశేషుడు, తన వేయిపడగలను విప్పి, నీకు గొడుగు పట్టినాడు. అతని ఫణులయందలి మణులు, నీకు, వెలుగుబాట నేర్పరచినవి.

గురువాయుపురాధిపా! కృష్ణా! నా రోగ తీవ్రతను తొలగించి, నాకును, వెలుగుబాట చూపుము నాయనా!

అర్థము - వివరణ

(1) దేవకీ వసుదేవుల పూర్వజన్మ వృత్తాంతము : దేవకీ వసుదేవులు స్వాయంభువ మన్వంతరమున, పృశ్ని సుతపుడు అనువారు. పృశ్ని పరమ పతివ్రత; సుతపుడు ఒక ప్రజాపతి.

ఆ దంపతులు శ్రీహరి నుద్దేశించి పన్నెండువేల దివ్య వత్సరములు తపమాచరించినారు. వారి తపస్సునకు సంత సించిన శ్రీహరి, నిజరూపమున వారికి దర్శన మొసగినాడు; 'ఏదైనను వరము నడుగవలసినది' అనినాడు.

సంతానహీనులైన ఆ దంపతులు అతని దివ్య సౌందర్య మునకు ముగ్ధులై, 'నీవు మాకు కుమారుడవై జన్మింపవలసినది' అని ఆయనను ముమ్మారు ప్రార్థించినారు. అది కారణముగ ఆయన, మూడు జన్మలలో వారికి కుమారుడవుటకు అంగీక రించినాడు. ఆ జన్మయందే, పృశ్నిగర్భుడను పుత్రుడుగా పుట్టినాడు.

తరువాతి జన్మలో, ఆ దంపతులు, అదితీ కశ్యపుడూ అయినారు. అప్పుడు, శ్రీహరి, వారికి వామనుడై జన్మించినాడు.

అనంతరము, వారు, దేవకీ వసుదేవులగుటయు, శ్రీహరి, వారికి, శ్రీకృష్ణుడై జనించుటయు జరిగినది.

39. యోగమాయ

1. యదుకుల శేఖరుడైన వసుదేవుడు, నిన్ను తీసుకుని, గోకులము దిక్కుగా గమించుచున్న సమయమున, పొంగి పరవళ్లు త్రొక్కుచు, ఆకసము నంటునట్లున్న కాళింది, అతనికి యెదురైనది. కాని, తక్షణమే అది, ఇంద్రజాలమువలన జరిగినదా యనునట్లు, క్షీణించిపోయి, మోకాలు బంటి నీరు గలదిగా తయారైనది.

2. అక్కడ, నందగోపుని యింట, తలుపు లన్నియు తెరచి ఉన్నవి. గొల్లెత లెల్లరును గాఢనిద్రాపరవశులై ఉన్నారు. పురిటి పొత్తిళ్లలో ఉన్న బాలిక, మెల్లమెల్లగ రోదించుచున్నది.

ఆ సమయమున, వసుదేవుడు, ఆ యింటిలో ప్రవేశించినాడు. నిన్ను, ఆ పురిటి పాన్పున నుంచినాడు. అచటి బాలికను చేతులలోనికి తీసుకుని, వెంటనే, తన నివాసమును చేరుకొనినాడు.

3. ఆ విధముగ దేవకీదేవి పురిటి పాన్పున చేరిన యోగమాయ, ఆ వెంటనే, పోరుపెట్ట సాగినది. ఆ ధ్వనికి మేలుకొనిన కారాగారభటులు, పరుగుపరుగున పోయి, దేవకీదేవి అప్పుడే ప్రసవించినదని, కంస రాజేంద్రునకు విన్నవించికొనినారు.

ఆ వార్త వినిన కంసుడు, వ్యాకుల చిత్తముతో, చెదరిపోయిన జుత్తుతో, చర చర అటు పోయినాడు. కాని, తన సోదరి కరములందున్న ఆడుబిడ్డను చూసి, అమితమైన అసంతృప్తి నందినాడు.

4. అయినను, ఆ వెంటనే, అతనికి, 'ఇదికూడ, మాయావి అయిన మధుసూదనుని పనియే అయిఉండునన్న అభిప్రాయము కలిగినది. అది కారణముగనే, అతడు, ఏనుగు సరోవరమునుండి కమల కాండమును పెకలించునట్లుగ, దేవకీదేవి హృదయమునకు హత్తుకొని ఉన్న

నీ సోదరిని, ఆ శిశువును, ఇట్టె గుంజుకుని, కటిక ఱానేలమీదకు విసరి వేసినాడు.

5. అయినను, ఆమె నేలమీద పడలేదు. నీ భక్తులైనవారు, మృత్యుపాశములనుండి తప్పించుకొనునట్లుగ, పైకెగసి, ఆకసము దిక్కుగా పోసాగినది. అప్పుడు ఆమె రూపమే మారిపోయినది. అష్ట భుజములతో, అష్ట విధ మహాయుధములతో(1) ఆమె ప్రకాశించినది.

6. అప్పు డామె, కంసుని ఉద్దేశించి, 'దురాత్ముడా! నన్ను హింసించుటవలన నీకు కలుగు ప్రయోజనమేమున్నది? నిన్ను సంహరించువాడు, ఒక చోట, పుట్టి పెరుగుచున్నాడు. నీ శ్రేయమును నీవు చూసుకొనవలసినది' అని పలికినది.

అది గ్రహించిన దేవతలు, నీ సోదరి అయిన ఆ యోగమాయను, పరిపరి విధముల ప్రస్తుతించినారు. అనంతర కాలమున, ఆ యోగమాయ, అనేక దేవతాగారములందు, వివిధ రూపములతో(2) ప్రవేశించుట జరిగినది.

7. కంసుడు, ఆ మరుసటి ఉదయముననే, మిథ్యాభిమాన పూరితులగు తన వారిని, ప్రలంబ బక పూతనాదులను సమావేశపరచి, యోగమాయ పలికిన పలుకులను వినిపించినాడు. ఆ పైన, వారు, నిన్ను నిర్జించు ఉద్దేశముతో, బాల ఘాతకులై ప్రపంచమందంతటను, నిర్భయముగ సంచరింపసాగినారు.

కటకు గుండెలు చేయరాని అకార్యముండునా ప్రభూ!

8. అక్కడ నందగోపుని యింట, యశోదాదేవి పురిటి పానుపు మీద, నీవు, నీ చరణకమలములను మెల్ల మెల్లన కదలించుచు, రోదింపసాగినపుడు, అప్పుడే మేల్కొనిన గొల్లెతలు, 'మన యశోదమ్మకు కొడుకు పుట్టినాడు' అనుకొనినారు. ఆ వార్త, ఆ నోట ఆ నోట గోకులమంతటను ప్రాకినది; అచటివా రందరును ఆనందతాండవ మొనర్చినారు.

9. అప్పుడే మొగ్గ తొడిగిన కలాయ కుసుమమువలె మనోహరముగఉన్న నిన్ను, పొత్తిళ్లలో ఉంచుకుని కనులార గాంచుట, తనివి తీర నీకు పాలిచ్చుట, నీ కోమలావయవములను పదే పదే స్పృశించి లాలించి పరవశించుట - అహో ఎంతటి అదృష్టము ! ఆ అదృష్టము యశోదాదేవికే గదా లభించినది !

10. ఆ సమయమున, నీ శ్రేయము నాసించి, పరమానందమున, నందుడు చేయని దానము లేదు; గోపకులు సలుపని సత్కార్యములు లేవు.

విశ్వశ్రేయోభిలాషీ ! కృష్ణా ! నా శ్రేయము నీ చేతిలో ఉన్నది నాయనా ! నా జాడ్యమును నిర్మూలించి, నన్ను కాపాడుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) అష్టవిధ మహాయుధములు : విల్లు, త్రిశూలము, బాణము, ఖడ్గము, కవచము, శంఖము, చక్రము, గద.

(2) వివిధ రూపములు : దుర్గ, కాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాని, శారద, అంబిక.

40. పూతనా మోక్షణం

1. కంసరాజేంద్రునకు కప్పముకట్టు నిమిత్తము, అఖిల శుభములకు ఆకరమైన నందుడు, ఒకసారి, మథురానగరమునకు వెళ్ళినాడు. ఆ సందర్భమున, అతడు, తన ఆబాల్యమిత్రుడైన నీ తండ్రిని వసుదేవుని, కూడ అచట కలిసికొనినాడు.

2. కంసుని అనుచరుల సన్నాహములను యెప్పటికప్పుడు గ్రహించుచున్న వసుదేవుడు, అతని నుద్దేశించి, 'నందా! నీకు కుమారుడు కలిగినాడని విని, నాకు పుత్రోదయమైనంతగ సంతోషించినాను' అని, నీ తండ్రి ఆ నందుడే అయినట్లు, సాదరముగ పలికినాడు.

3. ఆ పైన, 'ఇక్కడ అనేకమైన ఉత్పాతములు గోచరించుచున్నవి. నీవు త్వరితముగ యిలుచేరుట మంచిది' అనికూడ, హితోపదేశమొనర్చినాడు.

ఆ పలుకులు వినిన నందుడు, అక్కడ నీ కేదో ఆపద సంభవింపనున్నదను భావముతో, వెంటనే, వెనుదిరిగి వెళ్ళినాడు.

4. అదే సమయమునకు, వినీలకుంతలయు, సర్వాంగ శోభితయు అయిన ఒక నవయౌవనాంగి, నందగోకులమున ప్రవేశించినది; మాయా బాలుడవైన నిన్ను సమీపించినది.

5. ఆమెను చూసిన వ్రజాంగనలు, 'ఈమె యెవరా!' అని, తమలో తాము తర్కించుకొనుచుండగనే, ఆమె, నిన్ను తన చేతులలోనికి తీసుకొనినది. ఆమెయే, బాలఘాతిని అయిన పూతన; ఒకానొక రక్కసి.

6. ఆమె, తన హావ భావ విలాసములద్వారా, ఆ గోపకాంతల మనస్సులను వశపరచుకొనినది. అది కారణముగనే, వారు, ఆమెను

వారింపలేకపోయినారు. అంతలో, ఆమె, గృహాంతర్భాగమున నాసీనురాలై, మాయా డింభకుడవైన నీకు, పాలుకుడుప సాగినది.

7. శిశు సంహరణోద్యమమున నిమగ్నురాలై ఉన్న ఆ దుశ్చరితపట్ల క్రోధము వహించిన నీవు, నిస్సంకోచముగ, ఆమె ఒడిలోకూర్చుని, ఒక పెద్ద మామిడిపండునుండి రసమునువలె, విషపూరితమైన ఆమె వక్షోజముల నుండి, క్షీరమునంతను పీల్చివేయ సాగినావు.

8. ఆ సమయమున, నీవు, పాలతోపాటు ప్రాణములనుకూడ పీల్చి వేయుచుండుటను, పూతన గ్రహించినది. కంపించిపోయినది. ఆ వెంటనే, మాయారూపమునువదలి, ఘోరమైన తన నిజరూపమును ధరించినది. వేదనా భరమున, చేతులు చాచుకుని, గావుకేకలు పెట్టుచు, నేలకు ఒరిగిపోయినది.

9 అప్పుడు, ఆమె పెట్టిన కేకలు, గోకులమునం దంతటను మారు మ్రోగినవి. ఆమెదైన భీకరాకారము, చూపరులను నిశ్చేష్టుల నొనర్చినది. అయినను, నీవు మాత్రము, చిరునగవులు చిందుచు, ఆమె యురమున కేరింతలు కొట్టుచునే ఉన్నావు. అట్టి నిన్ను, గోపకాంతలు, చేతులలోనికి తీసుకొనినారు.

10. ఆ పైన, వారు, భువన మంగళకారకములైన నీ దివ్య నామములనే ఉచ్చరించుచు, నీకు అనేక విధముల అంగరక్ష[1] నిడినారు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! నా వేదనల నన్నిటిని తొలగించి, నన్నును నీ భక్తశ్రేణిలో చేర్చుకొనుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) అంగరక్ష నిడినారు : దృష్టిదోషమును తొలగించినారు.

దృష్టిదోషమును తొలగించుటకు వారు చేసిన పనులు : భగవన్నామమును జపించినారు. గోపుచ్ఛమును గోమయమును అతని చుట్టు త్రిప్పినారు. గోమూత్రముతో అతనిని స్నానము చేయించినారు. అతని నొసట గోరజముతో బొట్టు పెట్టినారు.

41. గోపీగోపాలక లాలనం

1. వసుదేవుని సూచనమీద, భయాకుల చిత్తముతో ప్రయాణము సాగించిన నందునకు, గోకులమున, కూలిపోయిన వృక్షము లనేకము గోచరించినవి. వాటి మధ్య, ఒక భయంకర రూపముగూడ కనిపించినది. అది చూసిన అతని గుండె, చెదరిపోయినది. ఆ వెంటనే, అతడు, సర్వశక్తి సంపన్నుడవైన నీ శరణు జొచ్చినాడు.

2. గోపీ జనము ద్వారా, పూతనకు సంబంధించిన యావద్ వృత్తాంతమును విని, గోపాలురు విస్మయావిష్టులైనారు. ఆ పైన, వారు, నీవు కూల్చిన ఆ ఘోరాకృతిని, గొడ్డళ్ళతో నరకి, ఆ శకలములకు, ఊరి వెలుపల, దహన సంస్కారమొనర్చినారు.

3. నీవు స్తన్యపానము చేయుటద్వారా పునీతమైన ఆమె శరీరము నుండి, అప్పుడు బాహిరిల్లిన ధూమము, ఆకసము నంతను ఆవరించినది. మహాద్భుతమైన ఆ ధూమ సౌరభము నాఘ్రాణించిన ప్రాణులు, అమితాశ్చర్యము నందినవి; తన్మయత్వము జెందినవి.

4. 'నన్ను స్మరించుకొను భాగ్యము కలవారు, భజించుకొను అదృష్టవంతులు, స్పృశింపగల పుణ్యాత్ములు, తక్షణమే, సత్ఫలితములను పొందగలరు. అనతికాలమున, మీకును అవి లభింపనున్నవి' అని, వ్రజవాసులకు విశదపరచుటకుగాను, నీవు, ఆ రక్కసి శరీరమునుండి సుగంధమును వెలువరించియుందువు. ఔనుకదా ప్రభూ !

5. 'బాలమాతిని చేతులలో చిక్కియు, ఈ బాలుడు, బ్రతికి బయటపడినాడు. ఇది, ఆశ్చర్యకరమైన విషయము. ఇట్టిదేదియో జరుగనున్నదని వసుదేవుడు ముందుగనే గ్రహించియున్నాడు. అది, ఇంతకుమించిన మహా

ద్భుత విషయము', అనుకొనుచు, నీయందే దృష్టిని నిలుపుకొనియున్న గోపకులు, ఆ సమయమున, పరమానందానుభూతి నందినారు.

6. వాసుదేవా ! ఆ పైన, నందగోకులము, క్రమక్రమముగ, సర్వవిధైశ్వర్య సంపన్నము కాజొచ్చినది. నిత్యకల్యాణములకు నిలయముగ, ఆనంద ధామముగ, విలసిల్ల సాగినది. ఆ విధముగ, అది దినదినాభివృద్ధి నందుటకు, నీ సన్నిధియే కారణముగదా !

7. ఆ సమయమున, వ్రజకామినీమణులు, తమతమ యిండ్లలో, మనోహరమైన నీ మూర్తినిగురించి, మధురమైన నీ మందహాసమును గురించి, ప్రధానముగ, పరస్పరము చర్చించుకొనుచుండువారు. తీరిక దొరికినపుడెల్ల, అమితోత్సాహమున, నిన్ను దర్శించుకొనుచుండువారు.

8. 'నా కన్నయ్య, నా వంకనే చూచుచున్నాడు' అని, కొందరు భావించువారు. 'నా చిట్టితండ్రి, నన్నుచూసి మందహాసము చేయుచున్నాడు' అని, మరికొందరు తలపోయుచుండువారు. 'నా పుత్తడి బొమ్మను, నే నెత్తుకొనవలెనట' అని, యింక కొందరు అనుకొనుచుండువారు. ఎవ రేమను కొనినను, అందరును, నిన్ను లాలించుచుండుటయే జరుగుచుండెడిది.

9. ఆ విధముగ నిన్ను చేరిన గోపికలు, నిన్ను స్పృశించు భాగ్యముకొరకు ఉవ్విళులూరుచు, ఒకరి చేతులనుండి మరొకరు నిన్ను అందుకొను సమయమున, నీవు, ఎఱ్ఱకలువ పూదండలో, ఒక పూవునుండి మరొక పూవుమీదకుపోయి వ్రాలు మధుపమువలె గోచరించుచుండువాడవు.

10. నిన్ను ఒడిలో ఉంచుకుని నీకు పాలుగుడుపుచు, నీ మీదనే చూపులు నిలుపుకుని చిరునగవులు చిందుచుండు ఆ యశోదాదేవి అప్పుడు అనుభవింపని ఆనంద మేమున్నది ప్రభూ !

భక్తవత్సలా ! హరీ ! నా వేదనలను తొలగించి, నాకును అట్టి ఆనందము నొదగూర్పుము నాయనా !

42. శకటాసుర భంజనం

1. ప్రభూ ! ఒకసారి, నీ జన్మనక్షత్రము వచ్చినరోజున, వ్రజేశ్వరి అయిన యశోదాదేవి, తన బంధువర్గములోని స్త్రీ జనమును, గ్రామము నందలి భూసుర శ్రేష్ఠులను, ఆహ్వానించి, వేడుకలు జరుపుకొనుచు, నిన్నొక బృహత్ శకట సమీపమున నుంచి, తాను, గృహాంతర్భాగమున, నేదో పనిచూచుకొనుచుండుట సంభవించినది.

2. ఆ సమయమున, నీ సమీపమున నొక కఠోర శబ్ద ముత్పన్న మగుటయు, అంతవరకు అక్కడ, నిన్ను కనిపెట్టుకునిఉన్న బాలబాలికలు, భయపడి ఆక్రందించుటయు జరిగినది.

3. ఆ ధ్వని నాలకించిన వ్రజాంగనలు, ఒక్కపరుగున నిన్ను సమీపించినారు. చెల్లాచెదరై పడిఉన్న భీకరదారుశకట శకలముల నడుమ నిన్ను చూసి, భయ విహ్వలులైనారు.

4. అంతలో, నందాదులుకూడ, నీ కెదో ఉపద్రవము వాటిల్లి యుండునన్న అభిప్రాయముతో, 'ఏమి జరిగినది ? ఏమి జరిగినది ?' అని అరచుచు, శీఘ్రముగ అక్కడికి వచ్చినారు. అప్పుడు, వారి నేత్రములు బాష్పపూరితములై ఉన్నవి. కాని, నీవు, యశోదాదేవి కౌగిట కనిపించగనే, వారి మనస్తాపము కొంత చల్లారినది.

5. ఆ బృహత్ శకటము అట్లు భిన్నాభిన్నమగుటకుగల కారణము అచటివారికి అనూహ్యమైనది. అది కారణముగ, వారు, విస్మయావిష్టులైనారు; నీవంకనే చూచుచు నిలబడిపోయినారు.

6. ఆ పరిస్థితిలోఉన్న వారిని ఉద్దేశించి, అచటి బాలబాలికలు, 'ఈ పాపడు, కాలుసేతులు విసరుకొనుచు, పాలకొరకువలె యేడ్చినాడు. అప్పు డతని పాదముతగిలి, యీ శకటము తలక్రిందవుటను మేము చూసినాము; ప్రత్యక్షముగ చూసినాము' అని దృఢముగ తెలియపరచినారు.

7. నీ మాహాత్మ్యము నెరుగని కొందరు పెద్దలు, వారి మాటలను విశ్వసింపలేకపోయినారు. 'భయకంపితులై ఉన్న యీ పిల్లలు, అప్పుడు యథార్థమున కేమిజరిగినదో గ్రహించిఉండరు' అని నిర్ణయించుకొనినారు. కాని, పూతన విషయము తెలిసినవారు మాత్రము, అట్టిదే యేదో జరిగి ఉండవచ్చునని అనుమానించినారు.

8. ఆపైన, కరుణాతరంగితాత్మలైన వ్రజాంగనలు, 'చిగురు టాకులవంటి ఈ చరణములకు దెబ్బతగులలేదుగద!' 'పద్మ పత్రములవంటి ఈ చేతులు గాయపడలేదుగద!' అని, నీ శరీరము నంతను మృదువుగ స్పృశించుచు, పరీక్షించి చూడసాగినారు.

9. ఆ సమయమున, నందుడు, ముందుకుపోయి, 'నాయనా! నా అదృష్టము మంచిది. భగవదనుగ్రహమున, నీవు, బ్రతికి బయటపడినావు' అని, గద్గగ స్వరమున పలుకుచు, నిన్ను చేతులలోనికి తీసుకొనినాడు. పదేపదే తన హృదయమునకు హత్తుకొనినాడు. హర్షపులకిత శరీరుడైనాడు.

10. నిన్ను సంహరింపవచ్చిన శకటాసురుడు, ఆవిధముగ నీ చేత సంహరింపబడినాడు; అయినను, అందు, అత్యాశ్చర్యకరమైన విషయ మొకటి ఉన్నది నాయనా! అతని కాయమునకు సంబంధించిన ఒక కణము కూడ అప్పు డచట కనిపించలేదు. శుద్ధ సత్వస్వరూపుడవైన నీలో అతడు లీనుడై ఉండును. అది సత్యమే యగునా ప్రభూ!

11. ఆ వెంటనే, నందగోపుడు, ద్విజశ్రేష్ఠులను విధ్యుక్తముగ అర్చించినాడు. నీ శ్రేయము నాసించి, వారినుండి, ప్రత్యేకమైన దివ్యాశీస్సులను పొందినాడు. అనంతరము, నీవు, నీవైన శిశు క్రీడలతో, మంద నంతను, అమందానందమున ముంచి తేల్చినావు.

గురుపవనపురాధిపా! కృష్ణా! నా రోగమును హరించి, నాకును అట్టి ఆనందమును అనుగ్రహింపుము నాయనా!

43. తృణావర్త సంహారం

1. కృష్ణా ! ఒకసారి, నీ తల్లి, నిన్ను ఒడిలో ఉంచుకుని లాలించు చున్న సమయమున, నీవు భరింపరాని బరువు గలవాడవై తోచినావు. ఆ వెంటనే, ఆమె, నిన్ను పడకమీద ఉంచి, ఇంటిపనులు చూచుకొనుటకు లోనికి పోయినది. కాని, ఆ సమయమున గూడ, ఆమె, నిన్ను గుఱించియే ఆలోచింపసాగినది; భగవానునే స్మరించుకొనజొచ్చినది.

2. అంతలో, తృణావర్తుడను ఒక రాక్షస ప్రముఖుడు, సుడిగాలి రూపమున నక్కడకు వచ్చినాడు. అతని రాకవలన, నలుదిక్కులను, పెనుధూళి క్రమ్ముకొనినది. దూరమునుండి, భయంకర శబ్దమువినిపించినది. భక్తుల హృదయముల నాకర్షించుకొను నిన్ను, అత డా సమయమున ఆకర్షించుకొనినాడు; మృచ్ఛిలించుకుపోయినాడు.

3. అప్పుడు చెలరేగిన ఇసుకదుమారము మూలమున, ఆ ప్రదేశ మంతటను, పెను చీకటులు క్రమ్ముకొనినవి. అది కారణముగ, అచటి వారికి, కన్నులు పొడుచుకు చూచినను, యేమియు కనిపించని పరిస్థితి యేర్పడినది.

ఆ సమయమున, నీ తల్లి, 'నా చిట్టితండ్రి యేమైనాడు ?' అని అఱచుచు, పరుగు పరుగున నీ శయ్యను సమీపించి, అచట నీవు కనిపించక పోవుటచే, గుండెలు బాదుకుని రోదింపసాగినది.

4. అప్పటికే, తృణావర్తుని శక్తి క్షీణించిపోయినది. బరువెక్కిన నిన్ను మోసుకుని పోవుచున్న అతని గమనవేగము తగ్గిపోయినది. అతడు గగన మార్గముననే ఆగిపోయినాడు.

అది కారణముగ, అంతకు మునుపు గోకులమున చెలరేగిన ఇసుక దుమారమును పెనుగాలియు తగ్గు మొగము పట్టినవి. నీ తల్లిదైన రోదనము, ఆ ప్రదేశమందంతటను మారుమ్రోసినది.

5. యశోదాదేవి రోదనమును విని, నందాది గోపకులు, ఇంటిలో ప్రవేశించినారు. అమితవేదన ననుభవించినారు. అంతలో, ముక్తి ప్రదాతవైన నీకు విముక్తి కలిగింపవలెనను సంకల్పము, ఆ రాక్షస ప్రముఖునిలో కలిగినది. కాని, నీ వతనిని 'ముక్తుని' చేయుట కిచ్ఛగింపలేదు. అది కారణముగనే, అతడు, ఆకసమునుండి, ఒక పెనుకొండవలె, భూమి మీద పడిపోయినాడు.

6. ఆ సమయమున, వివశులై రోదించుచున్న గోపబృందము, గోష్ఠమునకు బయట, కటికరానేలమీద, ఒక స్థూలకాయుడు పడిపోవుట గమనించినారు. అతని వక్షస్థలమున కూర్చుని, కిలకిలలాడుచున్న అక్షీణబలుని, నిన్ను దర్శించుకొనినారు. నిజమున కది ఆశ్చర్యమేకదా ప్రభూ !

7. ఆ విధముగ క్రిందపడి, నుగ్గునుగ్గైపోయిన ఆ దుష్టాత్ముని మృత కాయముమీద ముద్దు లొలుకుచు కూర్చుని, సగర్వముగ చిరునగవులు చిమ్ముచు, మృదుకరములతో వానిని మర్దించుచున్న నిన్ను, పెద్ద పర్వతము నుండి ఒక నీల మణినివలె, గోపకులు తీసుకొనినారు.

8. అనంతరము, నందాదులు, నీవు తిరిగి తమకు దక్కినావను ఆనందాతిశయముతో, నిన్ను తమ తమ హృదయములకు హత్తుకుని, నీ మీద ముద్దులవర్షము గురిపించినారు. ఆ సమయమున, నీవు, నిన్ను ఒడిలోనికి తీసుకొనుటకు ఉవ్విళులూరుచున్న గోపికల చేతులలోనికి, చకచక పోసాగినావు. భక్తవత్సలుడవైన అట్టి నిన్ను, మేము భజించుకొను చున్నాము తండ్రీ !

9. అప్పుడు, 'మన చేతిలో యేమున్నది ? ఆర్తత్రాణపరాయణుడైన ఆ భగవంతుడే యితనిని రక్షింపవలెను' అని, బాలుని రూపమున నున్న నీ క్షేమమును కోరి, నీవా రందరును నిన్నే ప్రార్థింపసాగినారు.

10. వాతాలయాధిపా ! కృష్ణా ! నీవు, వాయురూపమున వచ్చిన రాక్షసుని సంహరించినవాడవు. వాయు ప్రకోపమున సంభవించిన నా యీ రోగమును నిర్మూలింపలేవా తండ్రీ ! నాకు వేరు దిక్కు లేదు నాయనా ! నేను నిన్నే ఆశ్రయించినాను. శారీరకము మానసికము అయిన నా యీ వేదన లన్నిటిని తొలగింపవలసినదిగ, నిన్ను పదేపదే ప్రార్థించుకొను చున్నాను. గ్రహింపవలసినది ప్రభూ !

44. నామకరణ మహోత్సవం

1. వసుదేవుని ప్రార్థనమీద, జ్యోతిశ్శాస్త్ర విశారదుడైన గర్గాచార్యుడు, ఒకసారి, సర్వకర్మలకు అతీతుడవై ఉండునీకు, జననమాదిగ జరుగవలయు కొన్ని సంస్కారములు, రహస్యముగ నిర్వర్తించు నిమిత్తము, మీ యింటికి విచ్చేసినాడు.

2. ఆయన రాకకు, అమందానందమునందిన నందగోపుడు, ఆ మహర్షిని అత్యాదరముతో సన్మానించినాడు. సంస్కారములు జరిపించుట కుత్సహించినాడు; వాటిని గురించి ఆయనతో ముచ్చటించినాడు.

3. నందుడు చూపిన అభిమానమునకును, తన అదృష్టమునకును, అమితముగ ఆనందించిన గర్గుడు, తను యాదవపురోహితు డగుటవలన, తన్ను ఆశ్రయించిన వారికి యెట్టి ఆపదయు కలుగరాదను అభిప్రాయముతో, కంసుని దృష్టిలోపడకుండునట్లుగ, ఆ సంస్కారకాండను, అతి గోప్యముగ ముగించినాడు. నీకును, నీ అన్నకును. నామకరణముకూడ జరిపినాడు.

4. 'సహస్రనామములు, కాదు కాదు, అనంతనామములు గల వీనికి, నామ రూప రహితుడైన వీనికి, నామకరణ మొనర్పబూనుటయా !' అను శంకతో, సర్వజ్ఞుడైన ఆ మహర్షి అట్లు సలిపియుండును.

5. సంపూర్ణమైన సత్వము కలవాడవు, పరమానంద స్వరూపుడవు అగుటవలనను, ప్రపంచమునందలి పాపము లన్నిటిని భస్మీకరించువాడ వగుటవలనను, ఆ మహర్షి, నీకు, 'కృష్ణుడు' అని పేరుపెట్టినాడు.

6. ఆ సందర్భముననే, ఆయన, నీకు మరికొన్ని వ్యవహార నామములను[1] కూడ పేర్కొనినాడు. అనంతరము, నీ అగ్రజునకు, 'రాముడు' మున్నగు పేర్లు[2] పెట్టినాడు. కాని, ఏ పరిస్థితిలోను, ఆయన,

నీ నిజ స్వరూపమును నందునకు విశదపరచలేదు. అయినను, నీవు, మానవాతీతమైన మహిమాదులు కలిగియుందువనిమాత్రము వ్యక్తపరచినాడు.

7. అదియే కాదు. 'నీ కుమారుని ప్రేమించినవారు, మాయా మోహితు లగుటయు, శోకము ననుభవించుటయు జరుగదు. ఇతనిని ద్వేషించినవారు, బాగుపడుటగాని, బ్రతికియుండుటగాని సంభవింపదు' అనికూడ, ఆయన, నీ ప్రభావమును వర్ణించినాడు.

8. 'ఇతడు, త న్నెదుర్కొను అసురులందరను హతమార్చును. తన్ను ఆశ్రయించినవారి కెల్లరకును మోక్షమును ప్రసాదించును. కాల క్రమమున, ప్రపంచమంతయు నితని విమలయశమును గానము చేయును' అనికూడ, ఆ సందర్భమున, ఆయన, నీప్రభావము నభివర్ణించినాడు.

9. ఆ పైన, ఆయన, 'నందా ! ఇతనివలననే మీకష్టములన్నియు తీరిపోగలవు. మీ రిక నిర్భయముగ ఉండవచ్చును' అని, అనేక విధముల నతనికి ధైర్యము కలిగించినాడేకాని, నీవు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవే అని మాత్రము స్పష్టముగ చెప్పలేదు.

10. ఆ విధముగ తమకు ఆనందము కలిగించిన గర్గమహర్షి నిర్గ మించిన తరువాత, నందాదిగోపకులు, నిన్ను, అమితానురాగముతో చూసు కొన సాగినారు.

కరుణారసస్వరూపా ! కృష్ణా ! గర్గాచార్యుని తుదిపలుకులను[3] నీవు నాపట్ల ఋజువుపరచుకొనవలెను నాయనా ! అదే నా ప్రార్థన తండ్రీ !

అర్థము - వివరణ

(1) వ్యవహారనామములు : వాసుదేవుడు, దామోదరుడు, గోపాలుడు, గోవిందుడు, పార్థసారథి మున్నగునవి.

(2) రాముడు మున్నగు పేర్లు : బలుడు, సంకర్షనుడు, హలాయుధుడు యిత్యాదులు.

(3) గర్గాచార్యుని తుది పలుకులు : (పై 9-వ. శ్లోకానువాదమున నున్నవి.)

45. బాల్య క్రీడలు

1. మురాసురాంతకా ! కృష్ణా ! అనంతరకాలమున, నీవును నీ అన్న అయిన బలభద్రుడును, మెల్ల మెల్లగ ప్రాకుట మొదలు పెట్టినారు. ఆ సమయమున, ఆ యింట యెక్కడ చూసినను మీరే. ఆ ఇల్లంతయు వెలుగే. అప్పుడు, మీ కోమల చరణాబ్జములను సేవించుచుండెడి మంజీరముల మనోహర స్వనమును విని, మీరే పరవశులగుచుండెడివారు.

2. అప్పటి మీ కోమల ముఖపద్మములను వీక్షించి, వానిని ముద్దిడుకొనుచున్న ముంగురులను తిలకించి, అప్పుడప్పుడే పొటమరించుచున్న దంతములను దర్శించి, మృదు మధుర మందహాసము నవలోకించి, కరకమలముల మీదకు జారుచున్న కంకణములను చూసి, మురిసి, తమ హృదయములను మీకు కానుకవెట్టని ప్రాణి ఆ సమయమున లేవేలేదు కదా !

3. మిమ్ము దర్శించుకొనుటకు వ్రజవాసులు వచ్చినపుడు, మీలో మీరు నవ్వుకొనుచు, దూరముగ వెళ్లుచుండువారు. వారు మిమ్ము వెంటాడుచున్నారని గ్రహించినప్పుడు, వెనుదిరిగి, వారివంక, ఓరచూపుల జూచుచుండువారు. అది, మీ భక్తులహృదయములలో గిలిగింతలు వెట్టుటయే కదా ప్రభూ !

4. మీరు అడుగులు వేయుట కారంభించినపుడు, అప్పుడప్పుడు పడిపోవుచుండువారు. ఆ సమయమున మీ శరీరములు మలిన మగుచుండెడివి. అప్పుడు, నిర్మల శరీరులైన దేవర్షులు, దేవలోకమునుండి మిమ్ము చూసి, మందహాసముచేయుచు, స్తుతించుచుండెడివారు. గోకులమున నున్న మీ తల్లులు, సానుభూతితో మిమ్ము దగ్గరకు తీసుకుని, పదే పదే హృదయమునకు హత్తుకుని, ముద్దాడుచుండెడివారు.

5. నిన్ను ఒడిలో ఉంచుకుని, మల్లెమొగ్గలవంటి పలువరుసతో భాసించు నీ సుందర ముఖారవిందమును వీక్షించుచు, నీ మృదు మంద హాసమును తిలకించుచు, నీకు చనుగుడుపుచుండు ఆ యశోదాదేవి అదృష్ట మునకును ఆనందమునకును అప్పుడు అవధి ఉండియుండునా ప్రభూ !

6. అనంతరకాలమున, నడకవచ్చిన మీదట, నీవు, తోటిబాలురతో కలసి, ఇరుగుపొరుగిండ్లలో ఆడుకొనుటకు పోవుచుండువాడవు. ఆ సమ యమున, నీవు చేయని చిలిపి పనులు లేవు. పెంపుడు పిల్లులను, పిట్టలను, ఆవుదూడలను, తరుముకుని పోవుచుండువాడవు. అది చూచుటకు ఆనంద దాయకముగనే ఉన్నను, గోపకులు, అప్పుడప్పుడు నిన్ను వారించు చుండువారు.

7. మురాసురాంతకా ! కృష్ణా ! మీ సోదర ద్వయము యెప్పు డెక్కడికి వెళ్లినను, అప్పు డక్కడ ఉండు గోపికలు, నీ మీదనే దృష్టి నిలుపుకుని, నిశ్చేష్టులై నిలబడిపోవువారు. ఆ సమయమున, వారు, వారి వారి గృహకృత్యములను, పరిచారకులను, చివరకు పసిపిల్లలను కూడ మరచిపోయెడివారు.

8. నీవు, నవ్యనవనీతమును కోరినపుడెల్ల, ఆడుచు పాడుచు గోపి కలను సమీపించుచుండువాడవు. నీ జిలిబిలి పలుకులనాలకించి, నీ విలాస భంగిమలు వీక్షించి, ఆర్ద్రహృదయలైన గోపికలు, ఆ వెంటనే, నీకు, వెన్నను, కాచిన పాలను ప్రేమతో సమర్పించుకొనుచుండువారు. వాటిని, నీవు, అమితానందముతో ఆరగించుచుండువాడవు.

9. 'ఒకప్పుడు, నేను, మహా బలశాలి అయిన బలిచక్రవర్తిని యాచించుట జరిగినది.(1) కాని, ఇప్పుడు, ఈ అబలాజనమును యాచిం చుట భావ్యముకాదు,' అని నిర్ణయించుకొని నట్లుగ, ఆ పైన, నీవు, యాచ నకు స్వస్తిచెప్పి, విచిత్ర మార్గముల, పాలు పెరుగులను దోచుకొనుట కుపక్రమించినావు.

10. పాలుపెరుగులను నీవు దొంగిలించినను, వ్రజాంగనలు ఆగ్రహించుకొనలేదు. ఆర్తి ననుభవింపలేదు. పాలుపెరుగులతోపాటు, నీవు, వారి హృదయములనుకూడ హరించినావు కదా! వారిని పరమానంద సాగరమున నోలలాడించినావు కదా!

గురుపవనపురాధిపా! కృష్ణా! నా వేదనలను హరించి, నాకును, అట్టి ఆనందమును అనుగ్రహింపుము నాయనా!

అర్థము - వివరణ

(1) బలిచక్రవర్తిని యాచించుట: వామనావతారమున ఆయననుండి మూడడుగుల మేర భూమిని కోరుట.

46. విశ్వరూప సందర్శనం

1. ప్రభూ ! నీవు, ఒకసారి, నీ తల్లిఒడిలో పడుకుని, స్వాత్మానందమున రమించుచుండగా, ఆవులించుట సంభవించినది. ఆసమయమున, యశోదాదేవి, నీ ముఖ పద్మమునందు, బ్రహ్మాండమునంతను దర్శించుకొనినది. అది, నీవు, పసిపాపడవై ఉన్నప్పటి మాట.

2. విశ్వనాథా ! అనంతరకాలమున, నీవు, తోటిబాలురతో ఆడుకొనుచు, కేళీవిలాసముగ, వారి పండ్లను అపహరించినావు. అది గ్రహించి, వారు, క్రుద్ధులైనారు. ఆ వెంటనే, వారు, మీ తల్లిని సమీపించి, నీవు మన్ను తినినట్లు కల్పించి ఆమెకు చెప్పినారు.

3. యథార్థమునకు నీవు మన్ను తింటివే అనుకొనుము. అది ని న్నేమి చేయగలదు ప్రభూ ! ప్రళయకాలమున, నీవు, పంచమహాభూతములనే భక్షించుచుందువుకదా !

అయినను, వారి పలుకులు వినిన యశోద, మన్నుతినుటవలన నీకు జబ్బు చేయవచ్చునను భీతితో, నీ పట్ల కోపగించుకొనినది.

4. ఆ కోపముతో, ఆమె, నిన్నుద్దేశించి, 'మన్నుతినినావా !' అని గద్దించినది. ఆమెను చూసిన నీకు, నవ్వు వచ్చినది. అయినను, 'ఆ మాట అబద్ధమమ్మా ! ' అని, అమాయికముగ ఆమెకు సమాధాన మిచ్చినావు; ప్రమాణము కూడ చేసినావు.

5. ఆ పైన, ఆమె, 'అందరును అబద్ధమాడుదురా ! ఏమో ! నేను నమ్మలేకున్నాను. అయినను, ఏది ! నీ నోరుచూపుము !' అనినది. ఆ వెంటనే, నీవు, వికసించుచున్న పద్మమువంటి నీ నోరు తెరచినావు.

6. అప్పుడు, మృత్కణములకొరకు పరిశీలించుచున్న మీ అమ్మకు ఆశ్చర్యము కలిగించుచు, నీవు, నీ ముఖ గహ్వరమున, మన్నును మిన్నునే కాదు, ముల్లోకములను కూడ ద్యోతపరచినావు.

7. ఆ సమయమున, ఆమెకు దర్శనీయము కాని దేమున్నది ప్రభూ ! ఒకచోట సాంద్రారణ్యములను, ఒకతావున సముద్రములను, ఒక దిక్కున ఆకాశమును, ఒక వేపున అతల వితల సుతల రసాతలాదులను, అటులనే, మానవులను దానవులను దేవతలను సర్వమును ఆమె సంభ్ర మాశ్చర్యములతో తిలకించినది.

8. క్షీరసాగరమున శయనించియున్న నిన్ను, వైకుంఠము నేలు కొనుచున్న నిన్ను, శిశురూపమున తన సమక్షముననున్న నిన్ను, అటులనే, భిన్న భిన్న రూపముల నిన్నామె యేకకాలమున దర్శించుకొనినది.

9. అప్పు డామెకు దర్శనీయమైన బ్రహ్మాండమునందు, ఆమె సమక్షమున నోరు తెరచుకునిఉన్న నీవును గోచరించితివి. ఆ నోటియందు కూడ, ఆమె, బ్రహ్మాండము నంతను తిలకించినది. అది కారణముగ, విశ్వ మంతయు నీలో ఒదిగి యుండుననియు, విశ్వమంతటను నీవు వ్యాపించి యుందువనియు, తాత్కాలికముగ నైనను, ఆమెకు తేటతెల్లమైనది.

10. ఆ విధమైన పరమ సత్యమును గ్రహించి, పరమానందము ననుభవించుచున్న ఆమె మీద, మరుక్షణముననే, నీవు, నీదైన వైష్ణవ మాయను ప్రయోగించినావు. నీకు చనుగుడుపవలెనను ఆతురతను ఆమెకు కలిగించినావు.

అద్భుత కిశోరమూర్తీ ! కృష్ణా ! నా ఆర్తిని హరింపవా నాయనా !

47. ఉలూఖల బంధనం

1. ఒకసారి, నీ తల్లి చల్ల చిలుకుచున్న సమయమున, పాలు త్రాగవలెనను ఆతురతతో నీ వామెను సమీపించి, ఆమె ఒడిలో ప్రవేశించినావు. ఆమె పనికి అడ్డుపడి, నీ పని చూచుకొనసాగినావు.

2. కులుకులొలుకుచు నీవు పాలుత్రాగుచుండగనే, పొయ్యి మీది పాలు పొంగు చున్నట్లు తోచి, మీ అమ్మ, వడివడిగ లోనికివెళ్లినది.

3. పాలు త్రావుట కాటంకము కలిగినందున నీకు కోపమువచ్చినది. అది కారణముగ, నీవు, చల్లకవ్వముతో అచటి పెరుగు కడవను మోది, దానిని పగులగొట్టినావు.

4. పెరుగుకుండ పగిలిన సవ్వడి విని, నీ తల్లి, పరుగు పరుగున అక్కడికి వచ్చినది. వచ్చి, విశ్వమంతటను వ్యాపించుచున్న నీ పరిశుద్ధ యశమువలె, నేలమీద, నలుదిక్కుల ప్రసరించుచున్న పెరుగును మాత్రమే చూడ గలిగినది.

5. అక్కడ, నీవు కనబడక పోవుటవలన, కుపితురాలైన ఆ గోప వధూమణి, వేదచోదితమార్గముల వెదకినవారికి గాని పట్టుబడని నిన్ను పట్టుకొనుటకు ఇల్లంతయు వెదకినది. చివరకు, ఒక రొయ్యి రోటి మీద కూర్చుని, పిల్లికి పెరుగు పెట్టుచున్న నిన్ను చూసినది.

6. ఆ వెంటనే, ఆమె నిన్ను అమాంతముగ పట్టుకొనినది. అది కారణముగ, నీవు, భయపడినట్లు నటించినావు. అది కూడ నీ ముఖమునకు, శోభనే చేకూర్చినది నాయనా! ఆ పైన, ఆమె తన సఖీజన సమక్షమున, నిన్ను బంధించుట కొరకు త్రాడు తీసుకొనినది.

7. భక్తజన బాంధవుడవైన నిన్ను, యశోదాదేవి, ఆ త్రాటితో బంధింపదలచినది; కాని, యెన్ని త్రాళ్లు కలిపికట్టినను, అవి, నీ నడుమును చుట్టుటకు సరిపోలేదు; ఒక బెత్తెడు తక్కువగుచుండుటయే తటస్థించినది.

8. ఆ సమయమున, ఆమెకు, ఒడలంతయు చెమటలుపోసినవి. ఆమె పూర్తిగ అలసిపోయినది. అది గ్రహించిన ఆమె సఖీజనము, విస్మయముతో, మందహాస మొనర్చినారు.

అమ్మను ఆ స్థితిలో చూసిన నీకు జాలివేసినది. అది కారణముగనే, ఎట్టి బంధములు లేని నీవు, ఆమెచే, ఱోటికి బంధింపబడుటకు అంగీకరించినావు.

9. ఆ పైన, ఆమె, నిన్ను ఉద్దేశించి, 'వెన్నదొంగకు తగిన శాస్తి అయినది. ఇక, ఊరిమీద పడుటకు వీలులేదు' అని, సగర్వముగ పలుకుచు, ఇంటిలోనికి వెళ్లిపోయినది. ఆ వెంటనే, నీవు, అంతకుముందు ఱోటిలో దాచికొనిన వెన్నను తీసుకుని, ఆరగింపసాగినావు.

10. ఆ సమయమున, దేవతలు, 'సర్వాంతర్యామీ ! మోహ పాశ బద్ధులు కానివారికి మాత్రమే వశుడవగు నీవు, మోహపూరితురాలైన యశోదాదేవి చేత బంధింపబడుటయా ! ' అని, నిన్ను ఆశ్చర్యముగ కొనియాడినారు.

గురుపవనపురాధీశ్వరా ! కృష్ణా ! అది నీ కృపావిశేషము నాయనా ! అట్టి కృపనే నాపట్లకూడ ప్రదర్శించి, నన్ను, రోగపాశవిముక్తుని చేయుము తండ్రీ !

48. యమలార్జున భంజనం

1. నీ నడుమునకు త్రాడు చుట్టబడి యుండుటవలన, దేవతలు, నిన్ను, 'దామోదరునిగ' పేర్కొని, జయజయధ్వానము లొనర్చినారు. అప్పుడు, నీవు, రోటికి కట్టబడి ఉండికూడ, యథాసుఖము ననుభవించుచునే ఉన్నావు. ఆ సమయమున, నీవు, అనతిదూరమున నున్న రెండు మద్దిచెట్లను చూచుట తటస్థించినది.

2. నలకూబర-మణిగ్రీవులనువారు, కుబేరుని పుత్రులు. మహేశ్వరానుగ్రహమున వారికి లభించిన మహదైశ్వర్యము కారణముగ, వారు, మదించి తిరుగుచుండెడివారు; నీ పట్ల విముఖులైయుండెడివారు.

3. ఒకసారి, వా రిరువురును, తమ కామినీ జనముతో సహ, తప్ప త్రాగి, దిగంబరులై, పరమపావని అయిన గంగానదిలో కేళీవిహారము సలుపుచుండగా, నీ పరమభక్తుడైన నారదుడు, వారిని సమీపించుట సంభవించినది.

4. నారదమహర్షిని చూడగనే, ఆ పడుచులు భయముతోను, ఆయన పట్లగల గౌరవము తోను, వెంటనే వస్త్రములు ధరించినారు. అది గ్రహించికూడ, నలకూబర - మణిగ్రీవులు, ఆ మర్యాదను పాటింపలేక పోయినారు; తమ ఆట పాటలయందే నిమగ్నులై ఉండిపోయినారు. అది కారణముగ, ఆ మహర్షి, వారికి నీ పట్ల భక్తిని కలిగింపవలెననుకొనినాడు. వారికి శాంతిని చేకూర్పవలె ననుకొనినాడు. ఆ అభిప్రాయముతోనే, వారిని శపించినాడు.

మనశ్శాంతి లేనపుడు, అనుభవింపగల సుఖమమాత్ర మేమున్నది ప్రభూ !

5. మద్ద్రిమానులై జన్మించునట్లును, అనంతరము శ్రీహరి సందర్శనమున తిరిగి నిజరూపములను ధరించునట్లును ఆ మహర్షి వలన శప్తులై, ముక్తిమార్గమును కూడ గ్రహించిన, వారు, ఆ పైన, అటులనే పుట్టుటయు, నీ కొరకు నిరీక్షించుచు అక్కడనే ఉండిపోవుటయు జరిగినది.

6. ఆ విధముగ నూరు దివ్యవత్సరములు గడచినవి. ఆ వృక్షములు జీర్ణించిపోసాగినవి. ఆ సమయముననే, నీవు, వారిమీద, నీ కటాక్షవీక్షణములను ప్రసరింపజేసినావు.

అప్పుడు, నీవు, మెల్లమెల్లగ వాటిని సమీపించి, ఆ రెంటి నడుమనుండి, అనాయాసముగ ఆవలకు పోయినావు. కాని, నీవు యీడ్చుకు పోవుచున్న ఱోటికి మాత్రము ఆ చెట్లు అడ్డుతగులుటవలన, అది అక్కడనే ఆగిపోయినది. అదిగ్రహించిన నీవు, దానిని, ఒక్కసారిగ నీ దిక్కునకు లాగికొనినావు. అది కారణముగ, ఆ వృక్షములు సమూలముగ కూలిపోయినవి.

7. ఆ వృక్షములు అట్లు పెకలింపబడగనే, వాటినుండి, దేదీప్యమానముగ ప్రకాశించుచున్న యిద్దరు యక్షులు బయటకువచ్చి, నిన్ను, బహుభంగుల ప్రస్తుతించినారు.

8. ప్రభూ ! ఈ జన్మలో, యెవ రేయే దేవతలను కొలిచినను, అంతిమమున నిన్నే చేరుకొందురు గదా ! అదే, ఆ యక్షుల విషయమునను ఋజువైనది. వారు, రుద్రానుచరులయ్యును, నారదుని అనుగ్రహమున, నిన్ను దర్శించుకొనగలిగినారు; తమకు గురుతర భక్తి లభించునట్లు, నీనుండి, వరమును పొందగలిగినారు.

9. ఆ చెట్లు విరిగిపడినపుడు, భయంకర శబ్ద ముత్పన్నమైనది. అది వినిన వ్రజవాసులు, తత్తరముతో, అటుగా పరుగెత్తినారు. ఆ వెంటనే, నందగోపుడు, ముక్తి ప్రదాతవైన నీకు, బంధవిముక్తి 'ననుగ్రహించినాడు'.

ఆ సమయమున, అతని చూపులు, నీ తల్లిఅయిన యశోదాదేవికి తలవంపులు కలిగించినవి.

10. ఆపైన, నందాదులు, 'ఇంతటి పెద్దచెట్లుకూలినను, బాలున కెట్టి ఆపదయు కలుగకుండట, భగవదనుగ్రహముననేగదా' అనుకొనుచు, నిన్ను యింటికి తీసుకుపోయినారు.

ఆపదుద్ధారకా ! కృష్ణా ! నలకూబర మణిగ్రీవులనువలె నన్నును అనుగ్రహింపుము నాయనా ! నా ఆపదను కూడ తొలగింపుము తండ్రీ !

49. బృందావన గమనం

1. రాక్షసులు నిన్ను చంపవచ్చుట, వృక్షములు అకారణముగ కూలిపోవుట మున్నగు సంఘటనలు, గోకులమునకే అరిష్టసూచకములని, నీ ప్రభావము నెరుగని గోపకులు భావించినారు; ఆ ప్రదేశమును వదలి పోవుటకు నిశ్చయించుకొనినారు.

2. ఆ సమయమున, నీ ప్రేరణకారణముగ, ఉపనందుడను గోప శ్రేష్ఠుడు, వారిని ఉద్దేశించి, అచటికి పశ్చిమమున బృందావనమను ఒక సుందరారణ్యమున్నదనియు, అది వారికి నివాసార్హమైనదనియు సూచించినాడు.

3. ఆ పైన, అనతికాలముననే, నందాదులు, బృహద్వనమును(1) వదలి, బృందావనమునకు పయనమైనారు; నీవును, నీ మాతృమూర్తి అయిన యశోదయు ఆసీనులై ఉన్న శకటము ననుగమింపసాగినారు.

4. మనోహరముగ ఉన్న ఆ శకటముల సవ్వడి నాలకించుచు, గో సంతతిదైన గిట్టల చప్పుడుతో వీనులవిందు చేసుకొనుచు, అప్పుడప్పుడు, నీవు విసరుచున్న ఛలోక్తులకు కిలకిలలాడుచు పయనించుచున్న నందాదులకు, ఆ నడక బడలికను కలిగించలేదు.

5. అంతలోననే, అందరును, బృందావనమును చేరుకొనినారు, ఆ ప్రదేశమంతయు, వికసించిన మల్లిక మాలతి మున్నగు పూలతోను, దట్టమైన పచ్చికసవుతోను శోభాయమానముగ ఉన్నది. చూపరులకు, అదంతయు, ఇంద్రనీలమణులతో అలంకరింపబడిన గృహాంగణమువలె తోచినది. దానిని చూసి, నీవు మురిసిపోయినావు.

6. అనంతరము, గోపకులు, అర్ధచంద్రాకారమున, తమ గృహములను నిర్మించుకుని, అచట సుఖముగ జీవింపసాగినారు. ఆ సమయమున, నీవు, గోపబాలురతో కలసి వనశోభను తిలకించుచు, ఆ ప్రదేశమునందంతటను తిరుగజొచ్చినావు.

7. కాలక్రమమున, నీవు, ఒకసారి, కళిందపుత్రి అయిన కాళిందిని చూచుట తటస్థించినది. అందు, పాయలు పాయలుగ చీలి ఉన్న నిర్మల జల ప్రవాహములను ఆమె వినీలకుంతలములుగా, అందలి కలహంసల కూజితములను ఆమె మృదు మధురభాషణములుగా, ఫుల్ల వికసిత పద్మములను ఆమె సుందర ముఖారవిందముగ భావించుకుని, నీ వపుడు తన్మయుడవైనావు.

8. ఆ పైన, నీవు, అసంఖ్యాకములైన కేకి సంఘముల కలస్వనములతోను, మణికిరణభాసురములైన ఉత్తుంగ శృంగములతోను మనోహరముగ ఉన్న గోవర్ధన పర్వతమును దర్శించుకొనినావు.

9. అనంతరము, నీవు, నీ సఖులతో ఆ వనాంతర్భాగమున నెటు పోయినను, విరహాతుర అయిన విలాసినివలె, మెలికలు తిరిగి ప్రవహించు ఆ కాళిందియే నీకు ప్రత్యక్షము కాజొచ్చినది.

10. గురువాయుపురాధిపా ! ఆ కాలమున నీవు బలరామునితోను, ఇతర గోపబాలురతోను కలసి, గోవత్సలను మేపుకొనుచు, అచటి పచ్చిక బయళ్లలో, పరమానందమున విహరించుచుండువాడవు.

కృష్ణా ! అచటి, ఏ ఒక గోవత్సపాదరజోకణస్పర్శనందిన పరమాణువును నీవు నా మీద విసరినను, నేను, పవిత్రీభూతుడనై, వేదనా రహితుడనౌదును కదా నాయనా !

అర్థము - వివరణ

(1) బృహద్వనము : మథుర పరిసరములలోగల 12 వనములలోను ఒకటి. గోకులము బృహద్వనమున నున్నది.

అచటి వనములు – బృహద్వనము, మధువనము, తాలవనము, కామవనము, బహులవనము, కుముదవనము, కదిరవనము, భద్రవనము, ఖాండీరవనము, శ్రీవనము, లోహవనము, బృందావనము.

50. వత్సాసుర బకాసుర సంహారం

1. శ్రియఃపతీ! ఆ పైన, నీవు, గోవత్సలను మేపుటయందు ఉత్సాహము కలవాడవై, విషాణమును, (కొమ్ముబూరను) వేణువును, వేత్ర దండమును ధరించి, బలరామునితోను, యితర గోపబాలురతోను బయలుదేరి, భ్రమరబృందమునకు విహారస్థలమైన మధుర బృందావనాంతరమునందు యథేచ్ఛావిహారము సలుపుచుండువాడవు; చూపరులకు కనువిందొనర్చు చుండువాడవు.

2. కృష్ణా! నీ చరణాబ్జములు పరమ పవిత్రములు. ముల్లోకముల కును శరణ్యములు. శ్రీ మహాలక్ష్మికి సర్వదా సేవ్యములు. అది కారణము గనే, నీ చరణస్పర్శనందిన బృందావనము, సర్వైశ్వర్య సంపన్నమైనది. అందలి తరులతాదులు, గోత్ర క్షేత్రములు, సలిలధారలు, భూధరములు, యిది అది యననేల, సర్వమును సర్వథా శోభించినవి.

3. మధుర వేణువు నూదుకొనుచు, గోవత్సలను మేపుకొనుచు, నీవు, ఆ వనాంతర్భాగమునందలి వరి పొలములలోను, పిల్లతెమ్మెరలకు పుట్టినిల్లయిన యమునా తీరము లందును, గోవర్ధన పర్వతోపరి భాగము లందును విహరించుచుండు సమయమున, ఒకనాడు, గోవత్సరూపము ధరించిన రాక్షసుడొకడు నీ కంటబడినాడు.

4. ఉత్సాహముతో, తోకనెత్తి ఆడించుచు, అవకాశమునకు వేచి ఉన్న వానివలె అప్పుడప్పుడు వెనుదిరిగి దొంగచూపులు చూచుచు, (అంభా రవమొనర్చుచు) అచట విహరించుచున్న ఆ వత్సాసురుని చూసి, నీవు, మెల్ల మెల్లగ అతనిని సమీపించినావు. అతని వెనుక కాళ్లు పట్టుకుని, యెత్తి, గిరగిర త్రిప్పి ఒక వృక్షాగ్రభాగమునకు విసరివేసినావు. దానితో, అతని ప్రాణము లెగసిపోయినవి.

5. దుష్టాత్ముడైన ఆ దనుజుడు క్రిందపడినప్పుడు, అతని కళే బరము క్రిందపడి, ఆ పరిసరప్రాంతమునగల వృక్షము లెన్నియో నుగ్గు నుగ్గై పోయినవి. అదంతయు, ఆకసమునుండి చూచుచున్న దేవతానీకము, ఆనందముతో నీ మీద పుష్పవృష్టి గురియించినది.

6. 'ఇంతటి సువాసనగలపూలు యెచటినుండి పడుచున్నవి'? అని, తోటి బాలురు సాశ్చర్యముగ నిన్నడిగినప్పుడు, 'రాక్షసుని పైకి విసరి నప్పుడు ఆకసమున కెగిరిపోయినవి మెల్లమెల్లగ జారుచున్నవ'ని, నీవు, చమత్కారముగ సమాధాన మిచ్చినావు.

7. మరొక రోజున, మండుటెండకు గొంతులెండిపోయిన గోప బాలురు, దాహము తీర్చుకొను నిమిత్తము, యమునానదికి వెళ్లుట సంభవించి నది. ఆ సమయమున, అక్కడ, బకరూపమున నున్న ఒక రాక్షసుడు, రెక్కలార్చుకొనుచు, నీకు కనిపించినాడు. అతడు, చూపరులకు, ఇంద్రుడు పర్వతముల రెక్కలు నఱికివేసినపుడు(1), పొరబడి వదలిన కైలాసగిరి కాదుగదా! యను భ్రమను కలిగించునట్లున్నాడు.

8. గోపబాలురు దాహము తీర్చుకొనుచున్న సమయమున, ఆ బకాసురుడు, నీ మీదకు యెగిరి వచ్చి, నిన్ను మ్రింగివేసినాడు. కాని, నీవు, ఒక అగ్నిగోళమువలె అతని ఉదరమును దహింపసాగుటవలన, వెంటనే, అతడు నిన్ను ఉమిసివేయుట జరిగినది. అయినను, అతడు, నిన్ను వదలి పెట్టలేదు. బాకువంటి తనముక్కుతో, నిన్ను, పొడిచి చీల్చివేయుటకు సంకల్పించుకొనినాడు. కాని, ప్రభూ! దుష్టులను చీల్చిచెండాడుటలో ప్రత్యేకనైపుణ్యముగల నీవు, అతని ముక్కుతుండములు పట్టుకుని, అతనినే నడిమికి చీల్చివేసినావు.

9. తనకు ముందు పోయిన తన సోదరిని, పూతనను, త్వరలో కలుసుకొనవలెనను ఉద్దేశముతోడనో, లేదా, తన్ను అనుసరించిరానున్న తన అనుజుని, అఘాసురుని, కొరకు నిరీక్షించుచుండు సంకల్పముననో,

బకాసురుడూ, తత్క్షణమే యమలోకమునకరుగుట గ్రహించిన దేవతలు, అప్పుడు, నీమీద కుసుమవర్షము గురిపించినారు. ఆపైన, నీవు, నీవారితో నీ నివాసమునకు బయలుదేరినావు.

10. ఆ సమయమున, మధురమైన నీ మురళీనాదమును విని, నీవు వచ్చుచున్నావని గ్రహించి, నిన్ను దర్శించుకొను నిమిత్తము ఆనందముతో పరుగులిడుచు వచ్చిన గోపికలకును, నీ తలిదండ్రులైన నంద యశోదలకును, నీవు, అమితానందము నొడగూర్చినావు.

గురువాయుపురనివాసా! కృష్ణా! నా వేదనలను నివారించి, నాకును అట్టి ఆనందము ననుగ్రహింపుము నాయనా!

అర్థము – వివరణ

(1) ఇంద్రుడు పర్వతముల రెక్కలు నరకివేయుట : ఒకప్పుడు పర్వతములకు రెక్కలుండెడివనియు, వాటి సాయముతో అవి యిచ్చవచ్చిన చోటికి యెగిరిపోయి వ్రాలుచుండెడివనియు, ఆ సమయమున, భూప్రజకును తదితర ప్రాణులకును కలుగుచుండెడి బాధను నివారించు నిమిత్తము, ఇంద్రుడు వాటి రెక్కలను నరకివేసెననియు పురాణములు తెలుపుచున్నవి.

51. అఘాసుర సంహారం

1. ఒకపరి, నీవు, వనభోజనమున కుత్సహించి, తోటిబాలురతో కలిసి, గోవత్సములను తీసుకుని, చల్దిమూటలు కట్టుకుని, సూర్యోదయాత్ పూర్వమే యింటినుండి బయలుదేరినావు.

2. ఆ సమయమున, నిన్ను దర్శించుకొనునిమిత్తము, మహర్షు లెందరో అక్కడకు వచ్చినారు. ముల్లోకములను పావనమొనర్చు నీ పాదధూళిని శిరసావహించి, వా రందరును పరమానందానుభూతి నందినారు.

3. పసిరికతో నిండి ఉన్న ఆ ప్రాంతమునందు నీవు నీ గోవత్స ములను మేపుకొనుచుండగా, అఘుడను ఒక అసురుడు, ఉరుభీకరమైన ఉరగరూపమున, నీ దారి కడ్డువచ్చినాడు.

4. ఆ సమయమున, నీవు, దానికి కొలది దూరమున నున్నావు. అప్పటికే దానిని సమీపించిన బాలురు, అదొక పర్వత మనుకొనినారు. తెరచిఉన్న దాని ముఖమును ఒక గుహగా భావించినారు. అదికారణముగనే, ఆట తమకమున నున్న వా రందరును, దాని నోటిలో జొరబడుట సంభ వించినది.

5. ఆ పైన, గోవత్సములు కూడ గోపబాలుర ననుగమించినవి. ఆ విధముగ సర్పముఖమున ప్రవేశించిన గోపకిశోరులును గోవత్సములును దాని జఠరాగ్నికి తాళలేక తపించిపోవుటను గ్రహించిన నీవు, ఆ ప్రాణులను రక్షించు నిమిత్తము, దాని నోట జొరబడినావు.

6. అంతట, నీవు, నీ శరీరమును పెంచుకొనుట జరిగినది. అది కారణముగ, ఆ సర్పము, ఊపిరిసలుపక గిలగిల తన్నుకొనసాగినది. ఆ పైన, దాని గొంతు ఉబ్బిపోయినది; పగిలిపోయినది. అప్పుడు, నీవును నీవారును, గోవత్సములతోసహ బయటపడినారు.

7. ఆ సమయమున, అఘాసురుని శరీరమునుండి వెలువడిన ఒక మహాద్భుత తేజఃపుంజము, క్షణకాలము గగనతలమున నుండి, నీవు బయల్పడగనే, నీ యందు లీనమైపోయినది. ఆకసమునుండి అదంతయు తిలకించుచున్న దేవతలు, అప్పుడు, ఆనందముతో ఆడినారు; పరవశులై పాడినారు.

8. అనంతరము, బ్రహ్మాదులు విస్మయావిష్టులై నిన్ను వీక్షించు చుండగా, నీవు, నీ మిత్రబృందముతో అక్కడినుండి కదలిపోయి, అప్పటికే మధ్యాహ్నసమయ మగుటవలన, వారితో వనభోజనమున కుప క్రమించినావు.

9. ఆ సమయమున, నీవు, నీ మురళిని మొలలో దోపుకునిఉన్నావు. ఒక చేతితో అన్నము ముద్దను పట్టుకొని ఉన్నావు. ఛలోక్తులతో తోటి వారిని నవ్వించుచున్నావు. అదంతయు గమనించుచున్న అనిమిషులు, నీ లీలావిలాసము నెంతగనో ప్రశంసించినారు.

10. అంతే కాదు. 'బృందారక బృందముతో ఆరగించు హవ్యము కన్న, గోప బృందముతో తిను గోగుపచ్చడి ముద్దలే యీయనకు రుచికర ముగ ఉన్నట్లున్నవి' అని కూడ వా రనుకొన సాగినారు.

గురుపవనపురాధిపా! కృష్ణా! దేవతలు నీ కీర్తిని గానము చేయు చున్నారు. నేనో, నా ఆర్తిని వెళ్ళబోసికొనుచున్నాను. తప్పు పట్టకుము తండ్రీ!

52. గోవత్సాపహరణం

1. అఘాసుర మోక్షణ సందర్భమున ప్రదర్శితమైన నీ మహిమాతిశయము, అంతకుముందు, యే అవతారమునందును కనిపించకపోవుటవలన, అట్టిదానినే మరొకమారు దర్శింపవలెనను కుతూహలము, బ్రహ్మదేవునకు కలిగినది. ఆ వెంటనే, ఆయన, తన మాయా ప్రభావమున, నీ ఆవుదూడలన్నిటిని అదృశ్యము చేసినాడు.

2. గోవత్సలు కనబడకపోవుటవలన, గోపబాలురు అమితముగ ఆందోళన పడినారు. అది గ్రహించిన నీవు, చేతిలోని అన్నము ముద్దను చేతిలోనే ఉంచుకుని, బ్రహ్మదేవుని కోరిక తీర్చుటకా అనినట్లు, గోవత్సములను వెదకుటకు బయలుదేరినావు. అంతలో, ఆయన, అక్కడ చల్దులారగించుచున్న గోపకుమారులనుకూడ మాయము చేసినాడు.

3. అనంతరము, నీవు, నీ మాయా ప్రభావముద్వారా, గోవత్సల రూపములను, గోపబాలుర రూపములను, పెరుగుముంతలు కొమ్ముబూరలు మున్నగువాని రూపములను ధరించి, యథాపూర్వకముగ నీ ఆటలు సాగించుకుని, సంధ్యా సమయమునకు బృందావనమును చేరుకొనినావు.

4. ఆ విధముగ బహురూపధారణ మొనర్చిన నిన్ను, గోవులు గోవత్సల రూపమునను, గోపాంగనలు గోపకిశోరుల రూపమునను దర్శించుకుని, అపూర్వానందము ననుభవింపసాగినారు.

5. పూర్వవాసనా బలమున యే జీవియో తమ గర్భమున జనించినపుడు, దానిపట్ల మమకారమును పెంచుకొని 'వీడు నావాడు', 'ఇది నాది' అనుకుని ఆనందించుట, తల్లుల సహజ లక్షణమైనపుడు, సర్వాత్మ స్వరూపుడవైన నీవే స్వయముగ తమ బిడ్డల రూపమున తమ సమక్షమున నున్న

తరి, ఆ తల్లులు అనుభవించు ఆనందమునకు అవధి యేముండును ప్రభూ! అట్టి అనుపమానందమేకదా, అప్పుడు, గోవులకును గోపాంగనలకును లభించినది !

6. బహు రూపముల భాసించుచున్న నిన్ను, గోకులమంతయు, దినదినాభివృద్ధి నందుచున్న అనురాగముతో లాలించుకొనజొచ్చినది. అట్లొక సంవత్సరకాలము జరిగినది. ఆ సంవత్సరాంతమునగాని, నీ సోదరునకు అసలు విషయము అవగతము కాలేదు.

మీ రిరువురును ఆ పరమాత్మ స్వరూపులే అయినను, మీ మధ్య, యెంత అంతరమున్నది ప్రభూ !

7. అనంతరము, చతుర్ముఖుడు, తను మాయముచేసిన గోవత్సలను గోపకిశోరులను, తన సముఖముననున్న గోవత్సలను గోపకిశోరులను యేక కాలమున తిలకించినాడు. తత్తరపడినాడు. వివేకహీనుడై నాడు. అది గ్రహించిన నీవు, నూత్నరూపములన్నియు నీవుగా అతనికి ద్యోతపరచినావు. ఆ సమయమున, అతడు, చతుర్భుజులుగా, వరకిరీటధారులుగా, దివ్యాభరణ భూషితులుగా, శ్యామలవర్ణ దేహులుగా భాసించుచున్న అనంత మూర్తులను దర్శించుకొనినాడు.

8. అతడు దర్శించుకొనిన అన్ని మూర్తులును, శేషతల్పమున, యోగనిద్రలో ఉన్నవి. అన్ని మూర్తులను, శ్రీ మహాలక్ష్మి సేవించుచున్నది; సనకాదులు స్తుతించుచున్నారు.

9. ఆ విధముగ, శ్రీమన్నారాయణుని, అనంతరూపములలో దర్శించుకొనిన చతుర్ముఖునకు, ఆ మూర్తు లన్నిటికిని తాను పరిచర్య సలుపుచుండుట గోచరించినది. అది చూసినంతనే, అతడు, మోహోపహతుడైనాడు. అది గ్రహించిన నీవు, నీ రూపము లన్నిటిని ఉపసంహరించుకొన్నినావు. సగము తివి వదలిపెట్టిన అన్నము ముద్దతో, తిరిగి అతనికి ప్రత్యక్షమైనావు.

10. అది చూసిన చతుర్ముఖుని గర్వమంతయు హరించిపోయినది. ఆపైన, అతడు, నీకు పునః పునః ప్రణామము లాచరించి, నీ వద్ద సెలవు తీసుకుని, సత్యలోకమునకు వెళ్ళిపోయినాడు. అనంతరము, నీవు, గోప బాలురతోను గోవత్సలతోను గోకులమును చేరుకొనినావు.

గురువాయుపురాధీశ్వరా ! కృష్ణా ! చతుర్ముఖుని జాడ్యమును(1) వలె నా జాడ్యమును(2) కూడ హరింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) జాడ్యమును : మూర్ఖత్వమును.

(2) నా జాడ్యమును : నా రోగమును.

53. ధేనుకాసుర సంహారం

1. ఆ విధముగ, ఆరేండ్లు గడచిపోయినవి. నీలో, క్రొంగ్రొత్త రుచులు పొడచూపినవి. ఆ సమయమున, నీ మనసు, గోవత్సలనుండి గోవులమీదకు మరలినది.

2. అనంతరకాలమున భూపాలకత్వము వహింపనున్న నీవు, గోపాలకత్వముతో కార్యారంభ మొనర్చుట, యెంతయు సమంజసమేగదా ప్రభూ !

3. ప్రకృతి శోభను తిలకించుచు, బలరామునితోసహ వనాంతర్భాగ మున విహరించుచున్న నీవు, ఒకసారి, నీ చెలికాడైన శ్రీదాముని సూచన మీద, జయజయధ్వానముల నడుమ, ధేనుకాటవిలో ప్రవేశించినావు.

4. ఆ సమయమున, బలరాముడు, నీ ప్రేరణమీద, అచటి తాళ వృంతములను అత్యుత్సాహముతో అటు నిటు ఊపసాగినాడు. కూకటి వ్రేళ్ళతోసహ పెకలింపసాగినాడు. అది కారణముగ, పండ్లు, కాయలు, అసంఖ్యాకముగ రాలిపోయినవి. అది గ్రహించి, గర్దభాకారుడైన ధేనుకా సురుడు, పరుగుపరుగున అక్కడికి వచ్చినాడు.

5. నీవు, ధేనుగణ పోషణమున కవతరించినవాడ వగుటవలన, ధేనుకుడను పేరుగల ఆ దేవద్రోహిని వధించుటకు వెనుకాడినావు. అది గ్రహించిన బలభద్రుడు, వెంటనే, ఆ పని పూర్తిచేసినాడు.

6. అనంతరము, జంబుకాకారులైన (నక్కల రూపముననున్న) ఆ ధేనుకుని అనుజులును అనుయాయులును ఒక్కుమ్మడిగ మీ మీద పడినారు. వా రందరిని, జంబూ ఫలములనువలె, (నేరేడు పండ్లనుమాదిరి) నీవును నీ అన్నయు, తాటి మ్రానులకు వేసికొట్టి, అవలీలగ కూల్చివేసినారు.

7. జంబుకములను (నక్కల రూపముననున్న అసురులను) నీవు వధించుచుండుటవలన, జంబుకుడని వేదములందు ప్రసిద్ధుడైఉన్న వరుణుడు కూడ భయపడినాడు. తన పేరు బయటపడకుండ చూచుకొనినాడు.

8. ధేనుకాసుర సంహారమును కనులార గాంచిన దేవతలు, 'మురహరా! నీ అవతారము యిప్పుడుగదా ఫలప్రదమైనది' అని, నిన్ను స్తుతించినారు. వారి స్తోత్రమును అర్థవంతము చేయుటకువలె, నీవు, నీ చేతిలోని తాలఫలమును (తాటిపండును) యెత్తి చూపుచు, 'అదే యిది' అని మందహాసము చేసినావు. ఆ పైన, తోటి బాలురతో కలిసి, వాటిని ఆరగించినావు.

9. మంచి కండ గలవియు, మధురమైనవియు అయిన ఆ ఫలములను, తిన్నన్ని తిని, మిగిలిన వాటితో, నీవును నీవారును, సగర్వముగ యిండ్ల కేగినారు.

10. ఆ పైన, తమ బిడ్డలు తెచ్చియిచ్చిన మధుర ఫలముల నారగించుచు, ధేనుకాసుర సంహారగాథను ఒకరికొకరు వర్ణించి చెప్పుకొనుచు, వ్రజవాసు లందరును నిన్ను ఆశీర్వదించినారు; నీకు జయము పలికినారు.

గురువాయుపురాధిపా! కృష్ణా! నీ సాహచర్యమున ఆ గోప కిశోరులు పొందిన సంతృప్తిని, నీ సేవద్వారా, నాకు లభింపజేయుము నాయనా!

54. గోగోపోజ్జీవనం

1. పూర్వము, సౌభరిమహర్షి, కాళిందీనదిలో ఉండి, నిన్ను సంతుష్టిపరచు నిమిత్తము, పన్నెండు సంవత్సరములకాలము తీవ్ర తప మొనర్చినాడు. దీర్ఘకాలసంపర్కము వలన, ఆయనకు, అందులో క్రీడించు చుండు మీనులపట్ల అమితానురాగము కలిగినది. ఆ సమయమున, ఒకసారి, గరుడుడు అచటకు పోవుట సంభవించినది.

2. గరుడుడు త్రుక్షకశ్యపుని కుమారుడు. నీకు వాహనమైనవాడు. అదియే కాదు. ఆ సమయమున నాకలిగొనియున్నాడు. అట్టి గరుడుడు అచటి మీను నొకదానిని భక్షించుచుండుట గమనించి, సౌభరిమహర్షి, అమితమైన ఆవేదన పడినాడు. అది కారణముగనే, అతడు, గరుడుని ఉద్దేశించి, 'ఇకమీద ఇచటి జీవులను భుజించినచో, నీవు, నీ జీవిత మును త్యజింపవలసివచ్చును' అని శపించినాడు.

3. ఆ కాలమున, కాళియుడను ఒక సర్పరాజు ఉండెడివాడు. అత డొకసారి, తన విషగర్వము కారణముగ, సర్పారాతి అయిన గరుడునకై నిర్దేశింపబడిన ఆహారమును భుజించినాడు. నీ ఆశ్రితుడైన గరుడుడు అద్ది గ్రహించి, ఆగ్రహించుకొనినాడు. తన రెక్కను విచ్చి, అతనిని, ఒక్క చఱపు చఱచినాడు. దానిమీద, కాళియునకు, ప్రాణభీతికలిగినది. అది కారణముగనే, అతడు, గరుడునకు ప్రవేశార్హతలేని కాళిందిలో తలదాచు కొనుట జరిగినది.

4. విషానలమును గ్రక్కుచుండు కాళియునకు, కాళింది, ఆ విధముగ నివాసస్థానమైనది. అదికారణముగ, ఆ నదీతీరమున ఉన్న వృక్షము లన్నియు, ఎండి మోడులై పోయినవి. ఆకసమున విహరించు

చుండు పశులన్నియు చచ్చుపడిపోజొచ్చినవి. అది గ్రహించిన నీ హృదయము కలఁగిపోయినది.

5. అట్టితరి, నీవు ఒకసారి, బలభద్రుని ఇంటివద్దనే వదలి, గోవులను గోవత్సలను తీసుకుని, యమునాతీరమున నున్న వనాంతరమున కేగినావు. అపుడచట, మండుటెండలో తిరుగుచున్న గోవులును గోపబాలురును, తాపోపశమనార్థము, కాళిందీ జలము, విషపూరితమైనదని తెలియక, త్రావుట సంభవించినది.

6. విషజలపానము వలన, గోవులు నేల కొరిగిపోయినవి. గోపబాలురు మూర్ఛితులైనారు. అదిచూసిన నీ హృదయము, ద్రవించిపోయినది. ఆ వెంటనే నీ వచటికిపోయి, నిన్నాశ్రయించిన ఆ ప్రాణులమీద, నీ కరుణారసామృత వీక్షణములను ప్రసరింపజేసినావు.

7. అది కారణముగ పునర్జీవితులైన గోపబాలురు, అదెదో ఒక విధమైన ఆనందానుభూతి నందినారు. ఆపైన, తమ సమక్షమున నున్న నిన్ను చూసి, నీ ప్రభావాతిశయమును మున్ను వీక్షించి యున్నవారగుట వలన, అనిర్వచనీయమైన తమ అనుభూతికి నీవే మూలమై ఉందువని నిర్ణయించుకొనినారు; నిన్ను, అత్యంతానందముతో, ఆలింగన మొనర్చికొనినారు.

8. వారివలెనె తేరుకొనిన గోవులుకూడ, నిన్ను దర్శించుకుని, పరమానందమున, హర్షాశ్రులు రాల్చినవి. మందమందముగ అంభారవ మొనర్చినవి. నిన్ను చుట్టి తిరుగ జొచ్చినవి.

9. 'మోక్షప్రదాతా! కృష్ణా! ఆ విషతీవ్రత యేమోగాని, మా శరీరములకు గగుర్పాటు కలుగుచున్నది. మాలో పరమానందము పొంగి పరవళ్ళు త్రొక్కుచున్నది' అని, అప్పటి తమ దివ్యానుభూతికి, ఆ విషజలపానమే కారణ మనుకొనినట్లు, గోపబాలురు, ఆ పైన పలుక

సాగినారు. నీకు కృతజ్ఞత తెలుపుకొనినారు. పునః పునః ప్రణామము లాచరించినారు.

10. గురుపవనపురాధిపా ! కృష్ణా ! నీ కృపాపాంగ వీక్షణముల ద్వారా, మరణించిన నీ భక్తులను బ్రతికించినావు. విషజలపానమువలన వారికి ప్రాప్తించిన వేదనను నిర్మూలించినావు. అట్టి అనుగ్రహమునే, నా పట్ల కూడ చూపవలసినది తండ్రీ ! నన్ను రోగవిముక్తుని చేయవలసినది నాయనా !

55. కాళియ మర్దనం

1. భగవన్! ఆ పైన, నీవు, ఆ ఘోరభీకర విషసర్పమును కాళిందినుండి తొలగించుటకు నిశ్చయించుకుని, ఆ ప్రక్కనే, యెండి మ్రోడై ఉన్న ఒక కదంబ వృక్షము నెక్కినావు.

2. చివురుటాకులవంటి పాదములతో, గబగబ ఆ వృక్షాగ్ర భాగమునకు పోయి, అక్కడినుండి ఒక్క గంతువేసి, ఉత్తుంగ తరంగ మాలికలతో కూడిఉన్న ఆ జలమధ్యమున, 'గుభీ'మని దుమికినావు.

3. బొజ్జలో ముజ్జగములుకల నీవు, అటు లమాంతముగ దుముకుట వలన, ఆ నదీజలము, ఘూర్ణిల్లుచు పొంగి, ఆ తీరము నిరువంకల ముంచెత్తినది.

4. ఆ భీకరధ్వని నాలకించి, సంక్షుభితమైన జలరాశిని వీక్షించి, కళ్ళు కప్పిన క్రోధముతో, కాళియుడు పైకి వచ్చినాడు.

5. ఆ విధముగ నీ కట్టెదుట నిలబడిన కాళియుడు, సహస్ర శృంగ ములుకల ఒక కాటుక కొండవలె కనిపించినాడు. అతడు అప్పుడు ఉమిసిన కాలకూటము, అతని అనంత ఫణులనుండి బాహిరిల్లుచున్న అగ్నిధారవలె గోచరించినది.

6. ఆ పైన, ఆ మహానాగము, నిప్పులు క్రక్కుచు నీ వంక చూడ సాగినది. మహోగ్ర విషధూమమును నలుదిక్కుల ప్రసరింపజేసినది. ఇష్టమువచ్చినట్లు నిన్ను కఱచినది. అతులిత బలశాలివైన నిన్ను, అచింత్య కర్ముడవైన నిన్ను, ఆపాదమస్తకము గట్టిగ చుట్టుకొనినది.

7. అది కారణముగ నీవు కనిపించక పోవుటవలన, ఆ నదీ తీరమునఉన్న గోవులును గోపబాలురును అమితముగ కలవరపడుట జరిగినది.

అదే సమయమున, అక్కడ, గోకులమునందు, అనేక దుశ్శకునములు గోచరించినవి. వాటిని గ్రహించిన వ్రజవాసులు, నిన్ను వెదకికొనుచు, యమునా నదిని సమీపించినారు.

8. సర్వశక్తి సంపన్నుడవైన కృష్ణా ! ఆ విధముగ కాళిందిని చేరిన వ్రజవాసులు, నీ దురవస్థను చూసి, ఆ పైన తాము బ్రతికియుండుట నిరర్థకమని నిర్ణయించుకొనినారు. వారి మనోవేదనను గ్రహించిన నీవు, ఆ వెంటనే, అతి విచిత్రముగ, ఆ నాగబంధమునుండి బయటపడి, మందహాసమొనర్చుచు వారికి దర్శన మిచ్చినావు.

9. అనంతరము, నీవు, ఆ ఫణీంద్రుని పడగలమీదకు యెగిరి, అక్కడ, సవిలాసముగ నృత్యము చేయసాగినావు. ఆ సందర్భమున, నీ కరకంకణముల రవళియు, నూపురముల మధురస్వనమును, నీ మృదుపద విన్యాసమునకు అనుగుణముగ తాళము వేసినవి. అప్పటి నీ చరణశోభ వర్ణనాతీతము ప్రభూ !

10. ఆ నీ నృత్యమును తిలకించిన గోపకులు, నీ క్షేమమునారసి, అమితానందము నందినారు. మహర్షులు, నీ దుష్టశిక్షణాభిరతిని గ్రహించి సంతుష్టి చెందినారు. దివిజానీకము నీ లీలావిలాసమునుచూసి, మోదించి, నీ మీద కుసుమవర్షము కురియించినది.

గురుపవనపురేశా ! కృష్ణా ! కాళియుని గర్వోద్ధతిని నిగ్రహించిన విధమున నా రోగోద్ధతినికూడ నిగ్రహింపుము నాయనా !

56. కాళియానుగ్రహం

1. దేవతలు ఉత్సాహమున దుందుభులు మ్రోయించుచుండగా, దివ్యాంగనలు నీ కీర్తిని గానముచేయుచుండగా, మణిమయాంచితకుండలములు నీ మృదు గండభాగమును ముద్దిడుకొనుచుండగా, నీవు, ఆ కాళియుని శిరమున నెంత సేపు నృత్యమొనర్చితివో నీకే తెలియదు.

2. ఆ విధముగ నీవు నృత్యము చేయుచున్నపుడు, కాళియుని పడగలు, ఒకటొకటిగ ఒరిగిపోవుచుండెడివి. నీవు, ఆ ఒరిగిపోయిన పడగలను వదలిపెట్టి, ఉన్నతముగఉన్న పడగలమీది కెగిరి నృత్యము సాగించుచుండువాడవు. అప్పటి నీ చరణకమల విన్యాసము, నీ కరతాళ ధ్వనుల కనుగుణముగ ఉండెడిది.

3. లక్ష్మీపతీ ! అట్లు, నీ వెంతప్రొద్దు నటించితివోగాని, నీ పద ఘట్టనల మూలమున, అతని పడగలన్నియు ముడుచుకుపోయినవి. అతని బలముపూర్తిగ ఉడిగిపోయినది. ఆ సమయమున, అతడు క్రక్కిన రుధిరముతో, ఆ నదీజలమంతయు ఎఱ్ఱవారినది. అదిగ్రహించిన అతని పత్నులు, ఆపైన, నీ పాదములకు ప్రణమిల్లినారు.

4. ఆ నాగపత్నులు, అంతకుపూర్వమే నీ మాహాత్మ్యమును విని, నీ యందు మనసును లగ్నముచేసుకుని ఉన్నవారగుటవలన, ఆ వెంటనే, మునీశ్వరులుకూడ మున్ను ఊహించి ఉండని మార్గమున, సర్వస్వతంత్రుడవైన నిన్ను స్తుతింపసాగినారు.

5. అచ్యుతా ! వారి భక్తిభావమును గ్రహించి వారిపట్ల ప్రసన్నుడవైన నీవు, వారికి పతిభిక్ష పెట్టినావు. ఆ విధముగ బ్రతికిబయటపడిన పన్నగేశ్వరుడు, నీకు స్వాత్మార్పణ మొనర్చుకొనినాడు; సాష్టాంగ దండ ప్రణామ మాచరించినాడు.

6. ఆ పైన, నీవు, అతనిని లేవనెత్తి, 'నీ విక రత్నాకరమున నున్న రమణక ద్వీపమునకు పోవలసినది. గరుడ భీతిని త్యజింపవలసినది' అని ఆదేశించినావు. నీ పలుకులమీది పరిపూర్ణ విశ్వాసముతో, కాళియుడు, ఆ పైన, తనవారితోసహ, కాళిందిని వదలి వెళ్లిపోయినాడు.

7. అనంతరము, నీవు, నాగపత్నులు సమర్పించుకొనిన దుకూలములను, మణిమయాంచిత హారములను, యితర రత్నాభరణములను ధరించి, ఆనందాశ్రులు రాల్చుచు అంతదనుక నీకొఱకు నదీతీరమున వేచి ఉన్న నీవారిని సమీపించినావు. అప్పటికి సంధ్యాసమయమైనది.

8. ఆ చీకటిలో, గోకులమువరకుపోవుట అపాయకరమని భావించి, వ్రజవాసులందరును, ఆ రాత్రి, నీ సమక్షమున అక్కడనే ఉండిపోయినారు. గాఢనిద్రాపరవశు లైనారు. ఆ సమయమున, యెచటనో బయలుదేరిన వనవహ్ని, వారిని సమీపించినది; చుట్టుముట్టినది.

9. అది గ్రహించిన గోపకులు, ఆర్తితో అరవసాగినారు. వారి దీనాలాపములను విన్న నీవు, వారిని రక్షించునిమిత్తము, ఆ వెంటనే, ఆ దవాగ్నిని, అమాంతముగ నీలోనికి తీసుకొనినావు.

ఇందులో ఆశ్చర్యపడవలసిన దేమున్నది ప్రభూ ! అది నీ ముఖోద్గతమైనదేగదా !

10. 'ఇంతవరకు, వనవహ్నినిగురించి వినుటయేగాని, చూచినదిలేదు. కాని, యిపుడో, దానిని చూచుటయు, దానిని హరింపగలవానిని దర్శించుకొనుటయుకూడ జరిగినది' అని, తమలోతాము అనుకొనుచు, గోపాలురు నిన్ను ప్రశంసింపసాగినారు.

శ్రీహరీ ! ఆ దవాగ్నిని వలెనె, నా వాత రోగమును, దానికి మూలకారణమైన నా పాతకములనుకూడ హరింపుము నాయనా !

57. ప్రలంబాసురవధ

1. సర్వార్థ ప్రదాతా ! కృష్ణా ! ఒకనాడు, నీవు, ముచ్చటగ అలంకరించుకుని, బలరామునితోను గోపకిశోరులతోను కలసి, ఆలను మేపుటకు వనాంతరమున కేగినావు.

2. భగవన్ ! ఆ సమయమున, వేత్ర దండములు(1) ధరించిన తోటి బాలురతో ఆడుకొనుచు, అక్కడక్కడ, బలభద్రునకు, బృందావన శోభను ద్యోతపరచుచు, పాపులకు తాపము నొడగూర్చు నీవు, పోయిపోయి, భాండీ రకమను ఒక వటవృక్షమును చేరుకొనినావు.

3. ఆ సమయమున, అతి క్రూరుడైన, ప్రలంబ నామక దైత్యు డొకడు, దీర్ఘబాహుడవైన నిన్ను సంహరించు ఉద్దేశముతో, గోపకిశోర రూపమున నిన్ను సమీపించినాడు.

4. అతని దుశ్చింతను గ్రహించికూడ, ఉట్టి అమాయకునివలె, నీవు, అతనితో స్నేహము చేసికొనినావు. ఆ పైన, మల్లయుద్ధ విశారదు లైన గోపబాలుర మధ్య, అక్కడనే, ఒక ద్వంద్వ యుద్ధము నేర్పాటు చేసినావు.

5. అనంతరము, గోపకిశోరులను రెండు వర్గములుగా విభజించి, ఒక వర్గము బలభద్రునకు ఒప్పజెప్పి, నీ బలమునూహించి భయపడు చున్న ప్రలంబుని, నీ జట్టులో చేర్చుకొనినావు.

6. ఆ ద్వంద్వ యుద్ధమున, ఓడిపోయినవారు, గెలిచినవారిని, తమ భుజములమీద కొంతదూరము మోసికొనిపోవు నియమమున్నది. ఆ నియ మానుసారము, నీకు అతి సన్నిహితుడైన శ్రీ దాముని చేతులో, కోరి పరా జయమును పొంది, అతనిని నీ భుజస్కంధమున నెక్కించుకొనినావు; 'భక్తజన సేవకుడ'వని నిరూపించుకొనినావు.

7. నీవు అపార మహిమా సమన్వితుడవు నాయనా ! నీవు యేర్పర చిన ఆటలో, పరాజితులైనవా రందరును, ప్రత్యర్థులను మోసికొనిపోవుట జరుగుచున్నది. ఆ సమయమున, బలభద్రుని చేతులో ఓడిపోయిన ప్రలం బుడు, అతనిని తన భుజస్కంధమున కూర్చుండబెట్టుకుని, నీకు దూరముగ తీసుకుపో జూచినాడు.

8. ఆ విధముగ తనను తీసుకుపోవుచున్న ప్రలంబుని మనః ప్రవృత్తిని, బలరాముడు గ్రహించినాడు. గ్రహించి, తన శరీరమును పెంచుకుని, కొండవలె బరువెక్కి పోయినాడు. అట్లు బరువెక్కిన అతనిని మోయజాలక, ఆ అసురుడు, తన నిజరూపమును గ్రహించుటయు, అప్పు డతనిని చూసిన బలరాముడే భయపడిపోవుటయు సంభవించినది.

9. ప్రలంబుని మూపునఉన్న బలభద్రునకు, దూరముననున్న నీవు గోచరించినావు. నిన్ను చూడగనే, అతనికి ధైర్యము వచ్చినది. ఆ వెంటనే, అతడు, తన ముష్టిఘాతములతో ఆ దురాత్ముని కూల్చివేసినాడు.

10. అట్లు, ఆ రాక్షసవీరుని సంహరించి, నిన్ను సమీపించిన బల భద్రుని, నీవు, ప్రేమపూర్వకముగ కౌగిలించుకొనినావు. ఆ విధముగ తిరిగి కలిసికొనిన మీ యిరువురిమీదను, దేవతలు, కుసుమ వర్షము కురి పించినారు.

11. నీల కోమల శరీరా ! కృష్ణా ! నీవు, త్రిభువనాశ్రయుడవుకదా తండ్రీ ! నాకును ఆశ్రయభిక్షపెట్టి, క్రూరుడైన ఆ ప్రలంబాసురుని సమయ జేసినట్లే, తీవ్రమైన నా క్లేశమునుకూడ శీఘ్రముగ సమయజేయుము నాయనా !

అర్థము - వివరణ

(1) వేత్ర దండములు : గొడ్లను మేతకు గొనిపోవునపుడు బాలురు తీసుకుపోవు కొయ్యబద్దలు - చేతి కఱ్ఱలు.

58. దవాగ్ని మోక్షణాదికం

1. కృష్ణా ! నీవు, తోటిబాలురతో క్రీడించుచు, ప్రలంబాసుర వధోద్యమమున నిమగ్నుడవై యున్న సమయమున, కోమల ఘాస ఖాదన రతితో(1) యథేచ్ఛావిహార మొనర్చుచున్న గోవులు, దూరముననున్న, ఐషీకవనమున (ముంజాటవిలో) ప్రవేశించుట జరిగినది.

2. శీతల బృందావనసీమలో తిరుగు గోవులకు, అచటి యెండ వేడిమి, భరింపరాని దైనది. దానికి తోడు, నీతో కలిగిన వియోగము, వాటి తాపమును యినుమడింపజేసినది. అది కారణముగ, అవి, నాలుక లెండిపోయి, దిక్కుతోచక, అక్కడనే నిలబడిపోయినవి.

3. ఆ పైన, నీవు, నీ వారితో కలిసి, దారి తప్పిన వాటికొరకు అరణ్యమంతటను వెదకినావు. చివరకు, అవి, మూర్తీభవించిన శోక దేవతల వలె, ముంజారణ్యమున నొకచోట కనిపించినవి. వాటిని వెనుకకు తోలుకుని వచ్చుటకు నీవు ఉత్సహించినావు. అంతలోననే, ఆ పరిసర ప్రాంతము నంతను, దవానల(2) మలముకొనినది.

4. ఆ మంటలు, చటచ్ఛటారవములతో, నలుదిక్కులనుండి తమ్ము చుట్టుముట్టినప్పుడు, దారితెన్నులు తోచని గోపార్భకులు, ఆర్తత్రాణ పరాయణుడవైన నిన్నే స్మరించుకొనినారు. 'భువన బంధూ ! మమ్ము రక్షింపవలసినది' అని, అప్పటికే సగము చచ్చిన ప్రాణములతో మొఱపెట్టుకొనినారు.

5. వారి మొఱాలించిన నీవు, వారికి అభయ మొసంగినావు. 'అందరు నొకమారు కన్నులు మూసుకొనవలసినది' అని ఆదేశించినావు. వారు, ఆ వెంటనే, నీవు చెప్పినట్లు చేసినారు; మరుక్షణమున, భండీర

వటవృక్షముక్రింద ఉన్నారు. ఆ దవానల మేమైనదో, ముంజాటవి యెటు పోయినదో నీకే తెలియవలెను ప్రభూ!

6. ఆ సమయమున, గోపబాలురు సలిపిన జయజయ ధ్వానములకు అంతులేదు. వారందరును, నీ మాయా ప్రభావమును బహు భంగుల ప్రస్తుతించినారు.

వారి పొగడ్త లన్నిటిని, మాయామయుడవైన నీవు, మందహాసముతో స్వీకరించినావు. ఆ పైన, వారితో కలసి, ఆ వనాంతర్భాగమున, సవిలాసముగ సంచరించినావు. అప్పుడు, అచటి, పొగడ పున్నాగ మున్నగు పూలచెట్లను చూసినవారు మాత్రమే, అది గ్రీష్మర్తువు కాబోలు ననుకొనుట జరిగినది.

7. అప్పటి గ్రీష్మతాపము, భక్తిహీనుల హృదయమును పీడించునదివలె, భక్తవరుల పాపములను ఇంకించునదివలె, దివ్యతేజమును వెదజల్లుచుండు నీ అభయహస్తమువలె ఉన్నది. ఆ కాలమునంతను, నీవు, యమునా తీరముననే గడిపినావు.

8. ఆ పైన, నీ శరీరచ్ఛాయనుబోలు మేఘజాలముతోను, నీ పట్టు పీతాంబరమువంటి తటిల్లతా సముదాయముతోను విలసిల్లుచు, అవనీతలమునకు ఆహ్లాదము కలిగించు వర్షర్తువు వచ్చినది. ఆ సమయమునంతను, నీవు, గిరిగహ్వరములయందు గడపినావు.

9. అపుడు, గోవర్ధన గిరీంద్రుడు, ప్రతిధ్వను లీనుచుండు కేకిగముల కూజితములు స్తోత్రపాఠములుగా, కుటజ కదంబ సుమవిసరములు పుష్పోపహారములుగా, నిన్ను, నిత్యము అర్చించుకొనుచుండువాడు.

10. అనంతరము, నీవు, శరద్ ఋతువునకు స్వాగతము చెప్పినావు. ఆ సమయమున, ఆ వనాంతర్భాగములయందు యెచట చూచినను జలమే. అదియు, భక్తవరుని హృదయమువలె పరిశుద్ధముగ నుండెడిది.

అప్పుడు, నీవు, ఆ ప్రాంతముననుండు పసిరికను తినిపించుచు, ఆ పరిశుద్ధ జలమును త్రావించుచు, నీ ఆలమందను, సానందుడవై యేలుకొనుచుండు వాడవు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! ఆ గోవత్సలనువలె నన్నును నీ వేలుకొనుటకు, నేను, యింకెన్నివేల జన్మ లెత్తవలెనో గదా తండ్రీ !

అర్థము - వివరణ

(1) కోమల ఘాస ఖాదన రతి : లేతగడ్డి మొలకలను తినవలెనను ఆసక్తి.

(2) దవానలము : అడవులలో చెలరేగు పెద్ద మంట.

59. వేణుగానం

1. ఆ వయసున, నీ శ్రీ విగ్రహము, లేత సెనగపూమొగ్గవలె కోమలముగను, మనోహరముగను, ప్రేమవర్ధకమైనదిగను ఉండెడిది. సచ్చిదానందాత్మకమైన ఆ మూర్తిని కనులారగాంచిన వ్రజాంగనల యందు, మోహము, దినదినాభివృద్ధి నందుచుండెడిది.

2. ఆ విధముగ మోహోపహతలైన గోపికలు, చాటుమాటుగ నిన్ను దర్శించుకొనుటకు ఉత్సహించుచుండువారు. ప్రాతఃకాలముననే నీవు వనాంతరములకు పోవుటనుకూడ, వారు సహింపలేకుండెడివారు.

3. నీవు గోకులమునుండి బయలుదేరిన పిమ్మట, ఆ మృగేక్షణలు, నీవు కనుమఱుగు అగువరకు నీవంకనే చూచుచుండువారు. నీ మీదనే మనసును నిలుపుకుని, నన్నే స్మరించుకొనుచు, అంతకంతకు దూరమగుచుండు నీ మృదుమురళీస్వనమును శ్రద్ధతో ఆకర్ణించుచుండువారు. ఆ పైన నీ లీలావిలాసములను అభివర్ణించుకొనుచు ప్రొద్దుబుచ్చుకొనుచుండువారు.

4. నీ మటుకు నీవు, కాననాంతరమున ప్రవేశించిన మీదట, ఏదో ఒక చెట్టునానుకుని, వ్యత్యస్త పాదములతో(1) సవిలాసముగ నిలబడి, నీ దివ్యవేణువును మధురాతి మధురముగ మ్రోయించుచు, తన్మయత్వము చెందుచుండువాడవు.

5. ఆ మురళీస్వనము, అప్సరోంగనలను, మన్మథబాణమువలె పీడించెడిది. పశుపక్ష్యాదులకు, భావోద్వేగజనితమైన అచేతనత్వమును కలిగించెడిది. శిలలను ద్రవింపజేసెడిది.

6. సొగసులొలుకు భంగిమలో నీవు నిలబడి ఉన్నటులు, పద్మపత్రములవంటి నీ చేతివ్రేళ్లు ఆ వేణు రంధ్రములమీద నటించుచున్నటులు, పల్లవములవంటి నీ చిరుపాదములు నీ వేణునాదమునకు అనుగుణముగ

తాళము వేయుచున్నటులు భావించుకుని, ఆ వ్రజాంగనలు సమాధి స్థితి ననుభవించుచుండువారు.

7. శంకారహితముగ నిన్ను దర్శించు కొనుచుండు దివిజాంగనలు ధన్యజీవులని, పశు పక్ష్యాదులు మృగములు ఆర్జించుకొనిన పుణ్యము అనితర దుర్లభమైనదని, అన్నిటినిమించి నీ పాదస్పర్శనంది పులకించు చుండు ఆ పవిత్రబృందావనసీమ అదృష్టమే అదృష్టమని, గోపవధూమణులు సదా భావించుకొనుచుండువారు.

8. ఆ వేణువు అనుభవింపగా మిగిలిన నీ అధరసుధారసమును ఆస్వాదింపవలెనని, గోపికలు, అమితముగ తపించుచుండెడివారు. కాని, 'అది అందని మ్రానిపండు' అను అభిప్రాయముతో, నిట్టూర్పులు నిగుడ్చు చుండువారు.

9. ఆ విధముగ నీ పట్ల అనురాగము అభివృద్ధి యగుచున్నకొలది, ఆ వ్రజాంగనలకు, గృహకృత్యములపట్ల అనాసక్తి అధికము కాజొచ్చినది.

10. ప్రతి ప్రాణియందును, విషయాసక్తి అనునది, ప్రకృతి సిద్ధముగనే ప్రవృద్ధమగుచుండును. కాని, మోక్షసాధనమగు భగవద్ భక్తి అటువంటిదికాదు. అది, యెంతగ ప్రయత్నించినను లభింపకపోవచ్చును. అయినను, గోపికలకు, ఆ రెండును సహజసిద్ధములైనవి. వారి భాగ్యమే భాగ్యముకద ప్రభూ! వారికి, నీ పట్ల రక్తియు, ప్రాపంచిక విషయములపట్ల విరక్తియు కలుగుట, నీ అనుగ్రహముననే కదా !

గురుపవనపురాధిపా ! కృష్ణా ! నన్నును ఆ విధముగ అనుగ్రహింపవలసినది నాయనా !

అర్థము - వివరణ

(1) వ్యత్యస్త పాదము : ఒక కాలిమీద వేరొక కాలు వేసుకుని ఉన్నప్పటి స్థితి.

60. గోపికా వస్త్రాపహరణం

1. కామోద్దీపితలైన గోపికలు, కాళిందీ తీరమున, కాత్యాయనీ దేవిగా ఒక సైకతమూర్తిని కల్పించుకుని, నీ చరణ సేవాభాగ్యము నభిలషించి, అనుదినమును అర్చించుకొనుచుండువారు.

2. ఆ సమయమున, వారు, ప్రాతఃకాలముననే లేచి, నీ భవ్య నామములను జపించుకొనుచు, నీ దివ్యలీలలను స్మరించుకొనుచు, ఒక జట్టుగా అచటికి పోవువారు. అచట, ఆ సైకతమూర్తికి వివిధోపచారము లొనర్చువారు. వివిధోపహారములు సమర్పించుకొనువారు. వారిలో, యెవరికివారు, 'ఆ నల్లనయ్య నాకు వల్లభుడు కావలె'నని కోరుకొనుచుండువారు.

3. ఆ విధముగ, ఒక నెల రోజులు, వారు, ఆ కాత్యాయనీ వ్రతమును జరుపుకొనినమీదట, వారి ననుగ్రహింపవలెనను అభిలాషతో, నీవు, ఒకసారి, వారిని సమీపించినావు.

4. ఆ సమయమునకు, వారి వ్రతము సమాప్తమైనది. అవభృథస్నానార్థము, వారు, నదిలో ప్రవేశించినారు; కాని, వారి చీరలు మాత్రము నది ఒడ్డుననే ఉన్నవి. ఆ పరిస్థితిలో ప్రత్యక్షమైన నిన్ను చూడగనే, వారికి, చెప్పరాని సిగ్గువేసినది.

5. ఆ వనితలు, లజ్జావనత వదనలై ఉండగా, ఆ ప్రక్కనేఉన్న చీరల నన్నిటిని చంకన బెట్టుకుని, నీవు, ఒక చెట్టునెక్కి కూర్చొనినావు.

6. ఆ పైన, నీవు, ఆ సుందరీమణుల నుద్దేశించి, 'మీరు యిటుగావచ్చి మీ మీ చీరలను తీసుకుపోవచ్చును' అని, పరిహాసపూర్వకముగ అనినావు. ఆ పలుకుల నాలకించిన తరళాక్షులు, చేతనారహితలైనారు; మోహోపహతలైనారు.

7. అనంతరము, వారు, 'చిరంజీవీ ! కృష్ణా ! నీ వింతకు పూర్వమే మా హృదయములను దొంగిలించినావు. మా లజ్జాభిమానములను కొల్లగొని నావు. ఇప్పుడో, చీర లపహరించినావు. ఇక మాకు, నీవుగాక వేరు దిక్కెమున్నది ?' అని మొఱవెట్టుకొనినారు. వారి పరిస్థితి నర్థము చేసుకుని, నీవు, మందహాస మొనర్చినావు.

8. పరిశుద్ధ హృదయలూ అనన్యగతికలూ అయిన ఆ వధూజనము, ఆ పైన, తమ వక్షోజములను తమ చేతులతో కప్పుకుని, నీటి బయటకు వచ్చుచుండుటను చూసిన నీవు, వారిపట్ల ప్రసన్నుడవై, ఆ వెంటనే, వారి చీరలను వారికి యిచ్చివేసినావు.

9. ఆ పైన, వారి నుద్దేశించి, 'మీరు నోచిన నోము ఫలించినది. ఇక, మీరు, ఈ యమునాతీర భూములయందు, వెన్నెల రాత్రులలో, దాని మధురానుభూతిని పొందగలరు' అని, సాదరపూర్వకముగ పలికినావు.

10. నీ మృదుమధుర వచనములను విని సంతుష్టిచెందిన ఆ మృగేక్షణలు, ఆ పైన, ఓరచూపులతో నిన్ను పదేపదే దర్శించుకొనుచు, కదలి పోవుటకు కాళ్లురాక, మందగమనమున మంద దిక్కుగా గమింపసాగినారు.

11. గోప వధూజనమును ఆ విధముగ అనుగ్రహించినమీదట, నీవు, యథాపూర్వకముగ, వనాంతర సీమలయందు విహరింపసాగినావు.

కరుణారసస్వరూపా ! కృష్ణా ! ఆ గోపికల ననుగ్రహించినటులనే నన్నును అనుగ్రహింపుము తండ్రీ ! నా తాపమును తొలగింపుము నాయనా !

61. మునిపత్నీ మహానుగ్రహం

1. ఒకసారి, నీవు, గోపబాలురతోను గోవులతోను కలసి, బృందా వన సీమనుదాటి, దూరమున విహరించుచున్నపుడు, నీ పరమ భక్తురాండ్రైన అచటి విప్రపత్నుల ననుగ్రహింపవలెనను సంకల్పము నీలో జనించినది.

2. ఆ సమయమున, గోపబాలురు అమితముగ ఆకలి గొనుటయు, దాహపీడితులగుటయు నీవు గ్రహించినావు. అయినను, వారి బాధను నివా రింపగల ఆశ్రమ మేదియు అచట లేకపోవుటవలన, అచటి కనతి దూర మున, ఒక క్రతువును నిర్వహించుచున్న విప్రులవద్దకు వారిని పంపి, భోజనమును కొనిరావలసినదిగ ఆదేశించినావు.

3. ఆ విధముగ అచటికి పోయిన గోపబాలురు, నీ పేరుచెప్పి యెంతగ బ్రతిమాలినను, ఆ కర్మఠులు, వారి మాటలు చెవినిపెట్టలేదు; వారికి సమాధాన మీయలేదు.

4. విప్రులు చూపిన నిరాదరణ మూలమున ఖిన్నులైన ఆ గోప బాలురు, వెంటనే నిన్ను సమీపించినారు. అచట జరిగినదంతయు నీకు నివే దించుకొనినారు.

ఆ విప్రులు, ఫలాభిలాషులైన కర్మమార్గావలంబులు. వారికి, ఫలా పేక్షరహితమైన భక్తిమార్గము దురవగాహము. భక్తిశూన్యులగు వారు, నీకు గాని నీవారికిగాని, భుక్తి నెట్లుపెట్టగలరు ప్రభూ !

5. ఆ విధముగ తిరిగివచ్చిన గోపబాలురను చూసి, నీవు, మంద హాసము చేయుచు, మీ రీమాటు, విప్రపత్నులను కలుసుకుని, నేనడిగినట్లుగ అడుగవలసినది. దయార్ద్ర హృదయలైన వారు, తప్పక మీ కోరిక తీర్చె దరు' అని పలికినావు. ఆ మీద, వారు, తిరిగివెళ్లి, ఆ విప్రపత్నులను కలుసు కుని, నీవు చెప్పినట్లు చేసినారు.

6. నిన్ను దర్శించుకొనవలెనని చిరకాలముగ అభిలషించుచున్న ఆ విప్రపత్నులు, నీ పేరు చెవులబడగనే, సంభ్రమాశ్చర్యములతో తబ్బిబ్బయినారు. ఆ వెంటనే, భక్ష్య భోజ్యాదులు తీసుకుని, తమవా రెంతగ వారించుచున్నను సరకుచేయక, బయటకు వచ్చినారు.

7. ఆ విధముగ బయలుదేరిన విప్రపత్నులు, కేశపాశముల నాడుచున్న కేకిపింఛముతోను, కపోలములమీద (బుగ్గల మీద) మెరయుచున్న కుండలములతోను, కరుణారసార్ద్ర వీక్షణములతోను భాసించుచున్న నిన్ను, ఒక స్నేహితుని భుజమున నొక చేయినిమోపి, ఒయ్యారముగ నిలచి ఉన్న నిన్ను, కన్నులపండువుగ వీక్షించినారు.

8. ఆ సమయమున, నిన్ను సమీపించుటకు ఉద్యుక్తురాలై ఉన్న ఒక పడుచును, కర్మిష్ఠి అయిన ఆమె భర్త, బలవంతముగ నిరోధింప జూచినాడు. ఆమె చేయి పట్టుకొనినాడు. అంతలోననే, నిన్ను స్మరించుకొనుచున్న ఆ పుణ్యవతి ప్రాణములు, ఆమె బొందెను వదలి బయటపడి, అమాంతముగ నిన్ను చేరుకొనినవి. అహో ! ఎంతటి అదృష్టమది !

9. విప్రపత్నులు సమర్పించుకొనిన భక్ష్య భోజ్యాదు లన్నిటిని స్వీకరించి, వారిని ఆశీర్వదించిన అనంతరము, వారు, తమ తమ యిండ్లు వాకిండ్లు వదలి, నిన్ను సేవించుకొనుచు నీ వద్దనే ఉండదలచినారని గ్రహించిన నీవు, తిరిగి వారిని యజ్ఞశాలలకు పంపివేసినావు. వారి భర్తలు, వారిని, యథాపూర్వకముగ ఆదరించునట్లు చేసినావు.

10. గురువాయుపురాధీశా ! కృష్ణా ! ఆ విప్రులకు, వారి భార్యలు తిరిగి వచ్చినమీదటగాని, నీ పట్ల అంతకు పూర్వము వా రాచరించిన అపచారము తెలిసిరాలేదు. నీ మాహాత్మ్యము గ్రాహ్యము కాలేదు. సత్య దర్శనము కాలేదు. ఆ సమయమునగాని, వారు, నిన్ను ప్రస్తుతింపలేక పోయినారు.

దయామయా ! ఆ విప్రపత్నులపట్లచూపిన అనుగ్రహమునే, నా పట్ల కూడ చూపుము నాయనా ! నా జాడ్యమునుగూడ నివారింపుము తండ్రీ !

62. ఇంద్రయాగభంగం

1. ఒకసారి, గోపశ్రేష్ఠు లేదో క్రతువును సంకల్పించి సంభారములను సేకరించుచున్నారని గ్రహించిన నీవు, సర్వజ్ఞుడవయ్యును, ఇంద్రుని గర్వము నాహరించు ఉద్దేశముతో, నందాదులను సమీపించి, 'ఈ ప్రయత్నములు దేనికొరకు జరుగుచున్నవి'? అని, అమాయకునివలె అడిగినావు.

2. దానిమీద, నందుడు, ఇది ఇంద్రయాగము నాయనా! ప్రతి సంవత్సరమును జరుపవలసినదే. ఈ యాగము నాచరించుటవలననే, మహేంద్రుడు సంతుష్టుడై వర్షము గురిపించుటయు, తద్వారా, భూప్రజకు సర్వవస్తువులును సమృద్ధిగ లభించుటయు జరుగుచుండును. మన గోగణమునకు, పసిరిక, పానీయము, నిత్యావసరములుగాన, యీ యజ్ఞము ప్రత్యేకముగ మనకు ప్రధానమైనది' అని, సమాధాన మిచ్చినాడు.

3. ఆ పలుకుల నాలకించిన నీవు, 'వర్షములు కురియుటకును, వజ్రి సంతసించుటకును సంబంధ మేమున్నది? మనకు, సర్వ సమృద్ధి కలుగుట గాని కలుగకుండుటగాని, మనము చేసుకొనిన కర్మలమీదనే ఆధారపడి యున్నది. ఈ మహాటవిలోని వృక్షములు, తాము పెరిగి ఫలప్రదము లగుటకు యే మహాయజ్ఞము లొనర్చినవి?' అని పలుకుచు, వారి విశ్వాసమునకు నీ ధిక్కారమును వ్యక్తపరచినావు.

4. ఆ పైన, 'మనకు ప్రాణాధారమైనవి; యీ ఆలమందలు. ఈ ఆలమందలకు ఆధారభూతమైనది; యీ పర్వత ప్రాంతము. ఈ ప్రాంతము నంతను పవిత్రీకరించువారు; బ్రహ్మవాదులు. కావుననే, మనము, పర్వత శ్రేష్ఠమైన యీ గోవర్ధనమును పూజింపవలెను. సత్పురుషులను సత్కరింపవలెను' అని కూడ, నీవు, నీవారికి బోధించినావు.

5. ఆ మీద, వారు, నీ వచనములను శిరసావహించి, గోవర్ధన గిరీంద్రమును యథావిధిగ అర్చించినారు. బ్రహ్మావాదులను సత్కరించినారు. ఆ పర్వతరాజమునకు ప్రదక్షిణ మొనర్చినారు; ప్రణమిల్లినారు. ఆ సమయమున, నీవు, గిరిరూపము ధరించి, వారు సభక్తికముగ అర్పించుకొనిన ఆహుతుల నన్నిటిని, ఆశ్చర్యకరముగ ఆరగించినావు.

6. అప్పుడు, నీవు, వారిని ఉద్దేశించి, 'చూచితిరా! ఈ గిరీంద్రుడు మీ రర్పించుకొనినవాటిని స్వయముగ స్వీకరించినాడు. ఇకమీద, ఆ ఇంద్రుడు కోపగించుకొనినను, ఈ పర్వతరాజు మనలను రక్షింపగల డనుటలో సందేహము లేదు' అనినావు. ఆ నీ పలుకులు విని, గోపకులందరును అమితముగ హర్షించినారు.

7. ఆ పైన, నిన్ను ముందుంచుకుని, వారు, మందలో అడుగిడు సమయమునకు, మహేంద్రుడు, తనకు జరిగిన అవమానమును గ్రహించినాడు; భరింపలేకపోయినాడు.

యథార్థమునకు, నీ శక్తి సామర్థ్యములు అతనికి తెలియనివి కావు. నీ కృపా విశేషముననే, తనకు ఆ మహేంద్రపదవి లభించినదను విషయము కూడ, అతడు విస్మరింపదగినది కాదు. అయినను, అతడు, తనలోని రజోగుణమునకు వశుడైనాడు; ఉద్రేకపడినాడు.

8. 'దేవతలు, మానవాకృతిలోఉన్న మాధవునిచే అవమానింపబడినను, దేవేంద్రుడనైన నేను సహించుటకు వీలులేదు. కావుననే, నే నా గొల్లలకును, వారి గురుడైన ఆ పిల్లవానికిని తగిన శాస్తిచేసి తీరెదను' అని నిశ్చయించుకుని, ఆ అహంకారముతోనే, అతడు, నీ మీద కత్తిగట్టినాడు.

9. ఆ వెంటనే, అతడు, గోకులమును సాకల్యముగ నిర్మూలించుటకు సంకల్పించుకుని, ప్రళయకాల మేఘములను ముందుగ మందమీదకు పంపినాడు. ఆ పైన, వజ్రాయుధమును తీసుకుని, తన వాహనమైన ఐరావతము నధిరోహించి, స్వయముగ బయలుదేరినాడు. అది చూసిన అనలుడు అనిలుడు మున్నగు దేవతలు, తమలోతాము నవ్వుకొనసాగినారు.

త్రిలోకాధిపతీ ! కృష్ణా ! నీ మాయకు మోహితులుకానివా రెవరు నాయనా !

10. అక్కడ, నీవు, ఇంద్రునికొరకు యెదురుతెన్నులు కాచి చూచు చున్నావు. వ్రజవాసులు, 'ఇంద్రు డెత్తివచ్చినను మనకు భయములేదు. మన శ్రేయమును కోరు భూసురు లున్నారు; మనలను రక్షింపగల యీ భూధరమున్నది' అనుకొనసాగినారు.

మురాంతకా ! కృష్ణా ! నీ పట్ల నాకుగల విశ్వాసముకూడ అటు వంటిదే నాయనా ! నా రోగనివారణకు, నేను, నిన్నే నమ్ముకుని ఉన్నాను తండ్రీ !

63. గోవర్ధనోద్ధరణం

1. అంతలో, నీ శరీరచ్ఛాయనుబోలిన జలదములు, గోకులము నంతను క్రమ్ముకొనినవి. క్షణక్షణము అధికమగుచున్న ఉఱుముల మూల మున, దశదిశలును దద్దరిల్లిపోయినవి.

2. అపుడు, కుంభవృష్టి కురియసాగినది. కొండరాళ్ళవంటి వడగళ్ళు పడజొచ్చినవి. అది చూసిన వ్రజవాసులు క్షోభిల్లిపోయినారు. 'కృష్ణా! మమ్ము రక్షింపవలసినది. ఇంద్రుని క్రోధమునకు మేము గురికాకుండ చూడవలసినది' అని, ఎలుగెత్తి ఆక్రందింపసాగినారు. వారి మొఱాలించిన నీవు, వారికి అభయమొసగినావు.

3. ఆ పైన, వారిని ఉద్దేశించి, ఈ గోవర్ధనము మన కులదైవతము. ఇంద్రుడు కల్పించిన అనర్థము నిది తొలగించి తీరగలదు. మీరు నా మాటను విశ్వసింప వలసినది' అని, మందహాసముతో వారికి నచ్చచెప్పినావు. ఆ వెంటనే, నీ చిరుచేతులతో, ఆ గిరీంద్రమును సమూలముగ పెకలించినావు.

4. ఆ మీద, దానిని పైకెత్తి, గొడుగుమాదిరి పట్టుకుని, దాని క్రిందకు, నీ వారిని, వారి ప్రాణములకు ప్రాణమైన ఆలమందలను, చేర్చి, ఒక్క వర్షపు చినుకుకూడ వారిమీద పడకుండ చూసినావు.

5. ఆ విధముగ, నీ సర్వస్వమును, ఆ కొండక్రింది సైకత సీమకు సురక్షితముగ చేర్చి, కొండను, చేతితో, అవలీలగ యెత్తి పట్టుకుని, గోపికల తోను గోపబాలురతోను సరస సల్లాపములాడుచు, సమీపించిన గోవుల మెడలు గోకుచు నిలబడిఉన్న నిన్ను చూచుటకు, కోటి కన్నులు చాలవా అనిపించినవి ప్రభూ !

6. ఆ సమయమున, 'కొండయా దొడ్డది. దీని నెత్తి పట్టుకొనినవాడా బాలుడు. ఇంతటి భారమును, యితని వామహస్తము, అందునను, దాని

చిటికెనవ్రేలు, అదియు నింత తడవు మోయుచుండుట మహాద్భుతముగ నున్నది. ఇదంతయును యీ పర్వత మాహాత్మ్యమే కావచ్చును' అని, గోప శ్రేష్ఠులు, సంభ్రమాశ్చర్యములతో గుసగుసలువోజొచ్చినారు.

7. అటువంక, మహేంద్రుడు, నీవు కొండనెత్తి పట్టుకొనుట ఒక అర్భకుని మహాద్భుత సాహస కృత్యముగ మాత్రము భావించి, అబ్బుర పడినాడు. అయినను, నీవు, అ ట్లెంతకాలము ఉండగలవో చూడవలెనన్న అభిప్రాయముతో, ఒక వారము రోజులపాటు, అహర్నిశలు, కుంభవృష్టి కురియించినాడు.

8. అయినను, నీవు చలింపలేదు. కాలు కదల్పలేదు. అంతలో, ప్రళయకాలమేఘములు పలుచబడినవి; దూదిపింజలవలె గాలికి తూలిపో జొచ్చినవి. అది గ్రహించిన మరుత్పతి గుండె జారిపోయినది. ఆ వెంటనే, అతడు, పలాయనమును చిత్తగించినాడు.

9. అనంతరము, వానలు వెలిసిన పిమ్మట, గోపాలురు, గోగణ ముతో సహ, ఆరుబయటకు వచ్చినారు. అది గ్రహించిన మీదటనే, నీవు, కొండను క్రిందికిదింపి, యథాస్థానమున నుంచినావు; అమితానందముతో గోపకు లర్పించుకొనిన ఆలింగనాది సత్కారము లందుకొనినావు.

10. అది చూసిన దేవతలు, 'భూతలమునే మోసినవానికి భూధరము నెత్తుట భారమగునా !' అని, నిన్ను శ్లాఘించినారు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! ఆ దేవేంద్రుని గర్వమునే హరించిన నీవు, యీ దీనుని రోగమును హరింపలేవా తండ్రీ !

64. గోవింద పట్టాభిషేకం

1. పూతనకు మోక్షమును ప్రసాదించినది మొదలు, గోవర్ధన పర్వతమును కొనగోట నెత్తుటవరకు దర్శనీయమైన నీ మహిమాతిశయ మును గమనించుచువచ్చిన గోపకులు, నీవు మానవమాత్రుడవు కావని, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవే అయిఉందువని అనుకొనజొచ్చినారు. నీ జాతకప్రభావమును వివరింపవలసినదిగ నందగోపుని కోరినారు.

2. ఆ మీద, నందగోపుడు, నిన్నుగురించి గర్గాచార్యుడు తెలియ పరచిన వివరములన్నియు వారికి విశదపరచినాడు. అది వినిన వారికి, అంతవరకు నీ పట్లఉన్న ప్రేమాభిమానములు దినదినాభివృద్ధినందసాగినవి.

3. నీ వలన పరాభవమునందిన దేవేంద్రునకుకూడ, అప్పటికి సత్య దర్శనమైనది. అహంకారము అణగారిపోయినది. అది కారణముగ, ఆయన, కామధేనువుతోపాటు నీ సన్నిధికి వచ్చి, నీ చరణాబ్జములకు శిరసా నమస్కరించినాడు; నిన్ను బహుధా స్తుతించినాడు.

4. ఆ పైన, కామధేనువు, తన దివ్యక్షీరముతో నిన్ను జలకమా డించి, గోవులకు అధిపతిగా, గోవిందునిగా, నీకు పట్టాభిషేక మొనర్చినది. మహేంద్రుడుకూడ, తనవాహనమైన ఐరావతము తెచ్చిన గంగోదకముతో, నిన్ను, పరమానందమున అభిషేకించినాడు.

5. త్రిభువనాధిపా ! ఆ విధముగ నీవు గోకులాధిపతివైనావు. అది కారణముగ, అంతవరకు, స్వర్గమునగాని, వైకుంఠమునగాని కని విని యెరుగని శోభ, గోకులము నాశ్రయించినది.

6. అనంతరము, ఒక రోజున, తెల్లవారుఝామున, మీ తండ్రి అయిన నందగోపుడు, యమునానదిలో స్నానము చేయుచుండగా, వరుణ

భటు డొకడు ఆయన నపహరించుకుపోవుట సంభవించినది. ఒక ప్రత్యేక ప్రయోజనముకొరకు మానవాకృతి ధరించిన నీవు, అది గ్రహించి, ఆయనను తిరిగి తీసుకువచ్చుటకుగాను, వరుణ లోకమున కేగినావు.

7. అక్కడ, వరుణదేవుడు, సంభ్రమాశ్చర్యములతో నీకు స్వాగత మొసగినాడు. అర్చనాదికము లొనర్చినాడు. ఆ పైన, అతనివద్దనుండి నీ తండ్రిని తీసుకుని, నీవు, గృహోన్ముఖుడవైనావు.

ఆ విధముగ తిరిగి యిల్లుచేరిన నందగోపుడు, వరుణలోకవిశేషము లన్నిటిని, ఆపైన, పూసగ్రుచ్చినట్లుగ తనవారికి తెలియపరచినాడు.

8. నందగోపుని పలుకులు వినిన గోపకులకు, నీవు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవే యను అభిప్రాయము దృఢపడిపోయినది. అది కారణముగ, వారికి, నీ దివ్యధామము నొకసారి చూడవలెనను కుతూహలము కలిగినది. అది గ్రహించిన నీవు, నీ భక్తులైన వారికి, అనితర దుర్లభమైన నీ పరమపదమును దర్శనీయ మొనర్చినావు.

9. ఆ పరమానంద రసార్ణవమున వారు మునుకలిడుచుండగా, తిరిగి, నీవే, వారిని, ఈ మాయాప్రపంచములోనికి ఈడ్చుకువచ్చినావు.

10. గురుపవనపురాధిపా ! కృష్ణా ! నీ వింతకుముందు, యే అవ తారమునందును, నీ భక్తులకు అట్టి పరమానంద రసానుభూతిని కలిగించి నట్లు కనిపించదు. నీవు గోపకిశోరరూపముననున్న పరమాత్ముడవే అనుటకు ఈ ఒక్క నిదర్శనము చాలునుగదా నాయనా !

కృష్ణా ! నన్నుపీడించుచున్న రోగములను వెంటనే నిర్మూలించి నాకును ఆ విధమైన అనుభూతిని అనుగ్రహింపుము తండ్రీ !

65. రాసక్రీడ - గోపికల బృందావనాగమనం

1. అది పండువెన్నెల రాత్రి. యమునాతీర మంతటను చల్లని పిల్లతెమ్మెరలు విహరించుచున్నవి. ప్రకృతి కడు రమణీయముగ నున్నది. ఆ సమయమున, వ్రజసుందరీమణులకు, వారి వ్రతావసాన సమయమున చేసిన వాగ్దానము చెల్లించుకొనవలెనను సంకల్పము నీలో జనించినది. ఆ వెంటనే, నీవు, అచట, మురళిని మ్రోయింపసాగినావు.

2. మనోహరమైన ఆ మృదు మురళీరవము, బ్రహ్మాండ మంతటిని సమ్మోహితమొనర్చినది. దాని నాకర్షించిన సుందరీమణులు, అదో విధమైన అనిర్వచనీయానందము ననుభవించినారు; తన్మయులైనారు.

3. దివ్యసుందరవిగ్రహా ! ఆ వెంటనే, వారు, తమ తమ గృహ కృత్యములను వదలి, పిల్లలను విడిచిపెట్టి, భర్తృసేవను విస్మరించి, మురళీ స్వనము వినవచ్చిన దిక్కుగా పయనముసాగించినారు.

4. అప్పుడు నిన్ను చేరినవారిలో కొందరు, తమ్ముతాము పూర్తిగ అలంకరించుకొన లేదు. అలంకరణమును పూర్తిచేసుకుని వచ్చినవారికంటె, వారే, నీకు, అందముగ కనిపించినారు.

5. నిన్ను చేరు తొందరలో, ఒక గోపిక, కంఠహారమును కటి ప్రదేశమున నలంకరించుకొనినది. మొలనూలును మెడలో వేసికొనినది. అటు లామె కటిప్రదేశము నలంకరించుకొనుట, పిడికిటికిరాని తన నితంబ శోభను నీ దృష్టికి తెచ్చుటకాయనినట్లున్నది.

6. పరవశత్వమున నిన్ను సమీపించిన ఒక పడుచు, అలంకారము నంతను ముగించుకొనినది. కాని, రవికెను తొడుగుకొనుట మరచిపోయినది. ఆమెతోపాటు వచ్చిన గోపికలు, యెవరికి వారు, ఉద్విగ్నమానసలై ఉండుట

వలన, ఆమెలోని వైలక్షణ్యమును యెవరును గుర్తింపలేదు. కాని, నీవు మాత్రము, ఆమె కుచకుంభములను, ఆపైన నీకు జరుగనున్న ప్రేమ సామ్రాజ్య పట్టాభిషేకమునకుగా ఆమె తీసుకువచ్చిన రెండు పూర్ణకుంభము లనువలె భావించినావు.

7. నిన్ను చేరుటకు అవకాశము దొరుకని కొందరు గోపికలు, తమ తమ యిండ్లలోననే ఉండి, తదేకముగ నిన్ను ధ్యానించుకొనుచు, బంధము లన్నిటిని త్రెంచుకుని, తనువులు త్యజించినారు; అద్వితీయుడవు, సచ్చిదానంద స్వరూపుడవునైన నీలో లీనమైపోయినారు. అందరిలోను అదృష్టవంతులు వారేకదా ప్రభూ !

8. ఆ స్త్రీలు, నిన్ను, ప్రియునిగ భావించుకొనినారేగాని, పరమాత్మ నిగ భావించుకొనలేదు. అయినను, పరమహంసలకు మాత్రమే ప్రాప్యమైన స్థితిని సునాయాసముగ పొందినారు.

కృష్ణా ! ఇక నేను సందేహింపవలసిన పనిలేదు. నాకును అమృ తత్వము సిద్ధించినట్లే. ఎటులనో తెలియునా ! సచ్చిదానంద స్వరూపుడ వైన నీవు నా సమక్షమున నున్నావు. నవవిధ భక్తిమార్గములలో(1) యే మార్గము ననుసరించినను నేను నిన్ను సులభముగ చేరవచ్చును గదా !

9. పరమేశ్వరా ! నీవు త్రిజగన్మోహనుడవు. తేజోనిధివి. అట్టి నిన్ను, ఆ గోపికాగణము, నలుదిక్కులనుండియు దర్శించుకొనినది. నీవు, వా రందరకును చిరునవ్వుతో స్వాగతము చెప్పినావు. నీ కృపా కటాక్ష వీక్షణామృత వృష్టిలో వా రందరిని తనివితీర జలకమాడించినావు.

భక్తవత్సలా ! నన్నును నీ భక్తశ్రేణిలో చేర్చుకొనుము తండ్రీ ! నా వేదనలను నిర్మూలింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) నవవిధ భక్తిమార్గములు : శ్రవణము, కీర్తనము, స్మరణము, పదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము.

66. రాసక్రీడ - ధర్మోపదేశం

1. పుష్పబాణునివలన పీడింపబడుచు నిన్ను చేరిన గోపవధూమణుల కోరికను తీర్చుటకు సంకల్పించుకొనికూడ, నీవు, వారిపట్ల విముఖుడవై ఉన్న చందమున మాట్లాడజొచ్చినావు.

2. ఆ సమయమున, ఆకసమునందు గుమిగూడిన మునిగణము వినునట్లుగ, నీ, వా కామినులకు పతివ్రతాధర్మమును బోధించినావు. కృష్ణా ! నీవు చెప్పినదెల్ల శిరోధార్యముగనే ఉన్నది; కాని, నీ చేతలు మాత్రము దానికి భిన్నముగ తోచుచున్నవి నాయనా !

3. నీ ప్రతికూల వచనములు వినిన ఆ మృగేక్షణలు, దుఃఖాన్వితలైనారు. 'దయాసాగరా ! మమ్ము అనుగ్రహించవలసినది' అని, పరిపరి విధముల నిన్ను బ్రతిమాలుకొనినారు.

4. మురాంతకా ! వారి మొఱాలించిన నీ హృదయము కరగిపోయినది. అది కారణముగనే, నీవు, వారితో, అచట క్రీడించుటకు పూనుకొనినావు. వారి మనోభీష్టమును సిద్ధింపజేయుటకే నిశ్చయించుకొనినావు.

5. ఆ పైన, గోప వధూమణులు, చంద్రకిరణ ప్రసారముచే ధగధగ మెరసిపోవుచున్న ఆ ఇసుక తిన్నెమీద, తమ తమ ఉత్తరీయములను పఱచినారు. వారితోపాటు నీ వచట ఆసీనుడ వైనావు.

6. అనంతరము, వారు, నయనానందకరమైన నీ దివ్యవిగ్రహమును తిలకించుచు, శ్రవణపేయమైన నీ నర్మోక్తుల నాలకించుచు, చేతులు చేతులు కలుపుకొనుచు, ఆలింగన చుంబనాదుల ద్వారా మధురానుభూతినందుచు, తమ్ము తాము మఱచిపోయినారు.

7. సర్వవిధ బంధములనుండి ముక్తులైన వారికి నీవీబంధవిముక్తి కలుగుటలో ఆశ్చర్యమేమున్నది ప్రభూ ! అదియు, వస్త్రాపహరణ సమయమున నీవు వారికి చేసిన వాగ్దానములలో ఒకటియే కదా !

8. త్రిజగన్మోహనా ! స్వేదబిందువులతో, చిర్నగవు చిందులతో శోభించు సుందర ముఖారవిందముగల నిన్ను ఆలింగనము చేసుకుని, ఆ సుందరీమణులు పొందిన ఆనందము వర్ణనాతీతముగదా !

9. కృష్ణా ! నీవు శృంగారరససర్వస్వమైనవాడవు. నీతోటి వియోగము, నీ ఆశ్రితులను దహింపజేయునది; అంగార సదృశమైనది. నీ తోటి సంయోగముకూడ, వారి పాపములను తాపములను దహించునదవుట, అంగార మయమైనదగుట, ఆశ్చర్యము నాయనా !

10. ధారావాహికమైన పరాభక్తికి ప్రతిరూపము రాధాదేవి. సర్వవిధైశ్వర్యములకు సర్వ సిద్ధులకు సర్వ భోగములకు నిలయము శ్రీ మహాలక్ష్మి. అట్టి శ్రీ మహాలక్ష్మి అర్ధాంగి అయి ఉన్నను, రాధా పరిష్వంగమున కువ్విళులూరుచుండువాడవు నీవు. తండ్రీ ! అట్టి నీ పద సేవనమునకు పరితపించుచున్నవాడను నేను. నన్ననుగ్రహింపుము నాయనా ! నా తాపములను పాపములను నశింపజేయుము ప్రభూ !

67. భగవత్తిరోధానం - అన్వేషణం

1. పొంగి పరవళ్లు త్రొక్కుచుండు పరమానంద రసార్ణవమైన నీతో క్రీడించుచున్న ఆ తరళలోచనలు, అవధిలేని ఆనందము ననుభవించిన వారై, అమితముగ గర్వించినారు.

2. గోవిందా! ఆ సమయమున, 'విశ్వమనోభిరాముడైన యీ రమావల్లభుని మనసు నా మీదనే లగ్నమై ఉన్నది' అని, వారిలో ప్రతి ఒక్కరును భావించుకొనసాగినారు. అది గ్రహించిన నీవు, అమాంతముగ అంతర్హితుడవై పోయినావు.

3. ఆ పైన, నీవు, గర్వము లేశమాత్రముకూడలేని నీ ప్రియతమ సఖితో, రాధాదేవితో కలిసి, దూరముగ పోయినావు; అచట, ఆమెతో యథేచ్ఛగ విహరింపసాగినావు.

4. నీవు కనబడకపోవుటవలన, ఆ కమలపత్రేక్షణలు అమితముగ దుఃఖించినారు. ఆ వెంటనే, వారు, ఒక జట్టుగా బయలుదేరి, ఆ వనమునందంతటను నీ కొరకు వెదుక నారంభించినారు.

5. ఆ సమయమున, వారు, ఉన్మాదినులవలె, కనిపించిన ప్రతి ప్రాణిని, నిన్నుగుఱించి ప్రశ్నించినారు. 'ఓ చూతమా! ఓ చంపకమా! ఓ కర్ణికారమా! ఓ మల్లికా! ఓ మాలతీ! మా చిత్తచోరుడు మీకు కనిపించినాడా!' అని, వివిధ వృక్షములను లతలను కూడ గద్గదస్వరముతో, దీనాతిదీనముగ పలుకరింపసాగినారు.

6. అంతలో, ఒక గోపిక, తన మనోవీధిలో నిన్ను దర్శించుకుని, 'ఇడుగో! నా ప్రియు డిక్కడనే ఉన్నాడు' అని, భావోన్మాదముతో కేకలు వెట్టినది. అది వినిన ఆమె సఖీజనుల తాపము అతిశయించినది.

7. ఆ స్థితిలో, గోపికలు, తమ వ్యక్తిత్వమును కోల్పోయినారు. తమ సర్వస్వమును నీకే సమర్పించుకొనినవా రగుటవలన, వా రెల్లరు నీవే అయిపోయినారు. అది కారణముగనే, వారు, ఆ పైన, నీవుగా వ్యవహరించినారు.

అనంతరము, వారు, తిరిగి నిన్ను అన్వేషించుచుండగా, తమవలెనె త్యజింపబడి, నిన్ను వెదకుచున్న రాధామహారాణి వారికి కనిపించినది.

8. ఆ పైన, వారు, ఆమెనుకూడ తమ జట్టులో కలుపుకుని, చీకటి పడువరకు, ఆ వనాంతర్భాగమంతయు నీ కొఱకు గాలించినారు. కాని, ఫలితము కనబడకపోవుటవలన, తిరిగి యమునా తీరమునకువచ్చి కూర్చుని, తమ దురదృష్టమునకు వాపోవ సాగినారు; నీ గుణగణమును గానముచేయ జొచ్చినారు.

9. ఆ విధముగ, వారు, మనోవ్యథ ననుభవించినమీదట, వారిని అనుగ్రహింపవలెనను బుద్ధి నీకు కలిగినది. ఆ వెంటనే, కరుణామయుడవైన నీవు, ముజ్జగములను మోహమునముంచు మన్మథునిగూడ మోహింపజేయగల తనుద్యుతితో, మందహాస భాసురమైన వదనముతో, వారి యెదుట సాక్షాత్కరించినావు.

10. నిరాసతో నీరసించిఉన్న గోపికలు, అట్లు అమాంతముగ కనిపించిన నిన్నుచూసి, అమితానందము నందినారు. తమ ఆనందాతిశయమును, అనేక విధముల, నీకు వ్యక్తపరచుకొనినారు.

గురుపవనపురాధిపా! కృష్ణా! నన్నును ఆ గోపికలనువలె ఉద్ధరింపుము నాయనా! నా రోగమును నిర్మూలించి, నాలోని నిరాసను తొలగింపుము తండ్రీ!

68. గోపికా సాంత్వనం

1. కమలనయనా ! కృష్ణా ! నీదైన పునర్దర్శన భాగ్యమునందిన ఆ గోపికలు, ఆనందాతిరేకమున నిన్ను సమీపించి, నీ కరుణారసామృత వీక్షణములలో మునిగి తేలుచు, నిశ్చల చిత్తముతో నీ యెదుట నిలబడి పోయినారు.

2. అంతలో, ఒక గోపిక, నీ కరాబ్జమును నిస్సంకోచముగ తన వక్షస్థలమున నుంచుకుని, పరవశత్వము నందినది; పులకిత శరీర అయినది.

3. మరొక గోపిక, అత్యంత హర్షముతో, నీ మృదుకరములను, ఊపిరాడనీనంతగట్టిగ తన మెడకు చుట్టుకొనినది.

4. వేఱొక కామిని, లజ్జావిరహితయై, పద్మమువంటి నీ ముఖము నుండి తమ్మ తీసుకుని నములుచు, తన వాంఛితార్థము లన్నియు నీడేరినట్లే భావించుకొనినది.

5. 'నిర్దయాత్ముడవై, నన్నీ వనమున యేకాకినిజేసి వెళ్ళినావుగదా ! ఇక నీ దగ్గర కెవరువత్తురో నేను చూచెదను' అని, ఒక విరహిణి, అమిత రోషముతో నీవంక చూచుచు కన్నీరు పెట్టుకొనినది.

6. ఆ విధముగ ఉద్విగ్నమానసలై ఉన్న గోపకామినీ జనముతో, నీవు, యమునాతటమును చేరి, అక్కడ, వారు, వారి వారి కుంకుమాంచిత కుచాంబరములు పఱచి యేర్పరచిన ఆసనమున కూర్చుని, మహాద్భుతముగ శోభించినావు.

7. అనంతరము, వారు, 'కృష్ణా ! కృపావిశేషము ఒక్కతీరున ఉండదుకదా ! కొందరు, అందరిపట్లను దయతో ప్రవర్తింతురు. మరికొందరు, తమ ఆశ్రితులపట్ల మాత్రమే దయకలిగి ఉందురు. ఇంక కొందరున్నారు.

వారో, మావంటివారిపట్ల కూడ, నీవలె, మహాద్భుతముగ ప్రవర్తించుచుందురు' అని, మృదుమధురముగ విమర్శింపసాగినారు.

8. ఆ పలుకులు వినిన నీవు, వారిని ఉద్దేశించి, 'మీ మీద మనసు లేక నేను మీకు దూరము కాలేదు. మీ మనసు నా మీదనే ఉండుటకొఱకు అట్లు చేసినాను' అని, వారికి విశదపరచినావు.

9. 'మీరు నాకు ప్రాణసములు. మీరుకాక నాకు ప్రియులు వేరు లేరు. ఇక మీరు నిరాటంకముగ నాతో క్రీడింపవచ్చును' అని కూడ, నీవు వారికి తెలియపరచినావు.

10. ఆ విధముగ గోపికలకు పరమానందము నొదగూర్చి, వారితో రాసక్రీడ కుపక్రమించినావు. కృష్ణా ! వారి ననుగ్రహించినటులనే నన్నును అనుగ్రహింపుము నాయనా ! నా తాపమునుకూడ ఉపశమింప జేయుము తండ్రీ !

69. రాసక్రీడాభివర్ణనం

1. కృష్ణా ! చిరువెంౘ్రుకల ముడిలో పొదుగబడిన నెమలి పురి సొగసుతోను, మకరకుండల ద్యుతితోను, కంఠహారముల ధగద్ధగలతోను, దివ్య సౌరభమును వెదజిమ్ముచుండు వనమాలతోను, చందనపు మైపూత సుగంధముతోను, పట్టు పీతాంబరము మీద వెలుగులు జిమ్ముచుండు బంగరు మొలనూలుతోను, మణినూపురముల ప్రకాశముతోను శోభించుచుండు నిన్ను, రాసలీలావసరమున దర్శనీయమైన నీ శ్రీవిగ్రహమును, మేము సదా ధ్యానించుకొనుచుందుము నాయనా !

2. ఆ సమయమున, గోపికలు, తమ అలంకరణమును పూర్తిచేసుకొనినారు. కంచుకములు ధరించినారు. చెక్కిళులమీద గునిసియాడు కర్ణాభరణములను దాల్చినారు. ఆ పైన, మండలాకారముగ నిలబడినారు. అప్పుడు, లక్ష్మీపతివైన నీవు, పద్మనాభుడవైన నీవు, ప్రతి యిరువురు గోపికలనడుమ ఒకడవుగా నడయాడుచు, రాసక్రీడ కుపక్రమించినావు.

3. ఇక్కడ, యమునాతీరమున జరుగుచున్న రాసలీలా మహోత్సవమును గురించి, నారదమహర్షి, దేవలోకమున చాటినాడు. ఆ వెంటనే, దేవత లందరును దానిని తిలకించు కుతూహలముతో, అందములు చిమ్ముచుండు అప్సరోగణముతో సహ అక్కడనుండి వచ్చి, ఆకసమునంతను ఆక్రమించుకొనినారు.

4. రాసలీలా మహోత్సవమునకు ప్రధానాంగములు కొన్ని కలవు. వానిలో ప్రముఖమైనది, నందనందనుని మృదు మురళీరవము. ఆ పైన, దాని కనుగుణముగ గోపికాగణము ప్రసాదించిన మధుర సంగీతము. అనంతరము, వారి మృదపద తాడనస్వనము, కంకణక్వణ సమన్వితమైన కరతాళ ధ్వనులు. అటుపిమ్మట, ఆ నర్తకీగణము, ఒకరి భుజములమీద

మరొకరు చేతులుమోపి, విలాస భంగిమలు వెలువరించుట. ఆ సమయమున వారి నడుములకు చుట్టుకొనిన ఉత్తరీయములు రెపరెపలాడుచు కల్పించిన శబ్దము. అహో ! అది వర్ణనాతీతము; అనుభవైకవేద్యము.

5. గోపికలు, తన్మయావస్థలో గొంతెత్తి పాడుచుండుటవలన, ఆ గానము క్రమక్రమముగ తారస్థాయికి చేరుకొన జొచ్చినది. వారి అంగ విన్యాసమువలన, వారు ధరించిన మాలలు ఆభరణములు చిందరవందర కాసాగినవి. ఆకసమునుండి అదంతయు, అమితానందముతో, తదేకముగ తిలకించుచున్న దేవతలు, తమ్ము తాము మరచిపోయినారు; సచ్చిదానంద స్వరూపుడవైన నీ మీద పుష్పవృష్టి గురియించినారు.

6. అంతలో, ఒక తన్వంగి, ఆడి ఆడి శోషిల్లిపోయినది. ఆమెకు ముచ్చెమటలు పోసినవి. అది కారణముగ, ఆమె, నీ భుజములమీద వాలి పోయినది. అమితముగ అలసిపోవుటవలన కన్నులు మూసికొనినది.

7. ఒక భాగ్యశాలిని, తన చుబుకమును నీ చుబుకముతో చేర్చి నిలబడి, నీవు నమలుచున్న తాంబూలమును, నీకు తెలియకుండనే తన నోటితో తీసుకొనినది.

ఆ విధముగ, శృంగారరససర్వస్వమైన నీతో, శ్రీ రమా విలాస మందిరుడవైన నీతో క్రీడించుచు, ఆ గోపకామినీనివహము అనుభవింపని అనిర్వచనీయానందము వే రేముండును ప్రభూ !

8. ఆ విధముగ కొలది కాలము గడచిన పిమ్మట, క్రమక్రమముగ గాన మాగినది. వాద్యమేళనము సాగిపోయినది. అప్పుడు, పరమానందాను భూతి నందుచున్న గోపికల నృత్యము మాత్రమే మిగిలినది.

ఆ సమయమున, వారికి, బహిః ప్రపంచము కనిపించలేదు. వారి చీరలు జారిపోవుటనుగాని, రవికె ముడులు వదులగుటనుగాని, కేశపాశ ములు చెదరిపోవుటనుగాని వారు గుర్తింపలేదు. ఆ కామోత్కర్షమును

గ్రహించిన సూర్యచంద్రాదులే స్థంభించి పోయినారు ప్రభూ! ఇక, నేను చెప్పగల దేమున్నది ?

9. ఆ రాసకేళిని తిలకించిన ముజ్జగములును మోదవార్ధిలో మునిగి పోయినవి. ఆ పైన, నీవు, బహురూపివై, ఒక్కొక్క గోపికకు ఒక్కొక్క రూపమున దర్శనీయుడవైనావు. ఏ గోపిక మనసున నే కోరిక గలదో గ్రహించి, ఆ గోపిక నట్లలరింపసాగినావు. మధుర భావములతో ఉత్తేజిత మైన వారి సుందరావయవము లా సమయమున క్రొంజెమటతో కులుకు లీనుచుండుటవలన, వారు, ముత్తెములు పొదుగబడిన పుత్తడి బొమ్మలా యనిపించినారు.

10. అనంతరము, నీవు, నీ సఖీజనముతో, ఆ కాళిందీ జలము నందు, యథేచ్ఛగ రమ్యక్రీడ సలిపినావు. ఆ సమయమున, నీవు, వారిని, దుర్లలితాద్భుతముగ, బహుభంగుల దనిపినావు. వారి మానసములను వశీ కృత మొనర్చుకొనినావు. ఆ నదీజలమునందు వలెనె, శీతల మంద మారు తముతోను ఫుల్లవికసిత సుమ సౌరభముతోను మనోహరముగఉన్న వనాం తరములందు కూడ, ఆ విలాసినీజన సహస్రముతో, విలాసముగ విహ రించినావు.

11. కమనీయ కిశోరమూర్తీ! కృష్ణా! నీ శ్రీవిగ్రహ సందర్శనము ఒక అదృష్టము. నీ చిదానందమయ స్వరూప సంస్పర్శన మొగ భాగ్యము. అవి కల్పించు మహదానంద రసానుభూతి, నీ భక్తవరులకును యోగీశ్వరుల కును మాత్రమే సులభగ్రాహ్యమైనది. దానినే, యామున ప్రాంతమున, నీ, వా కామినీమణులకు, ఆ యామినులందు కలిగించినావు. అది కారణముగనే, వారు, త్రిజగద్వంద్య లైనారు.

నందనందనా! నా జాడ్యమును తొలగించి, నాకును ఆ అనుభూతి ననుగ్రహింపుము నాయనా!

70. సుదర్శన శాపవిమోచనాదికం

1. గోపికాగణమునకు పరమానందమును ప్రసాదించుచు నీవు క్రీడించుచున్న సమయమున, ఒకసారి, మహేశ్వరుని అర్చించుటకుగాను, గోపాలురు, నీతోసహ, అంబికా వనమునకు వెళ్ళినారు. వెళ్ళి, అచట, పవలంతయు పూజాదికములు జరిపి, ఆ రాత్రి, వా రచట గాఢనిద్రా పరవశులై ఉండగా, ఒక మహానాగము, నందగోపుని మ్రింగజొచ్చినది.

2. అది గ్రహించిన గోపాలురు, దాని నెంతగ హింసించినను, అది నందుని వదలలేదు. అది కారణముగ, వా రందరును, నీ శరణుజొచ్చినారు. తమ్ము రక్షింపవలసినదిగ వేడుకొనినారు.

అప్పుడు, నీ వా మహానాగమును సమీపించి, ఒక్క తన్ను తన్నినావు. ఆ విధముగ నీ పాదస్పర్శనందిన ఆ సర్పము, తక్షణమే, తన తొల్లిటి విద్యాధర రూపముతో ప్రకాశించినది.

3. ఆ పైన, ఆ విద్యాధరుడు, నిన్ను ఉద్దేశించి, 'చక్రధారీ ! నేను నీ చక్రము పేరిటివాడను. నన్ను, సుదర్శను డందురు. నే నొకప్పుడు, కొందరు మునులను అవహేళనచేసి, వారి శాపము కారణముగ సర్ప రూపము ధరించినాను; నీ అనుగ్రహమున విముక్తుడ నైనాను' అని విన్నవించుకొనినాడు; నిన్ను బహుధా వినుతించినాడు. అనంతరము, సుదర్శను డంతర్హితు డగుటయు, మీ రందరును మంద చేరుకొనుటయు జరిగినది.

4. అటు పిమ్మట, ఒకసారి, నీవు, బలభద్రునితోను, గోపికాగణముతోను, వనాంతరమున క్రీడించుచుండగా, కుబేరానుచరుడైన శంఖచూడుడు, గోపికల నపహరించుకుపోవుట సంభవించినది. అది గ్రహించిన నీవు, ఆ వెంటనే, అతనిని తరుముకొనుచుపోయి, సంహరించి, గోపికలకు

విముక్తి కలిగించి, అతడు సమర్పించుకొనిన అతని శిరోభూషణమును నీ అన్నకు కానికగా సమర్పించుకొనినావు.

5. ఆ కాలమున, నీవు, పవలంతయు, నీ సఖులతోకలసి, వనాంతరమున విహరించుచుండువాడవు. అప్పుడు, నీ శ్రీవిగ్రహమును చూసి మురిసిపోవు అదృష్టమును, నీ, వా మన్మథునకే ప్రసాదించుచుండుటయు, నీ వేణునాదము కల్పించు అమృతవృష్టిని, నీ, వా వనదేవతలకే దత్తము చేయుచుండుటయు, అనిమిష వధూజనమునకే నీవు సర్వదా నేత్రోత్సవమొనర్చుచుండుటయు జరుగుచుండెడిది. అది తలపోసికొని, గోప వధూజనము, విరహతాపమును భరింపలేకపోయెడివారు; నిన్ను అమితముగ విమర్శించుచుండెడివారు.

6. ఒకపరి, క్రూరాత్ముడును భీకరాకారుడును నగు కంస భటుడొకడు, అరిష్టు డనువాడు, వృషభరూపము ధరించి, భయంకరముగ అంకెలువెట్టుచు మందలో ప్రవేశించుటను నీవు కనిపెట్టినావు.

7. మందలో ప్రవేశించగనే, అతడు, బృహద్రూపము ధరించినాడు. తన పదఘట్టనలతో భూమిని కంపింపజేసినాడు. ఆల మందలను అల్లకల్లోల మొనర్చినాడు. ఆ పైన, స్వేచ్ఛావర్తనుడవైన నిన్ను సమీపించినాడు.

8. వృషభరూపమున ఉన్నను తన విషమబుద్ధిని వదలని ఆ రాక్షసుడు, నిర్భయముగ నీ మీదకు ఉరికివచ్చుచుండుటను గ్రహించి, నీవు, అతని ఉన్నత శృంగము నమాంతముగ పట్టుకుని, నిలిపి, ముష్టిఘాతములతో అతనిని మర్దించి కూల్చివేసినావు. అది చూసిన దేవతలు అమితానందమునందినారు.

9. అప్పుడు, వారు, 'ప్రభూ! ఈ వృషభాసుర విధ్వంసము వలన, భూమిమీద, ధర్మము పునఃప్రతిష్ఠితమైనది. మహేంద్రుడుకూడ, మహదా

నందము నందు చున్నాడు' అని, నీకు విన్నవించుకొనినారు; నిన్ను వేనోళ్ల వినుతించినారు.

10. ఆపైన, గోపకులు, తమ తమ వృషభముల నుద్దేశించి, 'వృషభ విధ్వంసి వచ్చుచున్నాడు; పారిపోవలసినది' అని, పరిహాసపూర్వ కముగ కేకలు వెట్టుచు, వాటిని పరుగెత్తించుచు, నీతో కలిసి మందను చేరు కొనినారు.

కృష్ణా ! ఆ వృషభాసురుని వేగోద్ధతి నణచి నటులనే, నా రోగోద్ధతిని కూడ అణచివేయుము నాయనా !

71. కేశిమథనం

1. భోజకులాధిపతి అయిన కంసరాజేంద్రుని ఆత్మబంధువు, 'కేశి' అనువాడు, అమిత బల పరాక్రమవంతుడు. అత డెట్టి దుర్ఘటకార్యమును తలపెట్టినను, అది, సఫలమై తీరవలసినదే. నిన్ను వశపరచుకొనుటలో, తాను, శ్రీమహాలక్ష్మికి సముడని, అతడు దృఢముగ విశ్వసించువాడు. ఆ అభిప్రాయముతోనే, అత డొకసారి, గాంధారదేశమునకు చెందిన అశ్వ రూపము ధరించి, నిన్ను సమీపించినాడు.

2. గాంధర్వ వాజి రూపమున నుండియు, అతడు, కర్ణకఠోరమైన హేషారవమొనర్చుచు, వ్రజవాసుల గుండెలు వ్రయ్యలింపసాగినాడు. నీవు బయటపడువరకు, మందలో, అమందమైన భయానక పరిస్థితిని కల్పించి నాడు. ఆ పైన, నీ మీదకు ఉఱికినాడు.

3. ఆ వెంటనే, విహంగాధిపతి మీద పాదమునోపు నీమీదకు, ఆ తురంగాధిపతి, తనపాదమును విసరినాడు. భృగుమహర్షి చేసిన ఘన కార్యమునే తానును చేయదలచినాడు కాబోలును.

4. అసురుడు విసరిన పాదము నీ వక్షమును సోకులోపలనే, నీవు, దానిని పట్టుకుని, అతనిని పైకెత్తి, గిరగిర త్రిప్పి దూరముగ విసరివేసినావు. అది కారణముగ, అతడు మూర్ఛితుడైనాడు. కాని, వెంటనే తేరుకుని, అమితక్రోధముతో, తిరిగి నీ మీదకు ఉఱికినాడు; నిన్ను కబళించుటకు ఉద్యుక్తుడైనాడు.

5. అది గ్రహించిన నీవు, ఆ వాహమును (గుఱ్ఱమును) దండించు ఉద్దేశముతో, నీ బాహు దండమును దాని ముఖ గహ్వరములోనికి జొనిపి, పరిమాణమును పెంచినావు. దానితో, ఆ అశ్వరూపిదయిన నిశ్వసనమున

కంతరాయము కలిగినది. అతని శిరము, శతథా భిన్నమైనది. అయినను, అతడు నీలో లీనమైపోయినాడు.

6. ఆ విధముగ, నీవు, నూత్నమార్గమున నశ్వమేధము నొనర్చుటను గ్రహించి (అశ్వరూపి అయిన రాక్షసుని సంహరించుట నవలోకించి) దేవతలు సంతుష్టిచెందినారు. ఆ పైన, నిన్ను, కేశిధ్వంసిగా, కేశవునిగా స్తుతింపసాగినారు.

7. అంతకు ముందుగనే, కంసరాజేంద్రుని కలుసుకుని, నీవు వసుదేవుని కుమారుడవని తెలియపరచి, వసుదేవుని సంహరింప నుద్యమించిన అతనిని వారించిన నారద మహర్షి, సరిగ, కేశిరాక్షస సంహారావసాన సమయమునకు అచటకు విజయము చేసినాడు. ఆ పైన, నిన్ను సందర్శించుకుని, అమితముగ ప్రస్తుతించినాడు.

8. అనంతరము, నీవు, గోపబాలురతో కలిసి వనాంతరమునందు దాగుడుమూత లాడుచుండగా, సురద్వేషియు, మహా మాయావియునైన మయపుత్రుడు, వ్యోముడనువాడు, వ్యోమమార్గమున చరించుప్రాణులను సయితము పీడించువాడు, మాయారూపమున నిన్ను సమీపించినాడు.

9. ఆ విధముగ సమీపించి, అప్పుడు, దొంగలుగా నటించుచున్న నీ సఖుల జట్టులో కలిసి, కొందరు గోపబాలురను, కొన్ని గోవులను, గోవత్సములను ఒక కొండగుహలో దాచి, ఆ గుహద్వారమును, కొన్ని రాతి బండలతో మూసివేసినాడు. నీ వది గ్రహించి, అతనిని సంహరించినావు.

10. ఆ పైన, నీవు, ఆ విధమైన మహాద్భుతక్రీడలతో, అనుక్షణమును, వ్రజవాసులకు, అంతులేని అపూర్వానందమును కలిగింపసాగినావు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! అసురులను రాపాడుట ఆట అయిన నీకు, నా 'ఉసురులను' కాపాడుట యే పాటి పని తండ్రీ !

72. అక్రూరభాగ్యం (అ)

1. శేషశాయీ! కృష్ణా! నీవు బృందావనమున నున్నావని నారదుని ద్వారా వినిన కంసుని గుండె చెదిరిపోయినది. ఆ వెంటనే, అతడు, గాందినేయుడైన(1) అక్రూరుని, తన సమక్షమునకు రప్పించుకుని, తాను నిర్వహింప సంకల్పించిన ధనుర్యాగమునకు నిన్ను ఆహ్వానించి తోడ్కొని రావలసినదిగ ఆదేశించి, నీ వద్దకు పంపినాడు.

2. అక్రూరుడు, నీ చిరకాల భక్తుడు. అయినను, కంసరాజేంద్రునకు భయపడి, నిన్ను దర్శించుకొను ఆసను వదలుకొనినాడు. కాని, ఇప్పుడు, కంసుని పనుపున నిన్ను కలుసుకొను అవకాశము లభించినందులకు అతడు అమితానందము నందినాడు.

3. ఆ పైన, అతడు, తన రథమునధిరోహించి బయలుదేరినాడు. బృందావనము చేరు వరకు, యేకాగ్ర చిత్తముతో నిన్నే స్మరించుకొన జొచ్చినాడు. నిరాటంకముగ నిన్ను దర్శించుకొను భాగ్యమునకై, భగవానుని, పదేపదే ప్రార్థించుకొనసాగినాడు.

4. 'అనంతములైన ఉపనిషద్వీధులలో విహరించుచుండు ఆ మహానుభావుని దర్శించుకొను భాగ్యము నాకు ఉన్నదో లేదో' అని, 'ఆయన శ్రీవిగ్రహమును ఆలింగనముచేసుకొను అదృష్టముగాని, తుదకు, ఆయన చరణాబ్జములను స్పృశించు పుణ్యముగాని, నాకు కలదో లేదో' అని, 'ఆయన నన్ను యేమిగభావించునో, యే విధముగ పల్కరించునో' అని, 'ఆయన, నాకు, యెక్కడ యే రూపమున దర్శన మిచ్చునోగదా' అని మాత్రమే, అతడు, దారిపొడుగునను విచారింపసాగినాడు.

5. పద్మపత్రేక్షణా! కృష్ణా! నీ స్పర్శ మూలమున పవిత్రీ భూతమై, బ్రహ్మరుద్రాదులకుకూడ సేవ్యమైన, బృందావనమున

ప్రవేశించినపుడు, అతడు పొందిన ఆనందమునకుగాని, అనుభవించిన దివ్యానుభూతులకుగాని పారము కలదందువా ప్రభూ !

6. బృందావనమున నీవు క్రీడించిన ప్రదేశములకు, అతడు, భక్తి పూర్వకముగ ప్రణమిల్లినాడు. నీ పాదరజము సోకి పవిత్రమైన మన్నులో పడి దొర్లినాడు. అప్పు డతని తన్మయావస్థ వర్ణనాతీతము ప్రభూ ! ఆ కాలమున నెందరో భక్తులు కలరు; కాని, అక్రూరునివంటి పరమభక్తులు మాత్రము అరిది.

7. సంధ్యాసమయమునకు, అక్రూరుడు, మందలో ప్రవేశించినాడు. అప్పు డక్కడ ఏ యింటివద్ద వినినను నీ కీర్తిగానమే. అది అతనికి తన్మయత్వము కలిగించినది. ఆ పైన అతడు, దివ్యానందరసార్ణవమున కొట్టుకువచ్చినవానివలె, మీ యిలు చేరినాడు.

8. అటుపిమ్మట, అచటి గోదోహనశాలలో, నీ సోదరుడైన బలరామునితోసహ నిలబడి, పాలుపిండుట నాసక్తితో వీక్షించుచున్నటులున్న నిన్ను, తనకు బ్రహ్మానందైక రసానుభూతి నొడగూర్చుచున్న నిన్ను, అతడు దర్శించుకొనినాడు.

9. మీరు, అప్పుడే జలకమాడి వచ్చినటులున్నారు. పీత నీల వసనధారులై ఉన్నారు. మీ శరీరములమీద, సాధారణమైన భూషలు మాత్రమే ఉన్నవి. మీరు, మందహాసము చేయుచున్నారు. ప్రసన్న వదనులై ఉన్నారు. అట్టి రమణీయమూర్తులను, మిమ్ము, అతడు దర్శించుకొనినాడు.

10. అల్లంత దూరముననే రథమునుండి దిగిన అతడు, మిమ్ము సమీపించి, సాగిలి మ్రొక్కినాడు. ఆ వెంటనే, నీవు, భక్త శిరోమణి అయిన అతనిని లేవదీసి, అమితాదరముతో ఆలింగన మొనర్చికొనినావు. క్లుప్తముగ అతని యోగక్షేమము లడిగి తెలుసుకొనినావు. అనంతరము, మీ సోదరు లిరువురును, అతనిని, గృహాంతర్భాగమునకు తోడ్కొనిపోయినారు.

11. ఆ పైన, యదువంశీయుడైన అతనికి, మీరును మీవారును సర్వవిధ సత్కారములు జరిపినారు. అతని ఉద్యమమును గురించి అతడు తెలిపినదంతయు సావధానముగ వినినారు. అనంతరము, అతనిద్వారా అందిన కంసరాజేంద్రుని ఆదేశమును గోపాలురకు తెలియపరచినారు. అటు పిమ్మట, అనేక గాథలు చెప్పుకొనుచు, మీరు, అతనితో ఆ రాత్రి అంతయు గడిపినారు.

12. ఆ రేయి, నీవు వారికి కనపడకపోవుటవలన, విరహాతురలైన గోపికలు, నీకు వారిపట్లగల అనురాగమును శంకింపసాగినారు. 'అసలే అతడు ధూర్తుడు. ఏ చంద్రికతో కులుకుచున్నాడో ! ఏ చంద్రభాగాదేవి సౌందర్యమున మునిగితేలుచున్నాడో ! ఏ మిత్రవిందకు విందులు చేయుచున్నాడో ! లేక, ఆ రాధామహారాణి ప్రణయ రసామృత పానముననే సొక్కిసోలుచున్నాడో ! యేమో !' అని, పరిపరి విధముల నిన్ను గుఱించి తల పోయజొచ్చినారు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! నీ అనుగ్రహబుద్ధి ననుమానించిన గాని నీ ఆదరము లభింపదాయేమి తండ్రీ !

అర్థము - వివరణ

(1) గాందినేయుడు : గాందిని అనుఆమె కుమారుడు. అతని తండ్రి శ్వఫల్కుడు.

73. అక్రూరభాగ్యం (ఆ)

1. మధురానగరమునకు నీవు పయనము కానున్నావను వార్త చెవులబడినంతనే, గోపకన్యలు అమితముగ ఆర్తినందినారు. అందరును ఒకచోట గుమికూడి, 'ఇదేమి విచిత్రము !', 'ఇదెట్లు జరిగినది ?' అని విచారింపసాగినారు.

2. 'నందనందనుడు కరుణారసమందిరుడు గదా ! అన్యాశ్రయము లేని మనల నెట్లు విడిచిపోగలడు ? అయినను, మన విధిలో యిట్లున్నది కాబోలును !' అని, నిన్నే స్మరించుకొనసాగినారు; వాపోవజొచ్చినారు.

3. తుది యామమున, నీవు, నందునితోను మిత్రబృందముతోను బయలుదేరుటకు ముందు, ఆ గోపికలతాపము నుపశమింపజేయు నిమిత్తము, వారివద్దకు, నీ సుహృదునొకని పంపినావు.

4. అతడు వారిని సమీపించి, 'త్వరలోనే మీకు నా సన్నిధి సుఖము లభింపగలదు. అమృతత్వము సిద్ధింపగలదు' అని, నీ మాటలుగ వినిపించి, వారికి, కొలది మనశ్శాంతిని కలిగించినాడు.

5. ఆ పైన, నీవును బలభద్రుడును, అక్రూరుని రథము నధిరోహించినారు. మీ రథము కనుచూపుమేర దాటువరకు, దుఃఖపరవశలై ఉన్న గోపికలు, మీ దిక్కే చూచుచు, నిన్ను ఉద్దేశించి ఏమేమో వేడికొనుచు ఉండిపోయినారు; నీవును, ఆదరపూర్వకమైన ఓరచూపులతో, వారిని తిలకించుచునే ఉన్నావు.

6. అనంతరము, శారీరకముగ గోపకులును, మానసికముగ గోపికలును నిన్ను అనుసరించి వచ్చుచుండగా, నీవు, బృందావనారణ్యసీమ నధిగమించి, కాళిందీ తటమును చేరుకొనినావు. నీవు వదలివచ్చిన వనములలోని

మృగములును వృక్షములును గూడ నీ తోటి వియోగమును సహింపలేక, కన్నీరు పెట్టుకొనినవి.

7. కాళిందినిచేరి, మాధ్యాహ్నిక సంధ్యావందన మాచరించుకొను చున్న అక్రూరునకు, నీవు, ఆ జలమధ్యమున కనిపించినావు. ఆశ్చర్యమున, అత డావెంటనే బయటకు వచ్చి చూడగా, అక్కడ, రథమునందు యథా పూర్వకముగ గోచరించినావు. అది గ్రహించిన అక్రూరుడు వివశుడైనాడు. సర్వవ్యాపివయిన నీవు, ఏక కాలమున అట నిట గోచరించుటలో వింత యేమున్నది ప్రభూ !

8. అదృష్టవంతుడైన అక్రూరుడు, తిరిగి నదీజలమున ప్రవేశించి నపుడు, నీ వతనికి, నీ నిజరూపమున, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవై దర్శన మొసంగినావు. ఆ సమయమున, నిన్ను, సిద్ధ చారణాదులు పరివే ష్టించి యున్నారు; శంఖ చక్ర గదా పద్మములు ఆశ్రయించి యున్నవి. నీవు, శేషతల్పమున శయనించి యున్నావు.

9. ఆ విధముగ నిన్ను దర్శించుకొనిన అక్రూరుడు, బ్రహ్మానంద రసామృతాబ్ధిలో మునిగిపోయినాడు. నిన్ను, బహువిధముల ప్రస్తుతించి నాడు. అంతలో, నీవు, అంతర్హితుడవైనావు. అది గ్రహించిన అతడు, హర్షాతిరేకమున, పులకిత శరీరుడై, తిరిగి నిన్ను సమీపించినాడు.

10. ఆ స్థితియందున్న అతనిని చూసి, రథమున నాసీనుడవై ఉన్న నీవు, మందహాసమొనర్చుచు, 'శీతజలస్నానమున కాబోలు; తనువు పులక రించినది' అనినావు. ఆ పలుకులు విని, అక్రూరుడు, అమితముగ హర్షిం చినాడు; నిరుత్తరుడైనాడు.

కృష్ణా ! భక్తవత్సలా ! నీ, యీ బిరుదును నిలబెట్టుకొనుటకైనను, నీ దాసుడనైన నన్ను కాపాడుకొనుము తండ్రీ !

74. మధురాపుర ప్రవేశం

1. ఆ విధముగ, అక్రూరునితో బయలుదేరిన నీవు, మధ్యాహ్న సమయమునకు మధురానగరమును చేరుకుని, పురోపవనమున నాగి, భోజనాదికములు పూర్తిచేసుకొనినావు. ఆ పైన, అంతకుముందు నీ లీలా శిశుక్రీడలను గుఱించి విని, నీ దివ్యసుందర విగ్రహ దర్శనాభిలాషతో ఉన్న నగరవాసుల పూర్వపుణ్య విశేషమున ఆకర్షింపబడినవానివలె, నగరమున ప్రవేశించినావు.

2. నీ దర్శనము నభిలషించి నిన్ను సమీపించిన ఆ మధురాపురీ పురంధ్రులకును నీకును బహువిధ సంబంధము కలదు ప్రభూ !

నీ చరణములు రాగరంజితములు; వారు అనురాగ పూరితలు. నీవు ఘన పయోధర శ్యాముడవు; వారు పీన పయోధరలు. నీ చూపులవలెనె వారి చూపులును చంచలములు. హారశోభితమైనది నీ హృదయసీమ; వారు మనోహారిణులు. నీ చిరునవ్వువలెనె వారి చిత్తమును నిర్మలమైనది. కలాపము (నెమలిపురి) నీకు కూకటియందున్నది; కలాపము (ఒడ్డాణము) వారికి కటి ప్రదేశమున నున్నది.

3. నీ ఓరచూపులతో, నీవు, ఆ నారీమణులకు మహదానందము నొదగూర్చినావు. ఆబాలగోపాలమును సంభ్రమాశ్చర్యముల ముంచెత్తినావు. అచట కనిపించిన కంస పరిచారకుడు, ఒక రజకుడు, నీవు కోరిన సుందర ధౌతచేలముల నిచ్చుటకు నిరాకరించి, నిన్ను నిరసించి మాట్లాడుట కారణముగ, అతని శిరమును నఱికివేసినావు; అతనికి పుణ్యగతిని కల్పించినావు.

4. ఆ పైన, నీకు ధారణ యోగ్యములైన వస్త్రములను సభక్తికముగ సమర్పించుకొనిన కుశాగ్రబుద్ధియగు ఒక సాలెవానికి, సాలోక్య ముక్తిని ప్రసాదించినావు.

ఎవరి అదృష్ట మెటువంటిదో యెవరు చెప్పగలరు ప్రభూ !

అనంతరము, సుదాముడను మాలాకారునిచే సన్మానితుడవై, అతని పూజలందుకుని, లక్ష్మీపతివైన నీవు, అతని గీమును లక్ష్మీనిలయ మొనర్చినావు. అతని అభ్యర్థనమీద, అతనికి, నీ చరణ సరోజ సేవా భాగ్యము అనవరతము కలుగునట్లుగ అనుగ్రహించినావు.

5. అటుపిమ్మట, మీ కొక కమలలోచన కనిపించినది. ఆమె, కమల లోచనయే; కాని, కుబ్జ. ఆమె, మీకు, అంగరాగమును సమర్పించుకొనినది. దానికి ప్రతికృతిగ, నీవు, ఆమెకు, నీ పట్ల అనురాగమును ప్రసాదించినావు. మనోహరమైన ఆ అనురాగమువలెనె, ఆమెనుకూడ, మనోహారిణి నొనర్ప సంకల్పించుకొనినావు. ఆ వెంటనే, ఆమెను ఉద్ధరించినావు; ఆ త్రివక్ర(1) నొక త్రిలోక సుందరిగ మార్చివేసినావు.

6. అత్యంత పాపాత్ములుకానివారు, అది కారణముగ, నీ వైభవమును యే కొలదిగనైనను గ్రహింపజాలినవారు, వారి వారి శక్త్యానుసారము, ఆ సమ యమున, నీకు, మధుపర్కములను(2) పుష్పహారములు మున్నగువానిని, భక్తిపూర్వకముగ సమర్పించుకొనినారు.

కృష్ణా ! ఆ సందర్భమున, నే నచట లేను కాబోలును. ఉండి ఉన్నను, సభక్తికముగ అంజలించి, కనీసము, యే పత్రమునో పుష్పమునో అయినను నీకు అర్పించుకొని యుండను కాబోలును. ఈనాడు నే ననుభ వించుచున్న తాపము లన్నిటికిని ఆనాటి పాపమే కారణమై ఉండును నాయనా !

7. నీకు అంగరాగమును సమర్పించుకొనిన ఆ కుబ్జకు, 'తిరిగి నిన్ను కలిసికొందు'నని మాటయిచ్చి, నీవు పురోప కంఠమును చేరితివి. అయినను, ఆమె, నీవు కనుచూపుమేర దాటువరకును నిన్నే చూచుచు, అట్టె నిలబడిపోయినది.

నీ ఆగమనము కల్పించిన ఆనంద కోలాహలము, అప్పటికి, నగర మంతటను మార్మ్రోగసాగినది. నీ ప్రవేశమునకు ముందే, నీ విమలయశము,

నగరాంతర్భాగముననున్న నీ మాతృమూర్తియందు, పాలపొంగు రూపమున ప్రసరించినది.

8. మహోత్సవ సన్నాహముననున్న మధురానగరమునం దడుగిడిన నీవు, ఆ వెంటనే, ధనుశ్శాలలో ప్రవేశించినావు. నీ మధురమోహన రూపమును తిలకించియో, నీ తేజమును గ్రహించియోకాని, అచటి కావలివారు, నీకు దూరముగ తొలగి నిలబడినారు. ఆ పైన, నీవు, అలంకృతమై అర్చింపబడిఉన్న అచటి ఉద్దండ కోదండమును అవలీలగ యెత్తి, కంస భృత్యులు వారించులోపలనే, దానికి, నారిని సంధించి లాగినావు; దానిని విఱిచివేసినావు.

9. మరునాటి ఉదయమున జరుగనున్న కంససంహారమునకు నాందిగా మ్రోయింపబడిన భేరివలె, ఆ భగ్నకోదండము ధ్వనించినది. దాని నాకర్ణించిన దేవతలు ఆనందించినారు. కంసాదులు కంపించిపోయినారు. కార్ముక ఖండములతో మోదబడిన కోదండ రక్షకుల రోదనము, కంసుని కలవరమును అతిశయింపజేసినది.

10. ఆ సమయమున, నీ మహిమను కనులారగాంచిన ధర్మపరులు మోదించినారు; అధర్మపరులు రోదించినారు.

అనంతరము, నీవు, నగరశోభను తిలకించుటకు పోయి, సంధ్యా సమయమునకు పురోపవనమును చేరుకొనినావు. అచ్చట, రాధావియోగమున కలిగిన వేదనను, శ్రీదామునకు వెలువరించుచు, నీ అవతారప్రయోజనము సిద్ధింపనున్నందులకు లోలోన మురిసిపోవుచు, ఆ రేయిని వెళ్లదీసికొనినావు.

కృష్ణా! దుష్టశిక్షణమునకు ఉవ్విళులూరు నీవు, నా కష్టమును విస్మరించుట న్యాయమగునా తండ్రీ!

అర్థము - వివరణ

(1) త్రివక్ర : మూడు వంకరలు తిరిగిపోయిన శరీరము కలది.

(2) మధుపర్కములను : పెరుగుతో కలిపిన నేయి, నూత్న వస్త్రములు మున్నగు వాటిని -

75. కంస వధ

1. భయాకుల చిత్తుడై ఉన్న కంసరాజేంద్రుని ఆదేశానుసారము, ఆ నాటి కార్యక్రమము ప్రారంభమైనది. మల్లయుద్ధరంగమునుండి, తూర్య ఘోష వినిపించినది. కంసుడు, గద్దె నెక్కినాడు. సామంతరాజులు, సభా వేదిక నలంకరించినారు. నందాదులు, వారి వారి ఉచితాసనములమీద ఉపవిష్టులైనారు. సాలంకృతులైన మీ సోదరులిరువురును, మీ సహచరులతో, రంగశాలను సమీపించినారు. అప్పుడు, అక్కడ, ఉద్రిక్తమై ఉన్న మత్త గజేంద్రము, కువలయాపీడము(1) మీ దారి నడ్డగించినది.

2. అది గ్రహించిన నీవు, దాని మావటివానిని ఉద్దేశించి, 'పాపాత్ముడా ! ప్రక్కకు తొలగవలసినది' అని, హుంకరించినావు.

ఆ మావటివాడు, సహజముగనే దుష్టచిత్తుడు. నీ ఆదేశ మతనిని ఆవేశపరచినది. ఆ వెంటనే, అతడు, అప్పటికే తన తొండముతో నిన్ను పట్టుకుని ఉన్న ఆ మత్త ద్విపమును, అంకుశాఘాతముతో మరింత ఉద్రేక పరచినాడు.

ఆ మహానాగము నీకు అపాయమును కలిగించులోపలనే, నీవు, దాని పట్టునుండి అవలీలగ తప్పించుకుని, గోపీజన కుచకుంభములకు ప్రత్యర్థిగా ఉన్న దాని విపుల కుంభస్తలమును ప్రహరించి, దూలములవంటి దాని కాళ్ళమధ్య కొలదిసేపు దాగొని, ఆ పైన, మృదుమందహాసముతో బయటకు వచ్చినావు.

3. సదా నిన్ను ధ్యానించుకొనుచుండు మహర్షులకు సైతము చిక్క నట్లుండియు చిక్కని నీవు, అటుపిమ్మట, ఆ దంతావళము చెంతకుపోయి కూడ, దానికి పట్టుబడకుండ, కొంతసేపు తప్పుకుని తిరిగినావు. ఆ పైన, అమాంతముగ దాని ముందుకు ఉటికి, పడిపోయినట్లు నటించినావు.

అది చూసిన ఆ మత్త గజేంద్రము నిన్ను, తన దంతములతోపొడిచి చంపుటకు ఉద్యుక్తురాలై నది. అది గ్రహించిన నీవు, ఆ వెంటనే, దాని ప్రాణముతో సహ, దాని దంతములను సమూలముగ పెకలించినావు. ఆ దంతమూలమున నున్న మంచి ముత్యములను తీసుకుని, నీ ప్రాణమిత్రుడై న శ్రీదామున కిచ్చి, 'వీటితో ఒక చక్కని కంఠహారమును చేయించి, రాధా మహారాణికి సమర్పించుకొనవలసినది' అని ఆదేశించినావు.

4. ఆ పైన, నీవు, ఒక దంతమును భుజమున మోపుకుని, బలరామునితోసహ రంగస్థలమున ప్రవేశించినపుడు, నీ దివ్యసుందర విగ్రహము, అందరి మనసులను ఆహరించుకొనినది. అందరి చూపులను ఆకర్షించుకొనినది. అప్పుడు, వారు, 'ఇతని పుట్టువు వలన ధన్యులై న దెవరు ? తండ్రి అయిన నందుడా ? కాదు. తల్లి అయిన యశోదా దేవియా ? కాదు. ఇతనితో క్రీడించిన ఆ గోపికలా ? వారును కాదు. కానిది వారే కాదు. ముల్లోకములలోనివా రెవరును కాదు. ధన్యులము మనము. ముమ్మాటికి మనమే ధన్యులము. ఇతనిని ఈ రూపమున దర్శించు కొనగలిగిన మన నేత్రములు మాత్రమే ధన్యతమములు' అని తమ్ము తాము ప్రశంసించుకొనసాగినారు.

5. గోపకుల మధ్య, మాయా మానుషరూపముననున్న నీవు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడవేనని, సనాతనుడవు, నిరవధిక పరమానంద స్వరూపుడవు అయిన ఆ పరబ్రహ్మ వేనని, యే కొలదిమంది పుణ్యాత్ములో తప్ప యితరులెవరును అంతవరకు గ్రహించలేదు. కాని, ఇప్పుడు, వారి పున్నెము పండినది. వా రందరును నిన్ను దర్శించుకుని పాపరహితులై నారు. పరమానంద రసప్రపూర్ణమానసులై నారు. నీ మధురలీలా విశేషముల నన్నిటిని స్ఫురణకు తెచ్చుకుని, నిన్ను స్తుతింపసాగినారు.

6. మీరు, మల్లయుద్ధరంగమున ప్రవేశించినంతనే, కంసరాజేంద్రుని ఆదేశానుసారము, మల్లవిద్యాప్రవీణుడై న చాణూరుడును, ముష్టిఘాతములకు

పేరుమోసిన ముష్టికుడును మిమ్ము యెదుర్కొనినారు. తీవ్ర ముష్టిఘాతములకు మిమ్ము గురిచేసినారు. ఆ శబ్దములు రోదోంతరాళమున మారుమ్రోగినవి.

అప్పుడు జరిగిన పోరులో, మీరు, మీ చాతుర్యమునంతను ప్రదర్శించినారు. క్రిందపడినారు. పైకెగిరినారు. ఒకరినొకరు యీడ్చుకొనినారు. అదంతయు మహాద్భుతమనిపించినది. చాణూరుడు, నీ చేతులో ప్రాణము వదులుటకు ముందు, అనేక పర్యాయములు చచ్చిబ్రతికినాడు ప్రభూ !

7. అదంతయు గమనించుచున్న మధురాపురీ పురంధ్రులు, సుకుమారులైన మీతో, కులిశ కర్కశ దేహులైన చాణూర ముష్టికులు పోరుచుండుటను సహింపలేకపోయినారు. అచటినుండి వెళ్ళిపోవుటకు ఉద్యుక్తులైనారు.

అంతలో, నీవు, చాణూరుని పైకెత్తి, గిరగిరత్రిప్పి, నేలకువేసికొట్టినావు. దానితో, అతని ప్రాణములెగసిపోయినవి. ఆ పైన, బలరాముని చేతులో, ముష్టికునకు కూడ అదేగతి పట్టినది. అది చూసిన వీరులందరును పారిపోయినారు.

8. అప్పుడు, దుష్టబుద్ధి అయిన కంసుడు, తూర్యఘోష నాపివేయించినాడు. కిం కర్తవ్యతామూఢుడై, నీ కన్నతండ్రిని, పెంపుడు తండ్రిని, తుదకు, తన తండ్రిని కూడ సంహరింపవలసినదిగ భటుల కాజ్ఞాపించినాడు. సర్వవ్యాపివైన నిన్ను తన సమక్షమునుండి తొలగింపవలసినదిగ ఆదేశించినాడు.

ఆ దుర్మార్గుని వచనములను విని సంక్షోభించిపోయిన నీవు, ఆ వెంటనే, గరుడుడు పర్వతము మీదకు యెగిరినట్లుగ, సింహాసనముమీదికి యెగిరి, కరవాలమును ఝళిపించుచున్న కంసుని, చమత్కారముగ ఒడిసి పట్టుకొనినావు.

9. ఆ విధముగ పట్టుబడిన రాజేంద్రుని, నీవు, తక్షణమే, క్రిందకు పడత్రోసినావు. దానితో, అతని కీలుబంధములన్నియు సడలిపోయినవి.

ఆ పైన, నీ వతనిమీదకు లంఘింపనుండగా, దేవతలు, నీమీద పుష్పవృష్టి గురియించినారు.

కృష్ణా ! ఆ పైన నేనుచెప్పేది దేమున్నది ? కంసుడు, ప్రాణభీతితో నైనను, సర్వదా నిన్ను తలచుకొనుచుండువాడు. అది కారణముగనే, అతనికి, సాయుజ్యము క్తి లభించినది. పూర్వజన్మమున కాలనేమిగా ఉండి నీ చేత సంహరింపబడినపుడు, అతడు కోరిన దిదియేకదా ప్రభూ !

10. అనంతరము, నీవు, కంసుని సోదరులను(2) ఎనిమిది మందిని సంహరించినావు. నీ జననీ జనకులైన దేవకీ వసుదేవులకు ప్రణమిల్లినావు. ఉగ్రసేనునకు పట్టము కట్టినావు. యాదవుల వాంఛితార్థము లన్నియు తీర్చినావు. దేవగురుడైన బృహస్పతివద్ద నీతిశాస్త్రము నభ్యసించిన భక్తాగ్రేసరునితో, ఉద్ధవునితో, మైత్రి నెఱపుకుని మధురానగరముననే సుఖ నివాస మేర్పరచుకొనినావు.

గురుపవనపురాధిపా ! కృష్ణా ! కృష్ణకర్మలను శిక్షించుటతోపాటు కృష్ణదాసులను రక్షించినపుడుగదా నీ అవతారప్రయోజనము సిద్ధించునది !

అర్థము - వివరణ

(1) కువలయాపీడము : కంసుని పట్టపుదేనుగు. ప్రపంచమునంతను పీడింపగల శక్తి కలది.

(2) కంసుని సోదరులు : కంకుడు, న్యగ్రోధుడు, గహ్వుడు, సునామకుడు, సుభువు మున్నగువారు.

76. ఉద్ధవదౌత్యం

1. కృష్ణా ! నీవు సర్వజ్ఞుడవయ్యును, లోక సంగ్రహార్థము, బలరామునితో సహా, విద్యాభ్యాసము నిమిత్తము, సాందీపని మహర్షి వద్దకు పోయినావు. పోయి, అరువదినాలుగు దినములలో, అరువది నాలుగు విద్యలను(1) కూలంకషముగ గ్రహించి, ఆయనకు గురుదక్షణగా, ఏనాడో మరణించిన ఆయన కుమారుని, యమలోకమునుండి తెచ్చి యిచ్చినావు. ఆపైన, పాంచజన్యమును(2) పూరించుకొనుచు, మధురా నగరమునకు విజయము చేసినావు.

2. ఆ సమయమున, నీకు, గోపికలు, తిరిగి స్ఫురణకు వచ్చినారు. విరహాతురలైన, వారు, క్రుంగిపోవుచుండుటను, నీవు పదేపదే భావించుకొనజొచ్చినావు. అది కారణముగ, నీకును, వారి వియోగము భరింపరానిదే అయినది. అప్పుడు, నీవు, వారి యోగక్షేమములు విచారించివచ్చుటకుగాను, నీ పరమభక్తుడైన ఉద్ధవుని, వారివద్దకు పంపుట సంభవించినది. అటు లతనిని పంపుటలో, నీ పట్ల ఆ గోపికలకుగల అనన్య భక్తిని అతనికి విశదపరుపవలెనను అభిప్రాయముకూడ నీకు లేకపోలేదు.

3. ఉద్ధవుడు నీ వద్ద సెలవు దీసుకుని, సాయంసమయమునకు, గోకులమును చేరుకొనినాడు. అచట, యెటు చూచినను, అతనికి, నీ మాహాత్మ్యమే గోచరించినది. ఆ పైన, అతడు, నంద యశోదలను కలుసుకుని, వారికి, నీ క్షేమమును తెలియపరచినాడు; ఆనందము కలిగించినాడు.

ఆ మరునాటి ఉదయమునగాని, సాలంకృతమైన నీ రథమును, గోపికలు చూడలేదు. అది కనులబడగనే, వారికి, పరమానందము కలిగినది. ఆ వెంటనే, వారు, తమతమ గృహకృత్యములకు స్వస్తిచెప్పి, అటుగా పరుగు

దీసినారు. కాని, వారికి కనిపించినది నీవుకాదు; నీ నుండి నీ సందేశముతో వచ్చిన నీ సహచరుడు.

4. అయినను, అతని వేషభూషలు చూసిన, వారికి, నీవే తలపునకు వచ్చినావు. నీ లీలా విలాసములన్నియు, వారి కట్టెదుట కనిపించినవి. వారు తన్మయలై పోయినారు.

ఆ సమయమున, అతనికి అతిధి సత్కారము చేయవలెననికూడ వారికి తోచలేదు. కొలదిసేపటివరకు, వారి నోటివెంట, ఒక్కమాటకూడ పెగలిరాలేదు. అనంతరము, వారు, అతికష్టముమీద, తమకును అతనికిని ఉన్న అంతరమును సయితము పాటింపక, తొట్రుపడుచున్న పలుకులతో యిట్లనినారు.

5. "ఆ నిర్దయాత్ముడు, తన తల్లిదండ్రులను మాత్రమే చూసి రమ్మని నిన్ను పంపినాడా స్వామీ ! ఇంతకును, నగరవాసినుల నయనాంచలముల కట్టుబడిన ఆ నవమన్మథుడు, యిప్పు డెచటనున్నాడు ? ఏమి చేయుచున్నాడు ? హరి హరీ ! ఎంత మోసము జరిగినది ! ఆ అమృత స్వరూపుని ఆలింగన చుంబనాదులు, మృదుమధుర వచనములు, మఱతుమన్నను మఱపురావుగదా !'

'కృష్ణా ! నిన్ను నమ్మినదానికి ఫలము, మేము ఉన్మాదినుల మగుటయా ! అనన్య గతికల మగుటయా ! బాగున్నది.'

6. 'నీవు దయాసముద్రుడవుగదా ! రాసలీలావసరమున, మోమున పొటమరించిన చిరుచెమట బిందువులతోను, చెదరిపోయిన కేశపాశములతోను శోభించిన నీ దివ్యమంగళ విగ్రహమును, కనీసము ఒక్కమారయినను ఆలింగన మొనర్చుకొను అదృష్టము నిక మాకు కలిగింపవా ప్రభూ !" అని ప్రేమోన్మాదినులయిన గోపికలు, త్రిజగన్మోహనుడవైన నిన్ను తలచుకుని వాపోయినారు.

7. తమ్ము తాము మఱచి, ఆ విధముగ పలవరించుచున్న గోపకామినులకు, ఉద్ధవుడు, జ్ఞానపూరితమైన నీ సందేశమును వినిపించినాడు;

తిరిగి వారిని యథాపూర్వస్థితికి కొనిపోయినాడు. అనంతరము, నీ యందే మనసును లగ్నము చేసుకుని, హృదయ సంతుష్టినందిన వారికి, నీ లీలా విశేషములు విశదపరచుచు, వారితో కొన్ని దినములు, అచటనే, ఆనంద ముగ గడిపినాడు.

8. గోపికలు, ఎప్పుడు యెక్కడ యేపని చేయుచున్నను, నీ లీల లనే గానముచేయుచుండువారు. వారు, ఒకరినొకరు కలుసుకొనినపుడు, నీ విషయములనే ముచ్చటించుకొనుచుండువారు. వారు, పవలంతయు, నీ వలెనె వ్యవహరించుచుండువారు. నిదురలోకూడ, నిన్నే పలవరించుచుండు వారు. ఆ విధముగ, వారి మనసులు, సర్వదా నీ యందే లగ్నమైఉండు టను గ్రహించి, ఉద్ధవుడుకూడ ఆశ్చర్యచకితుడైనాడు.

9. "మనోహరమైన దేదైన కనిపించినపుడు, 'ఇది మా రాధకు మిక్కిలి ప్రియమైనది' అని, ఏదైన మధుర భాషణము వినినపుడు, 'రాధా దేవి అచ్చముగ యిటులనే ముచ్చటించునది' అని, నే నెపుడైనను మౌనము వహించినపుడు, 'ప్రణయకోపము నటించునపుడు, రాధామహారాణికూడ యిటులనే ఉండెడిది' అని, నీ ప్రియుడు, యేకాంతమున నాతో అనుచుండు వాడు" అని, అటులనే అనేక విషయములు, నీ ప్రియురాలైన రాధికకు తెలియపరచి, ఉద్ధవు డామెకు అమితానందము నొదగూర్చినాడు.

10. నీ హృదయమును గోపికలకు విశదపరచుచు, ఉద్ధవుడు, 'శ్రీకృష్ణుడు మిమ్ము మఱచిపోలేదు. కాని, కొన్ని విశేష ధర్మములను నిర్వర్తించుటలో నిమగ్నుడై ఉండుటవలన, నాతో రాలేకపోయినాడు. ఐనను, మీరు విచారపడవలసిన పనిలేదు. వియోగము ప్రేమను వృద్ధి చేయునుగదా! బ్రహ్మానంద రసానుభూతి కలిగినప్పుడు, సంయోగమునకు సంతోషించుటగాని, వియోగమునకు విచారపడుటగాని ఉండనే ఉండవు. ఇవి, నా మాటలు కావుసుమా! మీ ప్రియుని మాటలు' అని, తెలియపరచి, వారి విచారమును తొలగించినాడు.

(15)

11. 'గోపికలది పరాభక్తి. అట్టిది ముజ్జగముల నెందును, మున్ను, విన్నదిగాని కన్నదిగాని లేదు. శాస్త్రాధ్యయనమువలనగాని, తపశ్చర్యమూలమునగాని, అది లభించునది కాదు. అది కారణముగనే, నేను, ఆ గోపికలకు శిరసా నమస్కరించుచున్నాను' అని, బృందావనమునుండి తిరిగివచ్చిన ఉద్ధవుడు నీకు విన్నవించుకొనినాడు. ఆ పలుకులు వినిన నీవు, అమితానందము నందినావు.

గురువాయుపురాధిపా ! కృష్ణా ! నాకు రోగవిముక్తిని కలిగించి, నేను ముక్తి పథమున గమించునట్లు అనుగ్రహింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) విద్యలు : వేదవేదాంగములు, శాస్త్రములు, జ్యోతిషము, గణితము, గానము, చిత్రలేఖనము, కవిత్వము, శిల్పము మున్నగునవి.

(2) పాంచజన్యము : పంచజనుడను రాక్షసుని సంహరించి వాని గర్భమునుండి గ్రహించిన శంఖము.

77. ముచుకుందానుగ్రహం

1. అనంతరము, నీవు, ఉద్ధవునితోసహా, నీ కొఱకు ప్రతిదినమును యెదురుతెన్నులు చూచుచున్న కుబ్జయింటికి పోయినావు. ఆమె నివాసము, ఆమెవలెనె అతిమనోహరమైనది. నిన్ను సంతోషపరచుటకు, ఆమె, అనుక్షణమును మార్చుకొనుచున్న ఆభరణములు, ఆమెకు నీపట్ల గల అనురాగమునకు తార్కాణములు.

2. నీ ఆగమనమువలన, ఆమె, తన మనోభీష్టము లన్నియు నీడేరినట్లుగనే సంతోషించినది. పొంగి పరవళ్లుత్రొక్కుచున్న హర్షముతో, పరవశయై, నీకు వివిధోపచారము లొనర్చినది. ఆ పైన, నీ, వామెతో కొంత కాలము యేకాంతమున గడిపినావు.

3. ఆమె పరిచర్యలకు సంతుష్టిచెందిన నీవు, ఆమె కోరిన వరము నీయ సంకల్పించినావు. ఆ విధముగ అనుగ్రహింపనున్న నిన్ను, జ్ఞానులైనచో, సాయుజ్యముక్తిని కోరియుందురు. కాని, ఆ మూర్ఖురాలు, సామీప్య ముక్తినైనను వాంఛింపలేదు; ప్రాపంచిక విషయోపభోగములను మాత్రమే అర్థించినది.

4. ఆమె కోరిక ప్రకారము, నీ, వామెతో, మరికొన్ని దినములు గడిపి, తుదకు, ఆమె కొక కుమారుని అనుగ్రహించినావు. అతడే, అనంతర కాలమున, నారదుని ద్వారా పరమ రహస్యమును గ్రహించి, ఉపశ్లోకుడుగా సుప్రసిద్ధుడైనాడు.

5. అనంతరము, నీవు, బలరామునితోను ఉద్ధవునితోను కలిసి, అక్రూరుని ఇంటికి వెళ్లినావు. మీ రాకకు ఆనందించిన అక్రూరుడు, మిమ్ము అమితముగ స్తుతించినాడు; సముచితముగ అర్చించినాడు.

ఆ పైన, నీవు, ఉద్ధవుని హస్తినాపురమునకు పంపి, అతనిద్వారా, పాండవులు అరణ్యములనుండి తిరిగి వచ్చుటను గుఱించియు, ధృతరాష్ట్రుని దురుద్యోగమును గుఱించియు, వివరముగ తెలిసికొనినావు.

6. తనకు ప్రాణమిత్రుడును, తన కుమార్తెలకు ప్రాణవల్లభుడును అయిన కంసరాజేంద్రుడు, నీవలన నిహతుడగుటను గ్రహించిన జరాసంధుడు, అమితక్రోధముతోను, బలముతోను వచ్చి మధురానగరమును ముట్టడించినాడు. ఆ సమయమున నీ వద్ద తగినంత సైన్యము లేదు. కాని, దేవలోకమునుండి వచ్చిన రథాదుల సాయముతో(1) బలభద్రసహితుడవై అతనిని ప్రతిఘటించి, అతనికి అండగ ఉన్న యిరువది మూడు అక్షౌహిణుల సేనను(2) అవలీలగ నిర్మూలించినావు.

7. జరాసంధుడు రాజాధిరాజు. అతడు, రాజులనందరిని జయించి, వారిని తన గుప్పిట పెట్టుకొనినవాడు. అది కారణముగనే, అతడు, తిరిగి మరింత సైన్యముతో నీ సన్నిధికి వచ్చు అవకాశమును కల్పించుటకా అని నట్లు, బలరామునిచేత బంధింపబడిన అతనిని, నీవు విడిచిపుచ్చినావు.

8. అట్లు పరాజితుడై అవమానింపబడిన జరాసంధుడు, తన సామంతుల ప్రోత్సాహము కారణముగ, ఆ పైన, అదే విధమున, నీతో, పదహారు సార్లు పోరాడినాడు. అప్పటికి, నీ వలన నిహతులైన అతని సైనికుల సంఖ్య మూడువందల తొంబదిఒక్క అక్షౌహిణులు. అది మహాద్భుతము కదా ప్రభూ !

9. పదునెనిమిదవసారి, అతడు నీ మీదకు రానున్న సమయమున, యవనపతి అయిన కాలయవనుడు, మూడుకోట్లమంది యవన సైనికులతో నీ పైకి వచ్చుచుండుటను నీవు గ్రహించినావు. ఆ వెంటనే, దేవశిల్పిఅయిన విశ్వకర్మ ద్వారా, సముద్ర మధ్యమున, ఒక మహానగరమును నిర్మింపజేసి, నీ యోగబలముద్వారా నీ వారి నందరను అచటకు తరలించినావు.

10. ఆ పైన, నీవు, వనమాలను మాత్రము ధరించి, పాదచారివై నగరము వెలుపలకు వచ్చి, కాలయవనుని చూసి భయపడినవానివలె, పరుగిడసాగినావు. అట్లు పరుగిడుచున్న నిన్ను, నీ చేతులో మరణించు అదృష్టములేని ఆ మ్లేచ్ఛపతి వెంటాడినాడు. నీవు, పోయిపోయి, ఒక గుహలో ప్రవేశించి దాగొనినావు.

అప్పు డా గుహలో, ముచుకుందుడు గాఢనిద్రా పరవశుడై ఉన్నాడు. అతడు నీవే అనుకుని, ఆ మ్లేచ్ఛరాజు, అతనిని ఒకతన్ను తన్నినాడు; అతని ఆగ్రహమునకు ఆహుతి అయిపోయినాడు.

ఆనంతరము, నీ పరమ భక్తుడైన ఆ ముచుకుంద మహారాజునకు, అచటనే, నీవు, నీ దివ్యదర్శనము నొసంగినావు.

11. ఆ విధముగ నిన్ను దర్శించుకొనిన ముచుకుందుడు, ఇక్ష్వాకు వంశీయుడు. నీ అనుగ్రహము నభిలషించి, రాజ్యభోగముల నన్నిటిని త్యజించి, విరక్తుడై ఉన్నవాడు. నిష్కాముడు.

ఆ మహారాజు, ని న్నా సమయమున అతిభక్తితో స్తుతించినాడు. అది కారణముగ, నీ వతనిపట్ల ప్రసన్నుడవై, సర్వపాపములను హరింపగల పరమ భక్తిని, మోక్ష సదృశమైన దానిని, అతనికి ప్రసాదించినావు; కాల క్రమమున జన్మరాహిత్యము కలుగగలదనికూడ అభయ మొసగినావు.

అనంతరము, విశ్వకళ్యాణము నాసించి, 'నీవు మహారాజుగా పూర్వము సలిపిన ప్రాణిహింసకు పరిహారముగ తపమాచరింపవలసినది' అని ఆదేశించినావు.

12. ఆ పైన, మధురాభిముఖుడవై పోయి, దారిలో, యవన సైన్యము నంతను హతమార్చినావు. అంతలో, మగధరాజైన జరాసంధుడు, మరొక ఇరవై మూడు అక్షౌహిణుల సేనతో నీకు యెదురైనాడు. అతనికి అంతిమ విజయము చేకూరినదను అభిప్రాయమును కలిగించి, అతని గర్వమును

పెంచుటకుగాను, నీ వపుడు పారిపోయి, సముద్ర మధ్యముననున్న ద్వారావతిలో ప్రవేశించినావు.

ముచుకుందునకు పాపశాంతి మార్గము చూపినవాడవు, నా తాపశాంతికి మార్గము చూపలేవా నాయనా !

అర్థము - వివరణ

(1) రథాదుల సాయముతో : శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, బలాహకము అను నాలుగు గుఱ్ఱములు కలది శ్రీకృష్ణుని రథము. దాని సారథి పేరు దారుకుడు. శ్రీకృష్ణుని ఆయుధములు - సుదర్శనమను చక్రము, కౌమోదకి అను గద, సార్ఙ్గమను ధనుస్సు.

(2) అక్షౌహిణి : (దశ. 36 - వివ. 2 - చూడుము.)

78. రుక్మిణీ కల్యాణయాత్ర

1. దేవశిల్పి అయిన విశ్వకర్మ, తన కళాకౌశలము నంతను వినియోగించి, సముద్ర మధ్యమున నిర్మించినదియు, దిక్పాలురు, కోరి సమకూర్చిన అష్టనిధులతో అలరారునదియు నగు ఆ మహా నగరమునందు, ఆ పైన, నీవు విరాజమానుడవై ఉన్నావు.

2. అనంతరము, చతుర్ముఖుని ఆదేశానుసారము, రేవతుడను రాజేంద్రుడు, తన కుమార్తె అయిన రేవతిని, బలరామునకిచ్చి వివాహము చేయదలచినపుడు, నీవు, యాదవు లందరితోను కలిసి, ఆ కళ్యాణ మహమును, మహా వైభవముగ జరిపించినావు.

3. విదర్భ దేశాధీశ్వరుని కుమార్తె అయిన రుక్మిణి, మొదటి నుండియు నీ మీదనే మరులుగొని యున్నది. అది గ్రహించికూడ, ఆమె అన్న అయిన రుక్మి, ఆమెను, తనకు ఆశ్రయభూతుడూ దుష్టచిత్తుడూ అయిన చేదిరాజున కిచ్చి వివాహముచేయదలచినాడు.

4. ఆ నిర్ణయము, నీ పట్ల అనురాగవతి అయిఉన్న రుక్మిణీకన్యకు, అశనిపాతమువలె తోచినది. తన అభీప్సితమునకు విఘాతము సంభవించుటను ఆమె సహింపలేకపోయినది. ఆ వెంటనే, తన హృదయమును నీకు నివేదించుకొను నిమిత్తము, ఒక విప్రకుమారుని నీ వద్దకు పంపినది.

5. అతడు, దుష్టచిత్తులకు ప్రవేశార్హతలేని ద్వారకా నగరమును, వాయువేగమున చేరుకొనినాడు. భవతాప హరుడవైన(1) నీవు ఆదర పూర్వకముగ సమర్పించుకొనిన ఆతిధ్యమును స్వీకరించినాడు; సంతోషించినాడు.

6. అప్పుడు అతడు నిన్ను ఉద్దేశించి, 'కృష్ణా ! నేను కుండిన పురాధీశ్వరుని కుమార్తెయు, కన్యారత్నమును అయిన రుక్మిణి పంపున

వచ్చినాను. ఆమె మనసు మొదటినుండియు నీయందే లగ్నమై యున్నది. ప్రకృత మామె వివశురాలై యున్నది.

7. 'నీ మధుర గుణములు, ఇంతకు పూర్వమే, నా మనసును ఆహరించుకొనినవి. ఇపు డా చేదిరాజు, నా శరీరమును బంధింప దలచు చున్నాడు. దయామయా! అందరకును దిక్కైన నీవే, నాకును దిక్కు కావలెనని కోరుచున్నాను' అనునవి ఆమె పలుకులు. వాటినే, జగత్ప్రభుడ వైన నీకు, నేను నివేదించుకొనుచున్నాను.

8. 'ప్రాణవల్లభుడవైన నీవే ఉపేక్షించినచో, ఈ ప్రాణములిక యెవరికిని దక్కవు' అనికూడ, ఆ వివేకవతి, నీకు మనవి చేసికొను మని నది అని, ఆ భద్రమూర్తి పలికినంతనే, నీవు చలించిపోయినావు.

9. ఆ పైన, నీవు, 'ఆమె వేదన నాకు అవగతమైనది. నేనును ఆమె కొఱకు వేదన పడుచున్నాను. రాజులందరి సమక్షముననను, నే నామెను నాదానిని చేసుకొనబోవుచున్నాను' అని, ఆ సుహృదునకు తెలియ పరచినావు.

10. ఆ పలుకులు అతనికి అమితానందము నొడగూర్చినవి. ఆ వెంటనే, నీవు, అతనితోసహ రథము నధిరోహించి, అనతికాలముననే కుండినపురమును చేరుకొనినావు.

గురువాయుపురాధిపా! కృష్ణా! కుండినపురమున దండి మగలను చెండనున్న నీవు, నా 'గుండె'బాధను మఱచిపోకుము నాయనా!

అర్థము - వివరణ

(1) భవతాపహరుడు : మరల మరల పుట్టుచుండుట, పెరుగుచుండుట, బాధల ననుభవించుచుండుట, మరణించుచుండుట అను బాధలు లేకుండ చేయువాడు.

79. రుక్మిణీ కల్యాణం

1. బలునితోను, బలముతోను, తన నగరు చేరుకొనిన నీకు, భీష్మక మహారాజు, ఉచిత మర్యాదలు జరిపినాడు. అచటి అంతిపురమున, నీ శుభాగమన వార్తను వినిపించుచున్న విప్రునకు, ఆయన కుమార్తె అయిన రుక్మిణి, అమితానందమున, అనుకొనకుండగనే ఐదుపది చేసినది.(1)

2. భువనమోహనమైన నీ మూర్తిని స్మరించుకొనుచు, త్రిభువన సుందరి అయిన తమ రాకుమారి భవితవ్యమును భావించుకొనుచు, కుండిన పురవాసులు ఆ రేయినంతను ఎటులనో వేగించుకొనినారు; విలపించినారు.

3. ఆ మఱునాడు, ప్రాతఃకాలముననే, తన జీవితమును నీకే అంకితము చేసికొనిన భీష్మకరాజనందన, మంగళాభరణములను ధరించి, గౌరీ పూజ కొఱకు, అంగరక్షకుల సహాయముతో, నగరు వెడలివచ్చినది.

4. అనంతరము ఆమె, కొందరు పుణ్యాంగనలతో, ఆలయమున ప్రవేశించి, సభక్తికముగ శర్వాణి నర్చించినది. ఆమెకు పంచాంగ ప్రణామ(2) మాచరించినది. నిన్నే విభునిగాకోరి, ఆమెను పదేపదే ప్రార్థించి కొనినది.

5. ఆమెను దర్శించుకొను నిమిత్తము, రాజన్యు లెల్లరును ఆత్రముతో ముందుకు త్రోసుకువచ్చినారు. కాని, నీవు మాత్రము, నిశ్చలుడవై ఒక ప్రక్క నిలబడి ఉన్నావు. ఆ సమయమున, చూపరుల కన్నులు మిఱుమిట్లుగొలుపు చక్కదనముతో, ఆ పెండ్లికూతురు, గిరిజాలయమునుండి బయటకు వచ్చినది.

6. భువనమోహనమైన ఆమె వైభవమును గమనించి, రాజలోకమంతయు వివశమై పోయినది. ఆమె కటాక్ష వీక్షణములను గ్రహించిన నీవును, కొలదిగ చలించినావు ప్రభూ !

7. అనంతరము, నీ వామెను సమీపించి, 'మన రథము యిటున్నది' అని, ఆమెకుమాత్రమే వినబడునట్లు, మృదుమధురముగ పలికినావు. ఆ వెంటనే, కరగ్రహణ మొనర్చి, ఆమెను రథమున నెక్కించుకుని, అటనుండి బయలుదేరినావు. అది గ్రహించిన రాజలోకమునందు, అమితమైన కోలాహలము చెలరేగినది.

8. అప్పుడు, నీ వెక్కడ నున్నదియు వారు గమనించలేదు. వారు, నీ కొఱకు, నలుదిక్కుల చూచుచు, యుద్ధ సన్నద్ధులగు లోపలనే, నీవారు, వారిని చెల్లాచెదరు చేసినారు. సింహము గ్రామసింహములను వలె, నీవు, వారిని లక్ష్యము చేయకుండుటలో ఆశ్చర్య మేమున్నది ప్రభూ !

9. అప్పుడు జరిగిన సంకుల సమరమున, నీవు, ని న్నెదిర్చిన రుక్మిని పట్టుకుని, కట్టివేసినావు. అతనిని వధించుట కుద్యుక్తుడవైనావు. కాని, బలరాముని సూచనమీద, అతనిని విరూపినిచేసి, అతని గర్వమును మాత్రము హరించి విడిచిపుచ్చినావు. ఆ పైన, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మియే అయిన నీ ప్రియురాలితో, ద్వారకా నగరమునకు పయనము సాగించినావు.

10. అనంతరము, ప్రథమ సమాగమమువలన కలిగిన లజ్జతోను, ప్రణయ సల్లాపముల మూలమున అతిశయించిన కౌతుకముతోను చిర్నగవులు చిందుచున్న ఆ రమామణిని, నీ అంతిపురమున చేర్చుకుని, ఆమెతో, యేకాంతమున యథేచ్ఛగ క్రీడించినావు; ఆమెకు పరమానందము నొదగూర్చినావు.

11. వివిధ నర్మాలాపములతో, ఆమె నా పైన, అహర్నిశలు అలరించుచువచ్చిన నీవు, ఒకసారి, కపటమెరుగని ఆ కాంతాలలామను, వక్రోక్తులతో, అమితముగ కలవరపరచుటకూడ జరిగినది.

12. కృష్ణా ! నీవు లీలామానుష విగ్రహుండవు. అబలల నలరించుటలో నీది అందెవేసిన చేయి. అట్టి నీవు, ఆ లీలావతిని, క్షణక్షణ ప్రవృద్ధమానమగు శృంగార క్రీడలతో ఉల్లాసపరచుచుండుట నీ పట్ల సహజమే

కదా ! అది కారణముగనే, మేము, మంగళప్రదమైన నీ లీలలను ప్రశంసించు కొనుచుందుము; పరమానందము నందుచుందుము.

ముక్తిప్రదాతా ! ఆ కామదాసుల 'రోగము' కుదిర్చిన నీకు, ఈ ప్రేమదాసుల(3) రోగము కుదుర్చుట భారమగునా తండ్రీ !

అర్థము - వివరణ

(1) ఐదు పది చేసినది : చేతులు జోడించి నమస్కరించినది.

(2) పంచాంగ ప్రణామము : శిరస్సు మోచేతులు మోకాళ్ళు భూమికి తగులునట్లు చేయు నమస్కారము. స్త్రీలకు యిదే ఉచితమైనది.

(3) ప్రేమదాసులు : భక్తులు.

80. స్యమంతకోదంతం

1. సూర్యభగవానుడు సత్రాజితునకు ప్రసాదించిన స్యమంతకమను దివ్యమణిని, పేరాసగలవానివలె, నీవు, ఒకసారి కోరినావు. ఆ విధముగ నీవు కోరుటకు అనేక కారణము లుండిఉండును. వానిలో ప్రధానమైనది, ఆ మణి కారణముగ, నిన్ను ప్రేమించిన అతని కుమారీమణిని పొంద దల చుట అయిఉండునని నేను భావించుచున్నాను.

2. ఏమైనను, సత్రాజితుడు మాత్రము, ఆ దివ్యమణిని నీ కీయ నిరాకరించినాడు. అనంతర కాలమున, అతని సోదరుడు, ప్రసేనుడను వాడు, దానిని ధరించి, మృగయావినోదార్థము వనమున కేగుట సంభ వించినది. అక్కడ, ఒక సింహము, ఆ మణిని, మాంసము ముద్దగ భావించి, అతనిని సంహరించినది. అది చూసిన జాంబవంతుడు, ఆ సింహమును చంపి, మణిని అపహరించుకుపోయి, తన పసిపాపకు ఆట వస్తువుగ యిచ్చినాడు.

3. ఆ మణిమీది మోహముతో నీవే దానిని అపహరించి యుందు వని సత్రాజితుడు అభిప్రాయపడినాడు. అది, ఆ నోట ఆ నోట ప్రాకి పోవుటవలన, ప్రజలు నీకు దొంగతనము నంటగట్టినారు. ధర్మమూర్తులలోని దోష శకలమునుకూడ, పామఋలు అమృతమునువలె స్వీకరింతురు కదా!

ఆ పరిస్థితిని అర్థము చేసుకొనిన నీవు, ఆ వెంటనే, నీ వారితో బయలుదేరి, ఆ మణిని వెదుక నారంభించినావు. అనతికాలముననే, నీకు, చనిపోయిన ప్రసేనుడును, వనరాజును, కనిపించినారు. ఆ పైన, నీవు, అడుగుజాడలు పట్టిపోయి, జాంబవంతుని గుహలో ప్రవేశించినావు.

4. అక్కడ, చిరకాలజీవియు, భక్తశిరోమణియు అయిన జాంబ వంతుడు, నిన్ను గుర్తింపలేక, 'ముకుంద పాదాశ్రితుడనైన నాతో పోరుటకు

వచ్చిన వీ డెవడు ?' అని, గర్జించుచు, తన స్వామి అయిన శ్రీరామ చంద్రుని స్మరించుకొనుచు, ఆయన దివ్యనామమునే జపించుకొనుచు, ఆయనకు జయము పలుకుచు, తనివితీర, నీకు, 'పిడిగ్రుద్దులపూజ' చేయుటకుపక్రమించినాడు.

5. ఆ పైన, అతని బల ముడిగిపోవుటకు, అతడు నిన్ను గుర్తించుటకు, ఇరువది యెనిమిది దినములు పట్టినది. అప్పు డతడు, అమితముగ పశ్చాత్తాపపడి, పాపపరిహారార్థము, తన కుమారికా రత్నమైన జాంబవతినీ, రత్నశ్రేష్ఠమైన స్యమంతకమునూ నీకు సమర్పించుకొనినాడు. అటుపిమ్మట, నీ వతని ననుగ్రహించి, ద్వారకానగరమునకు తిరిగివచ్చి, ఆ స్యమంతకమును సత్రాజితునకు ఒప్పగించినావు.

6. ఆ విధముగ స్యమంతకమును తిరిగి పొందిన సత్రాజితుడు, అంతకుముందు నిన్ను అనరానిమాట లనినందులకు అమితముగ లజ్జించినాడు; పశ్చాత్తాపపడినాడు. ఆ వెంటనే, పూర్వము, శతధన్వునకు వాగ్దానము చేయబడిన తన కుమారీమణిని, సత్యభామను, మణిశ్రేష్ఠమైన స్యమంతకముతోసహ నీకు, సమర్పించుకొనినాడు. అప్పుడు, దూరదర్శివైన నీవు, ఆ మణి మూలమున పొందదలచినది పొందినందులకు సంతుష్టినంది, ఆ మణిని అతనివద్దనే ఉంచినావు.

7. అనంతరము, నీవు, సత్యభామతో సంతోషముగ కాలము పుచ్చుచున్న సమయమున, కుంతీకుమారులు లాక్షాగృహమున దహింపబడియుందురను వార్త నీ చెవులబడినది. ఆ వెంటనే, నీవు, హస్తినాపురమునకు పయనమై పోయినావు.

ఆ సమయమున, అక్రూర కృతవర్మల ప్రోత్సాహము కారణముగ, శతధన్వుడు, సత్రాజితుని సంహరించి, స్యమంతకము నపహరించుట జరిగినది.

8. సత్రాజితుని దుర్మరణ వార్తను సత్యభామద్వారా వినిన నీవు, ఆ వెంటనే, శతధన్వుని సంహరించినావు. ఆమె తాపమును కొలదిగ ఉపశ

మింపజేసినావు. ఆ మణి విషయమున నిన్ను శంకించిన బలరాముడు, ఆ పైన, మిథిలానగరమున ప్రవేశించినాడు. ఆయన అచట ఉన్నప్పుడే, దుర్యోధనుడు, ఆయనవద్ద గదాయుద్ధ కౌశలమును గడించుకొనుట సంభవించినది.

9. నీ ప్రేరణవలననే, దుశ్చరితుడైన సత్రాజితుని సంహరించుటకు అక్రూరుడు కారకుడైనాడనియు, అతనిని సర్వైశ్వర్య సంపన్నుని చేయుటకుగాను నీ వా మణిని అతనికి యిచ్చినావనియుకూడ, ప్రపంచమున నొక వాదు కలదు.

10. అక్రూరునివంటి భక్తుడు, సత్రాజితుని హత్యకు కారకుడగుట, పతనము పొందుటయేకదా ప్రభూ ! ఔను. అతనిలో, 'నేను జ్ఞానిని, ప్రసన్నహృదయుడను' అను సాత్వికాహంకారము ఉదయించినది కావలె. దానిని నిర్మూలించుటకే నీ వట్లు చేసియుందువు.

11. నీకు భయపడి, కృతవర్మతోపాటు ఊరు విడిచిపోయిన అతనిని వెనుకకు రప్పించుకుని, శతధన్వ దతనివద్ద దాచిఉంచిన మణిని నీ వారి కెల్లరకును చూపి, నీవు సంతుష్టినందినావు.

ఆ సమయమున, అక్రూరుడు, అఖండ క్రతువులను, స్వర్ణవేదికల మీద నిర్వహించుచుండువాడు. అది గ్రహించిన నీవు, ఆ దివ్యమణి అతని వద్ద ఉండుటయే ఉచితమని భావించి, దానిని, అతనికే దత్తము చేసినావు.

సత్యభామాప్రియా ! నీ భృత్యుని నిత్యప్రార్థనను మన్నింపుము నాయనా !

81. సుభద్రా పరిణయాదికం

1. భామాలలామ అయిన సత్యభామను, సరససల్లాపములతో లాలించుచు కొంతకాలము గడిపినపిమ్మట, ఆమెతోసహా, నీవు, పాంచాలీ పరిణయమున కేగినావు. ఆ పైన, పాండుపుత్రుల ప్రార్థనమీద, హస్తినా పురమున కొన్నిదినములుండి, వారికొఱకు ఇంద్రప్రస్థమును నిర్మింపజేసి, తిరిగి, ద్వారావతికి విజయముచేసినావు.

2. అనంతరము, దుర్యోధనుడు కోరిన నీ సోదరిని, భద్రమూర్తి అయిన సుభద్రను, యతి రూపమున వచ్చిన అర్జునుడు, నీ అనుమతి మీదనే అపహరించుకుపోవుట జరిగినది. అది గ్రహించి క్రుద్ధుడైన బల భద్రుని అనునయించి, అతనితోను, సత్యభామతోను, ఇంద్రప్రస్థమునకు పోయినావు; నీ ప్రాణమిత్రుడైన అర్జునునకు ఆహ్లాదము నొడగూర్చినావు.

3. ఒకపరి, నీవు, యమునాతటమున విహరించుచున్నపుడు కనిపించిన సూర్యపుత్రిని, కాళిందిని, ధర్మపత్నిగా స్వీకరించి, ఖాండవవనమును దహించుటలో అగ్నిదేవునకు సాయపడి, అతనిని సంతృప్తి పరచి, నగరు చేరుకొనినావు.

ఆ పైన, అవంతి రాజపుత్రియు, నీ మేనత్తకుమార్తెయు, నీ మీదనే మనసు నిలుపుకుని, తన సోదరులకు భయపడి బ్రతుకుచున్నదియు అయిన మిత్రవిందను, స్వయంవర మంటపమునుండి అపహరించుకుపోయినావు.

4. అనంతరము, అయోధ్యకుపోయి, ఏడు రూపములలో, యేడు ప్రసిద్ధవృషభములను యేకకాలమున బంధించి, నగ్నజిత్తుని కుమార్తె అయిన సత్యను (నాగ్నజితిని) పరిణయమాడినావు. ఆ పైన, నీ మేన బావలు, సంతర్దనాదులు, తమ సోదరి అయిన భద్రను, వరప్రదాతవయిన నీ కిచ్చి వివాహము చేసినారు.

5. అర్జునునకుకూడ అంతుపట్టని అస్త్రవిద్యాకౌశలమును ప్రదర్శించి, ఎక్కడో గుప్తముగ అమర్చబడిన మత్స్యమును, దాని నీడనుబట్టి పడగొట్టి మద్రరాజ పుత్రిక అయిన లక్ష్మణను స్వయంవరమున గెలుచుకొనినావు.

ఆ విధముగ, నీకు, అష్టపత్నులేర్పడినారు. ఆ కాలముననే, నీకు, ఇంద్రుని ద్వారా, నరకాసురుని దుష్కృత్యములు తెలియవచ్చినవి.

6. ఆ వెంటనే, నీవు, సంకల్పమాత్రమున నీ సమక్షమునకు విచ్చేసిన గరుడుని అధిరోహించి, అక్కడనే ఉన్న విహారవనమునకు వలె విరోధివీటికి, సత్యభామాసహితుడవై బయలుదేరినావు. ఆ పైన, అచటి కోటల నన్నిటిని కూలగొట్టి, నక్తంచర సీమను రక్తసీమగ మార్చివేసినావు.

7. నరకాసురుని దుర్గరక్షకుడైన మురాసురుడు పంచశిరుడు. అంతవరకును కందకమున దాగొని ఉన్న అతడు, ఒక్కసారిగ నీ మీదకు ఉఱికినాడు; తక్షణమే, నీ చక్రమునకు బలి అయిపోయినాడు.

ఆ పైన, దంత చతుష్టయముకల దంతావళములతో నిన్ను నిర్భీతిగ ప్రతిఘటించుచున్న నరకాసురునికూడ, నీవు, అదే విధముగ నఱికివేసినావు; అతనికి, నరకయాతన లేకుండ చేసినావు.

8. అనంతరము, భూదేవి ప్రార్థనమీద, నరకుని కుమారుడైన భగదత్తునకు పట్టముగట్టి, పట్టపుటేనుగు నిచ్చినావు. అటుపైన, శ్రీహరివైన నీకై తపించుచు, నరకుని చెఱయందున్న పదహారువేలమంది మత్తేభ గమన లనూ, మిగిలిన మత్తేభములనూ, విపుల ధనరాసులనూ ద్వారావతికి చేర్పించినావు.

9. పూర్వము, నరకాసురుడు అపహరించుకుపోయిన కుండలము లను తిరిగి అదితికి యిచ్చుటకుగాను, ఆ పైన, నీవు, నీ ప్రియురాలితోసహా, దేవలోకమునకు పోయినావు. అపు డచటి అప్సరలు, సత్యభామ సౌందర్యమును చూసి, తలలు వంచుకొనినారు.

ఆ సమయమున, ఇంద్రాదులు, నీకు నీరాజనము పట్టినారు. కాని, సత్యభామ కోరికమీద, నీ వచటి కల్పవృక్షమును పెకలింపనుండగా, ఆ ఇంద్రుడే నిన్ను ప్రతిఘటించినాడు; నీచే పరాభూతుడైనాడు.

యథార్థమునకు, కల్పవృక్షము నీకెందుకు ప్రభూ ! 'శ్రీమదాంధులకు శ్రీపతికూడ కనిపించడ'ని లోకమునకు చాటుటకే నీ వట్లు చేసియుందువు.

10. అనంతరము, నీవు, సత్యభామా నివాసమున, కల్పవృక్షమును నాటినావు. పదారువేలమంది సుందరీమణులను పరిణయ మాడినావు. ఆ పదారువేలమందితోను, పదారువేల గృహములందును, పదారువేల రూపములతో, యేకకాలమున, భిన్నభిన్న విలాస వైఖరులలో క్రీడింపసాగినావు. కాలక్రమమున, ప్రతి ఒక్క పడతికిని, పదిమంది సుతులను ప్రసాదించినావు. ఆ సమయమున, నీ దైన మహద్విభూతిని కనులార గాంచిన నారదుడే ఆశ్చర్యచకితుడైనాడు.

గురువాయుపురీవిహారా ! కృష్ణా ! నరకుని బారినుండి ఆ తరుణీమణులను రక్షించినటులనే, నరకయాతనలనుండి, నన్నును రక్షింపుము నాయనా !

82. నృగశాప మోక్షణం

1. రుక్మిణీదేవికి నీ అంశతో జనించిన ప్రద్యుమ్నుని, శంబరుడు అపహరించుకుపోయినాడు. కాని, ప్రద్యుమ్నుడు, అతనిని సంహరించి, మాయావతిగా పుట్టిన రతీదేవితోసహ, ద్వారావతికి తిరిగి వచ్చినాడు. అనంతరము, అతడు, రుక్మి కుమార్తెఅయిన రుక్మవతిని, గాంధర్వ పద్ధతిలో వివాహము చేసుకొనుట జరిగినది.

ప్రద్యుమ్నుని కుమారుడు అనిరుద్ధుడు. అతడు సర్వ సద్గుణ సంపన్నుడు. రుక్మి మనుమరాలైన రోచన, అతనికి భార్య అయినది.

ఆ రోచనానిరుద్ధుల వివాహమునకు నీవును వెళ్ళినావు. ఆ సమయమున పాచికలాడుకొనుచున్నపుడు తలచూపిన కలహము కారణముగ, బలరాముడు, రుక్మిని సంహరించినాడు.

2. బలిపుత్రుడైన బాణుడు, సహస్రబాహుడు; శివభక్తుడు. అతని కుమార్తె అయిన ఉష, మహిమాన్వితురాలు. ఆమె, నీ మనుమడైన అనిరుద్ధుని, తొలిసారిగ, కలలో చూసినది. అతనిపైన మరులుగొన్నది. ఆ మీద, అతని వియోగమునకు పరితపింపసాగినది.

3. అది గ్రహించిన ఆమె స్నేహితురాలు, చిత్రలేఖ, యోగశక్తి గలది; విచిత్రకర్మ లాచరించుటలో నైపుణ్యముకలది. ఆమె, తన యోగ బలముద్వారా, రాజకుమారు లందరి పటములను గీసి, ఉషాకుమారికి చూపినది. వాటిని పరిశీలించిన ఉషాకుమారి, అనిరుద్ధుని పోల్చుకొనినది. ఆ పైన, చిత్రలేఖ, తన యోగశక్తిద్వారా, ఆ రాత్రికి రాత్రి, అనిరుద్ధుని, ద్వారావతినుండి శోణపురాంతఃపురమునకు చేర్చినది.

4. ఆ విధముగ అంతిపురము చేరి, ఆనందముననున్న అనిరుద్ధుని, బాణు, డొకనాడు చూసినాడు. చూసి, అతి కష్టముమీద, అతనిని బంధించినాడు.

నారదునిద్వారా ఆ విషయమును గ్రహించిన యాదవవీరులు, క్రోధావిష్టులైనారు. ఆ వెంటనే, నీవు, వారితో కలిసిపోయి, శోణపురమును ముట్టడించినావు.

5. శోణపుర సంరక్షకుడైన గిరిజాపతి, అప్పుడు, తన భూతగణముతో, యాదవ సైన్యమును ప్రతిఘటించినాడు. ఆ పైన, సహస్రబాహుడైన బాణుడు సాత్యకితోను, దేవసేనాపతి అయిన కుమారస్వామి ప్రద్యుమ్ననితోను తలపడినారు. నీవు, త్రిపురాంతకునితో యుద్ధము చేయసాగినావు.

6. ఆ సమయమున, శంకరుడు ప్రయోగించిన అస్త్రములన్నిటిని నీవు నిరోధించుటయు, నీ అస్త్రముల తాకిడికి అతడు మూర్ఛితుడగుటయు జరిగినది. అది చూసిన భూతగణమంతయు, భీతిలి పారిపోయినారు. ప్రమథగణనాయకులందరును నిర్మూలింపబడినారు. ప్రద్యుమ్నని బాణపాతమునకు వెఱచి, స్కందుడు తిరోగమించినాడు. బాణుని అమాత్యుడైన కుంభాండకుడు పచ్చికుండవలె కూలిపోయినాడు.

7. అనంతరము, బాణుడు, యేక కాలమున ఐదువందల ధనుస్సులు ధరించి, రౌద్రమూర్తియై నీ మీదకు వచ్చినాడు. కాని, అవన్నియు భంగమైపోవుటవలన, నిరాశతో వెనుదిరిగిపోయినాడు.

ఆ పైన, శైవజ్వరము నిన్నెదుర్కొనినది; కాని, వైష్ణవ జ్వరము ముందు నిలువలేక, 'దాసోహ' మనినది. నిన్ను స్మరించుకొనుచుండువారిని కన్నెత్తికూడ చూడరాదని, చెంపలువేసుకొనినది.

యథార్థమునకు రుద్రానుచరులు అజ్ఞానులు కారు. అయినను, తమోగుణప్రధానులగుటవలన, అప్పుడప్పుడు క్రూరకర్మాచరణులగుచుందురు.

8. అప్పటికికూడ, బాణునకు బుద్ధిరాలేదు. అతడు, మరికొన్ని మారణాయుధములను ధరించి, మరల నిన్నెదిరించినాడు. ఆ దోషమంతయు అతనిదికాదు ప్రభూ ! కళ్లుగప్పిన అహంకారము అతని నట్లాడించినది.

బాణుడు, ప్రాణములకు తెగించి బాణ ప్రయోగము చేయుచున్నాడని గ్రహించిన శంకరుడు, ఆ వెంటనే, తన ఆశ్రితుని పక్షమున, నిన్నాశ్రయించినాడు.

అప్పటికే, బాణుని గర్వ మంతయు హరించిపోయినది. అతడు, నీ ముందు, తలవంచి నిలబడినాడు. అది గ్రహించిన నీవు, అతనికి అభయ మొసగి, ఉషానిరుద్ధులను తీసుకుని, ద్వారకాపురమును చేరుకొనినావు.

9. కృష్ణా ! యాగమును భంగపరచి, ఖాండవమును దహింపజేసి, కల్పవృక్షమును స్వాధీనపరచుకుని, అటులనే అనేక పర్యాయములు మహేంద్రుని తలక్రిందొనరించినావు. అదే విధముగ, నందుని విషయమున వరుణునీ, గురుపుత్రుని విషయమున యమునీ, దవాగ్ని విషయమున అగ్నిదేవునీ, గోవత్సల విషయమున చతుర్ముఖునీ, చివర కిపుడు, బాణాసురుని విషయమున శంకరుని కూడ పరాజితుల నొనర్చినావు. నీ యీ అవతారము సర్వోత్కృష్టమైనది నాయనా !

10. ఒక బ్రాహ్మణుని ఆగ్రహము కారణముగ ఊసరవెల్లి అయిన నృగమహారాజునకు శాపవిముక్తి కలిగించి, ఆయనను, దేవలోకమునకు పంపినావు. గురుజనులపట్ల జరిగిన అపచారము ఉరుభీకరపరిణామములకు దారితీయుననునదేకదా అందలి గుణపాఠము ప్రభూ !

గురువాయుపురీశా ! కృష్ణా ! నే నట్టి అపచారమునకు పాల్పడకుండ చూడుము నాయనా !

83. లక్షణా స్వయంవరం

1. బలరాము డొకసారి గోకులమునకు పోయి, మధుపానమత్తుడై వ్యవహరించుచు, తాను సలుపదలచిన జలక్రీడల కనువుగ యమునా ప్రవాహసరళిని మార్చి, గోపికలతో యథేచ్ఛావిహార మొనర్చుచున్న సమయమున, తన అనుచరుల పొగడ్తలకు లొంగిపోయిన పౌండ్రక వాసుదేవుడు, మూఢుడై, నీ వద్దకు, ఒక వార్తాహరుని పంపినాడు.

2. 'నేను భువి నవతరించిన శ్రీమన్నారాయణుడను. నీవు నా వైన దివ్యచిహ్నములను ధరించి చరించుచున్నటులు తెలియవచ్చినది. ఇకనైనను నీవు వాటిని త్యజించి, న న్నాశ్రయింపవలసినది' అని, అతడు పంపిన సందేశమును, ఆ దూత, నిండుసభలో నీకు వినిపించినాడు. ఆ పలుకుల నాలకించిన సభికులు, అతని నమితముగ గేలిచేసినారు.

3. ఆ దూత నిష్క్రమించిన పిమ్మట, నీవు, యాదవవీరులతో, పౌండ్రకుని మీదకు దండెత్తిపోయినావు. అక్కడ, శ్రీవత్సమువంటి తప్త ముద్రతోను, కౌస్తుభమువలె కనిపించు ఒక మణితోను, మకరకుండలముల బోలు కర్ణాభరణములతోను, పీతాంబరముతోను ఉన్న అతనిని చూసినావు.

4. కృష్ణాయసముతో (ఇనుముతో) తయారుచేయబడిన ఒక చక్రమును, అతడు నీ మీదకు విసరుచుండగనే, నీవు, కాలాగ్నితుల్యమైన నీ సుదర్శనమును అతనిమీదకు వదలి, అతని శిరమును ఖండించినావు. అతని సైన్యమును నిర్మూలించినావు. అతని మిత్రుడైన కాశీరాజు తలను కూడ నఱికి, అది, పోయి, వారణాసిలో పడునట్లు చేసినావు.

5. సహజముగ మందమతి అయినను, పౌండ్రకుడు, వంది మాగధుల పొగడ్తలను విశ్వసించి, 'నేను వాసుదేవుడనే' అను దృఢాభిప్రాయమున, నీతో తాదాత్మ్యమునంది జీవించిన కారణమున, అతనికి

సాయుజ్యము లభించినది. ఎవరి గీతలో యేమి ఉన్నదో యెవరు చెప్ప గలరు ప్రభూ !

6. తన తండ్రిని సంహరించిన నీ మీద పగ సాధించుకొను నిమిత్తము, కాశీరాజు కుమారుడైన సుదక్షిణుడు, శివుని ప్రసన్నుని చేసుకుని అతని సూచనమీద, ఒక అభిచారహోమము(1) నొనర్చినాడు. అందుండి, భయంకరమైన కృత్య ఒకటి బాహిరిల్లి, బాణునితో నీవు పోరాడినపుడు నీకు భయపడి పారిపోయిన భూతగణము నంతను తిరిగి సమకూర్చుకుని, నిప్పులు గ్రక్కుచు నీ మీదకు వచ్చినది.

7. ఆ కృత్య పాదములే తాళప్రమాణమున నున్నవి. అది, తన కనుచూపుమేరలోఉన్న ప్రాణిజాలము నంతను కబళింపజొచ్చినది. ప్రజలను భీతావహుల నొనర్పసాగినది. అది గ్రహించిన నీవారు, ఆ విషయము నంతను నీకు నివేదించుకొనినారు.

ఆ సమయమున, నీవు, పాచికలాడుచున్నావు. వారి మొఱాలించి కూడ, నీవు, వారివంక, అప్పుడు, కన్నెత్తి అయినను చూడలేదు. కాని, నీ కనుసన్నలలో మెలగుచుండు, కాలానలసదృశమైన సుదర్శనము మాత్రము, తక్షణమే, నీ వద్ద సెలవుతీసుకుని, యెగిరిపోయినది.

8. కోటి సూర్యుల తేజముతో తన మీదకు ఉరికివచ్చుచున్న చక్రమును చూసి, ఆ భీకర కృత్య, హాహాకారమొనర్చుచు వెనుదిరిగిపోయి, అదక్షిణకర్ముడైన (దుర్మార్గ ప్రవర్తనగల) సుదక్షిణుని హతమార్చినది. ఆ పైన, నీ సుదర్శనము, వారణాసిని గాసిలజేసినది.

9. పూర్వము, శ్రీరామచంద్రుడుగా, నీవు రాక్షస సంహార మొనర్చినపుడు నిన్ను సేవించిన ద్వివిదునకు, నీ అంశావతారమైన బలరాముని చేతులో మరణింపవలెనను ఆకాంక్ష కలిగినది. అది కారణముగనే, అతడు, ద్వాపర యుగమున నరకుని సచివుడై, ద్వారకా నగర పరిసరముల నల్లకల్లోల మొనర్చి, బలరామునితో పోరి, అతని ముష్టి ఘాతమునకు బలియైపోయినాడు.

10. దుర్యోధనాదులతో సంప్రదింపులు జరుపునిమిత్తము హస్తినాపురము చేరిన బలరాముడు, కౌరవుల మాటలకు కోపగించుకుని, ఆ నగరమును, సమూలముగ కంపింపచేసినాడు; దుర్యోధనుని కుమార్తె అయిన లక్షణను అపహరించుటకు ప్రయత్నించి, పట్టుబడి, అచట బంధితుడై ఉన్న సాంబుని విడిపించినాడు.

కౌరవ వంశ నిర్మూలనము, పాండవుల ద్వారా జరుగవలసిఉండుట నూహించి కాబోలును, నీ, వా, సమయమున యాదవసేనను బలరామునితో పంపలేదు.

గురువాయుపురాధిపా ! కృష్ణా ! నీ లీలలు అనూహ్యములు నాయనా ! అది కారణముగనే, నా బాధానివృత్తికికూడ, నేను, నిన్నే ఆశ్రయించినాను తండ్రీ !

అర్థము - వివరణ

(1) అభిచార హోమము : శత్రువులను హింసించు నిమిత్తము, దుష్ట శక్తులను వశీకరించుకొను ఉద్దేశముతో చేయు ఒక విధమైన కర్మ.

84. సూర్యగ్రహణయాత్ర

1. సూర్యగ్రహణ సమయమున, నొకసారి, నగర రక్షణ భార మును కృతవర్మకును అనిరుద్ధునకును ఒప్పగించి, యదువంశీయులతో, నీవు, సమంతపంచకమను తీర్థరాజమునకు వెళ్ళినావు.

2. అక్కడ, లోక సంగ్రహార్థము, నీవును ఆ తటాకములందు స్నానముచేసి, ఆ తీర్థరాజమున కొక విశిష్టతను కల్పించినావు. అనంత రము, విప్రోత్తములకు విరివిగ దాన ధర్మము లొనర్చి, ఆ దినమంతయు, కౌరవ పాండవులతో, అచటనే గడిపినావు.

3. ఆ సమయమున, నీ పట్ల అనన్య భక్తిగల పాంచాలి, నీ దేవేరు లతో, కలిసిమెలసి తిరిగినది. అపుడు, నీ దేవేరులు, వారి వారి పెండ్లి ముచ్చటలను, నీవు యెవరిని యే విధముగ నీ అంతిపురిని చేర్చుకొంటివో ఆ విషయములను, అన్నిటిని, స్వయముగ ఆమెకు వివరించినారు. ఆమె, అతి కుతూహలముతో, ఆ యా గాథలను విని, అమితముగ ఆనందించినది.

4. ఆనాటి గ్రహణ స్నానమునకు, గోపాలురుకూడ అచటికి వచ్చి నారు. వా రందరిని, నీవు, యథోచితముగ గౌరవించినావు.

అటుపిమ్మట, నీ వియోగమున చిక్కి సగమైపోయిన గోపికలను చూసి, జాలిపడి, వారిలో ప్రతి ఒక్కరిని, పేరుపేరున పలుకరించి, పరా మర్శించి, చీకటిపడువరకు వారితోనే ఉండిపోయినావు.

5. నీవు, వారిని దగ్గరకు తీసుకొనినంతనే, అంతవరకును వారికి నీ మీదగల ప్రణయకోపము చల్లారిపోయినది. వారిలో, ఆనందము పెల్లుబికి నది. దానికి చిహ్నముగ, వారి కంచుకములు భిన్నమైనవి. మఱుక్షణమున, వారికి, నీ పరిష్వంగ సుఖము లభించినది.

6. అనంతరము, మృదుమధురమైన నీ సాంత్వన వచనము లాల కించుచు, ప్రణయ స్వరూపిణి అయిన రాధాదేవి, నీ కౌగిట కరగిపోయినది; నీ తోటి ఐక్యసుఖానుభూతి నందినది.

7. ఆ విధముగ, గోపికల విరహవేదనను తొలగించి, వా రందరిని ఒక రహస్య ప్రదేశమునకు తీసుకుపోయి, తత్త్వోపదేశము చేసినావు. నీవు సర్వాత్ముడవను భావమును, సచ్చిదానంద స్వరూపుడవను యథార్థ జ్ఞానమును, వారికి కలిగించినావు.

8. అంతకుముందు, ఉద్ధవునిద్వారా వారికి లభించిన జ్ఞానము, వారి వియోగ దుఃఖమును కొలదిగ తొలగించినది; వియోగముకూడ సుఖదాయకమైనదే అను భావమును వారికి కలిగించినది. కాని, యిప్పుడు, నీ స్మరణము, వారికి, చిదానంద రసానుభవ సదృశమైనది.

9. అనంతరము, నీ తండ్రిఅయిన వసుదేవుడు, అచట సమావేశమైన మునీశ్వరులను సందర్శించుకుని, 'పాప పరిహారముకొఱకు నేను యే యే సత్కర్మల నాచరింపవలెనో సెలవీయ వలసినది' అని ప్రార్థించినాడు. అతని పలుకులు విని, వారు ఆశ్చర్యపడినారు. నిన్ను పుత్రునిగా పొందినవానికి, వేరు పుణ్యకర్మలతో పనిలేదని స్పష్టీకరించినారు. అయినను, ఆయన మనశ్శాంతికొఱకు, ఆయనచేత, అచటనే ఒక మహా క్రతువును జరిపించినారు.

10. ఆ క్రతువు, మూడు మాసములు నడిచినది. నీ బంధుమిత్రులందరును అందు పాల్గొనినారు. యాదవ ప్రముఖుల ఆతిథ్యమును, వారితో పాటు స్వీకరించి, గోపకులు, ఆ సమయమున, నీ సాహచర్య భాగ్యమును, అమితానందముతో, యథాపూర్వకముగ అనుభవించినారు.

11. ఆ క్రతువు నిర్విఘ్నముగ సమాప్తమైనది. ఎవరి యిండ్లకు వారు వెళ్ళనున్నారు. ఆ సమయమున, నీవు, రాధాదేవిని దగ్గరకు తీసు

కుని, ప్రేమపూర్వకముగ ఆలింగన మొనర్చికొనినావు. అప్పుడు, ఆమెలో, విషాదచ్ఛాయలు లేశమాత్రముకూడ నీకు గోచరింపలేదు. అది గ్రహించిన నీవు, సంతుష్ట చిత్తముతో, ద్వారావతికి పయనమైనావు.

గురువాయుపురాధిపా ! కృష్ణా ! రాధాదేవిలోని విచారమునువలె, నా విచారమునుకూడ తొలగించి, నాకును, పరాభక్తిని ప్రసాదింపుము నాయనా !

85. రాజసూయం

1. మగధ దేశాధీశ్వరుడైన జరాసంధునిచే బంధింపబడి, చిరకాలముగ కారాగార క్లేశము లనుభవించుచున్న ఇరువదివేల యెనిమిదివందల మంది రాజన్యులును, ఒకసారి, దీనజనావనుడవైన నీ వద్దకు, ఒక దూతను పంపుకొనినారు. ఆ వివరములతో పనేమున్నది ప్రభూ! ధర్మగ్లానిని తొలగింపుమని మాత్రమే, ఆ దూత, ప్రధానముగ నిన్ను అభ్యర్థించినాడు.

2. ఆ వెంటనే, నీవు, జరాసంధునిమీదకు దండెత్తిపోదలచినావు. కాని, ఆ సమయముననకే, నారదమహర్షి వచ్చి, యుధిష్ఠిరుడు రాజసూయము తలపెట్టినాడని నీకు విన్నవించుకొనుట సంభవించినది. అప్పుడు, నీకు, సమరమునకు పోవుటయా, సవనమునకు పోవుటయా అను సందేహము కలిగినది. అది గ్రహించిన ఉద్ధవుడు, శత్రునిబర్హణానంతరమునగాని క్రతుప్రారంభము కాదనియు, (రాజాధి రాజులకు మాత్రమే రాజసూయ నిర్వహణాధికారము కలదనియు,) నీ కోరికలు రెండును యేకకాలముననే సిద్ధింపగలవనియు సూచించినమీదట, నీవు, నీ వారితో, ఇంద్రప్రస్థమునకు బయలుదేరినావు.

3. నీ దేవేరు లందరితోను, నీవు, తన నగరు చేరిన పిమ్మట, యుధిష్ఠిరుడు, నీ అనుగ్రహమున అజేయులైన తన సోదరులను నలుదిక్కులకు పంపి, దిగ్విజయము సాధించినాడు; అమేయ ధనరాసులను ఆర్జించుకొనినాడు. అనంతరము, భీమార్జునులతోసహా, భక్తజనసేవకుడవైన నిన్ను, జరాసంధునిమీదకు పంపినాడు.

4. ఆ పైన, మీరు ముగ్గురును, విప్రవేషములు ధరించి, గిరివ్రజమును చేరుకుని, మగధాధీశుడైన జరాసంధునినుండి యుద్ధభిక్ష నర్థించినారు. భూభారమును తొలగించు నిమిత్తము, రాజులకును రాజులకును మధ్య పోరు

కల్పించు నీవు, అతడు, నీ చేతులో మరణించు అదృష్టము లేనివాడగుట వలన, భీమసేనునితో పోరునట్లు చేసినావు; అర్జునునితోపాటు, అది తిలకించుచు నిలబడినావు.

5. భీమసేన జరాసంధులు, చాలసేపు, సమ ఉజ్జీలుగ పోరాడినారు. అది, జరాసంధునకు గర్వకారణమైనది నీ వది గ్రహించి, ఒక చెట్టు కొమ్మను రెండు పచ్చములుగ చీల్చి, జరాసంధుని సంహరించు మార్గమును భీమసేనునకు సూచించినావు. ఆ వెంటనే, భీమసేనుడు, జరాసంధుని, క్రింద పడత్రోసి, అతని రెండు కాళ్ళను రెండు చేతులతో పట్టుకుని, అతనిని నడిమికి చీల్చివేసినాడు.

ఆ పైన, అతనిచేత బంధింపబడిఉన్న రాజు లందరకును విముక్తి కలిగించి, వారికి దృఢతరమైన భక్తి కలుగునట్లుగ ఆశీర్వదించినావు. నీ ఆశీర్వచన ప్రభావమున, వారిలోని భోగేచ్ఛ నశించిపోయినది. కాని, ధర్మ రక్షణకొఱకు, వారు, రాజ్యపాలన మొనర్పవలెనని, నీవు, వారి నాదేశించినావు.

6. అనంతరము, యుధిష్ఠిరుని రాజసూయాధ్వరము ప్రారంభమైనది. ఆ సమయమున, అతని సామంతులు ప్రతి ఒక్కరును, యెవరికి నిర్దేశింపబడిన కార్యమును, వారు, అత్యుత్సాహమున నిర్వహింప జొచ్చినారు. జగత్ప్రభూ ! నీకు గుర్తున్నదో లేదోగాని, నీ వపుడు, కోరి, బ్రహ్మజ్ఞానుల పాదములు పట్టినావు సుమా ! యుధిష్ఠిరుని మహద్భాగ్యమును వివరించుటకు, అంతకు మించిన తార్కాణ మేముండును ?

7. యజ్ఞాంతమున, 'అగ్రపూజ కర్హులెవరు ?' అన్న ప్రశ్న వచ్చినది. అప్పుడు, సహదేవుని సూచనమీద, ధర్మజుడు, సర్వాత్ముడవైన నిన్ను, సభాస్తారు లందరి సమక్షమునను అర్చించినాడు. అది తిలకించిన మానవులును దేవతలును మహదానందము నందినారు.

8. కాని, చేదిరాజైన శిశుపాలుడు మాత్రము, దానిని సహింపలేక పోయినాడు. 'ఈ సభలో యిందరు మహర్షులుండగా, మహారాజు లుండగా,

యీ గొల్ల వానికి యింతటి గౌరవము చూపుటయా !' అని గర్జించుచు, నోటికివచ్చినట్లెల్ల దుర్భాషలాడినాడు. ఆయుధము తీసుకుని, ఆసనము నుండి లేచి, నీ మీదకు ఉరికినాడు. అది చూసిన పాండవులు, అతనిని ప్రతిఘటించినారు.

9. ఆ పైన, నీవు, వారిని వారించి, సర్వరాక్షస సంహార సమర్థ మైన నీ చక్రాయుధముతో, నిన్ను సమీపించుచున్న అతని శిరమును నఱికి వేసినావు. అయినను, మూడు జన్మలలో, అనవరతము నిన్నే స్మరించు కొనుచువచ్చిన కారణమున పవిత్రీభూతుడైన అతడు, ఆ వెంటనే, యోగు లకుకూడ దుర్లభమైన సాయుజ్యముక్తిని పొందినాడు.

10. నీ అధ్వర్యమున ఆ మహాధ్వరము యథావిధిగ ముగిసిన పిమ్మట, దానిని దర్శించుకొను వేడుకతో అచట సమావేశమైనవా రంద రును, నీకును యుధిష్ఠిరునకును జయము పలుకుచు, ఎవరి దారిన వారు వెళ్ళిపోయినారు. కాని, దుష్టబుద్ధి అయిన సుయోధనుడు మాత్రము, తన విరోధులగు పాండవుల వైభవమును తిలకించి అసూయ చెందినాడు. మన శ్శాంతిని కోల్పోయినాడు. అది కారణముగనే, అతడు, మయసభా ముఖ మున, స్థలమును జలముగను, జలమును స్థలముగను భ్రమించి చరించుట జరిగినది.

11. అది గ్రహించిన పాంచాలియు భీమసేనుడును పగలబడి నవ్వి నారు. అవహేళన పూర్వకమైన వారి నవ్వును, నీ అపాంగ వీక్షణములు మరింత అధికము చేసినవి. భూభారమును తొలగించు నిమిత్తము నీవు సంకల్పించిన మహాభారత సంగ్రామమునకు, నీవు, ఆ క్షణముననే అంకు రార్పణ చేసినావు ప్రభూ !

కృష్ణా ! భూభారమునే తొలగింపబూనిన నీకు, నా హృదయ భార మును తొలగించుట యేపాటిపని నాయనా !

86. మహాభారత సంగ్రామం

1. రుక్మిణీ స్వయంవర సమయమున యాదవ వీరులచే పరాజితుడైన సాల్వుడు, మహేశ్వరుని అనుగ్రహమున, సౌభకమను ఒక దివ్య విమానమును సంపాదించుకొనినాడు. మాయాయుద్ధమున ప్రసిద్ధుడైన అతడు, నీవు ఇంద్రప్రస్థమున ఉన్న సమయమును కనిపెట్టి, ద్వారావతి మీద దండెత్తివచ్చినాడు. అప్పుడు, యాదవవీరులందరను కూడగట్టుకుని, ప్రద్యుమ్నుడు, అతనిని ప్రతిఘటించి, ఇరువదియేడురోజులు పోరాడినాడు; అద్భుత పరాక్రమశాలి అయిన అతని అమాత్యుని, ద్యుమను దనువానిని, సంహరించినాడు.

2. అంతలో, నీవు, బలరామునితోసహ ద్వారావతికి వచ్చి, సౌభగాధిపతి అయిన సాల్వుని యెదుర్కొనినావు. అప్పటికే, అతని సైన్యమంతయు నష్టమైపోయినది.

ఆ మీద, సాల్వుడు, తన గదతో, సార్ఙ్గమను నీ ధనుస్సును భంగపఱచినాడు. నీ సముఖమున, నీ తండ్రిదయిన మాయారూపమును నఱకివేసినాడు. అదంతయు నతని మాయయని నీవుకూడ గ్రహింపలేకపోయినావని, క్షణకాలము బాధపడినావని, కొందఱు అభిప్రాయపడుచుందురు; కాని, ఆ దురభిప్రాయమును వ్యాసవాక్యములే ఖండించినవి.

3. అనంతరము, నీవు, నీ గదతో, సౌభగమును తుత్తునియలు చేసి, సముద్రమున కూల్చివేసినావు. నీ చక్రముతో, సాల్వుని ఖండించినావు.

ఆ పైన, దంతవక్త్రుడు, నీ మీదకు ఉఱికి వచ్చి, తన గదతో నిన్ను మోదినాడు. ఆ పుణ్యకర్ముని, నీవు, నీ కౌమోదకి అను గదతో కూల్చివేసినావు. అతడును, శిశుపాలునివలెనె, నీలో లీనమైపోయినాడు. నీ మీద

మనసు నిలుపుకొనినవారికి ముక్తిని ప్రసాదించుటకేగదా నీవు అవతరించినది !

4. నీవు, ద్వారావతికి తిరిగి వచ్చిన మీదట, కౌరవ సభలో ద్యూత క్రీడ జరిగినది. దాని ఫలితముగ, పాంచాలి, నిండుసభలోనికి యీడ్చుకు రాబడినది. అచట, కౌరవులు, ఆమెను వివస్త్రను చేయ సంకల్పించినారు. ఆ సమయమున, నీవు, ఆమె ప్రార్థన నాలకించి, ఆమెకు, అక్షయమైన వలువలను ప్రసాదించినావు.

అనంతరము, పాండవులు, వనముల నుండగా, సమయముకాని సమయమున వచ్చి ఆతిథ్యము నర్థించిన దుర్వాసునకు భయపడి, పాంచాలి నిన్ను ధ్యానించుకొనుట జరిగినది. అపుడు, నీవు, అమాంతముగ అచటికి పోయి, అన్నపాత్రలో మిగిలిఉన్న ఒకమెతుకును ఆమెనడిగి తీసుకుని, తిని, దుర్వాసుడును అతని సహచరులును, సంతుష్టితో త్రేన్చునట్లు చేసినావు.

5. మహాభారత సంగ్రామమునకుగాను, సన్నాహములును మంతనములును జరుగుచున్న సమయమున, దుర్యోధనుడు, వీరాధివీరులుగల నీ సేనా వాహినులు తనకు కావలెనని కోరి తీసుకొనినాడు. 'నీవు నాపక్షముననున్నచాలు' నని, అర్జునుడు, నిన్ను అభ్యర్థించినాడు.

అనంతరము, నీవు, పాండవులపక్షమున, రాయబారివై, హస్తినాపురమున కేగినావు. అచట, భీష్మద్రోణాదులు, నీ సూచనలను శిరసావహించినారు; దుర్యోధనుడు మాత్రము ధిక్కరించినాడు. అది కారణముగ నీవు, ఆ మునిమండలిలో, నీ విశ్వరూపమును ప్రదర్శించినావు; అచటివారిలో సంక్షోభమును కల్పించి, తిరిగి వచ్చినావు.

6. అనంతరము, అర్జునునకు రథసారథివైన నీవు, యుద్ధము ప్రారంభము కానున్న సమయమున, ఆ పైన జరుగనున్న తన బంధుజన వినాశమును ఊహించుకుని కలవరపడసాగిన ఆ వీరుని ఉద్దేశించి, ఆత్మ నశించునదికాదనియు, అది సర్వదా సర్వత్రా వ్యాపించియుండున దనియు,

చంపువాడు-చంపబడువాడు అను భావమునకు భ్రమయే మూలకారణ మనియు బోధించినావు. అటుపిమ్మట, 'అర్జునా ! ఇది ధర్మయుద్ధము. ఆతతాయి(1) యగువాడు, బంధువైనను, యిందు వధార్హుడే. దుష్టశిక్షణము క్షత్రియ ధర్మము. కావున, భయముడిగి, నాయందే మనసును నిలుపుకుని, నీ ధర్మమును నీవు నిర్వర్తించుకొనవలసినది' అనికూడ, అతనికి ఉపదేశించి నావు. ఆ వెనుక, నీ విరాడ్రూపము నతనికి ప్రత్యక్ష పఱచి, అతని మనసును కుదుటబఱచినావు; అతడు యథాపూర్వస్థితికి వచ్చునట్లు చేసినావు.

7. అనంతరము, భీష్ముడు, భూభారమును తొలగింపదలచిన నీకు సాయపడుచు, ప్రతిదినమును పదివేలమంది సైనికులను సంహరింపసాగినాడు. ఆ సమయమున, ఒకసారి, అర్జునుడు అలసిపోవుటను గ్రహించి, ఆయుధ మును ధరింపనని శపథముచేసిన నీవు, సుదర్శన చక్రముతో, క్రోధ మూర్తివలె, భీష్మునిపైకి లంఘించినావు. కాని, శిరమువంచుకుని, చేతులు జోడించి నిలబడిన ఆ భక్తశిరోమణిని చూసి, మందహాసము చేయుచు వెనుదిరిగినావు.

8. ద్రోణుడు కౌరవసేనకు అధిపతిగా ఉన్నపుడు జరిగిన యుద్ధ ములో, తన దంతావళముమీద సురక్షితముగ కూర్చుని భగదత్తుడు వదలిన వైష్ణవాస్త్రమును, నీకు నీవై ఆకర్షించుకొనినావు. ఆ పైన, సుదర్శన చక్రముతో సూర్యతేజమును మఱుగుపరచి, అర్జునునిచేత, సింధు దేశాధిపతి అయిన జయద్రధుని చంపించినావు. అటులనే, కర్ణుడు నాగాస్త్రమును ప్రయోగించినపుడు, నీ కాలి బొటనవ్రేలితో, కాశ్యపిని కొలదిగ క్రుంగదీసి, ఆ అస్త్రము, అర్జునుని శిరమునకుమారు అతని శిరస్త్రాణమును ఖండించునట్లు చేసినావు. నిన్నే నమ్ముకొనిన పాండవులకొఱకు నీవు చేయని దేమున్నది ప్రభూ !

9. యుద్ధారంభముననే తీర్థయాత్రకు బయలుదేరిన బలరాముడు, కాలక్రమమున, నైమిశారణ్యము(2) చేరుకుని, అచటి మునులకు, పురాణములు

వినిపించుచున్న రోమహర్షణుడు తనకు గౌరవము చూపనందున కోపగించు కుని, అతనిని సంహరించినాడు. ఆ పైన, మహర్షుల ప్రార్థనమీద, అతని కుమారుడైన ఉగ్రశ్రవసుని, సూతునిగా(3) నియమించినాడు.

అనంతరము, ప్రతి పూర్ణిమామాసలందును మహర్షులు సలుపు క్రతువులను భంగపరచు వల్కల నామక రాక్షసుని వధించి, తీర్థయాత్ర ముగించుకుని, యుద్ధావసాన కాలమున కురుక్షేత్రము చేరుకొనినాడు.

ఆ సమయమునకు, అక్కడ, భీమ దుర్యోధనులమధ్య భీకర గదా యుద్ధము జరుగుచున్నది. బలరాముడు, దానిని నివారించుటకు ప్రయత్నించి విఫలుడైనాడు; ఆ వెంటనే, ద్వారావతికి వెళ్ళిపోయినాడు.

10. గాఢనిద్రా పరవశులైఉన్న పాంచాలీ సుతులను, నిర్దయుడై వధించి, మతిచెడిఉన్న ద్రోణకుమారుడు - అశ్వత్థామ - ప్రయోగించిన బ్రహ్మ శిరోనామకాస్త్రమును, నీ ఆదేశానుసారము, అర్జునుడు ఉపసంహరించి నాడు. బంధితుడైఉన్న అతని శిరోమణిని తీసుకొనినాడు.

ఆ పైన, అశ్వత్థామ, ప్రపంచమును అపాండవముచేయు నిమిత్తము, మఱొక దివ్యాస్త్రమును, ఉత్తరా గర్భముమీద ప్రయోగించుట జరిగినది. అది గ్రహించిన నీవు, అంగుష్ఠమాత్ర దేహుడవై ఆమె ఉదరమున ప్రవేశించి, చక్రాయుధమును గిరగిర త్రిప్పుచు, గర్భస్థ శిశువుదైన తాపమును చల్లార్చినావు.

11. స్వచ్ఛంద మరణము(4) వరముగా గల భీష్ముడు, అంపశయ్య(5) మీదనుండి, నీ ఆదేశానుసారము, ధర్మజునకు, సర్వధర్మములను ఉపదేశించినాడు. ఆ పైన, నీ సముఖముననే, తనదైన అనన్యభక్తి ద్వారా, నిష్కలపరబ్రహ్మస్వరూప స్థితి(6) నందినాడు.

అనంతరము, నీవు, పూర్ణకాముడైన యుధిష్ఠిరుని చేత, మహి మాన్వితములైన మూడు అశ్వమేధయాగములను వైభవోపేతముగ నిర్వ హింపజేసి, అటుపిమ్మట, ద్వారావతికి తిరిగివచ్చినావు.

పవనపురపతీ ! కృష్ణా ! కౌరవులనుండి పాండవులను, రాక్షస పాలననుండి భూమాతను రక్షించినట్లు, భరింపరాని వేదనలనుండి నన్నును రక్షింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) ఆతతాయి : తుంటరి.

(2) నైమిశారణ్యము : (అ) నిమిషములో శత్రువు లందరును చంపబడిన చోటు.
(ఆ) బ్రహ్మదేవుడు విసరిన రథచక్రము పడిన తావు.
(ఇ) చతుర్ముఖుని ధర్మ రథచక్రము జారి పడిన స్థలము.

(3) సూతుడు : యజ్ఞసమయములయందు పురాణములు చెప్పువాడు.

(4) స్వచ్ఛంద మరణము : ప్రాణము వదలదలచుకొనినపుడుమాత్రమే ప్రాణము వదలుట.

(5) అంపశయ్య : బాణములతో కూర్చబడిన పడక.

(6) నిష్కలపరబ్రహ్మస్వరూప స్థితి : సారూప్య ముక్తి.

87. కుచేలోపాఖ్యానం

1. సాందీపని మహర్షివద్ద, నీవు, విద్యాభ్యాసము చేయుచున్నప్పుడు, నీకు, సహపాఠి అయిన విప్రబాలుడు, కుచేలుడనువాడు, అనంతర కాలమున, గృహస్థాశ్రమమును స్వీకరించినాడు. ప్రశాంతచిత్తముతో, సదా నిన్నే స్మరించుకొనుచు, భోగభాగ్యములకు ఆసపడక, కాలము వెళ్ళదీసు కొనసాగినాడు.

2. ఆ విధమైన సద్గుణములలో, అతని భార్య, అతని కే మాత్రమును తీసిపోవునది కాదు. అయినను, జితేంద్రియత్వమున, ఆమెను అతనితో పోల్చుటకు వీలులేదు. అది కారణముగనే, ఆమె, ఒకసారి, అతని నుద్దేశించి, 'దిన దిన గండముగ యిట్లు జీవించుటకంటె, మీ బాల్య మిత్రుడైన ఆ రమావల్లభుని ఒకసారి దర్శించుకుని వచ్చుట మంచిదికదా !' అని, అతి దీనముగ నివేదించుకొనినది.

3. ఆకటి బాధతో అటమటించిపోవుచున్న తన అర్ధాంగి పలుకుల నాలకించిన కుచేలుడు, 'లక్ష్మీ కటాక్షము' కొఱకు కాకపోయినను, లక్ష్మీ పతివైన నిన్ను దర్శించుకొను కుతూహలముతో, ద్వారావతికి బయలు దేరినాడు. నీకు కానికగా సమర్పించుకొనుటకు, గుప్పెడు అటుకులను మాత్రమే అతడు తీసుకురాగలిగినాడు.

4. ఆశ్చర్యమయమైన ఆ మహానగరమును సమీపించిన కుచేలుడు, ఆ వెంటనే, మిత్రవింద యింట ప్రవేశించి, వైకుంఠమును చేరినంతగ ఆనందించినాడు. విశిష్టమైన నీ ఆతిథ్యమును స్వీకరించి, తన్ను తాను మఱచిపోయినాడు.

5. అనంతరము, నీవు, అతనికి అతిథిపూజ నొనర్చినావు. మిత్ర వింద, వింజామర[1] వీచినది. ఆ పైన, నీవు, అతనిని దగ్గరకు తీసుకుని,

మీరు సాందీపని ఆశ్రమమున నున్నపుడు, గురుపత్ని ఆదేశానుసారము, సమిధలకొఱకు వనమున కేగుటయు, అపుడు, అచట కురిసిన అకాల వర్షమున తడిసి ముద్దైపోవుటయు అతని స్ఫురణకు తెచ్చినావు.

6. అటుపిమ్మట, నీవు, అతడు సమర్పించుకొనుటకు సిగ్గుపడుచున్న అటుకులను చమత్కారముగ అతనినుండి తీసుకొనినావు. ఒక గుప్పెడు నోటిలో పోసుకుని, ఉత్సాహముతో తినసాగినావు. అంతలో రుక్మిణీదేవి, సంరంభమున, నిన్ను సమీపించి, 'ఇంతకు మించి ఋణపడుట మంచిది కాదు' అని, మఱొక గుప్పెడు తీసుకొనకుండ నివారించినది.

7. భక్తులపట్ల పరమభక్తుడవై ఉండు నీ వలన, ఆ విధముగ సన్మానింపబడిన కుచేలుడు, ఆ రోజంతయు నీతో గడిపినాడు. మఱుసటి దినమున, నీ వద్ద సెలవు తీసుకుని, అతడు గృహోన్ముఖుడైనాడు. అతనిని నీ వెట్లు అనుగ్రహించితివో నీకే ఎఱుకకావలెను ప్రభూ !

8. 'నేను కోరిన పక్షమున, లక్ష్మీపతి, నాకు యేదైనను ప్రసాదించియుండువాడు. కాని, అట్లు జరుగలేదు. అదియు వాని లీలావిలాసమే' అనుకొనుచు, నిన్నే స్మరించుకొనుచు, నీ మధుర వచనములను, మృదు మందహాసమును, తలపోసికొనుచు, అతడు, నడక సాగించినాడు. అట్లు పోయి పోయి, ఒక మణిమయాంచిత భర్మ హర్మ్యము ముందు ఆగినాడు.

9. ఒక క్షణకాలము, అతడు, దారి తప్పిన వానివలె, అటు నిటు పరిశీలించి చూడసాగినాడు. అంతలో, సర్వాభరణభూషిత అయిన అతని భార్య, పరిచారికాగణము, బరాబరులు(2) చేయుచుండగా, అతనికి స్వాగతము చెప్పుటకు అందుండి బయటకువచ్చినది. ఆమెను చూసినంతనే, అతనికి, మహాద్భుతమైన నీ అనుగ్రహవిశేషము తిరిగి స్ఫురణకు వచ్చినది.

10. ఆ పైన, అతడు, సర్వవిధభోగముల ననుభవించుచున్నను, వానిమీద మమకారమును పెంచుకొనలేదు; నిన్ను మఱచిపోలేదు. అదే, అతనికి మోక్షమును చేకూర్చినది.

భక్తవత్సలా ! కృష్ణా ! అట్టి నీ అనుగ్రహమునకు నన్నును పాత్రుని చేసుకొనుము నాయనా !

అర్థము - వివరణ

(1) వింజామర : తెల్లటి చామరము - చమరీ మృగముయొక్క వెండ్రుకలతో కూర్చబడిన విసనకఱ్ఱ.

(2) బరాబరులు : హెచ్చరికలు. రాచరికపు మర్యాదలకు సంబంధించినవి.

88. అర్జున గర్వభంజనం

1. నీ గురుపుత్రుని, నీవు, వరుణలోకమునుండి తీసుకువచ్చినావని వినిన నీ తల్లికి, పుట్టిన వెంటనే కంసునిచేత సంహరింపబడిన తన ఆరుగురు కుమారులను(1) ఒకసారి చూడవలెనను కుతూహలము కలిగినది. ఆ కోరి కను తీర్చు నిమిత్తము, నీవు, సుతలాధిపతి అయిన బలిని కలుసుకుని, అతని పూజలందుకుని, పూర్వము చతుర్ముఖుని శాపమువలన హిరణ్య కశిపుని కుమారులుగా పుట్టిన మరీచినందనులను, వసుదేవ సుతులను, అతని వద్దనుండి తీసుకువచ్చి, నీ తలిదండ్రులకు చూపించినావు; ఆటుపిమ్మట, వారిని, నీ నిజనివాసమునకు పంపివేసినావు.

2. నిన్ను, దృఢభక్తితో సేవించుకొను, శ్రుతదేవుడను ప్రముఖ భూసురునీ, బహుళాశ్వుడను ప్రసిద్ధ భూపతినీ యేకకాలముననే అనుగ్ర హింపదలచిన నీవు, కొందరు మహర్షులతోసహా మిథిలానగరమునకు విజ యము చేసినావు.

3. ఏకరూపముగల ఇరువురు మూర్తులుగా రూపొందిన నీవు, యేక కాలమున ఆ యిరువురి నివాసములందును ప్రత్యక్షమైనావు. వారిలో, ఒకరు, పంచభక్ష్య పరమాన్నములతోను, మఱొకరు, పచ్చడి మెతుకులతోను నీకు భోజనము పెట్టినారు. నీవు ఆ రెంటిని ఆదరముతోడనే స్వీకరించినావు; ఆ యిరువురకును ముక్తిని ప్రసాదించినావు.

4. ద్వారకాపురనివాసి అయిన ఒక బ్రాహ్మణుడు, తన కుమారులు, పుట్టిన వెంటనే మరణించుచుండుటవలన, అమిత వ్యాకులుడై, రోదించు చుండువాడు. అతని వేదనను గ్రహించికూడ, నీవు, అతనికి చేసిన సాయ మేమియు లేదు. 'విధి బలీయమైనద'ని మాత్రము తెలిపి, అతనికి ఊఱట

కలిగించుచుండువాడవు. విశ్వంభరుడవైన నీవు, అట్లు ఔదాసీన్యము వహించుటను, నీ అశక్తతగ నేను భావించుటలేదు ప్రభూ !

అర్జునుడు, తను సర్వసమర్థుడని అనుకొనుచుండువాడు. అది అతనికి గర్వకారణమైనది. దానికితోడు, నిన్నతడు, అప్పుడప్పుడు, మానవ మాత్రునిగ భావించుచుండుటకూడ జరుగుచుండెడిది. అతనినుండి, ఆ విధమైన గర్వమును తొలగించుటకును, అతనికి, నీ పరమపదమును దర్శనీయమొనర్చి, యథార్థ తత్త్వజ్ఞానమును కలిగించుటకును, నీవట్లు ప్రవర్తించియుందువు.

5. ఆ బ్రాహ్మణునకు, ఎనమండుగురు కుమారులు పుట్టి పోయినారు. అట్లు జరుగుటకు, నీ ఔదాసీన్యమే కారణమను వదంతి, ప్రజలలో వ్యాపించినది.

ఒకసారి, అర్జునుడు ద్వారావతికి వచ్చినపుడు, తొమ్మిదవ కుమారునికూడ కోల్పోయిన ఆ బ్రాహ్మణుని రోదనము అతని చెవులబడినది. ఆ వెంటనే, అతడు, 'ఈ మాఱు నీకు పుట్టిన కుమారుని బ్రతికించి నీకు యివ్వలేకపోయినచో నేను అగ్నిప్రవేశ మొనర్చెదను' అని, అతనికి మాట యిచ్చినాడు.

6. మరల, ఆ బ్రాహ్మణుని భార్య ప్రసవించు సమయము వచ్చినది. పూర్వము తాను చేసిన వాగ్దానము ప్రకారము, దురభిమానముగల అర్జునుడు, నీకు తెలుపకుండనే, ఆ బ్రాహ్మణుని యింటికి వెళ్ళినాడు. వెళ్ళి, ఆ సూతికా గృహమును, కొన్ని దివ్యాస్త్రములతో బంధించి వేసినాడు. కాని, అప్పుడు పుట్టిన పిల్లవానిని సైతము మృత్యుదేవత హరించుకుపోయినది.

ఆ వెంటనే, అర్జునుడు, తన యోగబలముద్వారా, ఆ కుఱ్ఱవానికొఱకు, యమపురమునకు వెళ్ళినాడు. ఇంద్రపురమునకు వెళ్ళినాడు. అటులనే, దేవలోకము లన్నిటిని గాలించినాడు. కాని, ఎక్కడను ఆ బాలుని జాడ తెలియకపోవుటవలన, అగ్నిప్రవేశముచేయుటకు నిర్ణయించుకొని

నాడు. అది గ్రహించిన నీవు, అతనిని సమీపించి, మందహాస మొనర్చుచు, అత డా ఉద్యమమును విరమించుకొనునట్లు చేసినావు.

7. ఆ పైన, నీ వతనితో రథము నధిరోహించి, పశ్చిమ దిక్కుగా పోయి, లోకాలోకమను పర్వతపంక్తి నధిగమించి, అచటి చీకటినంతను నీ చక్రాయుధ ద్యుతితో తొలగించినావు. అపుడు, నీ సుదర్శనము కల్పించిన తేజమును, అర్జునుడు, చూడలేకపోయినాడు. అనంతరము, ఆ అంధకార మును దాటి, సప్త సముద్రముల కావలనున్న నీ దివ్యధామమును నీ వతనికి చూపినావు.

8. అచట, చిదానంద రసస్వరూపుడైన వానిని, వేదవిజ్ఞానమునకు లక్ష్యమైనవానిని, మువురయ్యలకును మూలమైనవానిని, నీలమేఘచ్ఛాయతో శోభించువానిని, అనేక దివ్యాభరణములను, దివ్యాయుధములను, పట్టు పీతాంబరమును ధరించియున్నవానిని, శేషతల్పమున శయనించియున్న వానిని, దివ్యసుందర విగ్రహుని, సాక్షాత్తు నీవే అయిన వానిని, నీ మిత్రు నకు ద్యోతపరచినావు. అతనితో కూడ, ఆయనకు ప్రణామ మొనర్చినావు.

9. ఆ పైన, ఆ మహానుభావుడు నిన్ను ఉద్దేశించి, 'మూర్తిద్వయ ముగా వెలసిన మీ రిరువురును నాకు భిన్నులుకారు. మీ యం దొకరిలో దివ్యత్వము ప్రస్ఫుటముగ వ్యక్తమై ఉన్నది; వే రొకరిలో నిక్షిప్తమై ఉన్నది. మి మ్మీ విధమున కలుసుకొనుటకే నే నీ విప్రసుతులను యిచటికి రప్పించుకొనినాను. ఇక, మీరు, వీరిని తీసుకుని పోవచ్చును' అని పలు కుచు, వారిని మీకు ఒప్పగించినాడు.

అది చూసిన అర్జునుడు, నిన్ను అమితముగ స్తుతించినాడు. అనంత రము, నీవు, ఆ బాలురను వారి తండ్రికి తిరిగి యిచ్చివేసినావు.

10. ఆ విధముగ, నీవు, అనేకాద్భుతకృత్యము లొనర్చి, ప్రాణి కోటికి పరమానందమును ప్రసాదించినావు. వృష్ణి వంశమునకు(2) పుష్టి చేకూర్చినావు. వివిధ యజ్ఞము లొనర్చినావు. నిరుపమమైన లీలావిలాస ములతో, గోపికా సహస్రమును సంతృప్తి పరచినావు.

నీవు, సాక్షాత్తు పూర్ణబ్రహ్మ స్వరూపుడవు ప్రభూ ! భూభారమును తొలగించుటకును, నీ దివ్యపాదారవిందములను ఆశ్రయించినవారికి మోక్షమును ప్రసాదించుటకును, కోరి మానవాకృతి ధరించి, యాదవకులమున నుద్భవించినావు; సర్వోత్కృష్టుడవై ప్రకాశించినావు.

11. ఆ సమయమున, నిన్ను సేవించుకొనుచు, ద్వారావతిలోనే ఉండిపోయిన దివ్యర్షి-నారదుని-ద్వారా, పుణ్యాత్ముడైన నీ తండ్రి, తత్త్వోపదేశము నందినాడు. పరమ భాగవతోత్తముడును, కుశాగ్రబుద్ధియు, అయిన ఉద్ధవుడు, నీ నుండి ఆత్మ జ్ఞానమును బడసినాడు. అతడు, విశ్వశ్రేయము నాసించి, యీ నాటికిని, బదరికాశ్రమప్రాంతమున విహరించుచున్నట్లు ప్రాజ్ఞులు తెలుపుచుందురు ప్రభూ !

12. కృష్ణా ! అవతారము లన్నిటియందును, నీ అవతారమునకు మించినది లేదు నాయనా ! అది ప్రత్యేకమైనది. సర్వోత్కృష్టమైనది. నిన్ను ప్రేమించినవారు, ద్వేషించినవారు, నిన్ను భయపెట్టదలచినవారు నీకు భయపడినవారు, నీతో మైత్రి నెఱపికొనినవారు శత్రుత్వము వహించినవారు, అటులనే, అనుపమమును అతి సులభమును అయిన వివిధ మార్గముల ననుసరించినవారు, యెందరో, నీ అనుగ్రహమునకు పాత్రులై వారి వారి తాపములను పాపములను తొలగించికొనినారు; పరమ పదమును పొందినారు.

గురువాయుపురాధిపా ! నన్నును నీవానిగ చూసుకొనుము నాయనా ! నాకు, పరిపూర్ణారోగ్యమును భక్తిని ప్రసాదింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) ఆరుగురు కుమారులు : కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రసేనుడు, ఋజువు, సమదనుడు, భద్రుడు.

(2) వృష్ణి వంశమునకు : యాదవులకు.

89. వృకాసుర వధ

1. రమావల్లభా ! ఈ లోకమున, నీవు, నీ భక్తులకు, సద్యోఫలమును[1] ప్రసాదింపకుండుటకు, ఐశ్వర్యము అహంకారమును కలిగించునదగుటయే కారణము కావచ్చును. అహంకార పూరితులను ప్రశాంత చిత్తులనొనర్చిగాని, నీవు, వారి అభీప్సితములను సిద్ధింపజేయవు. ప్రశాంత చిత్తమున నిన్ను భజించువారికి, శీఘ్రఫలప్రాప్తి కలిగించుచుందువు. అందువలననే, నీ భక్తులైనవారికి, యెన్నడును, పతనము సంభవింపదు.

2. భక్తుల ననుగ్రహించుటలో, బ్రహ్మ రుద్రాదులదే అగ్రతాంబూలము. శీఘ్రముగ అనుగ్రహించుటయు, అంత శీఘ్రముగనే ఆగ్రహించుకొనుటయుకూడ వారికి పరిపాటి. అది కారణముగనే, వారి నాశ్రయించినవారు, దూరదృష్టిలేని కారణమున, అమిత దుఃఖముల ననుభవించుచుందురు. దానికి వృకాసురుని జీవితమే ప్రబల నిదర్శనము.

3. 'సులభముగ ప్రసన్నుడగు దైవత మెవర'ని, శకుని[2] కుమారుడైన వృకాసురుడు, ఒకసారి, నారదమహర్షి నడిగినాడు. అతనికి సమాధానముగ, నారదమహర్షి, శివుని పేరు చెప్పినాడు. అతడు, నిన్ను సూచింపకుండుటకు, నీవు అసాధువుల నాదరింపనివాడ వగుటయే కారణముకాని అన్యముకాదు.

4. ఆ పైన, వృకాసురుడు, తీవ్ర తపశ్చర్యకు పూనుకొనినాడు. ఏడురోజులు తపస్సు చేసినను, ఈశ్వరుడు ప్రత్యక్షము కాకపోవుటవలన, అతనికి, మితిలేని కోపము కలిగినది. ఆ వెంటనే, అతడు, తన శిరస్సును ఛేదించుకొనుట కుద్యుక్తుడైనాడు. అది గ్రహించిన శంకరుడు, అతనికి సాక్షాత్కరించినపుడు, అతి క్షుద్రమును రౌద్రమును అయిన వరమును,

తన కరము సోకిన శిరము వ్రయ్యలై పోవునట్టిదానిని, అతడు ఆయన నుండి కోరి, పొందినాడు. నీ పట్ల విముఖులైనవారికి, మంచిచెడ్డల నాలోచించు శక్తి ఉండదుగదా ప్రభూ !

5. బంధవిముక్తినందిన సింహము, ముక్తిప్రదాతమీదికే ఉఱుకునట్లు, ఆ వెంటనే, ఆ అసురుడు, పరమశివునిమీదకు ఉఱికినాడు; అతనిని తఱుముకొని పోజొచ్చినాడు.

ఆ స్థితిలో, శంకరుడు, దిక్కుతోచక, అటునిటు అన్ని దిక్కులకు పరుగెత్తినాడు. కాని, అతని నాదుకొనగలవారు యెవరును అతనికి కనిపించలేదు. అప్పు డతనికి, దిక్కులేనివారికి దిక్కైన నీవు స్ఫురణకు వచ్చినావు; అతడు నీ దిక్కుగా పరుగుతీయసాగినాడు.

అతనిని, అల్లంత దూరముననే తిలకించిన నీవు, ఒక వటుని రూపమునపోయి, వృకాసురుని సముఖమున వాలినావు.

6. ఆ పైన, అతని నుద్దేశించి, 'అసురేశ్వరా ! అతడు అసలే పిశాచపతి. అతని పలుకులకు విలువ యేమున్నది ? ఆ యథార్థము నర్థము చేసుకొనుటకు, అతని వెనుక పడుటయా ! నీ చేతిని నీ నెత్తిన పెట్టుకొనినచో నీకే తెలిసిరాగలదుగదా' అని నిర్భయముగ పలికినావు.

ఆ మూర్ఖుడు, నీవు చెప్పినది నిజముకావచ్చు ననుకొనినాడు. తన చేతిని తన నెత్తిమీదనే పెట్టుకొనినాడు; ఒక మహావృక్షమువలె ఒరిగిపోయినాడు.

ఇతర దేవతలను నమ్మినవారి గతి యింతేగదా ప్రభూ ! ఇదికాక, శంకరునకుకూడ నీవే శరణ్యుడవని దీనివలన తేలుచున్నదికదా స్వామీ !

7. సరస్వతీ తీరముననుండు మునులు, ఒకసారి, త్రిమూర్తులలోను, సత్త్వగుణాధిక్యతగలవా రెవరో నిర్ణయించవలసినదని భృగుమహర్షిని కోరినారు. ఆ పైన, భృగుమహర్షి, బ్రహ్మదేవుని సమీపించి, ఆయన నగౌరవపరచినాడు. అది గ్రహించిన బ్రహ్మ, కోపగించుకొనినాడు; కాని,

వెంటనే శాంతి వహించినాడు. అనంతరము, శివుడును, అదే విధముగ అవమానింపబడి, ఆయనను సంహరింపబోయినాడు; కాని, పార్వతి అతనిని వారించినది. అటుపిమ్మట, ఆ మహర్షి నిన్ను సమీపించినాడు.

8. శ్రీమహాలక్ష్మి ఒడిలో తలపెట్టుకుని పడుకునిఉన్న నిన్ను, ఆ మహర్షి తన్నినంతనే, నీవు, అదిరిపడి లేచినావు. ఆయన ఆగమనమును గ్రహింపలేకపోయినందులకు, ఆయననుండి క్షమాభిక్ష నర్థించినావు. ఆయన పాదముద్రను, ఒక దివ్యాభరణముగ, వక్షస్థలమున నుంచుకొనదలచినట్లు ఆయనకు నివేదించుకొనినావు. అదే, అనంతరకాలమున, శ్రీవత్సముగ ప్రసిద్ధినందినది ప్రభూ !

9. ఆ విధముగ సమాధానము పొందిన మహర్షులు, తమ మనోఫలకములయందు నిన్నే దృఢముగ నిలుపుకుని, పునరావృత్తి రహితమైన పరమపదము నందినారు. ఆ నీ పరిశుద్ధ సత్త్వస్వరూపమునే, నేనును సేవించుకొనుచున్నాను నాయనా ! ఇక నాకు పతనభీతి యెక్కడిది ?

10. కృష్ణా ! నీవు సర్వవ్యాపివి. సర్వశక్తి సంపన్నుడవు. పరమాత్ముడవు. సృష్ట్యారంభమున, నిగమనివహము (వేదసముదాయము) సచ్చిదానంద స్వరూపునిగ, శుద్ధ చైతన్యమూర్తిగ, అద్వయ పరబ్రహ్మగ వేనోళ్ళ నుతించినది నిన్నేకదా ప్రభూ ! గోపీజన భాగ్యరాశివైన నీవు, మా అదృష్టవశమున, గురువాయుపురాధిపతివై వెలసినావు. మమ్ము నీ ఆశ్రితుల నొనర్చికొనినావు. ఇక, మా ఆధ్యాత్మిక ఆధిభౌతిక తాపములు(3) శమింపకపోవుటయేమి నాయనా !

అర్థము - వివరణ

(1) సద్యోఫలము : వెంటనే కనిపించు ఫలితము.
(2) శకుని : ఇతడు దుర్యోధనుని మేనమామ కాడు; ఒక దానవుడు.
(3) ఆధ్యాత్మిక ఆధిభౌతిక తాపములు : ఆత్మదేహాదులవలనను, పంచభూతముల వలనను కలుగు వేదనలు.

90. ఆగమాది పరమ తాత్పర్య నిర్ణయం

1. వృక, భృగు, మోహిన్యంబరీషాదుల వృత్తాంతముల వలన, రుద్రాది దేవతల మాహాత్మ్యమునకన్న నీ మాహాత్మ్యము మిన్నయని తేలినది. నీవు, పరిపూర్ణ పరమాత్మ స్వరూపుడవని, వ్యక్తావ్యక్త స్వరూపములన్నియు నీ అంశామాత్రములేనని, బ్రహ్మ రుద్రామరేంద్రాదు లెల్లరును నీవే యని స్పష్టమైపోయినది.

2. త్రిమూర్తులు, ఈశ్వరుడు, సదాశివుడు అని చెప్పబడు ఐదుగురిలోను, ఆ సదాశివుడు, పరమాత్మ స్వరూపుడవైన నీవేకాని అన్యముకాదు. వైకుంఠమున నుండు నిన్నే ఈశ్వరుడనుచున్నారు. బ్రహ్మలోకము, విష్ణులోకము, రుద్రలోకము అని మూడు తెఱగుల వ్యవహరింపబడు సత్యలోకమున, నీవు, త్రిమూర్త్యాత్మకుడవై భాసించుచున్నావు.

3. ఆ త్రిమూర్తులయందును, శుద్ధ సత్త్వస్వరూపుడవైన నిన్ను, శ్రీమహావిష్ణువుగను, రజోగుణము ప్రధానముగ ఉండి, సత్త్వము స్వల్పముగ ఉన్న నీమూర్తిని చతుర్ముఖ బ్రహ్మగను, సత్త్వగుణము ప్రధానముగ ఉన్నను, తమోగుణచ్ఛాయలుగల ఆ మూర్తినే, శంకరునిగను, పేర్కొనుట జరుగుచున్నది.

4. నీవు, త్రిమూర్తులకు పరుడవును, ఈశ్వర శబ్ద వాచ్యుడవును, పరమాత్ముడవును అయినను, సర్వాత్ముడవైన కారణమున, శైవాగమవేత్తలు నీ శివ స్వరూపమునే ఆరాధింతురు. యథార్థమునకు ఆ శివుడెవరు? నీ అంశామూర్తియే కదా ! నా యీ మాటలు ఆధారరహితమైనవి కావుకదా ప్రభూ !

5. శ్రీ శంకర భగవచ్చరణులు సయితము, యే ఒక్క దేవత పట్లను పక్షపాతబుద్ధి చూపలేదు. ఆబ్రహ్మస్తంబ పర్యంతము(1) ఆయన

నిన్నే దర్శించుకొనినారు. నీ పరముగ చెప్పబడు 'సహస్రనామముల'కు భాష్యముకూడ వ్రాయగలిగినారు. అది కారణముగనే, ఆయన, అంతిమ క్షణములలో, నిన్నే స్మరించుకొనుచు, మోక్షమును సాధించుకొనుట జరిగినది.

6. ప్రసిద్ధ మంత్రశాస్త్ర గ్రంథమైన 'ప్రపంచసారము' నకు మంగళాశాసనముగ(2) శ్రీ 'శంకరులు' నిన్ను పరమేశ్వరునిగ, త్రిమూర్తుల కును మూలకారణమైనవానిగ, నీల కమలమువంటి మేనిచాయ కలవానిగ ధ్యానించికొనినారు. ప్రణవ సంబంధమునకూడ, శ్రీ భగవత్పాదులు, గుణాతీతునిగ, నిష్కలపరబ్రహ్మను ధ్యానించు మార్గమును వివరించి, ఆ పైన, సకలాత్మునిగ నిన్నే పేర్కొనినారు.

7. సర్వవిషయములను విశదపరచు 'పురాణ సంగ్రహమ'ను గ్రంథమునకూడ, నీ మహిమానువర్ణనమే ఘంటాపథముగ జరిగినది. బ్రహ్మ విష్ణు రుద్రలోకములకు మీద నున్నది, నీ దివ్యధామమైన వైకుంఠ ముగ వర్ణింపబడినదేకాని వేరుగ వర్ణింపబడలేదు.

8. ఈ బ్రహ్మకల్పమున, (సృష్ట్యాదిని) నీవు, బ్రహ్మదేవునకు ద్యోతపరచిన రూపము, శ్రీమద్ భాగవతమునందు, ద్వితీయ స్కంథమున వర్ణితమైనది. దానిని, శైవ సంప్రదాయమునకు చెందిన మాధవాచార్యుడు కూడ, తన, 'పురాణసారమ' ను గ్రంథమున, హరి హరాది నామములతో మాత్రమే వివరించినాడు.

9. తమ సహజ ప్రకృతికి అనుగుణముగ, శివుని ఆరాధించువారు, ఆయనపట్ల దృఢమైన భక్తి శ్రద్ధలను పెంపొందించుకొనుటవలననే సత్ఫలితములను పొందగలుగుచున్నారు. అట్టి భక్తుల విశ్వాసమును వృద్ధి చేయుటకొఱకే, వ్యాసర్షి, స్కాందాది పురాణములయందు, శివుని పొగడు టయు, నిన్ను తెగడుటయు, జరిగినది. దానినేకదా అర్థవాదమందురు!

10. అర్థవాదము ముత్తెఱగుల నుండును. అం దొకటి, యథార్థ విషయమును, అతిశయోక్తులతో తెలుపుట; అది భూతార్థవాదము.

మఱొకటి, లేని విషయమును, 'ఇట్లుండి ఉండవచ్చును' అని వివరించుట; అది అనువాదము. వేరొకటి యథార్థవిషయమును వక్రముగ తెలుపుట; అది విరుద్ధవాదము.

స్కాందాదులందు, విరుద్ధవాద మధికముగ గోచరించును. వాటి యందు, నిన్ను, కోపనునిగ, అల్పునిగ, చిత్రించుటకూడ జరిగినది. ఇదంతయు ఆ యా భక్తులలోని ఔత్సుక్యమును వృద్ధిచేయుటకు మాత్రమే ఉద్దేశింపబడినది.

11. ఇవి నా మాటలు కావు ప్రభూ ! మంత్రశాస్త్రములోనివి. ఏ దేమైనను, శ్రీమద్భాగవతమున, వ్యాసర్షి, నిన్ను పరమాత్మునిగ ప్రస్తుతించినారు. ఆ వచనములే నాకు శిరోధార్యములు.

కృష్ణా ! నా హృదయమును గ్రహించి, నన్ననుగ్రహింపుము నాయనా ! నా జాడ్యమును నివారించి, నాకు పరాభక్తిని ప్రసాదింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) ఆబ్రహ్మ స్తంబ పర్యంతము : బ్రహ్మ మొదలు గడ్డిపోచవరకు.

(2) మంగళాశాసనము : గ్రంథారంభమున కవి చేయు ప్రార్థన. వైష్ణవ పరిభాష యందు ఆశీర్వాదమని అర్థము.

91. భక్తి వైభవం

1. ఆత్మస్వరూపా! దేవాధిదేవా! కృష్ణా! నశ్వరములగువానిని నమ్ముకుని, నానా బాధల ననుభవించు ప్రాణులకు, నీ పద సేవనము సర్వ భయ నివారకమైనది; శ్రేయోదాయకమైనది. విధ్యుక్తముగ, నిన్ను ఉపాసించుచుండువారు, మోక్షమార్గమున, గ్రుడ్డిగపోవుచున్నను పతనము నందరు.

2. జన్మతః ఛండాలుడైనను, యెవడు, తన మనస్సును, వాక్కును, కాయమును, సర్వేంద్రియములను, ఇంద్రియార్థములను, తుదకు ప్రాణ వాయువునుసయితము నీయందే లయముచేయుచున్నాడో, అతడు, ముల్లోకములను పవిత్రీకరించినవా డగుచున్నాడు. బ్రాహ్మణ కులమున జన్మించియు, నీ పట్ల విముఖుడై యుండువాడు, తనకుకూడ తాను పవిత్రతను చేకూర్చుకొనలేకున్నాడు. అది తెలియుటవలననే, నీ ప్రేరణ మూలమున, నేను, మనోవాక్కాయములతో సలుపు సర్వకర్మలను, సర్వేశ్వరుడవైన నీకే సమర్పించుకొనుచున్నాను ప్రభూ!

3. ఏ ప్రాణికైనను, భయ మనునది, మఱొక ప్రాణినుండి మాత్రమే కలుగుచున్నది. ఆ మఱొక ప్రాణి - అన్యవస్తువు - అనునది, మన మనస్సు కల్పించుకొనినదే. పరమాత్మునితో యేకాత్మభావముకలవారికి, భయకారణమే కనిపించదు. అది గ్రహించిన నేను, ఆ భావమును దృఢపరచుకొనుటకు, యథాశక్తిగ కృషిచేయుచున్నాను. కాని, ఒక్కొకప్పుడు, మనసు మాయామోహితమైనపుడు, ఆ సమైక్యభావన అసంభవ మగుచున్నది. అందులకే దృఢతరభక్తితో, మాయావల్లభుడవైన నిన్ను అనవరతము ధ్యానించుకొనుచు, నే నా భీతిని - సంసార భయమును - తొలగించుకొనుటకు ప్రయత్నించుచున్నాను.

4. శ్రీమంతులతోటి సంబంధమువలన ఐశ్వర్యము లభించునట్లు, సత్పురుషుల సాంగత్యమువలన, భగవద్భక్తి జనించుచుండుటయు, వృద్ధి యగు చుండుటయు సంభవించుచుండును. పూర్వపుణ్య వశమునగాని అట్టి సత్సంగము లభింపదు.

సత్పురుషులు, నిన్ను, సదా భజించుచుందురు. సర్వధా ప్రస్తుతించు చుందురు. అమృతతుల్యమైన వారి పలుకుల నాలకించుట మూలమున, సర్వ పాపములును హరింపగలవు. భగవద్భక్తి సుప్రతిష్ఠితము కాగలదు. అది కారణముగనే, అట్టి సత్సంగ భాగ్యమును నాకు ప్రసాదింపుమని, నిన్ను, బహుధా వేడుకొనుచున్నాను ప్రభూ !

5. పరమ పురుషార్థమైన మోక్షమును సాధించుకొనుటకు, భక్తి మార్గమును మించినది లేదని, పెద్దలు ఉద్ఘాటించినారు. ఆ భక్తి మార్గమున గమించువారు, మంగళప్రదమైన నీ దివ్యగాథలను స్మరించుకొనుచుందురు; నీ భవ్య నామమును జపించుకొనుచుందురు. అది కారణముగ, వారి హృద యములు, ఆర్ద్రమగుటయు, కరగిపోవుటయు జరుగుచుండును. ఆ సమయ మున, వారికి, బాహ్యస్మృతికూడ ఉండదు. వారు, ఉన్మాదులవలె సంచరించు చుందురు. అప్పుడప్పుడు నవ్వుచుందురు; రోదించుచుందురు. ఆడుచుందురు; పాడుచుందురు.

దయామయా ! కృష్ణా ! నేనును అట్టి విశేషస్థితి నందునట్లు అనుగ్ర హింపుము నాయనా !

6. పంచమహాభూతములు నీవుగా, పాంచ భౌతికమైన మూర్తు లన్నియు నీవిగా, జలచరములు, భూచరములు, ఖగచరములు అన్నియు నీ రూపములుగా, మానవులు, దానవులు, మిత్రులు, శత్రువులు అందరును నీ ప్రతిబింబములుగా చూసుకుని ప్రణమిల్లుశక్తిని నాకు ప్రసా దింపుము నాయనా ! సర్వభూతములయందును, సర్వేశ్వరుడవైన నిన్ను దర్శించుకుని, సేవించుకుని, వేరు ప్రయత్నము లేకుండ, నా భక్తిని, దృఢ

తర మొనర్చుకుని, ప్రాపంచిక విషయములపట్ల విరక్తినంది, ఆత్మజ్ఞాన మును పొందు భాగ్యమును నాకు అనుగ్రహింపుము ప్రభూ !

7. కృష్ణా ! నీయందే మనసును లగ్నము చేసుకొనుటద్వారా, ఆకలి దప్పుల నధిగమించి, నిరంతరము, నీ చరణ సరోజములనే సేవించు కొనుచు, సుఖ దుఃఖములు రెండును అశాశ్వతములేనని గ్రహించి, ఐశ్వ ర్యము కలిగినపుడు పొంగిపోక, అది తొలగినపుడు కృంగిపోక, నీ నఖ చంద్ర చంద్రికల శీతలచ్ఛాయలో, నేను, యథేచ్ఛావిహార మొనర్చు భాగ్యము ననుగ్రహింపుము నాయనా !

8. సర్వభూతములందును సర్వేశ్వరుడవైన నిన్ను దర్శించుకొను అర్హత నా కిపుడు లేని పక్షమున, నీ భక్తులను సేవించుకొనుటకును, అజ్ఞా నులపట్ల అనుకంపను, విరోధులపట్ల ఔదాసీన్యమును, వహించుటకు ఉపకరించు దృఢతర భక్తినైనను ప్రసాదింపవచ్చును. దానికికూడ నేను అనర్హుడనే అయిన, కనీసము, నీ అర్చనా మూర్తిపట్ల అచంచల విశ్వాసము నయినను అనుగ్రహింపవచ్చును కదా ! ఆ విధముగ నిన్ను సేవించుకుని, అచిరకాలమున భక్తాగ్రగణ్యులైన వారు యెందరులేరు ప్రభూ !

9. మాయకు, ఆవరణశక్తి, విక్షేపశక్తి అను రెండు శక్తులున్నవి. ఆవరణశక్తి ద్వారా, అది, పరబ్రహ్మ స్వరూపమును ప్రాణులకు గోచరింప కుండ చేయును. విక్షేపశక్తిద్వారా, ఆ పరబ్రహ్మను, పంచభూతముల రూపమున, చరాచర జీవరాశి రూపమున, ప్రపంచమున ప్రదర్శించు చుండును. వారి వారి పూర్వ కర్మల ననుసరించి, వారు దుఃఖజాలమున మునిగి తేలుచుండునట్లు చేయుచుండును. నీ చరణాబ్జములపట్ల అచంచలమైన భక్తి కలవారు మాత్రమే ఆ మాయను జయింపగలరు. ఇవి సిద్ధ యోగీంద్రుడైన ప్రబుద్ధుని వచనములు ప్రభూ !

విశ్వేశ్వరా ! నేను, ఆ మాయ కు లోనుకాకుండ చూడవలసినది.

10. ప్రాణు లనుభవించు కష్టములను చూసినమీదటగాని వివేకోదయము కాదు. అప్పుడుగాని, సద్గురువు నాశ్రయించుట జరుగదు. సద్గురు కటాక్షమునగాని, నీ స్వరూప స్వభావము లవగతముకావు. ఆ పైన గాని, నీ దివ్యవైభవమునకు సంబంధించిన గాథల నాకర్ణించుటయు, నీ లీలా విలాసమును చింతించుటయు, నీమాహాత్మ్యమును స్తుతించుటయు సంభవింపదు. వాని మూలమున లభించిన దృఢభక్తివలనగాని, మాయ నధిగమించుట సాధ్యము కాదు. ఆ మాయను జయించినగాని, పరమానందము సిద్ధింపదు. నా విషయమున, ఆ పరమానందానుభవమునకు, నాదైన రోగ నిర్మూలనము నాంది కావలయును నాయనా !

92. కర్మమిశ్ర భక్తిస్వరూపం

1. కర్మఫలాపేక్ష లేకుండ, సర్వకర్మల నాచరింపవలసినదని, వేదములు ఆదేశించుచున్నవి. అది గ్రహించుటవలననే, నేను, నే చేయు అన్ని పనులను, నీకే అంకిత మొనర్చి, నైష్కర్మ్యసిద్ధిని(1) పొందగోరు చున్నాను. వేదములు నిషేధించిన యే కర్మనుగాని, నేను, మనో వా క్కాయ ములద్వారా సలుపకుండునట్లు చూడవలసినది ప్రభూ ! అనివార్య పరిస్థితు లలో, అట్టి దేదైనను నేను చేయుట సంభవించిన, దానినికూడ, నేను, పరం జ్యోతివైన నీకే అర్పించుకొనుచున్నాను.

2. తాంత్రికమైన కర్మమార్గము ననుసరించినచో, నేను, మున్ముం దుగ, నా యిష్టదైవమును నిర్ణయించుకొందును. అది సాత్త్వికమైనదియు, మనోహరమైనదియుగ నుండునట్లు చూచుకొందును. ఆపైన, దానిని, శిల యందో, మృత్తికయందో లోహమునందో, దారువునందో, లేదా హృదయ మునందో, యేదేనొక ప్రత్యేక స్థలమున ప్రతిష్ఠించుకుని, దానిని, నిత్యము, యథాశక్తిగ, సుమములతోను సుగంధ ద్రవ్యములతోను నైవేద్యముతోను సభక్తికముగ అర్చించుకొందును; తద్వారా, నీ అనుగ్రహమునందుటకు ప్రయత్నింతును.

3. నీ దివ్యనామమును జపించుటకును, నీ లీలాభివర్ణనల నాకర్ణిం చుటకును, స్త్రీ శూద్రులకు తగు అవకాశము లభింపకపోవచ్చును. నిజముగ, వారి స్థితి శోచనీయ మైనదే. కాని, అగ్రవర్ణమున బుట్టి, నిన్ను అర్చించు కొనుటకువలయు సర్వవిధావకాశములు ఉండికూడ, నీ శ్రీవిగ్రహమును కన్నెత్తిఅయినను చూడని అహంభావ స్వరూపులు, విషయలాలసులు, కొందరున్నారు. పొట్టపోసికొనుటకు, పేరుప్రతిష్ఠలకొఱకు మాత్రమే, వారు, యజ్ఞయాగాదుల నొనర్చుచున్నారు. శ్రుతులు స్మృతులు శాస్త్రములు నిన్ను

గురించి యెంతగ చెప్పినను, అవి, వారి చెవిని బడుటలేదు. వారి జన్మాహంకారమును, వారి విద్యాగర్వము, అధికతమము చేయుచున్నది. వారు, భ్రష్టులైపోవుచున్నారు. నా కట్టి దుర్గతి పట్టకుండ చూడుము నాయనా !

4. 'ఈ పాపాత్ముడు, తన దుశ్చర్యలను మఱుగు పరచుకొను నిమిత్తము, భగవన్నామమును జపించుచున్నాడు' అని, 'ఇతని కర్మ సిద్ధాంతముముందు, ధర్మప్రబోధముముందు, నా ప్రపంచజ్ఞానము పనికి రాకుండపోవుచున్నది' అని, 'మాకు, అగస్త్యభ్రాత ఒక డున్నాడు. ఆయనకు కూడు గుడ్డలతో పనిలేదు. ఆయనకు, అన్నిటికిని గోపాలుడే. అన్నిటికిని గోవిందుడే. ఆ విధముగ, ఆయన, యెందుకును పనికి రాకుండ పాడైపోయినాడు', అని, జ్ఞానులను ఆక్షేపించువారు, అవహేళన మొనర్చువారు, యెందరో ఉన్నారు. వారివలె నేనును, అట్టినైచ్యమునకు పాల్పడకుండ చూడుము ప్రభూ !

5. ఆజన్మబ్రహ్మచారియు, శ్వేతమూర్తియు అయిన మహర్షిగా నిన్ను భావించుకుని, కొన్ని కఠోరనియమములతో తపశ్చర్యకు పూనుకుని, కృతయుగమునందలివారు తరింతురు.

అరుణ వర్ణముగలవాడును, ఒకచేత స్రుక్కును (ఘృతపాత్రను) వేఱొకచేత స్రువమును (హోమగుండమున నేయి వేయు గరిటెను) ధరించిన వాడును అయిన యజ్ఞ పురుషునిగా నిన్ను ఉపాసించుకుని, త్రేతాయుగమునందలివారు తరింతురు.

శ్యామలాంగునిగ, శంఖ చక్రా ద్యాయుధములు ధరించినవానిగ నిన్ను భావించుకుని, తాంత్రిక కర్మయోగ సాధనలద్వారా, ద్వాపరయుగమునందలివారు తరింతురు.

నీలమేఘచ్ఛాయతో శోభించు నిన్ను, నీ దివ్యనామ జప సంకీర్తనల ద్వారా ప్రసన్నుని చేసుకుని, ఈ కలియుగమునందలివారు తరింతురు.

6. నామ జపము, నామ సంకీర్తనము, మున్నగు సులభమార్గముల ద్వారా, సునాయాసముగ నీ అనుగ్రహమును లభింపజేయు యీ కలియుగము, యుగము లన్నిటియందును పరమోత్కృష్టమైనది. భక్త వరప్రదాతా! ఈ కారణముననే కదా, కృత త్రేతాది యుగముల జనించినవారుకూడ తిరిగి కలియుగమున జన్మించుట కుత్సహింతురని చెప్పబడుచున్నది.

కృష్ణా! అదృష్టవశమున యీ యుగమున పుట్టిన మమ్ము, విష తుల్యమైన విషయభోగముల ఆస చూపి మోసపుచ్చకుము నాయనా!

7. ఈ కలియుగమున, అక్కడక్కడ, ప్రత్యేకించి ద్రావిడ దేశమున, కావేరి, తామ్రపర్ణి, ఘృతమాల, ప్రతీచి (భరత) నదీతీరముల, పలువురు భక్తు లుద్భవింతురని చెప్పబడినది. నా అదృష్టవశమున, నే నీ భరతనదీప్రాంతమున జన్మించుటయు, నాలో భక్తిబీజము మొలకెత్తుటయు జరిగినది. నా హృదయము నీకు తెలియనిది కాదు. అయినను, నాలోని భక్తి బీజమును పెంచి పోషించి ఫలించునట్లు చేయవలసినదని, యే విధమైన మోహపాశములకును నేను కట్టువడకుండ చూడవలసినదని, నేను నిన్ను పదేపదే ప్రార్థించుకొనుచున్నాను తండ్రీ!

8. నిర్దయాత్ముడై, ధర్మమును హింసించుచున్న కలిని సంహరించుటకు, పరీక్షిన్మహారాజు కత్తిదూసినాడు. కాని, ధర్మసారము తెలిసినవాడు కావున, ఆ కలిపురుషునిలోని మంచిని గ్రహించి, అతనిని విడిచిపుచ్చినాడు. నిన్ను స్మరించుకొనుటద్వారా, సేవించుకొనుటద్వారా, శీఘ్రఫలమును పొందుటనునది, ఈ కలికాలమునమాత్రమే సాధ్యము. కలియుగమున, పాపకర్మాచరణమునకేకాని, పాపచింతకు కఠినశిక్ష లేదు. వాటికితోడు, అతనికి, నీ భక్తులనిన అమిత భయము. అది కారణముగనే, అతడు, ప్రాణులలో భక్తి పొటమరించుటకుముందే, వారికి, యేదేనొక రోగము నంటగట్టుచుండును. దానికిమాత్రము అతనిని శిక్షించితీరవలసినదే ప్రభూ!

9. గంగాస్నానము, భగవద్గీతా పారాయణము, గాయత్రీజపము, తులసిపూజ, గోపీ చందన ధారణము, సాలగ్రామాభిషేకము, ఏకాదశీ ఉపవాసము, నీ దివ్యనామజపము అనునవి కలిదోషమును నివారింపగల వనియు, అనాయాసముగ, అనతికాలమున మోక్షప్రాప్తిని కలిగింపగల వనియు, మహర్షులు ఉద్ఘాటించినారు. నేను వాటిని పాటించునట్లు చేయ వలసినది ప్రభూ !

10. స్వార్థ చింతతోకూడిన సర్వకర్మలను పరిత్యజించి, హృదయ పూర్వకముగ నిన్నే ఆశ్రయించినవారు, దేవ ఋషి పితృ ఋణములనుండి[2] విముక్తులవుచున్నారు. ఆ పైన, వారు, యే నిషిద్ధకర్మనైనను ఆచరింప వలసివచ్చినయెడల, హృదయస్థితుడవైయుండు నీవు, అట్టిదానిని వెంటనే రూపుమాపుచుందువు.

గురువాయుపురాధిపా ! కృష్ణా ! నా పాపఫలముగ, నేనీ నాడనుభ వించుచున్న తాపములన్నిటిని తొలగింపుము నాయనా ! నీ పట్ల నాకు గల భక్తిని దృఢతర మొనర్పుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) నైష్కర్మ్య సిద్ధి : నిస్వార్థముగ, ఫలాపేక్ష రహితముగ పరమేశ్వరార్పణ బుద్ధితో ఏ పని చేసినను అది బంధకారణము కాదు. ఆ విధముగ కర్మ లాచరించువారు, ఏ కర్మయు చేయనివారే అగుచున్నారు. అదే నైష్కర్మ్యసిద్ధి.

(2) ఋణములు : ప్రతి జీవియు మూడు రకముల ఋణములు తీర్చుకొనవలసి యున్నది. అవే దేవ ఋషి పితృ ఋణములు. యజ్ఞయాగాదు లొనర్చుటద్వారా దేవఋణమును, వేదాధ్యయనాదుల మూలమున ఋషుల ఋణమును, సత్సంతానమును పొందుటవలన పితౄణ మును తీరిపోవుచున్నవి.

93. బహుగురులాభం

1. ప్రభూ ! నీ కరుణయున్నచో, నేను, నా మనసును నీ యందే లగ్నము చేసుకుని, నా వా రనుకొను వారిపట్ల నాకుగల మమకారము నంతను వదలుకొనగలను. ఈ దృశ్య ప్రపంచమంతయు మాయా మయమైనదేనని గ్రహించి, దీనితోగల సర్వవిధ సంబంధములను త్యజించి, యథేచ్ఛగా చరింపగలను.

భ్రమ మూలమున నానాత్వభావన కలుగుచున్నది. దానినుండి, మంచి చెడ్డలకు, సంబంధించిన విచక్షణాశక్తి ఉత్పన్నమగుచున్నది. అది ఉన్నవారికే విధి నిషేధముల బెడద. అది లేనివారిని, నీ యందే మనసు కల వారిని, అవి యెట్లు బంధింపగలవు ప్రభూ !

2. క్షుత్పిపాసలను తీర్చుకొనుటయే లక్ష్యముగాకల ప్రాణులు, ఈ ప్రపంచమున, అనేక మున్నవి. కాని వాని అన్నిటిలోను, విజ్ఞానము కలదగుటవలన, నరజన్మ శ్రేష్ఠమైనదిగ భావింపబడుచున్నది.

ఆ నరజన్మ అతి దుర్లభమైనది. నరులకు, 'మనసు' అనున దొకటి కలదు. అది, వారిని, పశువులుగ మార్చగలదు; పరమాత్మునితో చేర్చ గలదు. దానిని, నీ యందు నిలుపుకొనినవారు నిలింపులవుచున్నారు.(1) అట్లు చేయలేనివారు అసురులవుచున్నారు.(2)

3. ప్రభూ ! నీవు అనుగ్రహించినచో, ఈ ప్రపంచమునగల సర్వ భూతములును నాకు సద్గురువులు కాగలవు.

ఎంతమంది పాదములక్రింద నలిగిపోవుచున్నను, భూమి చలింపదు. దానినుండి, నేను, సహనమును నేర్చుకొనవచ్చును.

గాలి, స్పృశింపని పదార్థము లేదు. అయినను, ఆ వస్తు గుణము వలన నది మలినము కాదు. దానినుండి, నేను, సర్వవిషయ సంపర్కము కలిగియుండియు, మమత్వము లేకుండ జీవించుట నలవరచుకొనవచ్చును.

ఆకాశము సర్వత్రా వ్యాపించియున్నది. అది గ్రహించిన నేను, నీ సర్వవ్యాపకత్వము నర్థము చేసుకొనవచ్చును. అది, ప్రాణుల లోపలను, బయటనుకూడ ఉన్నది. అయినను, దేనికిని కట్టుబడి లేదు. అటులనే, నేనును, నిర్లిప్తుడనుగ ఉండవలెనని గ్రహింపవచ్చును.

4. జలము మధురముగ నుండును. నిర్మలముగ నుండును. ఇతర వస్తువులను పవిత్రీకరించుచుండును. నేనును అట్లుండదలతును నాయనా !

అగ్ని, సర్వభక్షకుడు. అయినను, తను గ్రహించు వస్తువులలోని దోషము నతడు స్వీకరింపడు. నేనును అటులనే జీవింపగోరుదును ప్రభూ !

ఆ అగ్ని లేని ప్రాణిలేదు. అది గ్రహించిన నేను, అన్ని ప్రాణుల యందును నన్ను చూసుకొన నభిలషింతును.

వృద్ధి క్షయము లనునవి చంద్రుని కళలకే కాని చంద్రునకు కానట్లు, అవి దేహమునకే కాని, దేహికి కావను జ్ఞానమును నేను పొందదలతును.

వివిధ ఘటములలో, భిన్నభిన్నముగ గోచరించు సూర్యునివలె, వివిధ మూర్తులలో, భిన్నభిన్న గుణములతో భాసించునది నీవే యని నేను గ్రహింపవచ్చును.

5. తన బిడ్డలమీది అనురాగము కారణముగ, ఒక కపోతము, తనుత్యాగము చేయవలసివచ్చినది. అది గ్రహించిన నేను, అమితానురాగ మెంత హానికరమో తెలిసికొనవచ్చును.

అనాయాసముగ లభించిన దానితో సంతుష్టిచెందు కొండచిలువను చూసి, ఆకటి బాధ నోర్చుకొనుటను నేను నేర్చుకొనవచ్చును.

అటులనే, సముద్రమునుండి గాంభీర్యము నలవరచుకొనవచ్చును. భోగలాలసత్వమునందలి ప్రమాదమును, శలభమునుండి గ్రహింప వచ్చును.

పలురకముల పుష్పములందలి మధువును గ్రోలుచుండు మధుపము నుండి, సర్వశాస్త్ర సారమైన నారాయణ స్మరణాసక్తిని నేను పెంపొందించు కొనవచ్చును. కాని, అది, దురాసకు పాల్పడి దుర్మరణముపా లవుచున్నది. అదియు నాకొక గుణపాఠమే కదా !

6. ఆడు ఏనుగు మూలమున, మగ ఏనుగు బంధింపబడుట నెఱిగిన నేను, స్త్రీలపట్ల వ్యామోహమును తొలగించుకొనవచ్చును.

తేనెటీగలు కూడబెట్టుకొనిన మధువు, ఇతరు లెవరికో భోగ్యమగు చున్నది. అది గ్రహించిన నేను, ధనమును కూడబెట్టుకొనుట వ్యర్థ ప్రయాస యని తెల్పుకొనవచ్చును.

వేటగాని వేణునాదమునకు మురిసిపోయి, లేడి, మృత్యుముఖమున ప్రవేశించుచున్నది. అది గ్రహించిన నేను, చేటు కలిగించు పాటలకు చెవి యొగ్గరాదని తెలుసుకొనవచ్చును.

ఆమిష వాంఛతో, చేపలు, గాలమున చిక్కువడి మరణించు చున్నవి. నేను భోజనప్రియుడనైన, నా గతియు నంతయే కదా !

విషయవాంఛా విరహితత్వమునగాని సుఖనిద్ర లభింపదను విషయ మును, పింగళయను వేశ్య గాథ నేర్పుచున్నది.

ఒకరు దాచుకొనదలచిన వస్తువును, వేఱొకరు దోచుకొందురను విషయమును, కురుర పక్షులనుండి గ్రహించి, నా కొఱకు నేనే పదార్థమును దాచుకొనరాదను బుద్ధి నలవరచుకొనవచ్చును.

7. మానావమానముల ప్రసక్తిలేనిచో, మధుర జీవనము లభింపగల దను విషయమును, పసిపాపలు నేర్పుచున్నారు.

ఏకాంతవాసమున లక్ష్యము సిద్ధించునను యథార్థమును, ఒంటిగాజుతోఉన్న యువిద చర్య బోధించుచున్నది.

పరమాత్మునిమీద మనసు నిలిచినవారికి, ప్రపంచము కనిపించదను సత్యమును, తన పనిలో తాను నిమగ్నుడైఉండి, ఊరేగుచున్న ఉర్వీపతిని కూడ గమనించని ఒక కుమ్మరివాని దీక్ష గోచరింపజేయుచున్నది.

'నాది' యనునది లేకుండ జీవింపవచ్చునను విషయమును, బొరియలలో నుండు ఉరగము లుద్బోధించుచున్నవి.

8. నీవు సృజించిన యీ బ్రహ్మాండమునంతను, తిరిగి నీవు నీయందే లీనము చేసుకొనెదవను యథార్థమును, సాలీడు ద్యోతపరచుచున్నది.

నీ స్మరణ మూలమున, నేను నీవై పోదునను తత్త్వమును, భ్రమరముపదేశించుచున్నది.

అన్నిటినిమించి, మన్నున బుట్టి మన్నునగలియు ఈ శరీరమును గురించి కొంచెము తీవ్రముగ ఆలోచించినయెడల, ఇదే గురోర్గురువు కాగలదు. వివేక వైరాగ్యములను ప్రసాదింపగలదు. ప్రత్యేకించి, రోగగ్రస్థమైఉన్న నా ఈ శరీరము అట్టిదే కదా ప్రభూ !

9. కృష్ణా ! దేహమే నేననుకొనుచున్న నా యీ భ్రమను తొలగింపుము నాయనా ! ఈ భ్రమవలననేకదా, దారాపుత్రాదులపట్ల, ధనధాన్యాదులపట్ల, గృహారామాదులపట్ల, ప్రాణులు మమకారమును పెంచుకొనుటయు, నిన్ను మఱచిపోవుటయు జరుగుచున్నది !

ప్రాణ మున్నంతవరకు, యీ విషయేంద్రియములు, తమ యిచ్చవచ్చినట్లు మానవుని యీడ్చుకుపోవుచుండును. నీ చరణారవిందముల దిక్కుగా తీసుకుపోవునవి, వీనియం దొక్కటియునులేదు. చివరకు, యీ

శరీరము, కుక్కలపా లగుటయో, అగ్నికి ఆహుతి యగుటయో మాత్రము తథ్యము.

10. గురువాయుపురాధిపా ! కృష్ణా ! ఈ దేహముపట్ల కల మోహము అనివార్యమైనయెడల, నా రోగము లన్నిటిని నిర్మూలించి, నాకు నీ పట్ల దృఢతర భక్తిని ప్రసాదింపుము నాయనా ! జన్మాంతర సహస్రముల పుణ్యఫలమునగదా యీ మానవజన్మ, అందునను విప్రత్వము, నాకు లభ్యమైనది. ఇది, భోగలాలసత్వమున బూదికాకుండ చూడుము తండ్రీ ! దీనికి, చరితార్థత ననుగ్రహింపుము ప్రభూ !

అర్థము - వివరణ

(1) నిలింపులవుచున్నారు : దైవీగుణ సంపత్తి కలవారవుచున్నారు; దేవతలగుచున్నారు.

(2) అసురులవుచున్నారు : ఆసురీ సంపత్తి కలవారవుచున్నారు; రాక్షసులై ప్రవర్తించుచున్నారు.

94. తత్త్వ జ్ఞానోదయం

1. నిష్కామ కర్మాచరణ[1] మూలమున మనసును పవిత్రీకరించు కొనినవారు, సద్గురూపదేశము ద్వారా, నీవు పరిశుద్ధుడవని, దేహమునకును దేహేంద్రియములకును భిన్నుడవని, సర్వవ్యాపి వని, పరమాత్ముడ వని గ్రహింపగలుగుచున్నారు. నీవు, 'ఇంతటివాడవ'ని, 'అంతటివాడవ'ని భావించుట, నీవు ధరించు నానావిధ శరీరములకు సంబంధించినమాట. అది, మండెడు కట్టె పరిమాణమునుబట్టి, మంటయొక్క కాంతిలోను, విస్తృతిలోను సంభవించు హెచ్చు తగ్గుల వంటిది.

2. రెండు కట్టెల రాపిడివలన (అరణి ద్రచ్చుటవలన) అగ్ని ఉదయించి నట్లు, గురు శిష్యుల చర్చలవలన సమ్యక్జ్ఞానరూపమైన[2] అగ్ని ప్రజ్వరిల్లును. అది, పూర్వకర్మవాసనలద్వారా సంక్రమించిన శరీరాది ప్రపంచ విషయిక రూపముననుండు అజ్ఞానము నంతను దహించివేయును. అజ్ఞాన మావిధముగ దగ్ధమైన పిమ్మట, ఇంధనములు భస్మమైనంతనే, అగ్ని, తనంత తాను చల్లారినట్లు, ఆత్మ, శాంతినంది, నీయందే లయమై పోవును. అదియే తన్మయావస్థ; సాధకుడు, సచ్చిదానంద స్వరూపుడగుట.

3. సంపూర్ణబాధానివృత్తికి, ఈ విధముగ నిన్ను ప్రసన్నుని చేసుకొనుట వినా, మరొక మార్గము లేదు. ఔషధసేవనము, నిగూఢసాధనలు, వేదచోదిత కర్మానుష్ఠానము, యోగాభ్యాసము మున్నగున వేవియు ఈ భవరోగనివారణకు ఉపకరింపవు; నిర్వాణము ననుగ్రహింపవు.

వైదికకర్మలు కష్ట సాధ్యములు. అవి ఫలించినను, ఆ కర్తకు గర్వకారణములగును. అతని అహంభావమును అతిశయింపజేయును. అది కారణముగనే, అతడు, నిన్ను మరచిపోవును. పడరాని పాట్లు పడును. తుదకు పతనము పొందును.

4. మృత్యుభయముగాని, పతనభీతిగాని లేనిది, నీ దివ్యధామమైన వైకుంఠమునందు మాత్రమే. సత్యలోకమున, రెండు పరార్ధముల[3] అనంతరము, చతుర్ముఖునకుకూడ స్థానములేదు. ఆ పరిస్థితిలో, ఎన్నియో దుష్కర్మలనాచరించి, పాపమును మూటకట్టుకుని, నరకయాతనల ననుభవించుచున్న మర్త్యుల గుఱించి చెప్పవలసినదేమున్నది ? అది కారణముగనే, దీనజనావనుడవైన నిన్ను, దయాసాగరుడవైన నిన్ను, ప్రపంచ సంబంధమైన సర్వవిధబంధములనుండి నన్ను విముక్తుని చేయవలసినదిగ వేడికొనుచున్నాను ప్రభూ !

5. కృష్ణా ! యథార్థమునకు నీవే నేనైనపుడు, యీ బంధమోక్షము లెక్కడివి ? నీ మాయాశక్తివలన కలుగునది బంధము; నీ జ్ఞానశక్తి మూలమున లభించునది మోక్షము. అందొకటి స్వప్నావస్థవంటిది; రెండవది జాగ్రదవస్థవంటిది. బద్ధజీవికిని ముక్తజీవికిని ఒకే ఒక భేదమున్నది. వారిరువురును శరీరమను వృక్షము నాశ్రయించియున్న రెండు పక్షులవంటివారు. ప్రాపంచిక సుఖములనబడు ఫలముల ననుభవించునది బద్ధజీవి; వాటివంక కన్నెత్తికూడ చూడనిది, నిర్వేదముతో ఉండునది, ముక్తజీవి.

6. జీవన్ముక్తి అనునది 'ఇట్లుండును' 'అట్లుండును' అని వర్ణించుట వలన ప్రయోజన మేమున్నది ? మలిన మనస్కులకది కలలోకూడ కనిపించదు. మనస్సును సులభముగ పరిశుద్ధ మొనర్చునది, నీ మీది భక్తి మాత్రమే. అది కారణముగనే, నీ పట్ల దృఢమైన భక్తిని ప్రసాదింపుమని నిన్ను ప్రార్థించుకొనుచున్నాను. దానిని నీవు ప్రసాదించినచో, దాని ప్రభావమున, నేచేయు సర్వకర్మలును నీకు అంకితమైపోవును. గురూపదేశము ద్వారా లభించిన బ్రహ్మజ్ఞానముతో, అనతికాలముననే, నేను నీవైపోగలుగుదును. (సారూప్యముక్తిని పొందగలుగుదును.)

7. కొందరు, కష్టపడి, శబ్దబ్రహ్మను సాధింతురు. అయినను, పరబ్రహ్మవైన నిన్ను నిర్లక్ష్యము చేయుదురు. పాపము, అట్టివారి ప్రయాస

మంతయు వ్యర్థమేకదా ! వారి జీవితము నిష్ఫలమైనట్లే కదా ! నా మటుకు నేను, పాపపటలిని పటాపంచలు చేయు నట్టివియు, భువనములను మోహింపజేయు నట్టివియు, సచ్చిదానందస్వరూపుడవైన నీ దివ్యలీలావతార ములను వర్ణించునట్టివియు కాని మాటలను ఉచ్చరించుటకుకూడ యిచ్చ గింపను ప్రభూ !

8. కృష్ణా ! నీ స్వరూప స్వభావ మహిమాదులను గురించి, నా కేమియు తెలియదు. అయినను, నేను, నిన్నే ఆశ్రయించినాను. హృదయ పూర్వకముగ సేవించుకొనుచున్నాను. ఈ బొందెలో ప్రాణమున్నంత వరకు, వివిధ దివ్యక్షేత్రములను దర్శించుకొనుచు, నీ భక్తులతో కలిసి మెలసి తిరుగుచు, నిన్ను అర్చించుకొనుచు, స్తుతించుకొనుచు, నీకు ప్రణ మిల్లుచు, నీ గుణాభివర్ణన మొనర్చుచు, నీ కీర్తిని గానము చేయుచు, సదా నీయందే జీవించు భాగ్యమును నాకు ప్రసాదింపుము నాయనా !

9. స్వామీ ! నాకు, యెప్పుడు యేది లభించిన నది నేను నీకే సమ ర్పించుకొనుచుందును. నేను నీ దాసుడను ప్రభూ ! ఏ విధమైన భేషజమును లేకుండ, నీ మందిరములను ప్రతినిత్యము శుభ్రపరచుచుండవలెనను కోరిక నా యందు తీవ్రముగ నున్నది. నేను, సూర్యునిలోను, అగ్నియందును, విప్రులయందును, తుదకు నా యందునుకూడ, చతుర్భుజుడవైన నిన్ను దర్శించుకుని అర్చించుకొనుచుందును. ధారావాహికమైన ప్రేమరూపమున నుండు నా భక్తి, నిరంతరము నీ దిక్కుగా ప్రవహించుచుండునట్లు అనుగ్ర హింపుము నాయనా !

10. దాన ధర్మాదులవలనగాని, వ్రత నియమాదులవలనగాని, యజ్ఞ యాగాదులవలనగాని, సాంఖ్యయోగ సాధనలవలనగాని, తపశ్చర్య వలనగాని పొందరాని పరమానందరూపమగు సారూప్యముక్తిని, నీ తోటి సంపర్కము వలననే, భాగ్యశాలినులైన ఆ గోపికలు పొందినారు. నీకు, అంతులేనంతమంది భక్తులున్నను, ఆ గోపికల భక్తినే, నీవు, శ్రేష్ఠముగ పరిగణించుచుందువు.

గురువాయుపురీశా ! కృష్ణా ! పూర్వపుణ్యవశమున, నా యందు, భక్తి మొలకెత్తినది. దానిని, పెంచి పోషించి, నన్ను ను ఆ గోపికలతో చేర్చవలసినవాడవు నీవు. నా వేదనల నన్నిటిని నిర్మూలించి, నన్ను, నీ దాసుని, కృతార్థుని చేయవలసినదికూడ నీవే నాయనా !

అర్థము - వివరణ

(1) నిష్కామ కర్మాచరణము : ప్రతిఫలాపేక్ష లేకుండ యే పనినైన చేయుట.

(2) సమ్యక్ జ్ఞానము : సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మునకు సంబంధించిన యథార్థ జ్ఞానము.

(3) రెండు పరార్ధములు : బ్రహ్మదేవుని ఆయుః ప్రమాణము.

95. కైవల్యసిద్ధి

1. తండ్రీ! సృష్టి ప్రారంభమున, నీవు, సర్వజీవ మయుడైన చతుర్ముఖుడవుగ రూపొందుచున్నావు. అనంతరము, మాయా కల్పితమైన సత్త్వ రజ స్తమోగుణముల సంపర్కమున, వివిధ జీవుల రూపము ధరించు చున్నావు. అటుపిమ్మట, ఆ జీవులలో, సత్త్వగుణము వృద్ధియై ప్రాధాన్యత వహించినపుడు, భక్తి ప్రాదుర్భవించుటయు, రజస్తమములు నిర్మూలింప బడుటయు జరుగుచున్నది. కాలక్రమమున, ఆ జీవులు, సత్త్వమునుగూడ అధిగమించుచున్నవి. అప్పుడు, 'గుణాతీతుడును పరిశుద్ధుడును పరమాత్ముడును అయిన ఆ పరబ్రహ్మకు నేను భిన్నుడను కాను' అను జ్ఞానమును అవి సముపార్జించుకొనుట సంభవించుచున్నది.

2. అప్పుడప్పుడు, సత్వగుణాధిక్యతవలన, ప్రాపంచిక భోగములు తుచ్ఛమైనవనియు, దోషభూయిష్టమైనవనియు తోచుచుండును. కాని, ఆ వెంటనే, రజస్తమోగుణముల ప్రాబల్యము తీవ్రమై, మానవుని విషయలాలసునిగ మార్చివేయుచుండును. ప్రకృతి జన్యమైన త్రిగుణములును, మనః ప్రవృత్తియు, వస్త్రమున పడుగుపేకలవలె పెనవేసుకుని ఉండుటయే దానికి కారణము. ఆ గుణదోషములను ప్రతిఘటింపవలెనన్న, త్రిగుణాతీతుడవును అవస్థాత్రయము[1] నధిగమించినవాడవును అగు నిన్ను సర్వార్పణ బుద్ధితో ఆశ్రయించి తీరవలెను. హంసగీతలో నీవు తెలిపిన దదేకదా ప్రభూ!

3. కర్మమార్గావలంబులకు, వారివారి అభిరుచుల కనుగుణముగ, మహర్షులు సూచించిన సుఖప్రాప్తి మార్గము లనేకము లున్నవి. అయినను, వారు పొందు భోగములన్నియు క్షణికమైనవి; క్షుద్రమైనవి. శాశ్వత సుఖ ప్రాప్తికి, భక్తిని మించినదిలేదని, నీవు, నీ మిత్రునకు, ఉద్ధవునకు, ప్రతిజ్ఞా

పూర్వకముగ విశదపరచినావు కదా! భగవద్భక్తి మూలమున కలుగు ఆనందమును, విషయాసక్తులగువారు ఊహించుకొనగలరా ప్రభూ!

4. జలచరములకు, విశ్వమంతయు జలమయముగనే తోచునట్లు, భగవద్భక్తులకు, సర్వ ప్రపంచమును, ఆనందమయముగనే కన్పించును. వారు, తృష్ణారహితులై ఉందురు. విశ్వమం దంతటను యథేచ్ఛగ విహరించుచుందురు. స్వర్గభోగములనుగాని, సత్యలోక నివాస సౌఖ్యమునుగాని, కనీసము అష్టసిద్ధులనుగాని(2) వారు వాంఛింపరు. తుదకు, ముక్తి, తనకు తానై వరించివచ్చినను వారు లక్ష్యము చేయరు.

5. భక్తి యోగాభ్యాసమున కుపక్రమించిన సాధకుడు, తొలి దినములలో, ఇంద్రియ నిగ్రహశక్తి చాలక, విషయ భోగములకు వశుడైనను, కాలక్రమమున, అతనిలోని భక్తి అతనిని విజితేంద్రియుని చేసితీరును. కార్చిచ్చులోపడిన కాష్టములన్నియు దహించుకుపోవునట్లు, దృఢభక్తి, సాధకుని పాపసంఘాతమునంతను భస్మీపటల మొనర్చును. ఆ సమయమున, నతని విషయవాసనాబలము వీగిపోకుండుట అసంభవము కదా!

6. భగవత్స్మరణమాత్రముననే హృదయము ద్రవింపవలెను. ఒడలు పుల్కరింపవలెను. నయనము లానంద బాష్పములను రాల్పవలెను. అంతవరకును మనసు పరిశుద్ధమైనట్లు కాదు.

భక్తిలేని పాండిత్యము వ్యర్థము; తపము నిష్ఫలము. సూక్ష్మాతిసూక్ష్మమైన భగవత్తత్వము, దీర్ఘ వాదోపవాదముల మూలమున బయల్పడునది కాదు. నీ దివ్యగాథలను నిరంతరము శ్రవణము చేయుచుండుటవలన, నీ దివ్యనామములను అనవరతము జపించుచుండుటవలన మాత్రమే అది గోచరము కాగలదు. కన్నులకు కాటుక యెటువంటిదో, ఆత్మకు అవి అట్టివి.

7. నీ ధ్యానమున కుపక్రమించునపుడు, ఉత్కంధరుడనై (మెడను అటునిటు వంచని వాడనై) సుఖాసనమున కూర్చొందును. నా దృష్టిని, నాసికాగ్రమున, లేదా, భ్రూమధ్యమున నిలుపుకొందును. పూరక రేచక కుంభ

కాదులద్వారా(3) శ్వాసను పరిశుద్ధి మొనర్చుకొందును. అనంతరము, అధో ముఖముగ ఉండు హృదయపద్మము, ఊర్ధ్వ ముఖముగను, వికసితముగను ఉన్నట్లు భావించుకుని, దానిమీద, మొదట సూర్యుని, ఆ పైన చంద్రుని, అనంతరము అగ్నిని మానసికముగ ప్రతిష్టించుకుని, ఆ అగ్ని మధ్యమున నున్న నీ శ్యామసుందర విగ్రహమును, కుసుమకోమల మూర్తిని, నీటి తుంపురులతో కప్పబడి ఉన్నదానిని భావించుకొందును.

8. ఉంగరములు తిరుగుచున్న నీలాలక శ్రేణితోను, మనోహరముగ నున్న మకరకుండల ద్యుతితోను, మృదుమధుర మందహాసముతోను, కమనీయమైన హారములతోను, వనమాలతోను, కౌస్తుభమణితోను, శోభించుచున్న కంఠముతోను, శ్రీవత్సముతో భాసించుచున్న వక్షస్థలముతోను, దీర్ఘ బాహువులతోను, మృదూదరముతోను, కాంచనచ్ఛాయగల చేలముతోను, మృదులము సుందరము అయిన తొడలతోను, పద్మములవంటి పాదములతోను దేదీప్యమానముగ ప్రకాశించుచున్న నీ శ్రీవిగ్రహమును నేను ధ్యానించుకొందును ప్రభూ !

9. అనంతరము, ప్రత్యంగమునందును మనసును ప్రత్యేకించి నిలుపుకుని, ఆ పైన, సమగ్రమూర్తిని సంభావించుకుని, తుదకు, మందహాస భాసురమైన నీ సుందర వదనారవిందమునందు నా దృష్టిని యేకాగ్ర మొనర్చుకొందును. అటుపిమ్మట, అద్వితీయమును, పరమ సుఖదమును, చిదానందాత్మకమును అగు నీ మూర్తియందే మనసును లీనము చేసుకుని, అన్యవిషయ చింత లేనివాడనై పోదును. ఆ విధముగ జరుగు నిరంతర సాధనద్వారా యోగారూఢ స్థితి(4) ననుభవింతును.

10. అట్లు ధ్యానయోగము ముగియునప్పటికి, అణిమాద్యష్ట సిద్ధులును, దూరదర్శనము దూర శ్రవణము మున్నగు శక్తులును పరుగు పరుగునవచ్చి నన్ను చేరగలవు. అయినను, అవి క్షుద్రమైనవని, చిదానంద రసప్రపూర్ణుడవగు నిన్ను చేరదలచినవారిని వెనుకకు లాగుచుండుటయే వాటిపని అని నాకు తెలియును. అది కారణముగనే, నేను, వాని నాదరింపను ప్రభూ !

గురువాయుపురాధిపా ! కృష్ణా ! అట్టి యోగసాధన లొనర్చుటకై నను నా యీ రోగబాధను నివారింపుము నాయనా !

అర్థము - వివరణ

(1) అవస్థాత్రయము : జాగ్రత్ స్వప్న సుషుప్తులు.

(2) అష్టసిద్ధులు : (దశ. 36 – వివ. 1. చూడుము.)

(3) పూరక రేచక కుంభకములు : ప్రాణవాయువు ఇడ పింగళ అను మార్గముల ద్వారా ప్రసరించుచుండును. ఆ మార్గములు సామాన్యముగ కఫాది మలములతో నిండియుండును. ప్రాణవాయువును ఆ మార్గములయందు నింపుకొనుట పూరకము. విడుచుట రేచకము. నిలుపుకొనుట కుంభకము. ఈ విధమైన సాధనవలన ఆ మార్గముననుండు అవరోధము లన్నియు తొలగిపోవుట సంభవించును.

ఇట్లు చేయు సాధననే ప్రాణాయామ మందురు. దీనికి కొన్ని నియమములున్నవి. వాటిని గురుముఖతః తెలుసుకుని అనుసరింపవలెను.

(4) యోగారూఢ స్థితి : ప్రాణాయామముద్వారా శరీరమును పవిత్రీకరించుకుని, భక్తిసాధన లొనర్చుచు, ఏకాగ్రత నలవరచుకుని, మనసును చిదానంద స్వరూపుడగు నిర్గుణ పరబ్రహ్మమునందు నిలుపుకుని తాదాత్మ్యము నందుటయే సమాధిస్థితి నందుట. ఆ స్థితి నందుటకే, యోగులు, సర్వదా ప్రయత్నించుచుందురు.

96. భగవద్ విభూతి

1. విశ్వమూర్తీ ! కృష్ణా ! నీవు మహిమా సమన్వితుడవు. సాక్షాత్తు పరబ్రహ్మవు. అక్షర జాలమున ఆది అక్షరమైన అకారము నీవు. మంత్రము లందు ప్రణవ మనబడు ఓంకారము నీవు, రాజులందు ఆదిరాజైన మనువువు నీవు. బ్రహ్మర్షులందు భృగుడవు నీవు. దేవర్షులందు నారదుడవు నీవు. దానవులందు ప్రహ్లాదుడవు నీవు. పశుగణమునందు సురభివి నీవు. పక్షు లందు గరుడుడవు నీవు. నాగములందు అనంతుడవు నీవు. నదులయందు సురనది అయిన గంగవుకూడ నీవే.

2. బ్రహ్మణ్యులపట్ల భక్తికలవారిలో బలిచక్రవర్తివి నీవు. యజ్ఞము లందు జపయజ్ఞము నీవు. వీరాధివీరులయందు అర్జునుడవు నీవు. భక్తుల యందు ఉద్ధవుడవు నీవు.

అట్లే, బలవంతులలోని బలము, తేజస్వులలోని తేజముకూడ నీవే ప్రభూ !

నీ దివ్య విభూతి అనంతమైనది. సృష్టిలోని శ్రేష్ఠతమమైన అన్నిటి యందును భాసించుచున్నది నీవే. జీవుడవు నీవు. ప్రకృతివి నీవు. ప్రపంచ మున, నీవు కాని దేమున్నది ప్రభూ !

3. వేదచోదిత మార్గమున, వర్ణాశ్రమోచిత విధానమున, సభక్తిక ముగ సర్వకర్మలను నీకే సమర్పించుకొనువారిలో అభినివేశరాహిత్యము మొలకెత్తి అతిశయించును. అది పెరిగి పెరిగి వైరాగ్యముగ పరిణమించును. అట్టివారు, సర్వకర్మ పరిత్యాగ మొనర్చుటయు, పరమహంస స్థితి నందు టయు సంభవించును. ఆ సమయమున, వారు, 'తన ఉద్భవమునకు మూలము లేనివాడయ్యు సర్వమునకు మూలమగువాడును, వివిధ మూర్తు లలో భిన్నభిన్నముగ గోచరించుచుండియు ఒకే ఒకడై యుండువాడును,

సచ్చిదానంద స్వరూపుడును అగు ఆ పరబ్రహ్మమే నేను' అను యథార్థ జ్ఞానముతో విరాజమానులై యుందురు.

4. మోక్షప్రాప్తికి మూడు మార్గము లున్నవి. వానినే, జ్ఞాన, కర్మ, భక్తి మార్గము లందురు.

ఇహ పర సుఖములపట్ల లేశమాత్రమైన ఆసక్తికూడ లేనివారు, జ్ఞాన మార్గమున గమించుటకు అర్హులు.

విషయాసక్తిని వీడనివారు, అయినను, నీ పట్ల అనురాగము కల వారు, కర్మమార్గము ననుసరించుటకు అర్హులు.

విషయ సుఖము పట్ల అనురాగాతిశయముగాని, తీవ్రమైన వైరాగ్యము గాని లేనివారును, అయినను నీ పట్ల మనసుకలవారును, భక్తిమార్గము నవలంబించుటకు అర్హులు.

5. పూర్వపుణ్యము కలవారికి, యీ మర్త్యలోకమునందు, జ్ఞానము భక్తి అనునవి సులభముగ లభింపగలవు. అది కారణముగనే, స్వర్గలోక వాసులును నరకలోకవాసులును యిచట జన్మించుట కుత్సహింతురు.

అట్టి యీ మానవలోకమున, అదృష్టవశమున, మర్త్యదేహమను నావలో ప్రవేశించినాను. నా గురుదే దీని నావికుడు. భవసాగరమును తరించుటకు, యిక కావలసినది, నీ అనుగ్రహమను అనుకూల పవనము మాత్రమే. దానినే నే నర్థించుచున్నాను ప్రభూ !

6. కేవల జ్ఞానలుబ్ధు లైనవారు, వేదాంతమునందును, తర్క మీమాంసలందును విశేషముగ కృషిచేసి, అవ్యక్త పరబ్రహ్మమైన నిన్ను అన్వేషించుచుందురు. అట్టివారు, అనేక జన్మల అనంతరమునగాని లక్ష్య సిద్ధిని పొందలేరు. ఆ పరమలక్ష్యమునకును కర్మయోగమునకును సంబంధమే లేదు.

భగవద్భక్తి అట్టిదికాదు. అది ఆపాత మధురమైనది. శీఘ్రముగ నిన్ను చేర్చునది. కావుననే, ఆ భక్తిని నా యందు సుప్రతిష్ఠిత మొనర్ప వలసినదిగ నిన్ను ప్రార్థించుచున్నాను తండ్రీ!

7. కేవల జ్ఞానాసక్తితో తీవ్ర పరిశ్రమ సలుపువారిని, వ్యాసర్షికూడ నిరసించినారు. బ్రహ్మతత్త్వమును గురించి విని, అచంచల భక్తితో నిన్ను ఆశ్రయించి సేవించినవారికి, ముక్తి కరతలామలకమగుట తథ్యము.

మనస్సు చంచలమైన దగుటవలన, ధ్యాననిష్ఠ కలుగుట అంత సులభము కాకపోవచ్చును. అయినను, నిరంతర సాధన మూలమున, మనసును నిగ్రహించుకొనుట సాధ్యము కాకపోదు. ఆ సాధనయు, మనోహరమైన నీ శ్రీవిగ్రహమును, దానిమీద నీ అనుగ్రహమును, సాధకుని అభీప్సితమును సిద్ధింపజేయకపోవు.

8. త్రిభువనాధిపా! కర్మమార్గము కష్టసాధ్యమని గ్రహించి, నీ దివ్యకథా శ్రవణాదులయందు శ్రద్ధ నలవరచుకొంటిని. అయినను, విషయ వాంఛలు నన్ను వీడుటలేదు. అది కారణముగ. యిక నేను, నా మనసును నీ యందే నిలుపుకొనుటకు ప్రయత్నించుచు, విషయ వాంఛలు విషతుల్యములను జ్ఞానముతో, భక్తిని దృఢతర మొనర్చుకొనుటకు నిశ్చయించుకొంటిని. ఆ విధముగ నీవు నా హృదయము నాక్రమించుకొనినపుడు, అందలి ఐహికేచ్ఛల ఆయువు తీరిపోయినట్లేకదా ప్రభూ!

9. పూర్వమొక బ్రాహ్మణుడు, తన కష్టార్జితమునంతను కోల్పోయి, ప్రజా పీడకు గురిఅయినాడు. ఆ సమయమున, అతనికి జ్ఞానోదయమైనది. అప్పు డతడు, 'నా కష్టములకు కారణము, కాలము కాదు; కర్మము కాదు! దుష్టగ్రహబలము కాదు; దుర్జనులు కారు. నా మనసే దీని కంతటికిని కారణము. అదే, కర్తృత్వ భోక్తృత్వాది గుణములను కల్పించుకుని, వాటి నన్నిటిని ఆత్మకు అంటగట్టుచున్నది' అని గానము చేయుచు, శాంతచిత్తుడైనాడు. అనంతరము, అవధూత(1) స్థితినంది, సారూప్యముక్తిని సముపార్జించుకొనినాడు. నాకును అట్టి చిత్తశాంతిని ప్రసాదింపుము నాయనా!

10. పూర్వము, ఇలాసుతుడైన పురూరవుడు, ఉర్వసిమీది అమిత వ్యామోహమున, చిరకాల మామెతో సుఖోపభోగము లనుభవించినాడు. అనంతర మతనికి ఆమెపట్ల చెప్పరాని విరక్తి కలిగినది. అప్పు డతడు, 'స్త్రీ సుఖము క్షుద్రాతి క్షుద్రమైనది' అని భావించి, నీ మీద, భక్తిని నెల కొల్పుకుని, పరిపూర్ణస్థితి నందినాడు. జీవితమును సుఖమయ మొనర్చి కొనినాడు.

గురువాయుపురాధిపా ! కృష్ణా ! నా నుండిగూడ విషయాసక్తిని తొలగించి, నన్నును అట్టి భక్తశిఖామణి నొనర్పుము నాయనా ! నా జాడ్య మును నిర్మూలింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) అవధూత : దిగంబర సన్న్యాసి. మాయకు యెంతమాత్రమును లొంగని వాడు. దేనిపట్లను లేశమాత్రమైన వ్యామోహముకూడ లేకుండ జీవించువాడు. ప్రపంచమునంతను మోహింపజేయగల వస్తువులు ఝంఝా మారుతమువలె చుట్టుముట్టినను, కించిన్మాత్ర ముగనైన చలింపనివాడు. సర్వదా పరమాత్మునియందే మనసు నిలుపుకుని సర్వ ప్రపంచమును విస్మరించి చరించు చుండువాడు.

97. మార్కండేయోపాఖ్యానం

1. మాయామయమైనది యీ ప్రపంచము. మాయా కల్పితమైనవి సత్త్వ రజ స్తమో గుణములు. వానిలో, యేదే నొక గుణము ప్రధానముగ లేనిది, యీ ప్రపంచమున లేనేలేదు. అది కారణముగనే, ప్రపంచ సంబంధమైన సర్వవిషయములును, ఉత్తమ మధ్యమ అథమ శ్రేణులలో యేదో ఒక దానికి చెందినవిగ పరిగణింపబడుచున్నవి.

ఉదాహరణకు : జ్ఞానము మూడు విధములు. కర్మ మూడు విధములు. సుఖము మూడు విధములు: మనము తీసుకొను ఆహారము మూడు విధములు. చివరకు మనముండు నివాస స్థలములుకూడ మూడు విధములు.

అట్టి భేదములేనిది, త్రిగుణములకు అతీతమైనది, నీ సేవ; నీకే అంకితమైన కర్మ. అదే నిర్గుణ నిష్ఠ. దాని నలవరచుకొనినవారు, అనతి కాలముననే మోక్షప్రాప్తికి అర్హు లవుచున్నారు.

2. నీ మీదనే మనసును నిలుపుకుని, సర్వకర్మలను నీకే సమర్పించుకొనుచు, పూర్వము మహర్షులు మెట్టినవియు, యీ నాడు నీ దాసులు సేవించుకొనుచున్నవియునగు పుణ్యక్షేత్రములను సందర్శించుకొనుచు, నేను విహరింపదలతును. సర్వ జీవులును నీవుగా భావించి భజించుకొనుచుందును. వీరు వారనక, యెల్లరను సమదృష్టితో చూసుకొనుచుందును. తుదకు, పశువులనుకూడ ప్రేమించుచుందును. మానావమానములను, రాగ ద్వేషములను, ఈర్ష్యాసూయలను త్యజించి, విరోధ భావమును విసర్జించి, బంధు ప్రేమను వదులుకుని, శాంతియుత సుఖజీవితము నలవరచుకొందును.

3. సర్వప్రాణులయందును నిన్ను దర్శించుకొను శక్తి అలవడు వరకు, ఆ విధముగ నిన్ను సేవించుకొనుచుందును. అన్నిట నున్నది నీవే యను జ్ఞానము కలిగినమీదట, నేను, నీవుగానే చరింతును.

భాగవత ధర్మానుష్ఠానపరులకు పతనముగాని వినాశముగాని లేదు కదా ! అది కారణముగనే, సర్వవిధముల మనోహరమైన ఆ భక్తిని నాకు ప్రసాదింపుమని ప్రార్థించుకొనుచున్నాను ప్రభూ !

4. ఆయురారోగ్యములు పరిపూర్ణముగ నున్ననేకదా, నేను, యీ భక్తియోగ సాధన చేయగలుగుట ! నీ పట్ల నాకు సహజముగనే భక్తి కుదిరినది. ఇపుడు, ఆయురారోగ్యములకొరకు నిన్నే సేవించుకొనుట సంభవించినది. పాలమీద ప్రేమకల రోగికి, పథ్యముకూడ పాలే అయినట్లున్నది నా అదృష్టము.

పన్నెండు సంవత్సరములు మాత్రమే ఆయుర్దాయముకల మార్కండేయుడు, నిన్నొక సంవత్సరకాలము సేవించుకొనినాడు. ఆ పిమ్మట, నీ భటుల సాయమున, మృత్యుదేవతనే తరిమికొట్టినాడు.

5. చిరంజీవి అయిన మార్కండేయుడు, నిన్ను ప్రసన్నుని చేసుకొను ఉద్దేశముతో, నిన్నే హృదయమున నిలుపుకుని, పరమానందానుభూతి నందుచు, పుష్పభద్రానది తీరమున(1) ఆరు మన్వంతరముల కాలము(2) తీవ్ర తప మాచరించినాడు. ఆ సమయమున, మహేంద్రుడు, అతనిని మోహ పరవశునిచేయు తలంపుతో, తన అనుచర వర్గమునకుచెందిన అప్సరోగణము తోను, మందానిలముతోను, మన్మధునితోను బయలుదేరివచ్చి, అతని తపో వహ్నిని తాళుకొనలేకపోయినాడు. విఫల ప్రయత్నుడై, వెనుదిరిగి పోయి నాడు. నిజమునకు, నీవారిని జయింపగలవా రెవ్వరు ప్రభూ !

6. అనంతరము, నారాయణుడుగా పేర్కొనబడు నీవు, నీ సఖుడైన నరునితోసహా, ఆ మార్కండేయుని, అత్యాదరముతో సమీపించినావు. అది గ్రహించిన అతడు, ఆనందాతిరేకమున నిన్ను అమితముగ స్తుతించినాడు.

భక్త్యానందముతో సంతుష్టచిత్తుడైఉన్న అతనికి, ఆ సమయమున, నీవు ప్రసాదింపదలచిన వరము లేవియు రుచింపలేదు. అయినను, అతడు,

తనకుతానై, నీ మాయా ప్రభావమును దర్శించుకొనుటకు మాత్రము తనకు గల కుతూహలమును వ్యక్తపరచినాడు. అది కల్పించు వేదనల నంతదనుక రుచిచూడకుండుటయే దానికి కారణమై ఉండవచ్చును.

7. ఆ వెంటనే, నీవు, అంతర్హితుడవైనావు. మరుక్షణముననే ప్రళయ ఝంఝానిలము వీచినది. ఆకసమునంతను కారుమేఘము లలము కొనినవి. కుంభవృష్టి కురిసినది. సప్తసముద్రములును పొంగి, భూమి నంతను జలమయ మొనర్చినవి. ఆ జలరాశిలో, అతడు, దిక్కుతోచక కొట్టుకొని పోజొచ్చినాడు. అట్లు, కొన్ని కోట్ల సంవత్సరములు జరిగినట్లు అతనికి తోచినది.

అంతలో, అతనికి, అల్లంత దూరమున, వటపత్రమున శయనించి యున్న ఒక విచిత్ర శిశువు గోచరించినాడు. అతని శరీరచ్ఛాయ, నీల మేఘమువలె ఉన్నది. అతడు, తన పదారవిందమును తన ముఖారవింద మునకు యెత్తి పట్టుకొని ఉన్నాడు. అత డెవరోకాదు ప్రభూ ! నీవే !

8. ఆ విధముగ నిన్ను చూసిన మార్కండేయుని శరీరము, హర్షాతిరేకమున పులకరించినది. అతడు, నిన్ను, చేతులలోనికి తీసుకొన దలచి, త్వరితముగ నిన్ను సమీపించినాడు. కాని, నీ శ్వాసవాయువుతో పాటు నీ వతనిని నీ లోనికి పీల్చుకొనినావు.

అట్లు నీలో ప్రవేశించిన అతనికి, చతుర్దశ భువనములును దర్శనీయ మైనవి. అనంతరము, నీవు ఊపిరి వదలుటతో, అతడు, తిరిగి బయటపడి నాడు; నీ కృపా కటాక్ష వీక్షణములకు పాత్రుడైనాడు. పరమానంద భరితు డైనాడు. నిన్ను ఆలింగనము చేసుకొనుట కుద్యుక్తుడైనాడు.

అంతలో, నీవు మాయమైపోయినావు. నీతోపాటు ఆ జలరాశికూడ మాయమైపోయినది. అపు డా మహర్షికి గోచరించినవి, యథాపూర్వకముగ నున్న ఆయన ఆశ్రమమును, దాని పరిసరములును మాత్రమే.

9. అనంతరము, త్రిపురాంతకుడైన శంకరు డొకసారి, గౌరీ సహితుడై, నీ ప్రియ భక్తుడైన మార్కండేయుని యెదుట ప్రత్యక్షమైనాడు. ఆ సందర్భమున, ఆయన, అతనికి, వృద్ధాప్యము మున్నగునవికాని, మరణము కాని, లేకుండునట్లు, అనేకవరములను, తనకుతానై ప్రసాదించినాడు. యథార్థమునకు ఆ శక్తులన్నియు, ఆ మహర్షి, అంతకుముందు స్వీయయోగ బలమున సంపాదించుకొనినవే.

ఈ మార్కండేయుని గాథవలన, మధురిపుడవైన నిన్ను సేవించిన, మన్మథాంతకుడైన శంకరుడుకూడ సంతోషించునను గుణపాఠమును మేము నేర్చుకొంటిమి. యథార్థమునకు, నీవు, సకల నియంతవైన త్రిమూర్త్యాత్మకుడవే కదా ప్రభూ !

10. సత్యలోకమున, బ్రహ్మ విష్ణు రుద్ర నివాసములు, ఒకదానిపైన నొకటి ఉన్నవి. ఆ మూడింటికిని పైన, మాయకు అతీతమైన వైకుంఠమున్నది. అచటి మౌలిక జలరాశియందు, శుద్ధసత్త్వ మూర్తివై, అద్వితీయ సచ్చిదానంద స్వరూపుడవై, పరబ్రహ్మవై శోభించునదియు, ఇచట, గోకులమున విరాజమానుడవై యుండునదియు నీవేకదా ప్రభూ !

వాతాలయాధిపా ! కృష్ణా ! అట్టి నిన్ను, ఈ రోగనివారణకొఱకు యింతగ వేడికొనవలెనా తండ్రీ !

అర్థము - వివరణ

(1) పుష్పభద్రానది : హిమాలయములకు ఉత్తరమున నున్నదని చెప్పబడుచున్నది.

(2) ఆరు మన్వంతరముల కాలము : కృత త్రేతా ద్వాపర కలియుగములు డెబ్బదియొకటి (71) అయిన కాలము ఒక మన్వంతరము. అట్టివి ఆరు గడిచిన కాలము. అనగా, 426 చతుర్యుగముల కాలమన్నమాట.

98. నిష్కల బ్రహ్మోపాసనం

1. కృష్ణా ! ఈ బ్రహ్మాండము లన్నిటిని, నీవు, నీనుండి సృజించు చున్నావు. పోషించుచున్నావు. తిరిగి నీయందే లీనము చేసుకొనుచున్నావు.

ప్రపంచరూపమున నీవు గోచరించుచుందువు; అయినను, దానికి భిన్నమైనది నీ స్వరూపము.

సర్వప్రపంచమును, నీ తేజమువలననే ప్రకాశించుచున్నది. నీ మీదనే ఆధారపడియున్నది.

నిన్ను, మనసు భావించుకొనలేదు. మాటలు వర్ణింపలేవు. నీ దివ్య స్వరూపము, దేవర్షులకును దేవతలకును కూడ గ్రహింపరానిదనిన, యితరులమాట చెప్పవలసిన దేమున్నది ? తండ్రీ ! అట్టి నీకు, నేను, సాష్టాంగ ప్రణామము[1] లాచరించుకొనుచున్నాను.

2. కృష్ణా ! నీవు సర్వవ్యాపివి. పరమానంద రస స్వరూపుడవు. కైవల్యధాముడవు. యథార్థమునకు, నీకు, జన్మ కర్మాదికములు లేవు. గుణ దోషములు లేవు. అయినను, లోక సంగ్రహార్థము, నీదైన మాయను వశపఱచుకుని, నీకు నీవై వాటిని స్వీకరించుచున్నావు. నామ రూపములు లేనివాడవయ్యును, వివిధరూపములు ధరించుచున్నావు. అనంతనామములతో అలరారుచున్నావు. అశేష శక్తులను ప్రదర్శించు చున్నావు. నాయనా ! అట్టినీకు, నేను, శిరసా నమస్కరించుచున్నాను.

3. మహర్షులు, నీ స్వరూపమును, కొన్ని నిషేధార్థక వచనముల ద్వారా (నేతి నేతి వాక్యముల ద్వారా) వర్ణించుటకు ప్రయత్నించినారు. నీవు మానవరూపమునగాని మృగరూపమునగాని, దేవతల రూపమునగాని దానవులరూపమునగాని, స్త్రీరూపమునగాని పురుషరూపమునగాని ఉండవనినారు.

అటులనే, నీకు గుణకర్మాదికములులేవనినారు. ఏ ఒక జాతికిగాని చెందిన వాడవు కావనినారు. ద్రవ్యము కలవాడ వనరాదనినారు; దరిద్రుడవుగా భావింపరాదనినారు. నీవు ఉన్నావనికాని లేవనికాని చెప్పుటకు వీలులేదని నారు. ఇక మిగిలిన దేమున్నది? పరమానంద మొకటియే కదా! అదే ఉపనిషత్సారము. అదే పరతత్త్వము. అట్టి నీకు నా నమోవాకములు నాయనా!

4. నీవు, మాయామయమైన విశ్వదర్పణమున, అనంతరూపములలో, స్వప్నదృశ్యములవలె భాసించుచున్నావు. ఆ సమయమున, నీవు, మహద హంకారములను, పంచతన్మాత్రలను, పంచభూతములను, ఏకాదశేంద్రియ ములు మున్నగువాటిని ఉపయోగించుకొనుచున్నావు. అనంతరము, కూర్మము తన అంగములను తనలోనికి ఉపసంహరించుకొనునట్లు, కాల రూపుడవై, నీ సృష్టినంతను నీలో లీనము చేసుకొనుచున్నావు. ప్రళయ కాలమున నేర్పడు గాఢాంధకారమున, స్వయంప్రకాశుడవై వ్యవహరించు చున్నావు. అట్టి నీకు, నా అభివాదనములు నాయనా!

5. కృష్ణా! నీవు విశ్వరూపుడవు. విశ్వసృష్టికి మూలకారణ మైన వాడవు. అది, అందరును అంగీకరించిన విషయమే. అయినను, వివిధ సంప్రదాయములకు చెందినవారు, నిన్ను వివిధనామములతో పేర్కొనుచు న్నారు. కొందఱు, 'బ్రహ్మ' వనుచున్నారు; కొందఱు 'కర్మ' వనుచున్నారు. కొందఱు అణువువనుచున్నారు. కొందఱు కాలస్వరూపుడవనుచున్నారు. ఉపనిషత్తులు, నిన్ను, 'పురుషుడ'ని 'పరుడ'ని, 'చిత్' అని, 'ఆత్మ' అని ఉగ్గడించుచున్నవి. ఎవ రే విధముగ పేర్కొనినను, వా రందరి దృష్టియం దున నున్నది నీవు ఒక్కడవే. నీవే పరబ్రహ్మవు. ఆ మూలప్రకృతి, నీ కనుసన్నల మెలగునదిమాత్రమే. అట్టినీకు, సభక్తికముగ, ప్రణమిల్లు చున్నాను ప్రభూ!

6. అవిద్యారూపమైన నీ మాయ, 'ఉన్నద'ని కాని, 'లేదని'కాని దృఢముగ చెప్పుటకు వీలులేదు. కాని, ప్రపంచదృష్టికి, రజ్జువు, సర్పము

కాకపోయినను సర్పభ్రాంతిని కలిగించునట్లు, అది లేకపోయినను ఉన్నట్టిదే అవుచున్నది. అదే మాయ. అవిద్యాప్రభావము. అది తొలగిపోవలెనన్న, నీ కృపారసవృష్టి కావలయును. అది లభించిన మఱుక్షణమున, 'మాయ' మాయమైపోవును. అవిద్య విద్యగా మారిపోవును. ఆపైన, యే కొన్ని శ్రుతివాక్యములను గ్రహించినను, అది, ఆ విద్య, సంసార మహాటవిని సమూలముగ ఛేదించివేయగల గండ్ర గొడ్డలికాగలదు. అట్టి కృపారసవృష్టి గురియించు నీకు నా నమోవాకము లర్పించుకొనుచున్నాను నాయనా !

7. సమ్యగ్దృష్టితో(2) యీ ప్రపంచమును పరిశీలించిన యెడల, ఆభరణములందు స్వర్ణమువలె, కడవలయందు అడుసువలె, అద్వితీయమైన నీ దివ్యతత్త్వము, ఈనాడుకూడ ద్యోతము కాగలదు. నిదురనుండి మేల్కొనిన పిమ్మట, కలలో కనిపించిన వస్తువుల యాథార్థ్యము విదితమైనట్లు, దీపముతెచ్చి చూచిన, రజ్జుసర్పభ్రాంతి తొలగిపోయినట్లు, జ్ఞానోదయమైనంతనే, అది సుస్పష్టముగ గోచరింపగలదు. అట్టి నీ స్వరూపమునకు సాష్టాంగ ప్రణామములు తండ్రీ !

8. కృష్ణా ! విశ్వనియంతవైన నీకు భయపడి, సూర్యుడు ప్రకాశించుచున్నాడు. అగ్నిదహించుచున్నది. వాయువు ప్రసరించుచున్నది. బ్రహ్మాదులు తమతమ విధ్యుక్తధర్మములను నిర్వర్తించుకొనుచున్నారు. యథార్థమునకు, ఆ దేవతలను ఆయా స్థానములలో ఉంచినదియు, అనంతరకాలమున ఆ పదవులనుండి వారిని తొలగించునదియుకూడ నీవేకదా ! భగవన్ ! అట్టి సర్వశక్తి సంపన్నుడవైన నీకు నా నమోవాకము లర్పించుకొనుచున్నాను.

9. కృష్ణా ! త్రిగుణాత్మకమైన లోకత్రయమును సృష్టించునది నీవు. త్ర్యక్షరమైన ప్రణవము(3) నీవు. త్రిమూర్త్యాత్మకుడవు(4) నీవు. వేదత్రయముచే స్తుతింపబడునది నీవు. అవస్థాత్రయమునకతీతుడవు నీవు. యుగత్రయమున(5) నవతరించిన వాడవు నీవు. పదత్రయమున ప్రపంచమునంతను

ఆక్రమించినవాడవు నీవు. మూడుకాలములందును మార్పునెరుగక ఉండు వాడవు నీవు. అట్టి నిన్ను, యోగత్రయము(6) ద్వారా, త్రికరణ శుద్ధిగా,(7) అనవరతము ఆరాధించుకొనుచుందును నాయనా !

10. కృష్ణా ! నీ మూర్తి నిత్యమైనది. నిత్యముక్త మైనది. పరిశుద్ధ మైనది. స్వప్రకాశభాసురమై యుండునది. వాంఛారహితమైనది. అద్వితీయమైనది; ద్వంద్వాతీతమైనది. ఎట్టి మార్పుల నెఱుగనిది. సర్వదా సంపూర్ణముగ నుండునది. నిరాధారమైనది; నిఖిలగుణములకును ఆధార భూతమైనది. నిర్మలమైనది. నిరవధికమైన మహిమగలది. నిస్సంగులైన మహర్షుల హృదయాంతరాళమునందు, సుప్రతిష్ఠితమై, నిరుపమ పరమానంద రూపమున భాసించుచుండునది. అది సర్వోత్కృష్టముగ ప్రకాశించుచున్నది ప్రభూ !

11. కృష్ణా ! అప్రతిహతమైనది నీ కాలచక్రము. అది, ద్వాదశారమైనది. (బాణములవంటి పన్నెండు చువ్వలు గలది.) దానికి, మూడు వందల అరువది పర్వములు (కణుపులు) ఉన్నవి. దాని భ్రమణవేగము అతి క్రూరమైనది. అది సర్వదా ముందునకే ఉఱుకులిడుచుండును. క్షణ క్షణమును విశ్వవినాశన మొనర్చుచుండును.

కృష్ణా ! నీవు కరుణారస సాగరుడవు. నేను నీ ఆశ్రితుడను. దాని బారినుండి నన్ను యీ క్షణముననే రక్షింపుము నాయనా ! సర్వవిధ వేదనల(8) నుండి, నాకు, విముక్తిని కలిగింపుము తండ్రీ !

అర్థము - వివరణ

(1) సాష్టాంగ ప్రణామము : శిరసు ముఖము భుజములు మోచేతులు మోకాళ్ళు నేలకు తాకునట్లు కట్టెవలె పడి చేయు నమస్కారము.

(2) సమ్యగ్ దృష్టి : యథార్థ దృష్టి.

(3) త్ర్యక్షరమైన ప్రణవము : 'అ' 'ఉ' మ' అను వాని కూడికయే ఓమ్కారము.

(4) త్రిమూర్త్యాత్మకుడు : బ్రహ్మ విష్ణు మహేశ్వరులు తనే అయినవాడు.

(5) యుగత్రయమున : కృత త్రేతా ద్వాపరములయందు.

(6) యోగత్రయము : జ్ఞాన కర్మ భక్తి యోగములు.

(7) త్రికరణములు : మనస్సు, వాక్కు, కాయము.

(8) సర్వవిధ వేదనలు : పుట్టుట, పెరుగుట, మార్పులు చెందుచుండుట, వృద్ధాప్యము ననుభవించుట, రోగములవలన పీడింపబడుట, మరణించుట అనునవి ప్రతి జీవియు అనుభవించి తీరవలయు వేదనలు. అవి లేకుండ చేయుమని, అనగా, జన్మరాహిత్యమును ప్రసాదింపుమని శ్రీ నారాయణ భట్టు ప్రార్థించుకొనుచున్నాడు.

99. భగవన్మహిమ

1. భూమి మీది మృత్కణములను (ఇసుక రేణువులను) లెక్కింపగలవారు మాత్రమే విష్ణు మహిమాదుల నెన్నుటకు సమర్థులు. ఆయన, మూడడుగులతో ముల్లోకముల నాక్రమించినాడు. ఆయన పాదరజోస్పర్శ మూలముననే, అవి, సర్వైశ్వర్య సంపన్నములైనవి. ఆయన నాశ్రయించుట వలననే, అవి, పరమానందానుభూతి నందుచున్నవి.

ఆయన దివ్యధామము వైకుంఠము. అక్కడ, మోక్షరూపమైన మధుర రసామృతము సర్వదా ప్రవహించుచుండును. భక్త శిఖామణులైన వారు, ఆయనను సేవించుకొనుచు, అచట, అత్యంతానందము ననుభవించుచుందురు. నాకును అచట స్థానము దొరకిన యెంత బాగుండును !

2. ప్రాక్కాలీనుడును,(1) సర్వమునకు మూలకారణుడును, నవనవోన్మేషముగ భాసించుచుండువాడును, సమగ్రైశ్వర్యమునకు అధిపతియును అయిన ఆ శ్రీ మహావిష్ణువును, యజ్ఞయాగాదులద్వారా, పూజా పురస్కారముల ద్వారా సంతుష్టి పఱచువారును, మహోజ్వలమైనవాటిలో మహోజ్వలమైన రామ కృష్ణాదుల అవతార విశేషములను సదా అభివర్ణించుకొనుచుండువారును అగు నీ భక్తులు, యిచట, యథేష్ట, సుఖానుభవము నందుదురు. యశోవిశాలురగుదురు. తుదకు, మానవజీవిత పరమావధి అయిన నీదివ్యధామమును చేరుకొందురు.

3. 'శ్రీ రామ కృష్ణాద్యవతారములు, మూర్తిదాల్చిన వేదములు. వారి దివ్యగాథలు, మధురాతి మధురమైన అమృత ప్రవాహములు. సర్వాభీష్టములను సమకూర్చునది, భవబంధములను ఛేదించునది భగవన్నామము.' ఇవి, మహర్షుల మహద్వచనములు.

కవీంద్రులు భగవల్లీలా విశేషములను గానముచేసి, కృతార్థులు కావచ్చును. వేదపండితులు, భగవన్నామమును జపించి తరింపవచ్చును. నా మటుకు నేను, ఆ దివ్యనామములనే ఆశ్రయించినాను. ఆ దివ్య లీలలనే అభివర్ణించుచున్నాను. ఇక, నాకు, ఆ సత్‌పదార్థజ్ఞానము కలుగ కుండు టెట్లు ?

4. ధర్మ సంస్థాపన కొఱకు, పారమార్థిక ప్రబోధము కొఱకు, శ్రీ మహావిష్ణువు, వివిధావతారములందును ఆచరించిన కర్మలను, విశ్వ శ్రేయము నుద్దేశించి, ఇంద్రుని స్నేహితునివలె సేవకునివలె చేసిన పనులను, మనము, సదా చింతనచేసుకొనుచుండవలెను. యోగసిద్ధి నందినవారు, అత్యుజ్జ్వలమైఉండు ఆయన దివ్యధామమును, సదా దర్శించుకొనుచుందురు. ధ్యాన పరాయణులైన విప్రశేష్ఠులు, జాగరూకులై మెలగుచు, వివిధ స్తోత్రముల ద్వారా, ఆయన మాహాత్మ్యమును ద్యోతపరచుచుందురు.

5. సర్వవ్యాపీ ! కృష్ణా ! పూర్వులెవరును, ఇంతవరకు, నీ వైభవమును సంపూర్ణముగ వివరించినది లేదు. ఇకముందు కూడ, ఆ పని చేయగలవారు ఉద్భవించుట కల్ల. ఎవరికైనను సాధ్యమైనది ఒకే ఒకటి ఉన్నది. అది, నీ దివ్యనామమును పదే పదే జపించుచుండుట. ముల్లోకములకు పైన జాజ్వల్యమానమై ఉండు వైకుంఠమున నివసించు నీ ప్రశస్తిని వివిధ స్తోత్రములద్వారా గానముచేయుచుండుట. అదే, నేను చేయుచున్నాను ప్రభూ !

6. ప్రళయార్ణవమున నీవు శేషతల్పమున శయనించియున్నావు. ఆ సమయమున, సర్వజీవులును, నీ యందు తాత్కాలికముగ ఏకత్రితమై యున్నవి. అప్పుడు, నీ నాభిమూలమునుండి, ప్రపంచరూపమున ఒక పద్మముద్భవించినది. దశదిశలును దానికి పత్రములుగ నున్నవి. మేరు పర్వతము, దానికి, బీజకోశముగ నున్నది.

7. మర్త్యులారా ! శ్రీ మహావిష్ణువు యీ బ్రహ్మాండములన్నిటిని సృజించుచున్నాడని మీకు తెలియనట్లున్నది. ఆయన, జీవరూపమున, మీ

అందరియందును ఉన్నాడు. అయినను, మంచువలె, మాయ ఆవరించి యుండుటవలన, మీ రది గ్రహింపలేకున్నారు. నామ రూపాదులకు భ్రమసి పోవుచున్నారు. ఇంద్రియసుఖ ప్రాప్తియే పరమార్థమనుకుని, యజ్ఞ యాగాదులతో సంతుష్టి చెందుచున్నారు; జీవితములను వ్యర్థముచేసుకొను చున్నారు.

ముకుందుని చరణారవిందముల నాశ్రయించుటయే మానవ జీవితము నకు పరమావధి. దానిని విస్మరించుట ఆత్మహత్యాసదృశము కదా !

8. కృష్ణా ! నీకు, అసంఖ్యాకమైన శిరములు నేత్రములు పాదములు కలవు. నీవు, విశ్వమునం దంతటను మాత్రమే కాదు; విశ్వమున కావల గూడ ఉన్నావు. అట్టి నీవు, హృదయాంతర్భాగమున, నొకమూల, అంగుష్ఠ మాత్ర దేహుడవై ఒదిగియుండుట పరమాశ్చర్యము నాయనా !

భూత భవిష్యద్వర్తమానములలోని సర్వమును నీవే. జీవరూపమున సర్వదేహములందును, సర్వేంద్రియములందును ఉన్నదికూడ నీవే. అయినను నీవు, వాటికి భిన్నుడవు. ప్రపంచ సంబంధమైన సుఖ దుఃఖములతో నీ కెట్టి సంబంధమును లేదు. సదా, పరమానంద రసాస్వాదన మొనర్చు చుండునది నీవు ఒక్కడవే ప్రభూ !

9. అనంతా ! నీవు, ముల్లోకముల రూపమున గోచరించుచుందువు. అయినను, నీ ప్రభావము, వాటికి మాత్రమే పరిమితమైనది కాదు. పరిశుద్ధ జ్ఞాన స్వరూపుడవై, నీవు, వాటికి వెలుపలకూడ శోభించుచుందువు. అట్లుండుట నీకే చెల్లినది నాయనా !

మఱొక విషయమున్నది. నీలోని ఒక అంశమాత్రమే నిఖిల బ్రహ్మాండముల రూపమున ద్యోతమౌచున్నది. మిగిలిన దంతయు బ్రహ్మా నందమే. అట్టి నీకు నా నమోవాకము లర్పించుకొనుచున్నాను తండ్రీ !

10. బుద్ధికి గాని, ఇంద్రియములకుగాని గోచరము కానిది నీ అవ్యక్త స్వరూపము. అది కారణముగనే, సామాన్యులు, దాని నూహించు

కొనలేరు. దానివలని ఫలమును పొందలేరు. కాని, యిచట, ఈ గురువాయూరు దేవాలయమునందు ప్రత్యక్షమై ఉన్న శ్రీకృష్ణాఖ్య తేజము, శుద్ధ సత్త్వమయమైనది. సుధాసాగర తరంగ సదృశమైనది. దివ్యమైనది. సర్వోత్కృష్టమైనది. భగవద్గుణప్రపూర్ణమైనది. మనోహరమైనది. అది కారణముగనే, నేను, దీని నాశ్రయించినాను. నా మనోభీష్టసిద్ధికొఱకు, పునః పునః ప్రణామము లాచరించుకొనుచున్నాను. తండ్రీ! నన్ను అనుగ్రహింపవలసినది.

అర్థము – వివరణ

(1) ప్రాక్కాలీనుడు : కాలమునకు ముందున్నవాడు. కాలమును సృజించినదికూడ భగవానుడే యని భావము.

100. సాక్షాత్కారం

1. కృష్ణా! దివ్యకిశోరమూర్తీ! స్వాగతము నాయనా, నీకు, సుస్వాగతము! నా పున్నెములపంట నాకు కన్నులపండువు చేయుచున్నాడు. ఏమి నా అదృష్టము!

లేత సెనగపూగుత్తివలె, ఆ తేజోమండల మెంత శోభాయమానముగ నున్నది! ఆ మాలా మండల మధ్యముననున్న నా కన్నయ్యను చూచుటకు వేయి కన్నులు చాలవు. ఎంత మనోహరముగ నున్నాడు! అరె! ఏమి యీ విచిత్రము! ఇంతలోననే యౌవనారంభదశను చేరుకొనినాడే!

నే నిప్పుడు పరమానంద రసామృతమున స్నానము చేయుచున్నానా! ఏమో!

అదేమి...నారదాది మహర్షులును నావలెనె ఉన్నారు! వారి శరీరములును పుల్కరించియున్నవి!

నా నల్లనయ్యను పరివేష్టించి యున్నది ఆ ఉపనిషత్సుందరీబృందమే. ఔను. సందేహము లేదు. ధన్యోస్మి! ధన్యోస్మి!

2. ఆ నిబిడ నీలాలకశ్రేణి, ఆ ఉంగరములు తిరిగిన ముంగురులు ఎంత మనోహరముగ నున్నవి! ఆ కొండెసిగ యెంత ఒయ్యారము నొలుకుచున్నది! మణిమయాభరణములతో, మందార సుమములతో, రంగురంగుల నెమిలి పించెములతో అమర్చబడిన ఆ ముడి, యెంత అందముగ నున్నది! ఆ బాలచంద్ర నిభాననమున స్నిగ్ధోర్ధ్వ పుండ్రద్యుతి, నా అదృష్టమువలెనె, వర్ణనాతీతముగదా!

3. స్వామీ! కరుణారస సాగర తరంగములవలె చంచలములై ఉన్న కనుబొమలతోను, నీలవర్ణము గలవియు కోమలమైనవియు నగు

పక్ష్మములతోను (కనువెండ్రుకలతోను), అరుణ కమల పత్రములవంటి తెప్పలతోను, ముగ్ధమోహనమైన కనీనికలతోను (కనుగ్రుడ్లతోను), ముల్లోకములకును తాపోపశమనమును కలిగింపగల కటాక్ష వీక్షణములతోను శోభించుచున్న నీ చూపులను, దిక్కులేని యీ దీనునిమీద ప్రసరింపజేయుము తండ్రీ !

4. ప్రముఖముగను రమణీయముగను ఉన్న నాశికతోను, మహానీల దర్పణమును బురుడించు గండ భాగమున ప్రతిబింబించుచున్న మకర కుండలములతోను, వరుసగ పేర్చిన మల్లెమొగ్గలవలె వెలుగుల జిమ్ముచు, అప్పుడప్పుడు కొలదిగ గోచరించుచున్న దంతపంక్తితోను, అరుణాధర పల్లవమునుండి ప్రేమ రసామృతమును వర్షించుచున్న మృదుమధుర మంద హాసముతోను శోభించు నీ ముఖారవిందమును, నాకు, సుస్పష్టముగ ద్యోతపఱపుము నాయనా !

5. కృష్ణా ! నీ నఖద్యుతులు నిరుపమమైనవి. ప్రవాళ వర్ణము (పవడము రంగు) గలవియు కోమలమైనవియు నగు నీ వరదాభయ హస్తములు లోకరక్షా దక్షములు. రత్నకంకణాద్యాభరణములతో భాసించుచుండునవి నీ మృదుకరములు. ఆ కరయుగ్మము నలంకరించినది, విశ్వమోహనమైన నీ విచిత్ర వేణువు. దానిని లలితముగ పూరించి, మధురాతి మధురమైన నాదబ్రహ్మమును నీవు సృజించుచుందువు. భక్తుల హృదయ తాపమును చల్లార్చుచుందువు. ఆ గానరసామృతాస్వాదనమునకే, ఇంత వఱకు, నా కర్ణపుటములు తపించిపోయినవి ప్రభూ !

6. కౌస్తుభమణి కల్పించు అరుణ కిరణ కాంతులతో వెలుగుల జిమ్ముచున్నది నీ గళసీమ. శ్రీవత్సలాంఛితమైన నీ వక్షస్తలము, భృంగావళి కాకరమైన రంగురంగుల సుమదామములతోను, వనమాలలతోను, హార వల్లరులతోను శోభించుచున్నది. వానిని దర్శించుకొను భాగ్యము యీనాడు కదా నాకు లభించినది !

7. కుంకుమ అగరు కస్తూరి గోరోజనము హరిచందనము అనబడు పంచాంగ రాగముల సౌరభముద్వారా సర్వప్రాణులను ఆకర్షించుకొనుచుండు నదియును, ముజ్జగములకు నిలయమైన బొజ్జ అయినను, కృశీభూతమై ఉండు కటిస్థలము కలదియును, బంగారమున ఇంద్రనీలమణి పొదుగబడి నట్లు, తప్తకాంచన సన్నిభమైన పట్టు పీతాంబరమును ధరించి శోభించు చుండునదియును, బంగరు చిఱుగజ్జియలతో వెలుగులు చిమ్ముచుండు మణి మయ కటిసూత్రముచే బంధింపబడినదియును అగు నీ యీ శ్రీవిగ్రహమును నేను సదా ధ్యానించుకొనుచుందును ప్రభూ !

8. నీ తొడలు సుకుమారమైనవి. దృఢమైనవి. కాంతివంతమైనవి. మహాలక్ష్మి మనసునే ఆహరించుకొనినవి. భక్తుల హృదయములలో కల వరము కలుగకుండుటకు కాబోలు, నీవు, వాటిని, సదా, పట్టు పీతాంబర ముతో కప్పుకొని యుందువు !

నీ జానువులు, నిన్ను ఆశ్రయించినవారికి నీవు అందింపదలచిన సర్వాభీష్ట భండారములవలె ప్రకాశించుచున్నవి. క్రమశః వృద్ధినందిన నీ చిఱుతొడలు, (పిక్కలు) చూడముచ్చట గొల్పుచున్నవి. తండ్రీ ! నేను వానిని సదా చింతనముచేసుకొనుచుందును.

9. నీ చరణ మంజీరముల సవ్వడి, నీ చరణసేవ శ్రేయస్కర మైనదని, మందస్వరమున చాటుచున్నట్లున్నది.

నీ పాదాగ్రభాగము, అజ్ఞాన మహార్ణవమున మునిగియున్న నీ భక్తు లను, మందరపర్వతమునువలె ఉద్ధరింపనున్న కూర్మమును తలపించు చున్నది.

నఖేందు చంద్రికా విలసితమైన నీ చరణాంగుళుల అరుణకాంతి, నీ ఆశ్రితుల సంతాప ధ్వాంతమును హరించునదివోలె ఉన్నది.

కృష్ణా ! అట్టి నీ పాదద్వయమును, నేను, సభక్తికముగ ధ్యానించు కొనుచున్నాను.

10. కరుణారస సాగరా ! కృష్ణా ! నీ అవయవము లన్నిటియందును, నీ చరణాబ్జముల కొక ప్రత్యేకస్థాన మున్నది. యోగీశ్వరులు వాని నమితముగ ఆదరింతురు. ముక్తజీవుల కవి పరమాశ్రయములు. భక్తులకు, సర్వాభీష్టములను ప్రసాదించు కల్పతరు కిసలయములు. (కల్పవృక్షపు మొలకలు)

గురువాయుపురాధీశా ! నేను, వాటిని, నా హృదయమున ప్రతిష్టించుకొనినాను. నా ఆర్తిని నిశ్శేషముగ నిర్మూలింపవలసినది. నాకు, పరిపూర్ణమైన పరమానందమును ప్రసాదింపవలసినది.

11. విశ్వనాథా ! కృష్ణా ! నేను, నీ మహిమాతిశయము నెఱిగిన వాడను కాను. అయినను, నిన్ను గుఱించి యేమేమో పలికినాను. దోసములున్న క్షమింపవలసినది నాయనా ! సహస్రాధిక శ్లోకములతో కూడిన యీ స్తోత్రము, నీ పరిపూర్ణానుగ్రహమునకు పాత్రము కావలెనని కోరుచున్నాను తండ్రీ !

శ్రుతి ప్రతిపాదితమైన అనేక విషయములతోను, స్తుత్యర్హమైన నీ మహిమాది వర్ణనలతోను, నీ దివ్య లీలావతార గాథలతోను భాసించుచున్నది; యీ మాలామహాస్తోత్రము.

ఇది, నారాయణ పరమైనది - నారాయణ కృతమైనది; కావుననే నారాయణీయ మైనది.

గురువాయుపురాధీశా ! కృష్ణా ! ఈ శ్రీమన్నారాయణీయమును వినిపించెడివారును వినెడివారును, పఠించెడివారును పారాయణ చేయువారును, దీర్ఘాయురారోగ్యైశ్వర్యాదులందునట్లు ఆశీర్వదింపుము నాయనా !

శ్రీ కృ ష్ణా ర్ప ణ మ స్తు !

నారాయణీయమును యీ రూపమున
తొలిసారిగ తెలుగుల కందించిన
అదృష్టవంతులలో కొందఱు....

శ్రీః

1.	శ్రీ ఎస్. ఆర్. కె. మూర్తి	హైదరాబాదు
2.	శ్రీమతి ఎస్. వెంకట రమణమ్మ	,,
3.	కుమారి ఎస్. ప్రభావతి	,,
4.	శ్రీ మంచాల మల్లేశం	భువనగిరి
5.	శ్రీమతి మంచాల సరోజినమ్మ	,,
6.	శ్రీ మంచాల రవీంద్ర	,,
7.	శ్రీమతి మంచాల శంకరకుమారి	,,
8.	శ్రీ కొండూరు శేషయలింగం	వరంగల్
9.	శ్రీమతి కొండూరు వరలక్ష్మి	,,
10.	శ్రీ కొండూరు ఉదయశంకర్	,,
11.	శ్రీమతి కొండూరు సరస్వతి	,,
12.	శ్రీ ఎస్. ఎస్. సిద్ధాంతి	హైదరాబాదు
13.	శ్రీమతి ఎస్. కామేశ్వరి	,,
14.	శ్రీమతి సూరావఝ్ఝుల లక్ష్మిసోదెమ్మ	,,
15.	శ్రీ దశక భీమేశ్వరరావు	బెంగుళూరు
16.	శ్రీమతి దశక వెంకట శేషమ్మ	,,
17.	శ్రీ తడకమళ్ళ నరసింగరావు	దాచవరం
18.	శ్రీమతి తడకమళ్ళ సుగుణమ్మ	,,
19.	శ్రీమతి వెంపటి గుణసుందరి	హైదరాబాదు
20.	శ్రీ మంచాల చంద్రయ్య	భువనగిరి
21.	శ్రీమతి మంచాల ఆండాళమ్మ	,,
22.	శ్రీ రాచమళ్ళ రామలింగం	,,
23.	శ్రీమతి రాచమళ్ళ స్వరాజ్యం	,,



నారాయణీయం

నారాయణభట్టతిరిపాద కృత సంస్కృత మూలమునకు
స్వామి కృష్ణదాస్‌జీ తెలుగుసేత



శ్రీ నారాయణభట్టతిరిపాదులు
(మూలకృతికర్త)

శ్రీః

ఓం నారాయణ నారాయణ నారాయణ నారాయణ ఓం



ఈ కృతి

భిక్షాపాత్రను నను ది
వ్యాక్షర కలశముగ అమృత భండారముగా
అక్షయ సుఖ సందోహా
ధ్యక్షునిగా సలిపినట్టి అయ్యకు నీకే

సమర్పితము

యణ నారాయణ నారాయణ నారాయణ నారాయణ నారాయణ నారాయణ ఓం

24. శ్రీ రాచమళ్ళ అశోక్ భువనగిరి
25. శ్రీమతి రాచమళ్ళ శారద ,,
26. (స్వర్గీయ) శ్రీ ఉప్పలంచి లక్ష్మీనారాయణ ,,
27. శ్రీమతి ఉప్పలంచి రుక్మిణమ్మ ,,
28. శ్రీ తోట లక్ష్మినారాయణ ,,
29. శ్రీ వెలుగులేటి శ్రీనివాసాచార్య ,,
30. శ్రీ కొంకిమళ్ళ హనుమంతరావు హన్మకొండ
31. శ్రీమతి కొంకిమళ్ళ రత్నమాణిక్యమ్మ ,,
32. శ్రీ కానుకుంట జంగంరావు హైదరాబాదు
33. శ్రీమతి కానుకుంట పుష్పాంజలి ,,
34. శ్రీమతి ఎం. అనసూయమ్మ ,,
35. శ్రీ కొండుభట్ల లక్ష్మీనరసింహం ,,
36. శ్రీమతి కొండుభట్ల స్వరాజ్య జయప్రద ,,
37. శ్రీమతి బూర్గు జయశ్రీ సికిందరాబాదు
38. శ్రీమతి చందా వీరమణి హైదరాబాదు
39. శ్రీ వంగూరి గోపాల కృష్ణమ్మ ,,
40. శ్రీ పేరి లక్ష్మినారాయణ వరప్రసాదరావు ,,
41. శ్రీ వెంపటి సత్యనారాయణ ,,
42. శ్రీ లింగా రాజచంద్రశేఖర్ ,,
43. శ్రీమతి లింగా మహారాణి ,,
44. శ్రీమతి తేన్‌కున్‌ట్ల శ్యామంతమ్మ ,,
45. శ్రీమతి పొమ్మయ్యగారి ధనలక్ష్మి ,,
46. శ్రీ చౌడారపు ఎల్లయ్య గుప్త ,,
47. శ్రీమతి చౌడారపు అనంతలక్ష్మి ,,

48. శ్రీ గోపారపు వీరయ్య గుప్త	హైదరాబా
49. శ్రీమతి గోపారపు సక్కుబాయి	,,
50. శ్రీమతి గోపారపు చంద్రమణి	,,
51. శ్రీ మాలె భూమయ్య	,,
52. శ్రీమతి మాలె వీరమణి	,,
53. శ్రీ గాంజీ మాణిక్యారావు	,,
54. శ్రీమతి గాంజీ మాణిక్యమ్మ	,,
55. శ్రీ గాంజీ కిషన్‌రావు	,,
56. (స్వర్గీయ) శ్రీ కాజ శివరామయ్య	,,
57. శ్రీమతి కంభంపాటి శకుంతల	,,
58. శ్రీమతి సగిలి సరోజినమ్మ	,,
59. శ్రీ తాళ్ళపల్లి లక్ష్మన్‌గౌడ్	,,
60. శ్రీమతి తాళ్ళపల్లి అంజనీదేవి	,,
61. శ్రీమతి పిసుపాటి లక్ష్మి	,,
62. శ్రీమతి చామర్తి సుశీలాదేవి	,,
63. శ్రీ మల్లేల వెంకటేశ్వరరావు	,,
64. (స్వర్గవాసిని) శ్రీమతి మంచాల వీరమ్మ	భువనగిరి
65. చిరంజీవి మండగొండి మల్లిఖార్జునుడు	నల్లగొండ
66. శ్రీకృష్ణ మహిళా సమాజం	,,
67. శ్రీ బంగారు వెంకట సూర్యనారాయణరావు	పాలకొల్లు
68. శ్రీ మాజేటి వరదరాజులు	,,
69. శ్రీమతి భూపతిరాజు రాజయ్యమ్మ	జిన్నూరు
70. శ్రీమతి పిడపర్తి కొండమ్మ	సోమేశ్వ
71. శ్రీ మానేపల్లి సూర్యమాణిక్యం	భీమవరం



స్వామి కృష్ణదాస్ జీ

సమాజం ప్రచురించి...
స్వామిజీ కృతులు...

1. శ్రీకృష్ణ లీలామృతం...
2. శ్రీవిష్ణు సహస్రనామ స్తో...

(ప్రతి పదార్థవివరణ సహి...

3. నారాయణీయం.

-త్వరలో ప్రచురింపబడనున్న...

శ్రీమద్ భాగవ...

[పునర్ముద్రణం. 700 పేజీల ...
మూల్యం: 15 రూపాయలు మా...

శ్రీమద్భాగవత సేవా సమాజ ప్రచురణం ...

ప్రతులు దొరుకు చోట్లు:
కవిరాజ పబ్లిషర్సు - సికిందరాబాదు : ఆంధ్ర బుక్‌హౌస్ - హైదరా...

నారాయణీయం....

సర్వరోగనివృత్తిని, భక్తిని, ముక్తిని ప్రసాదించు
మహోత్కృష్ట స్తోత్రరాజం.

24.	శ్రీ రాచమళ్ళ అశోక్	భువనగిరి
25.	శ్రీమతి రాచమళ్ళ శారద	,,
26.	(స్వర్గీయ) శ్రీ ఉప్పలంచి లక్ష్మీనారాయణ	,,
27.	శ్రీమతి ఉప్పలంచి రుక్మిణమ్మ	,,
28.	శ్రీ తోట లక్ష్మీనారాయణ	,,
29.	శ్రీ వెలుగులేటి శ్రీనివాసాచార్య	,,
30.	శ్రీ కొంకిమళ్ళ హనుమంతరావు	హన్మకొండ
31.	శ్రీమతి కొంకిమళ్ళ రత్నమాణిక్యమ్మ	,,
32.	శ్రీ కానుకుంట జంగంరావు	హైదరాబాదు
33.	శ్రీమతి కానుకుంట పుష్పాంజలి	,,
34.	శ్రీమతి ఎం. అనసూయమ్మ	,,
35.	శ్రీ కొండుభట్ల లక్ష్మీనరసింహం	,,
36.	శ్రీమతి కొండుభట్ల స్వరాజ్య జయప్రద	,,
37.	శ్రీమతి బూర్గు జయశ్రీ	సికిందరాబాదు
38.	శ్రీమతి చందా వీరమణి	హైదరాబాదు
39.	శ్రీ వంగూరి గోపాల కృష్ణమ్మ	,,
40.	శ్రీ పేరి లక్ష్మీనారాయణ వరప్రసాదరావు	,,
41.	శ్రీ వెంపటి సత్యనారాయణ	,,
42.	శ్రీ లింగా రాజచంద్రశేఖర్	,,
43.	శ్రీమతి లింగా మహారాణి	,,
44.	శ్రీమతి తేన్‌కున్‌ట్ల శ్యమంతమ్మ	,,
45.	శ్రీమతి పొమ్మయ్యగారి ధనలక్ష్మి	,,
46.	శ్రీ చౌడారపు ఎల్లయ్య గుప్త	,,
47.	శ్రీమతి చౌడారపు అనంతలక్ష్మి	,,

48. శ్రీ గోపారపు వీరయ్య గుప్త	హైదరాబా
49. శ్రీమతి గోపారపు సక్కుబాయి	,,
50. శ్రీమతి గోపారపు చంద్రమణి	,,
51. శ్రీ మాలె భూమయ్య	,,
52. శ్రీమతి మాలె వీరమణి	,,
53. శ్రీ గాంజీ మాణిక్యారావు	,,
54. శ్రీమతి గాంజీ మాణిక్యమ్మ	,,
55. శ్రీ గాంజీ కిషన్‌రావు	,,
56. (స్వర్గీయ) శ్రీ కాజ శివరామయ్య	,,
57. శ్రీమతి కంభంపాటి శకుంతల	,,
58. శ్రీమతి సగిలి సరోజినమ్మ	,,
59. శ్రీ తాళ్ళపల్లి లక్ష్మన్‌గౌడ్	,,
60. శ్రీమతి తాళ్ళపల్లి అంజనీదేవి	,,
61. శ్రీమతి పిసుపాటి లక్ష్మి	,,
62. శ్రీమతి చామర్తి సుశీలాదేవి	,,
63. శ్రీ మల్లేల వెంకటేశ్వరరావు	,,
64. (స్వర్గవాసిని) శ్రీమతి మంచాల వీరమ్మ	భువనగిరి
65. చిరంజీవి మండగొండి మల్లిఖార్జునుడు	నల్లగొండ
66. శ్రీకృష్ణ మహిళా సమాజం	,,
67. శ్రీ బంగారు వెంకట సూర్యనారాయణరావు	పాలకొల్లు
68. శ్రీ మాజేటి వరదరాజులు	,,
69. శ్రీమతి భూపతిరాజు రాజయ్యమ్మ	జిన్నూరు
70. శ్రీమతి పిడపర్తి కొండమ్మ	సోమేశ్వ
71. శ్రీ మానేపల్లి సూర్యమాణిక్యం	భీమవరం



స్వామి కృష్ణదాస్ జీ

సమాజం ప్రచురించి
స్వామిజీ కృతులు

1. శ్రీకృష్ణ లీలామృతం
2. శ్రీవిష్ణు సహస్రనామ స్తో

(ప్రతి పదార్థవివరణ సహి

3. నారాయణీయం.

త్వరలో ప్రచురింపబడనున్న

శ్రీమద్ భాగవ

[పునర్ముద్రణం. 700 పేజీల
మూల్యం: 15 రూపాయలు మా

శ్రీమద్ భాగవత సేవా సమాజ ప్రచురణం

ప్రతులు దొరుకు చోట్లు :

కవిరాజ పబ్లిషర్సు - సికిందరాబాదు : ఆంధ్ర బుక్ హౌస్ - హైదరా

నారాయణీయం....

సర్వరోగనివృత్తిని, భక్తిని, ముక్తిని ప్రసాదించు
మహోత్కృష్ట స్తోత్రరాజం.